శ్రీ

# స్కాంద మహాపురాణము

# బ్రహ్మఖండము

అనువాదకులు :

శ్రీ సరిపెల్ల విశ్వనాథశాస్త్రి

ప్రచురణ :

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

1980

ప్రథమ ముద్రణ:

ఆగష్టు 1980

ప్రతులు 1000

ముద్రణ:

తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రెస్,

తిరుపతి.

శ్రీ గణేశాయ నమః

ఓం నమో భగవతే వాసుదేవాయ నమః

# శ్రీస్కాందమహాపురాణము

# బ్రహ్మ ఖండము

## సేతు మాహాత్మ్యము

### 1-వ అధ్యాయము — సేతు గమన ఫలాది వర్ణనము

నైమిశారణ్యవాసులయిన శౌనకాది మహర్షులు, మోక్షమునే కోరువారు, మమత్వములేనివారు, బ్రహ్మవాదులు, ధర్మజ్ఞులు, అసూయలేనివారు, సత్యవతపరాయణులు, జితేంద్రియులు, జిత క్రోధులు, భూతదయాపరులు, ముక్తిదాయినియయిన నైమిశమున భక్తితత్పరులయి, సనాతనుడగు విష్ణునిగూర్చి తపోనియతినుండిరి. ఋషుల సంఖ్య ఇరువదిఆరువేలు. వారి శిష్యులు అసంఖ్యాకులు. ఆ మహాసమాజమున భగవల్లీలలు కథలు చెప్పుకొనుచుందురు. ఒకసమయమున అటకు వ్యాసశిష్యుడు పౌరాణజ్ఞుడు సూతుడేతెంచెను. ఋషులాతనికి ఉచితసపర్యలిచ్చి గౌరవించిరి. సుఖాసనమిడి కూర్చుండజేసి నరులకు ముక్తిదమయిన తీర్థమెద్దియో, హరిహరులయందు భక్తి దేని వలన నలవడునో, త్రివిధకర్మలఫలము దేనివలన లభించునో తెలుప ప్రార్థించ, సూతుని సమాధానమిట్లున్నది:

ఈ ప్రశ్నకు సమాధానముగా పూర్వఋషులు తెల్పినదే మీకు తెల్పుచున్నాను. వినుడు: అతిపవిత్రమయినది, రాముడు సేతువును

నిర్మించిన పవిత్ర క్షేత్రము, రామేశ్వరముకలదు. భక్తితో, జన్మమధ్య మున, ఒకమారా క్షేత్రమును, దర్శించిన, ఫలమనంతము. మాతృ వంశమువారును, పితృవంశమువారును రెండుకోట్లుతరములవారు మోక్షమును ప్రాపింతురు. భూమిమీద ఇసుకరేణువు లెన్నికలవో, ఆకాశమున తారక లెన్నికలవో లెక్కించవచ్చునేమో కాని, సేతుదర్శన పుణ్యఫలములు ఆదిశేషుని కయినను లెక్కింపనలవికాదు. సేతు బంధము - రామేశ్వరము - సమస్త దేవతాస్వరూపమని ఖ్యాతిగాంచినది. ఆ క్షేత్రదర్శన మొనరించిన పురుషుని పుణ్యము ఇంతయని తెలుప నెవరికిని శక్యముకాదు. సేతుదర్శనము చేసిన నరుడు అఖిలయజ్ఞము లొనరించినవాడగును. సర్వతీర్థములయందును స్నానముచేసినఫలము, సమస్తతపము లొనరించిన ఫలములబడును. రామేశ్వరము శైలపదుసని మనసాతలంచిన చాలును, ఆఫలమందును. సేతుస్నానముచేసిన నరుని సప్తకోటికులములవారితో సహా విష్ణుపదమంది ముక్తులగుదురు. సేతువును, రామేశ్వరలింగమును గంధమాదన పర్వతమును స్మరించినంత, నిస్సందేహముగ సర్వపాపములు నశించును, హరి హర పదముల ననంతకాలము సుఖములు పడయుదురు. సేతుస్నానమొనరించిన నరునకు నరకస్పర్శయుండదు. సేతుస్నానమే సర్వపాప ప్రాయశ్చిత్తము. సేతుసైకత రేణువులెన్ని శరీరమునకంటునో అన్ని బ్రహ్మహత్యా పాతకములునశించును. రామేశ్వర క్షేత్రమునందలి ఉదక పానం, వాయుస్పర్శ, ఇత్యాదులవలన పంచమహాపాతకములు పటాపంచలగును. సేతుస్నానమున నాశమందని పాపజాలమేనరుడును చేయజాలడు. సేతుస్నానముచేసి పశ్చాత్తప్తుడయిన వాడెట్టిపాప మొనరించినను తప్పక నశించ, నాతడు పుణ్యగతినందును. ఆ క్షేత్ర మున చేసినదానమెంత స్వల్పమయినదయినను, అక్షయఫలము లొసంగును. కోరికతో సేతుస్నానమాచరించిన, కోరినకోరిక అచిర మున ఫలప్రదమగును. సర్వకామదము క్షేత్రదర్శనము, సేతుస్నాన మును. చింతామణి, కామధేనువు, కల్పతరువులవలె సమస్తకోరికల

నీడేర్పగలయిది, రామేశ్వర క్షేత్రము సేతుస్నానము. సేతుస్నానమున కని, సంపన్నుని యాచించి ధనము గొని, పోకున్న, బ్రహ్మహత్యతో సమమయిన పాపము నందును. ధనము యాచించిపోయి సేతుస్నాన మొనరించిన ధనదాతకు క్షేత్రదర్శన ఫలము అంతయులభించును. ఉభయులూ ముక్తి వడయుదురు. ఇతర యుగముల జ్ఞానమున, యజ్ఞమున పొందుఫలము, కలిలో దానమున, క్షేత్రములకుపోయి దర్శన, స్పర్శన, స్నానములవలన పొందగలరు.

---

## 2—వ అధ్యాయము

రాముడు సేతువు నిర్మించిన కారణము, గంధమాదనమునగల ఇతరతీర్థములు:

ఋషులు సూతునడిగినప్రశ్న : మహాభాగా! సూతా! వరుణాలయమయిన, సముద్రమునకు, సేతువేల బంధించెను? గంధమాదన పర్వతమున, సేతువున తీర్థములెయ్యవి? పౌరాణికోత్తముడవు. ఇవి సవివరముగ మాకుతెల్పుమన - సూతుని సమాధానము - తండ్రి ఆజ్ఞ పాలింపు నిమిత్తము రాముడు సీతాలక్ష్మణులనుగమించి అరణ్యములు గడుపుచు పంచవటిచేరుకొనెను. మారీచుని మాయాలేడిరూపమున రాముడు సుదూరమాకర్షింపబడ, లక్ష్మణుడున్ను అతనిని వెదుకబోవ, రావణుడు మాయాతాపసిరూపమున సీతనెత్తుకొని లంకకేగెను. అన్న దమ్ములిరువురు, మారీచుని లేడిరూపు నాశమొనరించి ఆశ్రమమున కేగి సీతను కానక దుఃఖించుచు అన్వేషణ తత్పరులై పంపాతీరము సమీపించిరి. హనుమంతుడు సుగ్రీవు పంపున వీరిని సమీపించి నమస్కరించి వారి వృత్తాంతము తెలిసి తన ప్రభువు సుగ్రీవుడు వారిసఖ్య మభిలషించు చున్నాడని తెలిపి వారి అనుమతి వడసి వారినితోడ్కొని

సుగ్రీవుపాలికేగెను. అట అగ్నిసాక్షికముగ రాముడు సుగ్రీవునితో సఖ్యమొనరించి, ఆతనికి వాలినివధించి సహాయమొనరింతునన, సుగ్రీవుడును సీతను వెదకి తెచ్చుటలో రామునికి సహాయమొనరింతుననెను. తనబలముమీద సుగ్రీవునకు నమ్మకము పుట్టుటకై ఆతనికోరిక ప్రకారము దుందుభికాయమున కాలిగోట సుదూరము పారజిమ్మెను. ఒకబాణమున సప్తతాళములను ఖండించివైచెను. సుగ్రీవుడు - తనకింద్రాది దేవతలన్న భయములేదనియు, అతిపరాక్రముడయిన ఆతని మైత్రివలన లంకేశ్వరుని చంపి సీతనుతీసికొని రాగలననెను. వెంటనే రామలక్ష్మణులు సుగ్రీవుడు ఆతనిసచివులతోసహా వాలిపాలితమయిన కిష్కింధసమీపమునకేగిరి. సుగ్రీవుడు బొబ్బయిడి వాలినాహ్వానించి తొలినాడు వాలిముష్టిఘాతమున కోర్వకపారిరా, ఇరువురేకరూపులుగాన ఆనవాలుగా ఒకమాలవైచి పంపి, మరలవాలితో పోరాడు సమయమున ఏకబాణమున రాముడు వాలిని సంహరించెను, పిదప వానర సేనతో సుగ్రీవుడనుగమించ రామలక్ష్మణులు - పూర్వమే హనుమ లంకకేగి సీత అట అశోకవనమున దుఃఖితయయియున్న వార్త విన్నవారు గనుక, లంకనుగూర్చి పయనించుటలో సముద్రతీరమున మహేంద్రగిరిచేరిరి. జాంబవంతుడు, నలుడు ఇత్యాది కపిముఖ్యులు వానర సైన్యమున నున్నారు. అటచక్రతీర్థమున నివాసమేర్పఱచుకొని శిబిరములు సైన్యములకు నిర్మించుకొనిరి. రావణుని తమ్ముడు విభీషణుడు నలువురుమంత్రులతోవచ్చి రామునిశరణందెను. సుగ్రీవుడు అనుమానించ, దానికితావులేదనుచు రాముడు శరణార్థులనాదరించెను. ఆ క్షణముననే విభీషణుని సర్వరాక్షసరాజ్యమున కభిషిక్తునొనరించెను. అనంతరము రామచంద్రమూర్తి సుగ్రీవునిచూచి సాగరముదాటుటకుపాయమాలోచించుడనెను. సాగరము శతయోజన విస్తారము. ఈ సేనాసమూహమంతయు దాటవలయునుగదా. రాజ్యములేదు. వనచరులప్రాయమటువంటిది. సీతహరించబడినది. తండ్రి స్వర్గమలంకరించెను. ఇన్నిటికన్న దుష్కరమయినది సాగరలంఘనము. ఇట్లాలో

చించు రాఘవులకు సుగ్రీవుడు పడవల సహాయమున దాటుదమన అది అంతసులక్షణముకాదని రాముడనెను. విభీషణుడు సముద్రుని అర్థించిన ఆతడు తప్పకసహాయపడగలడని సూచించెను. అంతరాముడు మూడు రాత్రులు కుశాస్తరణమునగడపెను. ఇట్లయినను సాగరము రామునికి దర్శనమీయలేదు. అంత ప్రక్కనేయున్న లక్ష్మణుని చూచి ఈ మూర్ఖుడు సామమున చక్కబడడు ధనుర్బాణములిటు తెమ్ము, సముద్రమును శోషింపచేతును. అని ధనువంది త్రిపురారివలె కోపమున ఎర్రబడిన నేత్రములుకలవాడై ఒకబాణమును జలములువిడువ, సముద్రుడు భీతిల్లి, ప్రాంజలియయి, ఎదుట నిలచి నుతించి రక్షించుమని వేడుకొనెను. 'నీవుసాక్షాన్నారాయణుడవు, నీ ఆజ్ఞశిరసావహించి నీవు సైన్యముతోదాట జలములు శోషింపచేసిన ఇతరులిట్లే నన్ను బలవంత పెట్టెదరు. అది ధర్మముకాదు. ఉపాయాంతరము తెల్పెదను వినుము నీ సేనలో నలుడనువానరుడు కలడు. ఆతడు తృణకాష్ఠలోష్ఠములేవి వేసినను తేలిపోవును, వాని సహాయమున వారధి నిర్మించి దాటిపోవుటుచితమనెను. ఇట్లని సముద్రుడంతర్హితుడుకాగా, నలునిపిలిచి రామచంద్రుడు సముద్రునివాక్యము సత్యమయిన నీవు సేతువు నిర్మించుమని కోరెను. నలుడు వానరులను గిరులు వృక్షలతాదులు తీసికొనిరమ్మని వారటులచేయ తానువాటిని స్పృశించినంత సేతువువలె అవి తేలినవి. పదియోజనములు వెడల్పు, నూరుయోజనములు పొడవు సేతువు నిర్మాణమాయెను. ఈ విధముగ విశ్వకర్మసుతుడు నలుని సహాయమున సేతువు తయారయ్యెను. ఇట్టిపవిత్రమయిన సేతుస్నానమున నరులు పాప విముక్తులగుదురు. రాముడుపవసించినతావు దర్భశయనమని ఖ్యాతిగాంచినది. ఇది సేతుబంధన గాథ. ఇట అనేక తీర్థములు, అనేకములు పుణ్యాదములు కలవు, అందుకొన్ని తెల్పెదను. ముఖ్యమయినవి ఇరువదినాలుగు: చక్రతీర్థము, పాపవినాశనము, సీతాసరస్సు, మంగళతీర్థం, అమృతవాపిక, బ్రహ్మకుండము, హనుమత్కుండము, అగస్త్యతీర్థము, రామతీర్థం, లక్ష్మణతీర్థం, జటాతీర్థం,

లక్ష్మీతీర్థము, అగ్నితీర్థము, శివతీర్థం, శంఖతీర్థం, ధనుష్కోటి, మానసతీర్థములు, ఇవి ప్రధానములు పాపఘ్నములు, సేతుమధ్యగత తీర్థరాజములు.

---

## 3—వ అధ్యాయము

చక్రతీర్థము త్తమమనుటకు కారణము – దానిని స్మరించినంత మాత్రాన పునర్జన్మయుండదు. లతుజన్మల చేసిన పాపములేనియు లయమందును. లోకమున ఇంతకన్న ఉత్తమతీర్థములేదు. స్మరించిన, స్నానమాచరించిన, కీర్తించిన పాపములుండవు. కాళిందీ, కావేరీ, నర్మదా, మణికర్ణికా, ఇత్యాది పుణ్యనదులు, పుణ్యతీర్థములు దీనికి కోట్యంశమయినను సరిరావు. దీనికి ధర్మతీర్థమని నామాంతరము. పూర్వము విష్ణుభక్తుడు గాలవుడను మునిపుంగవుడుండెను. దక్షిణ సముద్రతీరమున, [illegible] సమీపమున, ఫుల్లగ్రామము తీరస్థ తీరమున, ధర్మపుష్కరిణియందు తపమొనరించెను, సత్యవాది విజితేంద్రియుడు నిరాహారుడయి పదివేలయుగముల పర్యంతము, [illegible] కఠోర దీక్షల గ్రహించి, అనగా పర్ణభక్షణము, వాయుభక్షణము, జలమాత్రము ఆహారించుచు, శీతవాతాతపములకోర్చి నిరంతరము [illegible] పంచాగ్నిమధ్యమునయుండ, శంఖచక్రగదాద్యాయుధములతో పుండరీకాక్షుడు, హరి ప్రత్యక్షమై నిల్చిన, గాలవుడు పరమభక్తియుక్తచేతస్కుడై స్తుతించి అంజలించెను. హరి సంతసించి నాలుగు భుజములతో మునిని నాలింగనమొనర్చి చుకొని వరము వేడుమనెను. [illegible] దుర్లభము; నాకలవడినది. ఇంకేమి కావలయును. నీ [illegible] మాత్రమున ముక్తినందగలము. నీపాద [illegible] భక్తియుండునట్లు [illegible] వేడెదననెను. హరియట్లే అది [illegible] ఇందేయుండి తపమాచరింతువు.

కర్మ క్షయము కాగా నాపదము ప్రాపింతువనెను. అనంతరము గాలవుడు తనకనుకూలముగ ఒకతీర్థమును నిర్మించి తత్తీరమున మహాదేవుని చింతించుచుకాలము గడుపసాగెను.

పూర్వము ధర్మదేవత మహాదేవునిగూర్చి తపమాచరించ శూలపాణి ఆతనికి ప్రత్యక్షముకాగా ధర్ముడు హరుని నుతుల సంతసపెట్టెను. "ప్రణవాత్మకమయిన ఈశానునకు, విశ్వరూపునకు, అనంతున కజున కవ్యయునకు, పశూనాంపతికి నమస్కారములు," ఈశ్వరుడానుతులకు సంతసించి వరమువేడుమన తాను హరునకు వాహనముగా సేవింతునన హరుడంగీకరించ మహాబలముగల వృషభరూపము ధరించి ధర్మువు హరునకువాహనముగానయి ఆనందించెను. ఆ ధర్మువు తపమొనరించిన తీర్థము ధర్మపుష్కరిణి అని ఖ్యాతి వడసెను. ఈ తీర్థమునచేసిన జప హోమదానాదికములు అక్షయ ఫలప్రదములగును - అని శంకరులు వరమిచ్చి ధర్మాధిరూఢుడయి కైలాసమునకేగెను. ఈగాథ, హరి గాలవునకు తెల్పి అటశరీరపాతపర్యంతముండి అనంతరము తనపదమంద గలవని తెల్పెను. అంత హరి అంతర్హితుడుకాగా గాలవుడు విరక్తుడు విజితేంద్రియుడై కాలము నిరీక్షించుచునుండెను. ఒకానొక సమయమున, మాఘమాసము, శుక్లపక్షము ఏకాదశి ఉపవసించి హరిపూజ యొనరించి రాత్రిజాగ్గరణ మొనరించి ద్వాదశిపారణ యొనరించి అనంతరము హరికీర్తనము చేయసాగెను. సహస్ర శీర్ష పురుషుని, కూర్మాది దశావతార మూర్తిని, వాసుదేవుని కీర్తించెను. ధ్యాన నిమీలితుడయి ధర్మపుష్కరిణి తీరముననుండ, ఒక రాక్షసుడు మునిని చంపి తినవచ్చెను. ఆరాక్షసు డాతనినిపట్ట, ఆపన్నరక్షకు నారాయణుని గూర్చి ముని ఆక్రోశించెను. హరి చక్రమును ప్రేరేచెను. అది అగ్నిప్రభకలది, మహాజ్వాలగా ఏతెంచినది. రాక్షసుని శిరము చక్రము కత్తిరించ వాడు నేలప్రాలెను. చచ్చిపడిన రాక్షసుని గాలవముని చూచి ఆనందించ సుదర్శనమ్మున్ను నుతించెను. "విష్ణుచక్రమునకు, విశ్వరక్షణ

దీక్షితునకు, అసురసంహార కుశలునకు నమస్కారము, ఈ ధర్మతీర్థమున సదానివసించి మునులకు ముక్తి నిమ్మని ప్రార్థించెను. లోకములకు హితమునుగోరి తానట్లే అట నుందునని చక్రము గాలవమునిప్రార్థన నంగీకరించెను. నాటినుండి చక్రతీర్థమని పేర్వడసినది. ఇందుస్నాన మాచరించి కులములవారెల్లరు పాపముక్తులగుదురు, స్వర్గమధిగమింతురు అనుచు విష్ణుచక్రమంతర్ధానమందెను.

---

## 4—వ అధ్యాయము

విష్ణుభక్తుని గాలవుని హింసించవచ్చి చక్రధారకాహుతియయిన ఆరాక్షసునిగాధ తెలుప మునులడుగ సూతుడు వివరించుచున్నాడు.

హరుని మందిరమయిన కైలాసగిరికి, మధురాపురవాసులు బ్రహ్మవాదులు, ఇరువది నాలుగువేలు శివభక్తులు వసిష్ఠాదులు ముక్తికొఱకు శివుని పాసించనేగిరి. ఒకనాడాకైలాసగిరిన బలియుడు, విశ్వావసుడను గంధర్వుని కుమారుడు దుర్దముడనువాడు విటగోష్ఠి పరాయణుడు, వందమంది ప్రియకాంతలతో, జలక్రీడ సాగించెను. ఆ కాంతలు వివస్త్రలు, తాను వివస్త్రుడై క్రీడించసాగెను. మధ్యాహ్నము కాగా ఆహ్నికము తీర్చ మునులు హాలాస్య తీర్థమునకురా, చూచి కాంతలు వస్త్రములు త్వరగధరించుకొనిరి. దుర్దముడు సాహసి అటులొనరించలేదు. కోపించి వసిష్ఠు డాతని నిట్లు శపించెను. స్వర్గభ్రష్టుడవై నిశాచరుడవు కమ్మని, ఆతనికాంతలు పతిభిక్ష వేడ గాలవునిమూలమున శాపవిముక్తి, పదునారు సంవత్సరములనంతరము, కాంచుననెను. అపుడే యథాపూర్వము మీరు కాంతునితో సుఖములందగలరనెను. వెంటనే దుర్దము రాక్షసుడై అరణ్యములు తిరుగుచు జనమును హింసించుచు, తుదకు గాలవుని

రక్షించవచ్చిన చక్రముచే నిహతుడై మరల తనవారిని గంధర్వుడై కలసికొనెను. దర్భశయనము మొదలు దేవీపట్టణపర్యంతము విశాల మయిన చక్రతీర్థము ఇపుడు విచ్ఛిన్నమయి అఖండముగా నుండక పోవుటకు హేతువు తెల్పగోర, సూతుని సమాధానము: పూర్వము పర్వతములకు రెక్కలుండెడివి. యథేచ్ఛగ ఎగురుచు విహరించ పక్షులు పశువులు, ప్రాణిజాలము మరణించుచుండెడివి. ఇంద్రుడు కోపించి పర్వతముల రెక్కలు వజ్రముచే ఖండించివైచెను. కొన్ని పర్వతములు పారిపోయి లవణసముద్రమున దాగినవి. కొన్ని చక్రతీర్థమున దాగి నవి ఈ విధముగ పర్వతములుపడుటవలన చక్రతీర్థము మధ్యభాగమున విచ్ఛిన్నమైనది. మునుల ప్రశ్నకుసూతుడీ సమాధానమిచ్చెను.

---

## 5–వ అధ్యాయము

సూతుడింకొకగాథ చక్రతీర్థమునకు సంబంధించిన దిట్లు తెలుపసాగెను.

విధూముడను వసువు కలడు - ఆతని స్త్రీ అలంబుస. వీరిరువురిని బ్రహ్మ శపించిన కారణము, ఆగాథ ఇటులున్నది. ఒకనాడు బ్రహ్మ సరస్వతితో సల్లాపముగనుండ, మునీశ్వరులు సనకసనందనాదులు, నారదాదులు సేవించుచుండ, ఇంద్రాదులు గరుడుడు నుతుల సంతస పెట్టుచుండ, ఆదిత్యాది గ్రహరాజులు పరివారములోనుండ, కిన్నర కింపురుష సిద్ధసాధ్యాదులు నుతుల అచ్చరలు నాట్యమున సంతసపెట్ట సత్యలోకమున, సభామధ్యమున ఒకనాటిసమయమున, రూపయౌవన శాలిని అలంబుస అనుదేవకాంత నృత్యము చేసెను. ఆనాట్యసమయ మున వాయుచాలనమున వస్త్రముతొలగి ఊరుమూలరుచులు బయల్పడె, ప్రమాదముగాన, బ్రహ్మాదులు, ఋషులు కనులుమూసి

కొనిరి. విధూముడను వసువు కామపీడితుడయి, రోమాంచము కలిగి కోరికతో చూడ, బ్రహ్మ తెలిసి వసువును మానవుడయి జన్మించ శపించెను. ఈమెయే నీకట భార్యకాగలదనెను. విధూముడు తానా శాపము భరించజాలననియు, రక్షించుమనియు బ్రహ్మను వేడుకొనెను. అంత శాపమునకవధి తెల్పుదును. శాపమనుభవించక తీరదనుచు ఇట్లు తెల్పెను.

మానవుడవయి, క్షత్రియ జన్మగాంచి రాజ్యము శాసించుచు ఈకాంతతో పాలనసాగించుచు అసమానప్రభావముగల పుత్రుని కాంచి ఆతనికిరాజ్యమిచ్చి అనంతరము చక్రతీర్థమునకేగి అట స్నానమాచరించుము.దానపాపము శమించును. అంత బ్రహ్మనే ఆలోచన అడిగి కౌశాంబీ నగరమునకు ప్రభువు శతానీకుడు, ఆతని భార్య శీలవతి, విష్ణుమతి అను పేరుగల, వారలకు సుతుడయి జనించనేగెను. పోవుటకుముందు మాల్యవంతుడు, పుష్పదంతుడు, బలోత్కటుడు అను ముప్వురు భృత్యులకీశాపవార్త తెలుప, వారాతని వియోగమునకు ఓర్వలేమనుచు, ఆతనితో భూలోకమున జన్మించ నిశ్చయించిరి. ఒకడు శతానీకుని మంత్రి యుగంధరునకు తనయుడుగాను, సేనాని విప్రతీకునకు సుతుడుగా నింకొకడును, ఆతని నర్మసచివుడువల్లభునకు సుతుడుగా మూడవవాడును జన్మించనేగిరి. ఈమాటలువిని వసువు విధూముడిట్లనుచున్నాడు. మీకు నాయందుగల స్నేహాభావము తెలియును. శాపము నేననుభవింతును జుగుప్సితమయిన మానుష భావము మీకువలదు అన మీ వియోగముకన్న మానుషత్వము సుఖదాయకము మమ్ముమన్నించి అనుగమించ అనుమతి ప్రార్థించిరి. సరేఅనుచు ముప్పురితో కౌశాంబికేగెను. ఆకాలమునకే కౌశాంబికి రాజు శతానీకుడు, నీతిజ్ఞుడు, ప్రజాపాలనతత్పరుడు, శౌర్యరాశి. యువకుడు. ఆయన మంత్రి యుగంధరుడు, సేనాని విప్రతీకుడు, వల్లభుడను ద్విజుడు రాజునకు నర్మసఖుడు, భార్యవిష్ణుమతియందు

సంతానప్రాప్తిలేమి రాజు చింతాపరుడయి మంత్రినాలోచన అడిగెను. యుగంధరుని ఉపదేశము "శాండిల్యుడను మహర్షి కలడు. సత్యవ్రతుడు, శుచి, స్వాధ్యాయతత్పరుడు, అగ్నికల్పుడు. వినీతుడవయి ఆత్మ సమునిపుత్రుని వడయు నుపాయము ప్రార్థించుము. అనసంతసించి మంత్రితో శాండిల్యు నాశ్రమమునకేగెను. వచ్చినరాజునకు ముని ఆతిథ్యమిచ్చి పూజించి స్వాగతము పల్కెను. రాజువచ్చిన కార్యము తెలుపగోరి, అవశ్యమది తీర్తుననెను. మంత్రి రాజువచ్చిన కార్యము ఋషికితెల్పెను "భగవన్, రాజు పుత్రులు లేమి దుఃఖించుచున్నాడు. పుత్రకారణమున మిమ్ముశరణందవచ్చెనన. ముని కౌశాంబికేగి పుత్ర కామేష్టి చేయించెను. దశరథతుల్యుడు రాజు శతానీకుడు రాముని వంటి కుమారుని విష్ణుమతి వలన కాంచెను. అటులనే మంత్రి, సేనాని నర్మసచివులు సుతులను కనిరి. వరుసగా వారలనామములు సహస్రా నీకుడు యువరాజు, యౌగంధరాయణుడు మంత్రి యుగంధరుని తనయుడు, సేనాపతివి ప్రతీకుని సుతుడు రుమణ్వంతుడు, నర్మస చివునికుమారుడు వసంతకుడు. వీరు నల్వురు కలసియే అయిదు సంవత్సరములు పెరిగిరి. స్వర్వేశ్య అలంబస అయోధ్యాపతి కృతవర్మకు మృగావతి అను పేరుగల కన్యగా జనించెను. ఇట్లు విధూముడు, మిత్రులు ముువ్వురు, సర్వేశ్య అలంబస భూలోకమున జనించిరి.

ఈ సమయమున అహిదంష్ట్రుడను మహారాక్షసుడు, స్థూల శిరుడను ఇంకొక అసురుని సహాయమున, బలియుడై స్వర్గముపై దాడిచేసెను. ఇంద్రుడు తనకు సహాయార్థము శతానీకుని రావించెను. అతడు యువరాజును రాజ్యరక్షకు నియమించి మాతలితో స్వర్గమున కేగెను. యుద్ధమున రాక్షసులను రాజు తునుమాడియు వారలచేత మరణించెను. చనిపోయినరాజును ఇంద్రుడు మాతలిచే భూలోకమున అతని తనయునికడకుపంపెను. యువరాజు సహస్రానీకుడు విలపించి ప్రేతకార్యములు తీర్చెను. తల్లి పతిననుగమించెను మంత్రి వచనమున

రాజ్యము స్వీకరించెను. క్రమముగా వృద్ధులు మంత్రి, సేనాని నర్మస చివుడు గతించ వారల తనయులు సహస్రానీకుని సేవించసాగిరి. వీరి సహాయముతో పాలనకార్యము సహస్రానీకుడు శాసించెను. శాపాను సరణముననే సహస్రానీకుడు, ఇంద్రోత్సవమునకు ఇంద్రుని పిలుపున నాకమునకేగి తిరిగివచ్చుచు, ఇంద్రునివచనముననే తనకు కాగల భార్య మృగావతినే తలంచుచు భూలోకమునకు వచ్చుచుండ మార్గ మున తిలోత్తమతారసిలి రాజును కాంక్షించ అన్యాసక్తుడుకామి ఆమెను గమనించకయే వచ్చెను. పదునాలుగు వత్సరములు భార్యా వియోగమనుగునని ఆమె రాజు సహస్రానీకుని శపించెను. కౌశాంబి చేరి కాలక్రమమున కృతవర్మతనయ మృగావతిని పరిణయమాడెను. కొలదికాలమునకామె గర్భముదాల్చెను. గర్భదోహదములు కోరిన వెల్లరాజ్ఞికి రాజుసమకూర్చసాగెను. కర్మబంధము వలన రక్తవాపీ స్నానము కాంక్షించెను. కౌసుంభసలిలముతో క్షణములో వాపినేర్ప రించెను. ఆమె స్నానముచేసి ఆ ఎర్రని రక్తజలముల తడిసిన వస్త్రము లతో నంతిపురమునకేగుచుండ ఆమిషమని వికటమయిన సుపర్ణకుల జాతము. పక్షి ఎత్తుకొనిపోయెను. వివశ అయియున్న ఆకాంత నా పక్షి ఉదయాచలమున ఒక గుహలో విడిచెను. దిక్కుతెలియని ఆ నూతన ప్రదేశమున భయవిహ్వలఅయి భర్తను తలంచుకొని, విలపించ సాగెను. బాగతలంచి ఆ అరణ్యమున గజములకు, సింహములకు ఎదురై పోసాగెను. ఆపత్కాలమున మనుజులకు మరణ్యమే శరణ్య మను కొనుచు దీనముగ నేడువసాగ, మృగములు సయితము కన్నీరువిడుచుచు గ్రాసము తినక నిలచి చూచుచున్నవి. సమీపమున జమదగ్ని ఆశ్రమ మున్నది. ఆయన శిష్యులు కందమూలాదులు కొనిపోవుచున్నవారు, ఆమెను ఆదరించికొనిపోయి గురువునకు విన్నవించిరి. జమదగ్ని సర్వము జ్ఞాననేత్రమున తెలిసి ఆమెను ప్రియముగ సమీపమున నాసీననుచేసి "భద్రే! నన్ను నీ తండ్రి కృతవర్మను వలెనే తలంచుము. నీకు ఋషికులమున సుఖమయిన వాసము కల్పింతు

నని తెల్పి అటులొనరించి ఆమెకు దుఃఖోపశమనము గావించెను. అచిరమున ఆ మె సుతుని కన్నది. మునికాంతలు, బందుగులొనరించు కార్యములన్నియు రాణికొనరించిరి. ఒక అశరీరవాణి ఉదయాచల మున జన్మించుట ఉదయనుడని నామముచితమని విన్పించెను. చూడాది క్రియలొనరించి జమదగ్నియే ఆబాలునకు సకలవిద్యలు నేర్పెను. యువకుడయి, ఒకసమయమున వేట తమకమున అరణ్య ముల తిరుగువాడు. ఒక వ్యాధునిచే దృఢముగ పట్టుకోబడిన భుజంగ మును - పామును చూచెను. దయాపరుడయి దానిని విడువుమని వ్యాధునికోరెను. దీనితో నీవేమిచేతుము దానిని హింసించవలదనెను. వాడు దానిని పట్టుకొని గ్రామములతిరిగి ధనధాన్యములు సంపా దించుకొందునని సమాధానమిచ్చెను. అందువలన నాజీవిక కాధార మయిన దీనిని విడువజాలననుచు, పేటికలో బంధించెను. కాని ఉదయనుడు పేటికతో వానిని తల్లివద్దకు తీసికొనిపోయి ధనార్థికాశ బరునికి తల్లిచే కంకణమిప్పించి నాగమును బంధముక్తుని చేయించెను. కంకణముకొని శబరుడింటికిపోయెను.

వెంటనే ఆ నాగము పురుషాకృతి గ్రహించి, ఉదయనునితో సఖ్యమొనరించి, అతనిని తనలోకము చూతుము రమ్మని పాతాళము నకు కొంపోయెను. ఆ నాగుడు కిన్నరుడను పేరుగలవాడు ధృత రాష్ట్రుడను నాగరాజు సుతుడు. అతనిచే పూజలంది పాతాళము సుఖవాసముండెను. కిన్నరుని చెలియలు ధృతరాష్ట్రుని కూతురు లలి తను చేపట్టెను. అతనివలన లలిత మహాతేజస్వి సుతునొకనిని కనెను. వెంటనే ఆమె సర్పాకృతి విడచి, విద్యాధరిఆయెను. తాను శాప వశమున అట్లయితిననియు, ఈతడు నీ తనయుడు గ్రహించుము. వాడని ఈ మాల గ్రహించుము. ఘోషవతి అను ఈ వీణెనుకూడ గ్రహించుమన ఉదయనుడట్లే వానిని గ్రహించెను. సర్పములన్నియు చూచుచుండ ఆ విద్యాధరాంగన ఆకాశమున ఎగసిపోయెను. ఉద

యనుడు ధృతరాష్ట్రాదుల యనుమతివడసి, పుత్రుని మాలను, వీణియను గ్రహించి, దుఃఖితయయియున్న మాతనుచేర స్వాశ్రమమున కేగెను. ఈలోగా జమదగ్నిచే ఉపశమనమందియున్న మాతను సమీపించి తన వృత్తాంతమంతయు వివరించి మనుమనిచూపి సంతస పెట్టెను. ఈలోగా శబరుడు కంకణము అమ్ముటకై కౌశాంబికేగి అంగడిలో దానినమ్మ జూపెను. ఆ కంకణమున రాజముద్రచూచి వ్యాపారి ఆ శబరిని కంకణముతో కొనిపోయి రాజునకు నివేదించెను. ఆ రాజముద్ర సహస్రానీకుడు తనదేయని గ్రహించి కాంతను మృగావతిని తలంచి విలపించి ఆ శబరునివలన ఆతనికి కంకణము లభించిన వృత్తాంతము తెలిసికొనెను. శబరునికి బహుళధనములిచ్చి, మంత్రితో ఉచితపరివారముతో జమదగ్ని ఆశ్రమమునకు పయనమైపోయెను. పోయి మునికి నమస్కరించి నిలువ, రాజు నుచితసత్కారముల గౌరవించి జమదగ్ని ఆ నృపునకు రాణిని తనయుని ఉదయనుని, పౌత్రుని ఒప్పించ రాజు ముని ఆశీర్వాదములంది భార్యతో పుత్రుడు పౌత్రునితో రాజ్యమునకు, కౌశాంబి కేగెను. వెంటనే పూర్వశాపము, ఇంద్రుని వాక్యము స్మరించి, ఉదయనునకు రాజ్యమధీనమొనరించి, దక్షిణ సముద్రతీరమున చక్రతీర్థమున స్నానముచేయు నిమిత్తము భార్య మృగావతితో, మంత్రి యౌగంధరాయణునితో, వసంతకరుమణ్వంతులతో నేగెను. తీర్థరాజమునకేగి విధివిధానముగ నలువురును దేవితో స్నానముచేసిన వెంటనే వారల మానుషజన్మ మంతరించినది. నప్పలు దివ్యమాల్యాంబరధరులు, దివ్యరూపధరులు, నయిరి. అలంకృతము లయిన విమానములధిరోహించి స్వర్గలోకమునకేగిరి. అనంతరము వారు పదే పదే చక్రతీర్థమహిమను తలంచి స్నానమాచరించ వచ్చుచు పోవుచుందురు. ఈ విధముగ విధూమచరితము సూతుడు శౌనకాది మహర్షులకు తెల్పెను.

## 6–వ అధ్యాయము

ఋషులు సూతుని అడిగినప్రశ్న - సూతా! మహాభాగా! దేవీపట్టణ పర్యంతం చక్రతీర్థమని తెల్పితివికదా. దేవిపట్టణ చరిత విన్పింపుము. సేతుస్నానము, చక్రతీర్థమాహాత్మ్యము, ఇంకను అట విశేషములు విన్పింపగోరిరి. అందులకు సూతుని సమాధానము: శ్రీరామచంద్రుడు నవపాషాణములు ఏ ప్రదేశమున స్థాపించి మొదట సేతువు కట్టనారంభించెనో ఆ ప్రదేశమే దేవీపట్టణము: అది చక్రతీర్థము నకు తుది. దేవీపత్తనమను పేరు వచ్చుటకు కారణము ఇట్లున్నది.

పూర్వము దేవాసుర యుద్ధమున దైతేయులు నశించ, తన కుమార్తెతో దితి తపముచేసి సురులను హింసించే సుతుని కనుమన దితి తనయ తపోవనమునకేగి పంచాగ్ని మధ్యమున ఘోరతపమొనరించెను. వరబలమున ముఖము మహిషాకారము, శరీరమునరాకృతి సుతుడు మహాబలుడుద్భవించెను. ఇటుల మహిషాసురోత్పత్తి అయినది. ఈ వార్తవిని రక్కసులు విప్రచిత్తు విద్యున్మాలి ఇత్యాదులు, పూర్వము ఇంద్రుని కోడిపోయి స్వర్గము కోల్పోయినవారు వచ్చి మహిషు నాశ్రయించి దివ్యులపై దాడిచేయ ప్రోత్సహించిరి. వారలతోనేగి మహిషుడు నాకవాసులను రణమున కాహ్వానించెను. దేవదానవులు నూరువత్సరములు ఘోరముగ రణముజరిగి తుదకు దివ్యులోడి నాకము విడచి ఇంద్రునితోసహా పలాయితులై బ్రహ్మనుశరణందిరి. బ్రహ్మ దేవతలను వెంటనిడుకొని శివకేశవులున్న తావునకేగి వారిని స్తోత్రముల తృప్తినందించి దివ్యులకు మహిషునివలన పీడతొలగించ వేడుకొనెను. దిక్పాలుర అధికారములు తానే నిర్వహించుచు బలియుడయి లోక పీడ కల్పించుచున్నాడని విన్నవించెను. ఆ వాక్యములు విన్న వెంటనే శివకేశవుల నేత్రములు కోపారుణములయి మహాతేజస్సు దిగంతవ్యాప్త మయినది. ఆ సురులెల్లరి తేజము ఒక స్త్రీరూపము నందినది. శివు తేజమున ముఖము, హరితేజమున భుజములు, బ్రహ్మతేజమున పాద

ములు, ఇంద్రు తేజమున నడుము, యముని తేజమున కేశములు ఉరోజములు చంద్రుని తేజమున, వరుణతేజమున జంఘలు తొడలును, నితంబము పృథివీ తేజమున, పాదాంగుళులు సూర్యతేజమున, అగ్ని తేజమున కందోయి, ఉభయసంధ్యలవలన కనుబొమలు, వాయుతేజమున శ్రవణములు, కొదువ అవయవములు దివ్యులన్యుల తేజమున, ఇటుల దుర్గాదేవి ఆవిర్భవించినది. మహిషునివలన బాధితులయిన దివ్యులు దుర్గాదేవినిగాంచి సంతసించిరి. రుద్రాది దివ్యులు శూలాది తమ తమ ఆయుధములు దేవికిచ్చిరి. వస్త్రమాల్య భూషణాదులర్పించిరి. చందనము, సుకుమాలలిచ్చి అలంకృతు లందించిరి. భైరవముగ దుర్గ అట్టహాసమొనరించెను. సింహమును వాహనముగా గొనెను. దివ్యులు ఋషులు జయనినాదములు చేసిరి. దేవి అట్టహాసమున ముల్లోకములు క్షోభించినవి. రక్కసులు మహిషుని ముందుంచుకొని రణమున కుద్యుక్తులయిరి. అనంత సంఖ్యగా రాక్షసులొకేమారు దేవి నెదుర్కొన వేయు భుజములుదాల్చి దుర్గాదేవి బాణసహస్రములు, క్రూరములు వారిపై కెగజిమ్మెను. దివ్యులెల్లరు నిర్భయులై రణమున కురికిరి. కాని మహిషునెదిరించలేక దివ్యులు పలాయితులైరి. దేవి వజ్రతుల్యములయిన బాణములు ప్రయోగించి అసురులను చంపనారంభించెను. కోటానకోట్ల రాక్షసులు మరల మరల పుట్టుచునేయుండిరి. పుట్టినవారిని పుట్టినట్లే చంపి వేయుచు దుర్గ ఒకయామము వారితో అద్భుత రసావేశము కల్పించుచు పోరినది.

---

## 7—వ అధ్యాయము

మహిషు ఉగ్రుని చండకోపుని దేవి నెదిరించ ప్రోత్సహించెను. వాడు విజృంభించి బాణాసారమున దేవినిముంచ, దుర్గకోపించి సారథినిచంపి, రథము చూర్ణముచేసి, ధనువు ఖండించివైచి, వాని హృద

యమును నిశిత బాణముల తాడించెను. ఖడ్గమును చేపట్టి చండకోపుడు దేవిపై కురుక శూలమున పొడిచి వానిని దుర్గాదేవి చంపివేసెను. వెంటనే గజారూఢుడై చిత్రభానుడు దేవినెదిరించవచ్చెను. వాడు మహాఘంటారావముతో కూడిన శక్తిని దేవిపై ప్రయోగించెను. హుంకారమాత్రమున దేవి దానిని నిరాకరించెను. శూలముచేతనే వానిని పొడిచి చంపెను. కరాళుడు వేగముగ దేవికెదురయ్యెను. ఒక ముష్టిఘాతమున వానిని యముపాలికంపెను. అట్లే బాష్కలుని గదచే మోదిచంపెను. మహిషుని మంత్రులను ఇతరులను, మట్టుపెట్టెను. అంత మహిషుడు విజృంభించి దేవి సేనపై బడెను. వచ్చిన మహిషుని, సింహము నఖములచే చీల్చి నొప్పించెను. దుర్గ చండికయై మహిషుని పాశమున బంధించ వాడు మాహిషరూపు విడచి సింహరూపు ధరించిరా, వానిని చంప తలంచునంతలో పురుషుడై ఖడ్గము ధరించి అదృశ్యుడయ్యెను. వానిని రూపడంచ యత్నించునంతలో వాడు గజముగా మారెను. దేవీవాహనము సింహ మా గజమును హత మార్చెను. తిరిగి వాడు మహిషాకృతి ధరించివచ్చెను. భద్రకాళి వానిపై బడ పర్వతశిఖరములు వాడామెపై విసర ఆ పర్వతశిఖరములను బాణాసారమున దేవి యెగజిమ్మెను. జగన్మాత ఇంచుక తాళి ముష్టిచే వానిని పొడువ వాడు దక్షిణసముద్రతీరమునకు పారిపోసాగెను. సింహమధిరోహించి దేవి వానివెంటనేగి పట్టబోవ ధర్మపుష్కరిణీ జలముల మునిగెను. వాడు కన్పించకపోగా దేవి ఆలోచనలోనుండ అశరీరవాణి వాడు భయవిహ్వాలుడై జలముల నున్నాడని తెల్పెను. దేవీవాహనము పుష్కరణీ జలములన్నిటిని త్రాగివేసెను. దీనుడై వాడు బయల్పడ, దేవి వానిని పాదమున ఆక్రమించి శిరముత్రొక్కి కంఠమును శూలముచే పీడించుచు ఖడ్గముచే శిరము త్తరించివై చెను.

ఇట్లు దుర్గాదేవి సేనావారముతోసహా మహిషుని యమాలయమునకు పంపివై చెను. దేవతలు ఆనందముననోలలాడిరి. దేవిని

నతుల, నుతుల, సంతసపెట్టిరి. దివ్యులను వారితావులకు పంపివైచి దేవి దక్షిణసముద్ర తీరమున కుత్తరముగ తనపేర పురము నిర్మింపచేసెను. ధర్మపుష్కరిణిని అమృత జలముల దివ్యులు పూరించిరి. ఆ నగరమున తపమొనరించిన, తీర్థమున స్నానమొన రించిన రోగములుండవు, ముక్తులగుదురని దేవివరమిచ్చెను. ఇట్లు దేవీపురనిర్మాణమయినది. ద్విజులు దేవీపత్తనము మొదలుగా విఘ్నేశ్వరుని ప్రతిష్ఠించిరి. మహాదేవుననుమతి, అనంతరకాలమున, రామచంద్రుడు స్వహస్తములతో నవపాషాణములుస్థాపించి, లంకకు సేతువు కట్టించెను. నవపాషాణపు దేశమే సేతుమూలము. నవ పాషాణపు దేశమున, అనంతరము చక్రతీర్థమున, స్నానములుచేసిన నరులు పాపవిముక్తులగుదురు. దానికి దక్షిణముగ భేతాళవరద మను తీర్థమున్నది. మార్గమున దర్భశయనము. ఈ ప్రదేశముల స్నాన, దాన, క్షేత్రపిండప్రదానము లొనరించు వారి కులమువారు పలుతరములవారు తరింతురు. ఆదిలో రామచంద్రునికి నమస్కరించి సీతకును అటులనే పూజలు సలుపవలెను. భక్తియుక్తులయి నరులీ ప్రదేశములు స్మరించిన, తిలకించిన, స్నానమాచరించిన ముక్తి కాంతురు.

*

# బ్రహ్మ ఖండము

## 8-వ అధ్యాయము

ఋషులడిగిన ప్రశ్న - భేతాళ వరదమను తీర్థము చక్రతీర్థ మునకు దక్షిణముగ నున్నదంటివి, దానికి సంబంధించిన గాథ తెల్పుమన సూతుడు సమాధానముగ, పూర్వము కైలాసపర్వతమున కేళీవిలాసముగ పార్వతితోనున్న సమయమున శంకరులు తెల్పిన గాథ-అద్భుత రసమయము-తెల్పెదవినుడని తెల్పుచున్నాడు:

పూర్వము గాలవుడను మహర్షి ఉండెడివాడు. తన ఆశ్రమ మున పరంబ్రహ్మమును చింతించుచు తపోనియతినుండెను. ఆతని కొక తనయకాంతిమతి. రూపయౌవనశాలిని. ఆయన సమీపముననే తిరుగుచు పూలుకోసి పూజార్థము ఇచ్చుచు వేది పరిశుభ్రము చేయుచు తండ్రికి పరిచర్యచేయుచుండును. ఆ కన్యను ఇద్దరు విద్యా ధర కుమారులు విమానమున పోవుచు చూచిరి. వారి నామములు సుదర్శన సుకర్ణులు. ఆ కన్య వారలకు కాముని పత్ని రతికన్న అందముగ కన్పించినది. వారిలో పెద్దవాడు సుదర్శనుడు కామ మోహితుడయి దిగివచ్చి ఆ కన్యను సమీపించి, ఆమె వృత్తాంతము తెలియగోరెను. తాను సుకంతుడను విద్యాధరపతియొక్క కుమా రుడ నని తెల్పుచు, ఆమె సౌందర్యమునకు ముగ్ధుడ నయితినని వక్కాణించెను. తన్ను చేపట్టగోరెను. ఆమె వినీతయయి ఆతనితో తాను గాలవమహర్షి తనయననియు, పూలు వారినిమిత్తము కోయు చున్నాననియు ఆలస్యమయిన తండ్రి కోపించుననియు, కన్య స్వతంత్రురాలుకాదు, తండ్రి అధీనమున నుండునది అనియు, నీకు వలసిన తనతండ్రిని యాచించుమని తెల్పి, ఆశ్రమమునకు పోబోవ, హఠాత్తుగ నాతడు కేశాకర్షణమున ఎత్తికొని పోవుచుండ ఆక్రోశించి నది. మునులు, ప్రాంతములనున్నవారు త్వరితగతి నటకువచ్చిరి. సంగతి

తెలిసి గాలవముని విద్యాధరకుమారు నిట్లు శపించెను. 'అకార్య మొనరించిన నీవు మానుషయోని జనించుము. దుఃఖములపాలయి చనిపోయి భేతాళత్వము పొందుము. ఈ నీ కార్యము చూచుచు ఊరకయున్నవాడుకూడ మానవజన్మ ఎత్తునుగాక. అచిరమున తండ్రికీవార్త తెలిసినవెంటనే నీ సోదరుడు శాపముక్తుడగును. సాక్షాత్తు దుష్కర్మ యొనరించిన నీవు భేతాళత్వమంది చిరము బాధపడు మని వారలను శపించి కన్యను తీసికొని మునులతో ఆశ్రమమున ప్రవేశించెను. శాపమంది విద్యాధరకుమారులాశ్రమము విడచి యేగిరి. విద్యాధరకుమారులు ఎటజన్మించవలయునని ఆలోచించి, యమునాతీరవాసి గోవిందస్వామియను బ్రాహ్మణునికి సుతులయి జన్మించిరి. వారి నామములు విజయదత్తుడు, అశోకదత్తుడు అని. జ్యేష్ఠుడు, కనిష్ఠుడును, క్రమముగాయౌవనముప్రాపించిరి. ఈసమయ మునసే ఆ ప్రాంతముల 12 సంవత్సరములు అనావృష్టి, దుర్భిక్షము ఏర్పడెను. గోవిందస్వామి భార్యాపుత్రులతో కాశికేగెను. ప్రయాగ కేగి అక్షయ పుణ్యవటము కాంచెను. వారు తమముందు కపాలమాలా లంకృతుడగు యతినికనిరి. వారిని చూడగనే ముని 'బ్రాహ్మణోత్తమా, ఈ విజయ దత్తునితో నీకు వియోగము కల్గునసెను' ఆ మాటలువిని గోవిందస్వామి సూర్యాస్తమయము కాకుండ సాంధ్యకృత్యముతీర్చి దూరముగనున్న శూన్యాలయమున భార్యాపుత్రులతో ఆ రాత్రి గడుపనేగెను. తల్లి రెండవవాడగు అశోకదత్తుని ప్రక్కకు చేర్చుకొని, వస్త్రము పఱచుకొని శయనించెను. విజయదత్తునికి అలసటవచ్చి శీతజ్వరము తగిలినది. తండ్రిని చలిపోవ గట్టిగ కౌగిలించుకొనియు చలిబాధ తగ్గలేదు. 'చలిబాధ ఓర్వలేనిదిగానున్నది. తాత! నిప్పు చేసిన బాగుండునన' పరిసరములకేగి అగ్నిదొరుకక తిరిగివచ్చి ఎంత వెదకినను అగ్ని లభించలేదని కుమారునికితెల్పెను. అర్ధరాత్రికాలము అందరును తలుపులుమూసి నిదురించుచున్నారు. పిలిచిన పలుకరు, అగ్ని లభ్యము కాలేదనెను. విజయదత్తుడు దీనుడై మాటిమాటికి

తండ్రిని అగ్ని యాచించసాగెను. ఇంకను ఇట్లనెను. 'తాత నా ముందు దూరమున ఆకాశమునంటు అగ్ని జ్వాల కన్పించుచున్నది' నీ వసత్యమాడు చున్నావనసాగెను. తండ్రి 'నాయనా అది చితానలము, అమంగళకరము, స్పర్శకు తగనిది. దానివలన ఆయుక్షయమగును. అందుకని దానిని తేలే' దనెను. అది యెట్టిదయినను తెమ్ము లేకున్న నేను మరణించుట నిశ్చయమని సుతుడన, పుత్రస్నేహమున చితానలము తే గోవిందస్వామి శ్మశానవాటికే గెను. ఆతని వెంట విజయదత్తుడును పోసాగెను. చితనుచేరి ఆ మధ్యనున్నది ఎర్రకలువయా అన, వెనుదిరిగి కుమారునికని, చేపట్టి, కాదునాయనా అది మంటల మధ్యనున్న మానవకపాలము అని తెల్పెను. ఆ మాట విని విజయదత్తుడు ఒక కర్రతో ఆ కపాలమును కొట్టెను. వసారక్తమాంసములు స్రవించ విజయదత్తుడా కపాలమునుగొని రక్తమాంసములు చవిచూడ వెంటనే అతి భయంకరమయిన మహాకాయుడుగా రూపందెను. ఆ రాత్రి సమయమున, తీక్ష్ణదంష్ట్రలతో భేతాలత్వమునందెను. అట్టహాసముచేయ ఆ నాదమున దశదిశలు మారుమ్రోగినవి. తండ్రిని చంపబోవ ఆకాశమున వలదను వాణివిని, తండ్రినివిడచి పైకెగసి పోయెను. దూరమేగి ఇతర భేతాళులతో కలసిపోయెను. క్రమముగా భేతాళపతిత్వమందెను. శాపమీతీరుననున్నదేకదా!

*

# బ్రహ్మఖండము

## 9-వ అధ్యాయము

తెల్లవారగానే గోవిందస్వామి పుత్రశోకమున బాధితుడై, చిన్నకుమారునితో, భార్యతో చిరము విలపించెను. సముద్రదత్తుడను వణిజుడు, ఆ దుఃఖించు బ్రాహ్మణకుటుంబమును తన ఇంటికి కొని పోయెను. ఆతనిని తన ధనమునకంతకును రక్షకునిగా నియమించెను. అశోకదత్తుడను రెండవ కుమారుడు శస్త్రమున, శాస్త్రమున పండితుడు, ఇతర శాస్త్రములయందుకూడ ఆతనితో తుల్యుడన్యుడు లేడు. నగరమున ఆతడతిఖ్యాతిగాంచెను.

ఆ నగరమునకు రాజు ప్రతాపముకుటుడు. రాజదర్శనార్థము కాశీదేశపురాజు నాశ్రయించిన మల్లుడొకడు వచ్చి ఆస్థానమున మల్లులున్న తనతో పోర నియమించగోరెను. రాజు వెంటనే ద్విజపుత్రుని అశోకదత్తుని రావించెను. వచ్చిన అశోకదత్తుని రాజుచూచి ఇతడు బలియుడయిన మల్లుడట. నీవీతనిని జయింపుమనెను. నీవీతనిని జయించిన దాక్షిణాత్యమల్లపతివి కాగలవు. నీకోరినదెల్ల సమకూర్తును. నీ ఇష్టము తెల్పుమన, సరియని మల్లునాహ్వానించి ఒక పట్టుమీద దెబ్బకొట్టగా కనులు తేలవైచి వాడసువులువిడిచి నేలబడెను. రాజు సుదుష్కరమయిన ఈ కార్యముగని ఆశ్చర్యచకితుడయ్యెను. వెంటనే ద్విజునకు ప్రభూతముగ ధనము, అనేక గ్రామములిచ్చి సత్కరించి, సమీపమున నుంచుకొనెను. ఒకనాడు రాజు సంధ్యాసమయమున, ద్విజకుమారునితో తురగారూఢుడై విజనప్రదేశమున తిరుగుచుండెను. చీకట్లలమినవి. రాజునకొక దీనాలాపము విన్పించినది. 'రాజా! స్వల్పాపరాధమునకు నన్ను శూలమున వైచిరి. నేడు నాల్గవదినమున చాలాదాహమగుచున్నది. జలదానముచేయుము' అనిన నదివిని రాజు 'సాహసికుడవు! మిత్రుడా ఆ దీనునికి జలము

ఇమ్ము' అన జలపూర్ణమయిన కలశమునుగొని ఆ చీకట్లో శబ్దము వచ్చిన దిక్కుగానేగెను. అది స్మశానవాటిక, భూతభేతాళ సంకుల మయినది. శూలప్రేతమునకు జలమీయ ఉత్సుకుడై పగ, నవయౌ వనశాలిని, రతివంటి సౌందర్యకాంతికల ఒక కాంతను చూచెను. ధైర్యమున అశోకదత్తుడామె వృత్తాంతము తెలుపగోరెను. ఆ నారి "ఈతడు నా భర్త. విడిచిపోలేకున్నాను. జలముతే నశక్తురాల" ననెను. ఆ శూలమున అతి ఎత్తుగనున్నవాడానరుడు. అది కని "మాతా! నా భుజముపై నిలచి ఈ జలము నీ పతికందించు' మనెను. ఆమె వల్లెయన, ఆతడు ఇంచుక వంగగా భుజముపై కెక్కెను. ఇంతలో పైనుండి క్రొత్తనెత్తురు బొట్లుపడుటను అశోక దత్తుడు తిలకించెను. పైకిచూడ ఆ నారి ఆ పురుషుని తినివేయు చుండెను. వెంటనే పాదములుపట్టుకోగా ఒకపాదమందక అనేక రత్నాఢ్యమయిన నూపురము విడిచి ఆకాంత పైకెగసిపోయెను. ఆ నూపురముతో అశోకదత్తుడు రాజువద్దకువచ్చి జరిగిన వృత్తాంత మెల్ల వివరించెను. నూపురము చూపించెను. రాజు ఈతడు మహా వీర పురుషుడని గ్రహించి మదనలేఖ అను తనకుమార్తె నాతనికిచ్చి వివాహ మొనరించెను. నూపురము రాజువద్దనేయుండెను.

ఒకనాడు రాజునకు దీని జత రెండవ నూపురము లభించిన బాగుండుననుకొనెను. రాజు తలంపెరింగి రెండవది ఎటుల లభ్యమగునోయని చింతించసాగెను. స్మశానముననే అది లభ్యము కావలయునని తలంచి, స్మశానమునకేపోయి మహామాంస మమ్మ నిశ్చయించెను. స్మశానమున నల్దిక్కుల తిరుగుచు నిశీధమున "రండు, మహామాంసము గొనుడు, భూతప్రేత పిశాచములారా, రండు మీరెల్లరు, ఈ మాంసము కొను" డని అరచెను. సంతోషమున కోటానకోట్లు భూతభేతాళ పిశాచాదులు రాసాగినవి. రాక్షస కన్యలచే పరివృతురాలయి రాక్షసియువచ్చినది. ఆమెను ఆనవాలు

పట్టి రెండవ నూపురమిమ్మన ఆమె సంతసించికొనుమని రత్నఖచిత మయిన రెండవనూపురమిచ్చినది. దానితండ్రి ఆమెతోనుండెను. ఈనా తనయనుకూడ నీకిత్తును, భార్యగాగొనుమనెను. ఆతడు విద్యుత్కేశుడు, ఆకన్య విద్యుత్ప్రభ. అల్లునికి విద్యుత్కేశుడు ఒక హేమాబ్జముకూడ కాన్కగా నిచ్చెను. రాజునకు రెండవ నూపుర మిచ్చెను. రహస్యముగ ప్రియకాంతతో హేమాబ్జము లెటనున్నవన భేతాళరక్షితమగు సరోవరముకలదు. అందు హేమాబ్జములున్నవి. తనతండ్రి జలక్రీడ గావించుచు ఒకటి హరించెనన, తన్నాసరోవర మునకు కొనిపో ప్రియురాలితోనన, ఆమె ఆతని నటకు కొనిపో యెను. అట రక్షకులనెల్లరను చంపి హేమాబ్జములు హరించతలంచ భేతాలపతి కపాలస్ఫోటు డడ్డురా ఆతనినికూడ సంహరించ నుండపైన విమానమున ఓ విద్యాధరపతివలదువలదన ఆగిపైకి దృష్టి సారించి విద్యాధరపతిని చూచెను. ఆతనిని చూడగనే తనకు శాపాంత మయి, మానుషత్వముపోయి, దివ్యరూపము వచ్చెను. రమ్ము విమాన మధిరోహించుము స్వర్గమునకుపోదము. కపాలస్ఫోటుడు నీఅన్న. ముని ఆతనికి శాపాంతము తెలుప లేదన అన్నను విడచి తాను స్వర్గ మునకు రాజాలననెను. తన అన్నకు శాపాంతము తెలుప విద్యా ధరపతిని ప్రార్థించెను. చక్రతీర్థమున స్నానమాచరించిన శాపాంత మయి, భేతాలత్వముపోయి, మానుషత్వము లభించుననన, వెంటనే అన్నను తీసికొని చక్రతీర్థమేగిస్నానముచేయుమనుచుండ, స్నాన మాచరించు బ్రాహ్మణులచే జిమ్మబడిన శీకరములు గాత్రమును సోక వేతాలత్వముపోయి, మానుషత్వము వచ్చి బ్రాహ్మణకుమారుడా యెను. మనుష్యత్వముపోవుటకు విధ్యుక్తము తీర్థస్నానముచేసెను. స్నానముచేసి జలములనుండి లేచునంతలో దివ్యరూపమలవడినది. యథాపూర్వము దివ్యమాల్యా భరణాదులతో సుదర్శనుడాయెను. తమ్ముడుసుకర్ణుని కౌగిలించుకొని ఆనందించెను. నాటినుండి ఆ తీర్థము భేతాలవరదమని పేర్వడసినది.

★

# బ్రహ్మ ఖండము

## 10-వ అధ్యాయము

ఆ తీర్థము దాటిన అనంతరము, నెమ్మదిగా ముందుకు పోవ, సముద్రమున సేతురూపమున గంధమాదన పర్వతమున్నది. ఆమార్గ ముననే బ్రహ్మలోకమునకు పోవచ్చును. అది విశ్వకర్త నిర్మితము. లక్షకోటి సహస్రములు సరస్సులు, నదులు ఆ మార్గమునకలవు. మహాపుణ్యాదములగు సముద్రములు, వనములు, ఆశ్రమములునున్నవి. వేదారణ్యమున్నది, హేరంబుడు, స్కందుడు, ఇంద్రాదిదేవతలు, లక్ష్మి, ధరణి వీరితో మధుసూదనుడు, సావిత్రీ సరస్వతులతో బ్రహ్మ, ఆదిత్యులు, గ్రహములు, అష్టవసువులు, అనేకములు దేవతాగణ ములు, వీరెల్లరు గంధమాదనము నాశ్రయించి సదా ఉందురు. అందు వలన అది లోకపావనము. దర్శనమాత్రమున పాపములు పటాపంచ లయి సుఖములలవడును. దాని శిఖరముల సిద్ధచారణ కాంత లుందురు. సదా వారటనున్న కాలుని, శంకరుని, గిరిజాపతిని పూజింతురు. గంధమాదన పర్వతమునందలి వాయువు శరీరమున సోకినంతమాత్రమున బ్రహ్మహత్య ,అగమ్యాగమనాది కోట్ల పాప సంఘములు తూలిపోవును. సేతురూపమయిన గిరినిట్లు ప్రార్థించ నగును — "క్షమాధర, మహాపుణ్యా, సర్వదేవనమస్కృత — విష్ణువు ఆదిత్యులు ఋషులు శ్రద్ధతో నిన్ను సేవింతురు. నా కాలితాకుడు అను అపరాధము క్షమించుము. నీశిఖరమున నావాసముగొన్న శంకరుని దర్శనము నాకు గావించుము". ఇట్లు ప్రార్థించి రెండడు గులు పర్వతమున నుంతురు గాత. సేతుస్నానమొనరించు, ఆవగింజ లంత ప్రమాణమున మాత్రమే గంధమాదనమున పిండప్రదానము ఈయవలయును. పితరులు స్వర్గమును చూరగొందురు. అట పాప వినాశనమను తీర్థమున్నది. దానిని స్మరించినమాత్రముననే పునర్జన్మ

యుండదు''. అన ఋషులు పాపనాశన వైభవము తెలుపరగోరి సూతుని సమాధానము:—

పూర్వము హిమవత్ప్రాంతమున బ్రహ్మాశ్రమ పదముండెడిది. సిద్ధచారణ సేవ్యము. రమ్యమయిన పుష్పోద్యానములచే శోభితము. అగ్నికల్పులు, తపోధనులు, వాలఖిల్యాదులు, సర్వవర్ణముల వారలతో సుశోభితము. దృఢమతియను శూద్రుడట కేతెంచి కులపతి యనుజ్ఞ వేడి, యాగమున దీక్షయిడి తపముచేయు తలంపునకు నను మతి ప్రార్థించెను. కులపతి శూద్రుడవని తెల్పి, నీకు యాగదీక్ష ఈయ వలనుపడదు. ఇష్టమున్న, శుశ్రూష యొనరించు చుండుమనెను. ఉపదేశమునకు తగనివాని కుపదేశించిన ఉపాధ్యాయుడు దోషి యగును. బ్రాహ్మణులా ఉపాధ్యాయుని బహిష్కరింతురు. నాయనా శుశ్రూష నీకుచితము. దానివలననే తరింతువనెను. శూద్రుడు, దృఢమతి సార్థకనాముడగుట ఆలోచనలోపడెను. వ్రత మన్న నాకు శ్రద్ధయున్నది. నాకుగల విజ్ఞానముతోనే యత్నింతును. అని ఆశ్రమమునకు సుదూరమేగి పర్ణశాల కల్పించుకొనెను. ఆలయము, తటాకము, పూలవనము, తన తపోనియతి కనుకూలములు నిర్మించుకొనెను. తనకుతోచిన రీతిని అభిషేకము, బలి, పూజ, అగ్ని కాహుతులు కల్పించసాగెను. నియమవ్రతియయి, ఫలములే ఆహరించుచు, జితేంద్రియుడయి, కాలముగడుపుచు, కందమూల ఫలాదులతో వచ్చిన అతిథులను సత్కరించుచుండెను. ఈ తీరున చిర కాలము గడచిపోయెను. ఒకనాడు గర్గకుల సంభూతుడు, జితేంద్రియుడు, సత్యవాదియగు, ద్విజుడట కేతెంచెను. మునికి స్వాగతమిచ్చి ఫలాదులర్పించి కుశలప్రశ్నచేసి గౌరవించెను. మరల మరల తన ఆశ్రమమునకు వచ్చిపో ప్రార్థించ స్నేహమున ఆతడట్లే యొనరించు చుండెను. ఈ విధముగ ద్విజునకు శూద్రతపస్వితో సంపర్కము అతి శయించెను. స్నేహము అతిశయించ హవ్య కవ్య విధానము తనకు

తెలుప ద్విజుని ప్రార్థించెను. పితృకార్యము, దేవపూజనము, మంత్ర విధి వైదిక కృత్యముల రహస్యము తెలుప వేడెను. కాదనక సర్వ మాతడు, కోరినదెల్ల ఉపదేశించెను. ఈ సంసర్గము తెలిసి తనవారు విడువ కాలాంతరమున మరణించెను. పలు నరకములనుభవించి తుదకు స్థావరమాదిగా, క్రమముగా నీచజన్మలనేకములెత్తెను. కడకు బ్రాహ్మణుడై పుట్టెను. ఉపనీతుడై ఆచారములు సాగించుచు, ఒకనాడరణ్యమునకేగ ఆతనిని బ్రహ్మరాక్షసు డావేశించెను. తండ్రి పిశాచమువలెనయిన సుతుని గైకొని అగస్త్యుని శరణందెను. తన కుమారుని రక్షించుమని వాని నా మునిపాదముల పడవైచెను. తనకాతడొక్కడే తనయుడని దీనముగ వేడుకొనెను. ముని ధ్యానించి ఆతని బ్రహ్మరాక్షస గ్రహము తెలిపి దక్షిణ సముద్రతీరమున సేతురూప గంధమాదనగిరియందు పాపనాశన సమర్థమగు తీర్థమున్నది. నీ తనయునటకు కొనిపోయి స్నానముచేయించుము. మూడుదినము లట్లు చేయించిన గ్రహము విడిచిపోవును. అన్యోపాయము లేదు. వెంటనే రామసేతువునకు పొమ్మని తెల్ప, వెంటనే కుమారునితో నా తీర్థమునకేగి మూడుదినములు సుతునితో తానును శ్రద్ధతో స్నానమాచరించ గ్రహము వీడిపోవ కుమారుడు సుఖరూపునందెను. తానును ఆనందించెను. శేషజీవితమున వారు అనంతభోగములను భవించి అంతమున ముక్తిగాంచిరి. వ్రతనియమియయిన ఆశూద్రుడును మరణించి, శ్రద్ధవలన క్రమముగా గృధ్రమై గంధమాదన పర్వతము ననే యుండి, ఒకమారు పాపనాశనతీర్థమున జలముత్రాగ, ఆ రూపు విడచి దివ్యుడయి, నాకము చూరగొనెను. ఇట్టిది పాపనాశన తీర్థ ప్రభావము. స్వర్గ మోక్ష ప్రదము. దివ్యులు సేవించే తీర్థము. పాప ములు పోగొట్టునదికాగా పాపనాశనమయినది. కులభేదములేదు, ఎవ్వరయినను శ్రద్ధాన్వితులయి తీర్థరాజసేవనముగావించ ముక్తులగు దురు. పాపవినాశకథనము సూతుడీతీరున ఋషులకు తెల్పెను.

*

# బ్రహ్మ ఖండము

## 11-వ అధ్యాయము

అనంతరము సీతా సరోవరమున, నియమపూర్వకము స్నానము చేయవలయును. మహాపాతక నాశన సమీపమున సీతా సరోవరమున, గంగాది సర్వతీర్థములు, స్వపాప పరిశుద్ధికై, సదా మూర్తిమంతములై యుండును. కాశ్యాది క్షేత్రములును స్వీయ పాపనాశమునకీ సీతాసరస్సును సేవించును. ఇంద్రాదులు పాపనాశమున కిటకేతెంచి సీతాసరస్సును సేవింతురు. ఇంద్రుని బ్రహ్మహత్యా పాప నాశమిటనే అయినది.

ఇంద్రునికి బ్రహ్మహత్య ఎట్లు తటస్థించినదన్న ఋషుల ప్రశ్నకు సూతుని సమాధానము :— పూర్వము కపాలాభరణుడనే రాక్షసుడుకలడు. బ్రహ్మవరమున సర్వదేవతలకు వాడవధ్యుడు. వానికి మంత్రి శవభక్షుణుడు. వాని నగరమునకు వైజయంతమని పేరు. నూరక్షౌహిణులుగజాశ్వరథములు వానికి కలవు. వాడొకనాడు తనమంత్రినిపిలిచి "స్వర్గమాక్రమించి, నాకమున అచ్చరలేమలతో క్రీడించు భోగములనుభవించవలెనున్నది." అన మంత్రి శవభక్షుణుని డబ్లే యొనరింతమనెను. అంత కపాలాభరణుడు దుర్మేధసుని తనయుని బలియుని కొంత పరివారముతో పురమున నిల్పి, కొదువసేనతో అమరావతికి దాడివెడలెను. దిక్కులు మారుమ్రోగునట్లు గజబృంహితములు, హయహేషలు, భటుల జయనినాదములు మ్రోగ, దేవతలతో రణముచేయ అమరావతికి నడచెను. సేనాకలకలము విని ఇంద్రాద్యమరులు నాకము వెడలివచ్చి రాక్షససైన్యముతో పోర తలపడిరి. దేవదానవులకు ద్వంద్వయుద్ధము చెలరేగెను. యుద్ధమున మంత్రి శవభక్షుణుని యముడుదండమున తాడించి చంపి తన ఆలయమునకు పంపెను.

సైన్యమున పెక్కురు హతులుకాగా కపాలాభరణుడు విల్లందుకొని నిశితశరములు ప్రయోగించుచు ఆగుమాగుమని ఇంద్రునీతాకెను. శూలముగ్రహించి ఇంద్రుని తాడించ ఇంద్రుడుదానిని భగ్నము చేసెను. తుదకు అయిదువేల తులాభారముగల గదనుచేపట్టి, హృదయమును తాడించెను. ఇంద్రుడు మూర్ఛమునిగి రథమునవ్రాల బృహస్పతి మృతసంజీవనీ విద్యచే మంత్రించి పునరుజ్జీవింప జేసెను. వెంటనే ఇంద్రుడు ఐరావత మధిరోహించి వజ్రముచేబూని కపాలాభరణుని పొడువ సమీపించి, కోపమున వజ్రమెత్తి కపాలాభరణుని తాడించిన ఆ వజ్రాహతికి రథము, అశ్వములు, సర్వముతోపాటు వాడు చూర్ణముగానాయెను. ఆ రక్కసుడు ఇంద్రునిచే చావ లోకములు, సురలు, సుఖములందిరి. కాని రాక్షసుడు ద్విజుడుకదా. ఆతనిని చంపుటచే బ్రహ్మహత్య ఘోరరూపముదాల్చి ఇంద్రుని వెంటాడినది. ఇట నొకరహస్యము తెల్పెదనని మునులకు సూతుడిటుల తెలుపసాగెను:

పూర్వము వింధ్యాద్రిన త్రివక్రుడను రాక్షసుడు కలడు. ఆతనిభార్య గుణవతి, రూపవతి, సుశీల అనుపేరుగలది ఒకనాడు విలాసముగ వింధ్యపాదమున విహరించుచుండెను. ఆ వనమున శుచియను ముని యుండెను. తపస్సమాధి నిరతుడు. ఆ కాంత ఆతని ఆశ్రమ సమీపమునకేగెను. ఆమెను చూడగనే మునికి ధైర్యము సడలెను. ఆమెను సమీపించి లలనా నీకు స్వాగతము. నీ వెవనిభార్యవు, అతిభీషణమయిన ఈ వనమునకు నీవు రా కారణమేమి. నీవు అలసినట్లున్నావు. ఈ నాపర్ణశాలలో విశ్రాంతి తీసికొనుము''- అన సుశీల ''త్రివక్రుడను రాక్షసుడు కలడు. ఆతడు నాపతి. పూలుకోయు నిమిత్తమీవనమునకు వచ్చితిని. నే నపుత్రకురాలను. నా భర్త శుచి అయిన మునినాశ్రయించి సంతానము కనుమనెను. పతి అనుమతి నిన్నాశ్రయించితిని. నా వలన

కృపామతివయి సుతునికనుమని ప్రార్థించెను. శుచియు ఆమెను చూడగనే తనకు కాంత కలిగినదని తెల్పుచు ఆమెతో మూడు దినములా పర్ణశాలలో క్రీడించెను. నీ ఉదరమున కపాలాభరణుడను మహాబలుడు జనియించి చిరము రాజ్యముచేయును. వేయు సంవత్సరములు నీ తనయుడు తపమొనరించి బ్రహ్మవలన ఇంద్రునిచేగాక, ఇతరుల కవధ్యుడగునట్లు వరమునందును. ఆ నీతనయుడు ఇంద్ర తుల్య పరాక్రముడగును-అని తెల్పి ఆమెను విడచి కాశీపురి కేగెను. అనంతరము సుశీల తనయునికనెను. ఆతడే కపాలాభరణుడని, ముని వాక్యమున పేర్వడసెను. బ్రహ్మబీజ సంభూతుడు కాన ఆతనిని చంపుటచే బ్రహ్మహత్యాపాతక మంటినది. ఇంద్రుడు లోకము లన్నియు తిరుగ ఆతనినే వెన్నాడసాగినది. ఇంద్రుడు సత్యలోకమున కేగి తన్ను బాధించు బ్రహ్మహత్యా పాపనాశనమున కుపాయము తెల్ప వేడుకొనెను. బ్రహ్మ గంధమాదమునకేగి సీతాకుండమునుచేరి యాగముచే సదాశివుని ప్రీతునొనరించి, సీతాసరోవరమున స్నానము చేసిన అది సర్వపాపహరమని ఉపదేశించెను. ఇంద్రుడటులొనరించి పాపమునుండి తొలగి సుఖమున స్వపురికేగెను. నాడు రాఘవులు నాశయించ శుద్ధ్యర్థము సీత అగ్నిప్రవేశ మొనరించిన ప్రదేశమది. సీత లోకాల పాపనాశనమునకై సరస్సునేర్పరచినది. అదియే సీతా సరస్సు, పాపఘ్నము.

★

# బ్రహ్మ ఖండము

## 12-వ అధ్యాయము

సీతాసరోవరమున స్నానముచేసి అనంతరము యాత్రకేగిన వారు, మంగళతీర్థమును సేవించవలెను. ఆ తీర్థమున సదా హరివల్లభ, కమల యుండును. అలక్ష్మితొలగుటకు నిత్యము ఇంద్రాది దేవతలా తీర్థమును సేవింతురు. దీనికొకగాథ: పూర్వము చంద్రవంశజుడు మనోజవుడను నరపతియుండెను. సాగరమేఖలయయిన భూదేవిని ధర్మముగ పాలించుచుండెను. యజ్ఞముల దివ్యులను. అన్నదానమున ద్విజులను తృప్తిచేయుచుండెను. నిష్కంటకముగ రాజ్యముసాగెను. అరులులేరు. ఈతిబాధలు శూన్యము. దుష్కర్మపరిపాకమున అహంకారము రాజు నావరించ దానివలన కొదువ అరులు కామ, లోభాదులు మనసు నావరించినవి. బ్రాహ్మణులపట్ల ననాదర మేర్పడినది. దేవతాగారముల ధనముహరించెను. ఇట్లు లోభమున అకార్యము లొనరించి పరరాజులచే రాజ్యచ్యుతుడయి భార్యా పుత్రాదులతో కానలబట్టెను. ఘోరారణ్యముల క్షుధార్తులయి తిరుగుచుండ కొడుకు తండ్రిని అన్నము యాచించెను. తల్లిని అన్నము పెట్టుమని ఏడువసాగెను. రాజు భార్యతో దుర్విధివలన తానొనర్చిన పాపములే తెల్పుచు దుఃఖించసాగెను, ఋతువుల దానధర్మములు సముచితమయినవి చేయలేదు. శివ విష్ణుమందిరముల కైంకర్య మొనరించలేదు. వాపీ కూపతటాకాదులు నిర్మాణము కావించలేదు. ద్వాదశ్యాది వ్రతములు సలుపలేదు. ఇటుల విచారించుచునే రాజు మూర్ఛమునిగెను. పతి చనిపోయెననుకొని భార్యా పుత్రులాతనిపై బడి ఏడువసాగిరి. ఇంతలో పరాశర మునీంద్రుడటకేతెంచెను. ఆ కాంత సుమిత్ర మునిపాదములపై బడెను. ఆమె నూరడించుచు శక్తిపుత్రుడు పరాశరుడామెవృత్తాంతము తెలుపగోరెను. భర్త యుదంతము తెల్పుచు, ఆ పిల్లవాడు చంద్రకాంతుడను పేరుగల తన కుమారు

డనియు, రాజ్యచ్యుతి ఇత్యాదిగ వివరించెను. మునిఆమెతో నీభర్త మూర్ఛపోయెను, మరణించలేదు. ఇపుడే లేచుననుచు త్ర్యంబక మంత్రముచ్చరించుచు రాజుగాత్రమును స్పృశించ, తమోమయ మయిన మూర్ఛనుండి రాజు తెలివంది లేచెను. నరపతి మునికి ప్రణమిల్లి, ఆతనిస్పర్శవలన పాతకములుకూడ దూరీకృతములయిన వనుచు, మహాత్ముల దర్శనము, సుదుర్లభము. అట్టిది ప్రాప్తించ మాకు శుభములలవడును. ఆశగల్గినది. పరులచే రాజ్యచ్యుతుడ నయితిని. రక్షించుమనుచు ముని పాదముల వ్రాలెను. పరాశర మునీంద్రులుపాయము తెల్పుచు, 'గంధమాదన పర్వతప్రాంత మున రామసేతువను తీర్థమున్నది. దానికి సమీపమున మంగళ తీర్థము కలదు. అటస్నానదర్శనములు, సర్వైశ్వర్య ప్రదములు. శ్రాద్ధా దులా క్షేత్రమున, స్నానానంతరము, చేయుము. ఈ విధులొనరిం చిన, క్లేశకారణమయిన అలక్ష్మితొలగిపోవును. సర్వశుభములు ప్రాపింతువు. శత్రువులను జయించి మరల రాజ్యమును పొందగలవు. నీ అనుగ్రహము కొఱకు నేను గంధమాదనమునకు వత్తును పోదము' రండని, వారితో ముని సేతువునుగూర్చి యేగెను. మంగళతీర్థమున విధ్యుక్తముగ తాను స్నానముచేసి, రాజదంపతుల నావిధమున స్నానముచేయించెను. మూడుమాసములు ముని ఆ తీర్థమున నిత్యము స్నానాదివిధులు తానుతీర్చుచు, రాజకుటుంబముచే ఆ విధ ముగ చేయించెను. సర్వానర్థములు నశింపచేయునది, ఏకాక్షరము రామమంత్ర ముపదేశించ, ఆ ముని ఉపదేశానుసారము ఆ తీర్థమున నారాజు మనోజవుడు ఇరువది నాలుగు దినములు జపించెను. జపానంతరము ముని ప్రసాదమున దృఢమయిన ఒకవిల్లు రాజుముందు నిల్చెను. బంగారుపిడిగల ఖడ్గము, అక్షయతూణీరము లభించినవి. ఒకడాలు, గద, ముసలముకూడ లభ్యమయినవి. శంఖము గుర్రము లతో రథము, సారథితో, పతాకశోభితము తీర్థమునుండి ప్రాదుర్భ

వించెను. దివ్యాలంకారములు, దివ్యవసనములు మాల, వీని లాభము రాజు మునికి నివేదించెను. ముని తీర్థజలములు గ్రహించి రాజు నభిషేకించెను. రాజు మధ్యాహ్న మార్తాండునివలె ప్రకాశించెను. ముని బ్రహ్మాస్త్రమును ప్రయోగోపసంహార పూర్వక ముపదేశించెను. ముని ఆశీర్వదించెను. రాజు మునికి ప్రణమిల్లి ప్రదక్షిణ మొనరించి, అనుమతివడసి భార్యాపుత్రులతో రథమధిరోహించి పురమునకేగి శంఖము పూరించెను. శంఖనాదము వినిగోలభుడు సైన్యముతో, యుద్ధమునకు పురము వెడలివచ్చెను. రాజు మనోజవుడు బ్రహ్మాస్త్రమున అరిని నిర్జించెను. నిజపురము ప్రవేశించి పాలన కార్యమున సుఖమందెను. నాటినుండి అహంకారము దూరీకరించి, ధర్మ్యముగ పాలనసాగించుచు, గో, దేవ, బ్రాహ్మణ భక్తి రక్షణల అప్రమత్తుడై యుండెను. కాలాంతరమునదేహము విడచి తీర్థప్రభావమున శివలోకము చూరగొనెను. భార్య సుమిత్రయు పతినను గమించి, శివలోకము ప్రాపించెను. ఇట్టిది మంగళతీర్థ ప్రభావము.

★

# బ్రహ్మ ఖండము

## 13-వ అధ్యాయము

అనంతరము అమృతవాపి, బ్రహ్మకుండములుగలవు. ఏకాంత రామనాథ క్షేత్రమును దర్శించతగును. అటనే అమృతవాపి యున్నది. ఇట స్నానము చేసిన జరామరణ భయములుండవు. అనగా జన్మరాహిత్యమగు ననుట. దానికాపేరు వచ్చుటకు కారణమును, దాని మహిమాదికములును పురాణజ్ఞుడు సూతుడిటుల వివరించసాగెను:

పూర్వము హిమవత్పార్శ్వమున మునిగణ సంకులమయిన మహా కాననమున్నది. అట అగస్త్యభ్రాత కఠోరనియమము స్వీకరించి చిరము మహాదేవుని గూర్చి అతుల్యమయిన తపము చేసెను. గాయత్ర్యాది మహామంత్ర పునశ్చరణము చేసెను. ముని తపశ్చర్యకు సంతసించి వృషవాహనుడు మహాదేవుడు ప్రత్యక్షముకాగా అగస్త్యభ్రాత ఇటుల స్తోత్రముచేసెను. "నమస్తే పార్వతీనాథ, నీలకంఠ, మహేశ్వర శివ రుద్ర మహాదేవ! నమస్తే శంభవే విభో! గంగాధర విరూపాక్ష నమస్తే రుద్రమన్యవే! తారయస్వ త్రిలోచన" ఇట్లు నుతించి ముక్త్యుపాయమువేడ శంకరులవాక్యము - సేతుమధ్యమున గంధమాదన పర్వతమున, మంగళతీర్థమునకు సమీపమున తీర్థము కలదు. అట స్నానమాచరించ ముక్తియలవడును. దాని మహిమ అనన్య సామాన్యము. భవక్షయము కోరిన, అటకేగుమని తెల్పెను. సాంబు డంతర్ధానముందెను. అగస్త్య సహోదరుడు హరునానతి తలదాల్చి తీర్థమునకేగి స్నానముచేసి తీర్థదైవతము ఏకాంతరామనాథుని అర్చించుకొనెను. ఆ ప్రదేశముననే నియమియయి ముని మూడు సంవత్సరములు స్నాన ఆరాధన పరుడయి గడపెను. నాలుగవ సంవత్సరమున సమాధినాశ్రయించి ప్రాణవాయువును యోగ

మున శిరమున సహస్రారమునకు చేర్చి బ్రహ్మరంధ్రముద్వారా ప్రాణవాయువును ఎగజిమ్మెను. ఆ తీర్థ వైభవమున శరీరమువిడచి ఆ తీరున యోగమార్గమున ముక్తికనెను. అగస్త్యభ్రాత అమృతత్వమునందుటచే అమృతవాపియని ఆ తీర్థము ఖ్యాతిగాంచెను.

అనంతరము మునులు దైవమునకు ఏకాంతరామాఖ్య వచ్చుటకు కారణమడుగ సూతుడు తెల్పుచున్నాడు: పూర్వము, దాశరథి, శ్రీరామచంద్రుడు సుగ్రీవ విభీషణ, లక్ష్మణ హనుమంతులను పిల్చి ఒకనాడు ఏకాంతమున రావణవధనుగూర్చి ఆలోచన సాగించెను. మనసాసీతను చింతించసాగెను. ఆ సమయమున సాగరముల్లోల-కల్లోలమయి భీషణముగ ఘోషించ ఏకాంతభంగమును కోపించి రాఘవులించుక భ్రూలతకుటిలముచేయ ఉదధిని స్తరంగము శాంతము నయినది. నేటికి ఆ ప్రదేశము నిశ్చలము, తరంగ రహితముగా నున్నది. అందుచేత అట ఆ దైవము ఏకాంతరామము, తీర్థము అమృతవాపి-ముక్తిదము, సర్వపాపఘ్నమున్ను, జ్ఞాన శూన్యులు, ఆచార హీనులయ్యు, ఇటస్నానము చేసిన ముక్తి పొందగలరు.

# బ్రహ్మ ఖండము

## 14-వ అధ్యాయము

అమృతవాపి స్నానముచేసి, ఏకాంతరామచంద్రుని సేవించికొనిన తర్వాత, యాత్రకేగినవారు బ్రహ్మకుండ దర్శనము చేయవలెను. సర్వపాపనాశనము. ఒకమారు ఆ కుండదర్శన స్నానముల వైకుంఠప్రాప్తి. ఆ కుండమునందలి భస్మము ధరించిన కైవల్యము ప్రాపింతురు. లలాటమున భస్మమించుక ధరించిన ముక్తి కందురనగా శరీరమంతయును భస్మోద్ధూళితముగాగ ఆతనిపుణ్యము శంకరులు తెలుపగలరేమో, సంశయాస్పదమే. అటకేగియు భస్మము ధరించకున్న రౌరవాదినరకము ప్రాపించును. ఆ భస్మమును బ్రాహ్మణులకు తెచ్చియిచ్చిన, చతుస్సముద్ర ముద్రిత భూచక్రమును దానముచేసిన దానితో సమము. పూర్వము బ్రహ్మ ఈశ్వరునివలన నయిన శాప విముక్తికై సర్వదేవతలతో గంధమాదనమున ఈ కుండ ప్రదేశమున అనేక క్రతువులు చేసెను. శాపవిముక్తికాంచెను. తీర్థ స్నానమున మహాదేవసాయుజ్య మలవడును. మునులీమాటలువిని సృష్టికర్త బ్రహ్మను శంభునాథుడేల శపించె, బ్రహ్మ ఏమి అపరాధ మొనరించెనన దానికి సూతుని సమాధానము:

పూర్వమొకనాడు బ్రహ్మకు హరికి కలహమేర్పడెను. సృష్టి కర్త నేనంటేనేనను కలహ మారంభమయినది. స్వయంజ్యోతి, అనామయమయిన లింగము వారిమధ్య ఆవిర్భవించినది. ఆ లింగము జ్వాలాపరివృతము. అత్యున్నతము. దానిని చూడగనే వారి ట్లనుకొనిరి. దేవతలెల్లరును సాక్షులు. ఈ లింగము ఆద్యంతములెవరు తెలిసికొందురో వారధికులు. వారే సృష్టికర్తలు నను నియమము చేసికొనిరి. బ్రహ్మ తాను ఊర్ధ్వమేగి శిరముతెలిసికొందును. నీవు (హరియనుట) క్రిందుగపోయి మూలము తెలిసిరమ్మన హరి అంగీక

రించెను. హంసయానమున బ్రహ్మ పై పైకి పోసాగ, హరి వరాహ రూపమున పాతాళమునకు పోసాగెను. అనేకసంవత్సరములు పాతాళములు దాటిపోయి హరి తిరిగివచ్చి దివ్యులతో తానాది కనుగొన లేదని తెల్పెను. బ్రహ్మయు తిరిగివచ్చి లింగశిరముచూచితినని అసత్య మాడెను. వారలకు మహేశ్వరుడు ప్రత్యక్షమయి నవ్వుచు బ్రహ్మను చూచి అసత్యవాదివి నీకు సదా సర్వత్ర లోకమున పూజలేకుండు గాకయని శపించెను. తనతో సమముగ లోకములపూజ యలవడు నని హరికి సంతసించి తెల్పెను. బ్రహ్మ ఆతన అపరాధము క్షమించ హరుని వేడుకొనెను. "నీవు గంధమాదనమున క్రతువు లొనరించుము. ఈ పాపము శమించును. కాని నా మాట అసత్యముకాదు. నీకు పూజ లభించునుకాని నీ ప్రతిమ స్థాపించి ఎవ్వరును పూజసేయ రనెను. శంకరులంతర్ధానమందెను. వెంటనే బ్రహ్మ గంధమాదనమున కేగి సర్వక్రతువులు పౌండరీకాంతము-మునుల సహాయమునచేసెను. అంత ఈశ్వరుడు దర్శనమిచ్చి పాపము నశించినదనియు, వైదిక కర్మలయందు బ్రహ్మకు పూజ లిడుదురనియు, ఆలయముల ప్రతిమలుచేసి పూజించరనియు తెల్పి యేగెను. ఆ యాగస్థలమునకే బ్రహ్మకుండమని పేరు. సమీపతటము బ్రహ్మకుండతీర్థము. అందు స్నానముచేసిన పాపఘ్నము, ముక్తిప్రదమున్ను. కుండమునందలి భస్మధారణమున పంచమహాపాతకములు భస్మీపటలములగును. ఇట్లని శంకరునివరము. జలజ సంభవకుండమిది.

★

# బ్రహ్మ ఖండము

## 15-వ అధ్యాయము

అనంతరము హనుమత్కుండ మున్నది. రాక్షస సంహార మయిన తర్వాత తిరిగివచ్చి హనుమ ఈ కుండమును చేసెను. ఇట కేకయవంశజుడు, ధర్మసఖుడనురాజు, స్నానమొనరించి నూరు మంది సుతులను కాంచెను. ఆగాథ:—

పూర్వము నీతిజ్ఞుడు, ప్రజాపాలన తత్పరుడు, ధర్మసఖుడను రాజుకలడు. ఆతనికి నూరుమందికాంతలు, కాని ఒక్కతె గర్భమును వంశకర్త పుత్రుడు కలుగలేదు. సంతానమునకారాజు అనేక ప్రయత్నములు చేసెను. పలుదానములు, పలు యజ్ఞములు పుత్రార్థియయి చేసెను. అర్ధరాత్రి వచ్చినను అతిథుల కన్నమిడుచుండెను. సంతానకారకములయిన మంత్రజప మొనరించెను. క్రమముగా రాజు వృద్ధుడాయెను. చిరకాలమునకు పెద్దభార్య మనోరమ సుచంద్రుడను సుతుని కాంచెను. మాతలందరు ఈర్ష్యలేక సమముగా బాలుని పెంచసాగిరి. బాలుడొక నాడాందోళికలో శయనించ తేలుకుట్టినది. ఏడువసాగెను. వాని ఏడుపు వినలేక మాతలెల్లరును దుఃఖించ సాగిరి. రాజు ఈ ఆర్తనాదమువిని, సౌవిదల్లుని అంతఃపురమునకు సంగతి తెలిసిరాపంపి, తాను మంత్రి పురోహితాదులతో సభలోనే యుండెను. సౌవిదల్లుడు తిరిగివచ్చి సుతుడు వృశ్చిక కుట్టనమున బాధపడుచున్నాడని తెల్పెను. మంత్రి పురోహితులతో రాజు అంతఃపురమున కతి త్వరితగతి నేగెను. మంత్రజ్ఞులను రావించె అచిరమున వారు బాలుని బాధ లేకుండ సుఖస్థితి నందించిరి. రాజు వారికి పారితోషికములిచ్చి, పంపివైచి, తిరిగి వారలతో సభకువచ్చి, ఆసీనుడై ఇట్లు పల్కెను. 'ఏకపుత్రుడు దుఃఖకారణమేకదా! నా నూర్వురు పత్నులకును, నాకును ఈతనియందే ప్రాణము ఉచితముకాదు.

బహుపుత్రులుకల్గుట కుపాయము తెలుపగోరెదను. ఒక్కొక్కభార్యకు ఒక్కొక్క సుతుడుదయించు ఉపాయము వెదకుడనెను. మీ రెయ్యది ఆచరించ నుపదేశించిన అటులొనరించెద ననెను. ఋత్విజులు పురోహితులాలోచించి రాజుతోనిట్లనిరి. "గంధమాదన పర్వతము మహాపుణ్యప్రదేశము, సేతురూపమున, దక్షిణ సముద్రతీరమున నున్నది. అట లోకమున ఖ్యాతిగన్న హనుమత్కుండమున్నది. అట పుత్రకామేష్టి చేయించిన సుతులుదయింతురు. సంశయములేదు." అని తెల్పిరి. వెంటనే రాజు కాంతలతో, మంత్రి పురోహితులతో అటకేగి ఒకమాసము నియమియయి క్రతువుసాగించెను. రాజు ధర్మసఖుడు ఈ విధముగ నియమియు, శ్రద్ధాళువునయి కాంతలతో తీర్థము నాశ్రయించియుండి, మాసాంతమున హనుమత్కుండ జలముల అవభృథ స్నానము భార్యాశతముతోచేసెను. ఋత్విక్ పురోహితులకు బ్రాహ్మణులకు భూరిదానము లొసంగెను. సంతసించి నగరమునకు తిరిగివచ్చెను. పదిమాసములు నిండగా, నూర్వురు పత్నులు నూర్వురు సుతులను గాంచిరి. వారెల్లరు గుణవంతులు. రాజు వారలకు జాతకర్మాదికములు జరిపించెను. దశవిధ దానములు చేసెను. సుతులు కృతవిద్యావంతులు, ప్రౌఢులుకా, రాజ్యము విభజించి వారలకిచ్చి భార్యలతో సేతువునుగూర్చి గంధమాదనమున కేగెను. హనుమత్కుండముననుండి తపమొనరించెను. కాలమున సద్గతినందెను. పత్నులు పతిననుగమించిరి. పెద్దవాడు సుచంద్రుడు తల్లిదండ్రులకంత్యక్రియ లొనరించెను. అన్నదమ్ములు, మాత్సర్యరహితులయి, స్వీయరాజ్య భాగములు, పాలించుచు సుఖముండిరి.

*

# బ్రహ్మ ఖండము

## 16-వ అధ్యాయము

స్వయము రుద్రసేవితమయిన హనుమత్కుండమున స్నానము చేసి, అనంతరము అగస్తి తీర్థమున స్నానమాచరించవలెను. ఆ తీర్థము అగస్త్య నిర్మితము. పూర్వము ఇక్కడుండిన సమయమున మేరువునకు వింధ్యపర్వతమునకు కలహమేర్పడినది. భువనముల కుపద్రవము కల్పించుచు వింధ్యపర్వతము పెరుగ నారంభించెను. నరులకు దేవతలకు ఉచ్ఛ్వాసనిశ్వాసము లతికష్టముగ నగుచున్నవి. దేవతలు శంకరులకు లోకబాధ తెలుపగోరి కైలాసగిరి కేగిరి. ఆ సమయమున శంకరులు తనకొఱకు హిమవంతుని కడకేగి పార్వతిని యాచించ వసిష్ఠాదిమునులనుపంపెను. శంకరులు కుంభజుని అగస్త్యుని పిలచి వింధ్యుని అతిశయము వారించుమని ఆదేశించెను. అందుకు అగస్త్యులు శంకరునితో, వివాహమహోత్సవము చూచుభాగ్యము నాకుండదన, వివాహ వేషముతో వేదారణ్యమున మునికి దర్శనమిత్తుమని తెల్పి పంపించివైచెను. అగస్త్యులందుల కంగీకరించి వింధ్యునిచేరి పాదముల సులభముగ దాటి పోవగల యంతమట్టుకే ఉన్నతుడవయి యుండుమని శాసించి దక్షిణదిశగా నేగెను. గంధమాదన మహిమ తెలిసినవాడగుట ముని అటకేగి తనపేరిట తీర్థముకల్పించెను. లోపాముద్రాపతి ఆ తీర్థముననే యుండుటచేత ఆ తీర్థమున స్నానము భుక్తి ముక్తిప్రదము. ఇట మీకొక గాథ తెల్పుదునని సూతుడు కక్షీవంతుని యుదంతము ఇటుల తెలుపసాగెను:

సుదీర్ఘతమసుని సుతుడు కక్షీవంతుడను వాడు స్వనయుని కుమార్తె మనోరమను పొందగల్గెను. తొలుత ఉపనీతుడయి గురుకులవాసము చేసి వేదాధ్యయనము చేసెను. గురువు ఉదంకుని గృహముననే యుండి నాలుగు వేదములు సాంగములుగ అధ్యయ

నము చేసెను. అరువది సంవత్సరములు గురుకులవాస మొనరించి శాస్త్రములు, పురాణేతిహాసములు చదివెను. గృహమున కేగుటకై గురునను జ్ఞ యాచించెను. ఉదంకుడు అనుమతియిచ్చుచు వివాహము నిమిత్తమొక ఉపాయము నిట్లు తెల్పెను. 'గంధమాదన పర్వతమునకు, రామసేతువునకేగుము. సర్వఅభీష్టములు నెరవేర్పగల అగస్త్యతీర్థ మట యున్నది. మూడు సంవత్సరములట నియమియయి, నిత్యస్నాన మాచరించుచుండుము, నాలుగవ వత్సరమున ఒక గజము నాలుగు దంతములుకలది తీర్థమునుండి నీకగపడును. స్నానమాచరించి గిరి వలెనున్న ఆ గజమధిరోహించుము. ఆగజమధిరోహించి స్వనయనుని పురికేగుము. ఆతని కుమార్తె ఏ పురుషుడు నాలుగు దంతములుగల గజ మధిరోహించి నగరమునకు వచ్చునో ఆతడే తనభర్త అని తండ్రికి తెల్పెను. నీరాకకని ఆరాజు ఆనందించి తనయను మనో రమను నీకిచ్చి వివాహమొనరించును.' అని బోధించి పంపివైచెను. రాజు చిరము చింతాక్రాంతుడయి యుండెను. అటువంటి గజము ఇంద్రుని వద్దనున్నదిగాని భూలోకమునలేదు, కన్యతలంపు దుర్లభ మని చింతాపరుడై యుండ, ఒకనాడు నారదమహర్షి యేతెంచెను, అర్ఘ్యపాద్యములిచ్చి రాజు మునిని పూజించి, కన్య ప్రతినదెల్పి, అది సాధ్యమాఅని ప్రశ్నించెను. నారదుడు రాజుతో "చింతించ వలదు. తప్పక ఆ తీరున బ్రాహ్మణకుమారుడు రాగల" డనెను. ఆతని పేరు కక్షీవంతుడని తెల్పి నారదుడేగెను, కక్షీవంతుడు గురు ననుమతి వడసి, గురుడు తెల్పిన విధానమున అగస్త్యతీర్థమున నియమి, శుచియయి నిత్యజపమున మూడువత్సరములు గడపెను. అంతమున నాలుగవ సంవత్సరము తొలినాడుపవసించి శ్రాంతుడయి రేయి నిదురించ ప్రభాతమునకు ముందే గొప్ప ధ్వని చెలరేగ మేల్కాంచెను. అంతకుమున్నే భటులు అమాత్యులు వెంటరా మిథి లాపతి స్వనయుడు వేటకేగి క్రూరమృగములను వేటాడి అలసి అగస్త్యతీర్థమున కనతి దూరమున గుడారములువైచికొని, విశ్రాంతి

గానుండెను. కక్షీవంతుడు మేల్కొని స్నాతుడయి జప మొనరించు చుండ తీర్థమునుండి చతుర్దంతి గజమావిర్భవించినది. శుచియయి తీర్థ రాజమునకు నమస్కరించి క్రమముగా తనసమీపమునకే వచ్చిన గజమధిరోహించి స్వనయనుని పురమునకేగ తలంచెను. ఈ లోగా రాజు భటులవలన ఈ వార్త విని మంత్రులతో ఆ బ్రాహ్మణుని సమీపించెను. ఆతడే కక్షీవంతుడని, నారదుడు తెల్పిన ఆతడే అని నిశ్చయించి సమీపించెను. ఆతని నామము వృత్తము తెలుపగోరెను. తనవృత్తాంతము కక్షీవంతుడు వివరించెను. స్వనయనుని సుతను పాణిగ్రహణముచేయ ఆతని పురికేగ తలంచితినన రాజు ఆనందించి "కృతార్థుడనయితిని. నేనే ఆ రాజును. నీవు కోరినది నా కుమార్తె నే నీకు స్వాగతము." అన తన తండ్రి వేదారణ్యమున నున్నాడని ఆతనిపేరు దీర్ఘతముడని తెల్పి, ఆతనివద్దకు ఒక బ్రాహ్మణునిపంపి ఈ తలంపు చెప్పి పంపగోరెను. రాజు స్వపురికేగి సుదర్శనుడను బ్రాహ్మణుని పిలిపించి, గొప్పసేనను సహాయమిచ్చి, తెలుపవలసిన విషయము తెల్పి, వేదారణ్యమునకు పంపించెను. సుదర్శనుడా అరణ్యా మునకేగి, పర్ణశాల తపోనియతినున్న దీర్ఘతముని పాలికేగి ప్రణ మిల్లి కుశలమడిగెను. దీర్ఘతముడును సర్వము కుశలముచును ప్రతి ప్రశ్న కుశలము నడిగెను. ఆగమన కారణము తెలుపగోర, తనపట్ల సర్వము సుఖమే అనుచు, రాజునభిలాష నివేదించెను. ఆ విధము తనకిష్టమనుచు వారలతో దీర్ఘతముడు, వేదారణ్యా నాథునకు నమస్కరించి, గంధమాదనమునకు పయనించి యేగెను. ఆరుదిన ములు ముని వారితో పయనించి పర్వతమును చేరి అట కుమారుని కక్షీవంతుని కలసికొనెను. తనయుడు పేరు తెల్పుకొనుచు, తండ్రికి నమస్కరించెను. గురుకులమున తనచర్యనంతయు సంగ్రహముగ జనకునికి వివరించెను.

★

# బ్రహ్మ ఖండము

## 17-వ అధ్యాయము

గురువచనానుసారము తానాతీర్థమునకువచ్చి సాధించినదెల్ల తెల్పి, తండ్రిఆజ్ఞకై వేచియుంటినని తెల్పెను. సుదర్శనుడు రాజును దర్శించి దీర్ఘతముని రాక తెల్పి, రాజు పటమందిరమును వెల్వడి అగస్త్య తీర్థమున నున్న తండ్రి కుమారులను సమీపించి ముని సత్తమునకు నమస్కరించెను. మునిపాదముల రాజువ్రాల ముని రాజేంద్రుని లేవనెత్తి ఆశీర్వదించి ఆసనమున నుంచ ఈలోగా ఉదంకుడును అటకువచ్చెను. ధనుష్కోటి రామసేతువులో స్నాన మాచరించ శిష్యగణముతో నేతెంచెను. ఆతనిశిష్యులు లక్షకుపైగా ఉన్నారు. వచ్చిన గురునకు కక్షీవంతుడు పాదాక్రాంతుడుకాగా గురువాశీర్వదించెను. దీర్ఘతమ ఉదంకులు లోకవిశ్రుతులు. ఒండొరులు కుశలప్రశ్నలు చేసి సమాధానములంది ఆనందించిరి. మునుల అనుమతి వడసి రాజు కుమార్తెనటకు రావించి మహావైభవముగ తీర్థముననే మనోరమా కక్షీవంతులకు వివాహము జరిపించెను. ఉదంకుడు అధిపతిగా సర్వకార్యములు అగ్నిముఖముగ జరిపించెను. గజోత్తమము అగస్త్యతీర్థమున అదృశ్యమయ్యెను. సర్వులును తీర్థస్నానము చేసిరి. దీర్ఘతముడు కుమారునితో కోడలితో వేదారణ్యమున స్వాశ్రమమునకు పోతలంచెను. రాజు అల్లునికి కుమార్తెకు అనర్ఘములయిన కానుక లిచ్చెను. వారు వేదారణ్యమున స్వాశ్రమమునకేగి సుఖముగనుండిరి.

* * *

# బ్రహ్మ ఖండము

## 18-వ అధ్యాయము

అనంతరతీర్థము పుణ్యోదము రామకుండమున్నది. దాని ప్రక్కనే రఘునాథ సరోవరముకలదు. అట అల్ప దక్షిణతో చేసిన యజ్ఞము అక్షయఫలములిచ్చును.

సుతీక్ష్ణుడను బ్రాహ్మణుడు రామచంద్ర షడక్షర మంత్రము చిరము జపించుచు నియతాహారుడు జితేంద్రియుడునయి బహుకాలముండెను. ప్రీతుడయి సీతాసమేతుడై రామచంద్రుడా బ్రాహ్మణునకు దర్శనమీయ ద్విజుడు నుతించ సాగెను. "నమస్తే జానకీనాథ నమస్తే హనుమత్ప్రియ! నమస్తే కౌసలేయాయ, విశ్వామిత్ర ప్రియాయచ! అహల్యాదుఃఖసంహర్త్రే! నమస్తే భరతాగ్రజ!" ఇట్లు నుతించుచు ధ్యానముననుండ, మూర్తి అంతర్ధానము కాగా అష్టసిద్ధులు, సర్వలోక గమనము, సర్వశాస్త్ర పారంగతత్వము అలవడినవి. రామచంద్రుడా కుండతీరమున లింగము స్థాపించి పూజించి లోకానుగ్రహమునకై నియమముచేసెను. ఆ రామ సరోవరమున స్నానముచేసి పూర్వము ధర్మపుత్రుడు అసత్యదోషము పోగొట్టుకొనెను. అదెట్లన ఋషులకు సూతుని సమాధానము:

పూర్వము కురుపాండవులకు వైరమేర్పడి రాజ్యార్థము కలహించిరి. కురుక్షేత్రమున ఉభయసేనలు తలపడ, గాంగేయుడు పదిదినములుపోరి నేలవ్రాలెను. అయిదుదినములు ధృష్టద్యుమ్నునకును ద్రోణునకును రణము జరిగెను. ద్రోణుడు ధృష్టద్యుమ్నుని పారద్రోల అర్జునుడు గురువు నెదుర్కొనెను. గురుశిష్యులపోరు అతిఘోరముగా జరిగెను. మరల ధృష్టద్యుమ్నుడు ద్రోణునెదిరించ నిశితబాణములచే ధృష్టద్యుమ్నుని విరథునొనరించ, భీముడాతనిని

తన అరదమున నెక్కించికొనిపోయెను. పోవుచు ఏకపుత్రుడు చనిపోయినను హింస మానవుకదా అన ధర్మజుడు సత్యమనెను. వెంటనే ద్రోణుడస్త్ర సన్యాసమొనరించెను. ప్రాయోపవేశముచేయ తేజము ఊర్ధ్వమునకు పోగా ప్రాణములేని ఆతని శిరము వలదను చున్నను ధృష్టద్యుమ్నుడు ఖడ్గమున ఖండించెను. కౌరవులు పారి పోయిరి. ఇట్లగుటకు కారణము సుతుడశ్వత్థామ—గజము—చని పోయెనని అస్పష్టముగ ధర్మజుడన అది నిజమనుకొని ఆచార్యుడు ప్రాణములు విడచెను. ఇటుల భీష్మద్రోణులు యుద్ధవిరమణమున, మృతివలన, ఇరువురు లేకపోగా అశ్వత్థామ కోపమున అపాండవ మొనరింతునని శపథము చేసెను. ఆ తరువాత కౌరవులెల్లరు మొత్తము పదునెనిమిది దినములలో దుర్యోధనునితోసహా హతు లయిరి. ఒకరాత్రి అశ్వత్థామ ఉపపాండవులను నిదురించు వారిని చంపెను. కృష్ణార్జునులాతనిని పట్టితే వెన్నాడ ఆతడు బ్రహ్మాస్త్రము ప్రయోగించ అర్జునుడు దానిని పాశుపతాస్త్రముచే ఉపసంహరించి ద్రోణపుత్రుని కేశాకర్షణ మొనరించి చూడామణితీసికొని కట్టివైచి ద్రౌపదిముందుపెట్ట, బ్రాహ్మణహత్యవలదని వారించ, ఆతనిని విడిచి పుచ్చిరి. అశ్వత్థామ అనే కుంజరము'హతః' అని ధర్మజుడన'కుంజరము' విన్పించకుండ కలకలము చెలరేగినదని కథ. అయినను ఈ అసత్యమున ధర్మజునకు పాపము సంభవించినది. ధౌమ్యాదులు ధర్మజుని రాజ్య మున కభిషేకించయత్నించ అశరీరవాణి అసత్యముచే నీవు రాజ్య పాలన కనర్హుడవని విన్పించినది. ధర్మజుడు భయకాతరుడయ్యెను. చింతాక్రాంతుడయి దుఃఖించ వ్యాసమహర్షి అటకేతెంచెను. ఆ మునిని పూజించి ధర్మజులు తన పాపమునకు ప్రాయశ్చిత్తము తెలుపవేడెను. వ్యాసుని వాక్యము "దక్షిణ తీరమున గంధమాదన మున రామసేతువున రామతీర్థమున్నది. అటనే రామసరస్సు కలదు. సూర్యోదయమున తమస్సు పటాపంచలయినట్లు, నరుడా సరోవర

మున స్నానమాచరించిన పాపములు తొలగిపోవును.'' పాండవులు ధౌమ్యసహితులయి వెంటనే రామ సేతువునకేగిరి. అట వారు స్నానములుచేసి, క్షేత్ర పిండములిడి, వ్యాసోక్తము సర్వదానములు చేసిరి. ఇట్లొకమాసము వారాతీర్థమున నివసించి నిత్యస్నానము శ్రాద్ధ దానాదులొనరించ అశరీరవాణి "నీపాపములు సర్వము తొలగిన''వని విన్పించినది. ధర్మజుడావాణి వచ్చిన దిక్కుగా నమస్కరించెను. "నీవేగి అభిషేచనమంది రాజ్యము పాలించు మనియు వినవచ్చెను.

# బ్రహ్మ ఖండము

## 19-వ అధ్యాయము

తారక బ్రహ్మమయిన రామతీర్థమున కావల లక్ష్మణ తీర్థము కలదట కేగవలయును. ఇట స్నానము దారిద్ర్యనాశనము. లక్ష్మణుడీ తీర్థమున లింగమును స్థాపించెను, లక్ష్మణేశ్వర తీర్థసేవనమున దారిద్ర్యము, రోగములేక భవవిముక్తియు కలుగును. ఇట స్నానముచేసి లక్ష్మణేశ్వరునర్చించి పూర్వము బలభద్రుడు బ్రహ్మహత్యాపాతకము తొలగించుకొనెను. అదెట్లనిన కురుపాండవ యుద్ధము చూడలేక. ఏ పక్షమును వహించినను అన్యపక్షమునకు కోపకారణమని తలంచి, మధ్యస్థుడై, తీర్థయాత్ర మిషఇడి వెడలిపోయెను, ప్రభాసతీర్థము సేవించి దానికి తూర్పుగా నున్న సరస్వతీ తీర్థమునకేగెను. అనంతరము బిందుసరస్సు, బ్రహ్మతీర్థము సేవించి, గంగా, యమునా, సింధు సరిత్తుల స్నానమాచరించి, నైమిశారణ్యము చేరబోగా, దీర్ఘ సత్రమున నియమితులయిన ఋషులు ఆయదుశ్రేష్ఠునకు నమస్కరించి సత్కరించి ఆసనమిడ, లేవక ఆసనముననున్న వ్యాసశిష్యుని, పౌరాణికుని, సూతునిచూచి, మునుల కిట్లనెను,: "ఉన్నతాసనమున నుండిలేవక, నన్నవమానించిన ఈతనిని వధింతును. దుష్ట శిక్షణమునకే గదానారాక ఈ లోకమునకు" అనుచు చేతనున్న కుశాగ్రమున ఆసూతుని శిరము త్రుంచివైచెను. మునులు హాహాకారము లొనరించిరి. బలరామునివారిట్లు ప్రార్థించిరి. "మహాభాగా! ఈతనికి మేము బ్రహ్మాసనమిచ్చి దీర్ఘాయువని దీవించి కథాకథనకుశలుని వల్లపురాణములు వినుచుంటిమి. మావాక్కు వృథాకారా"దన బలరాము డట్లేచేతునని, యోగమాయను, ప్రేరేచి ఆతని వలన ఆశరీరము నుండి పుత్రుని ఉద్భవింపచేసెను. తరువాత వారలకింకేమి కావలయునో కోరిన ఇత్తుననుచు, బ్రహ్మహత్య తొలగుటకు ప్రాయ

శ్చిత్తము వారినే తెలుపుమన ఋషులిట్లను చున్నారు. 'రాక్షసుడిల్వ లుడు కలడు, ఆతని కుమారుడు బల్వలుడనువాడు యాగము పాడు చేయుచున్నాడు,'' వానిని వధించకోరిరి. ప్రాయశ్చిత్తముగా భారత భూమిలోగల తీర్థములన్నియు ఒక సంవత్సరము తిరిగి సేవించిన బ్రహ్మహత్య తొలగుననిరి. పర్వమునువేచి వచ్చిన బల్వలుని మహా కాయుని సీరమున ఆహరించి వధించెను. సంవత్సరము తీర్థములు సేవించు పురము తిరిగి పోనుండ రావముతో, ఛాయవలె, వెనుక ఒక నీడ వచ్చుచుండకనెను. అశరీరవాణి బ్రహ్మహత్య పూర్తిగా నశించలేదనెను. వెంటనే యదుపుంగవుడు నైమిశమునకేగి ఋషుల కావార్త తెల్ప, ఆశేషము తొలగుటకై గంధమాదనమున లక్ష్మణ తీర్థమును సేవించ తెల్పిరి. వెంటనే అట్లుచేసి పాపముతొలగి ధను ష్కోటిని, రామనాథుని సేవించెను.

*

# బ్రహ్మ ఖండము

## 20-వ అధ్యాయము

బ్రహ్మహత్యాది మహాపాతకనాశని అయిన లక్ష్మణతీర్థము తరువాత జటాతీర్థమున్నది. ఇది అజ్ఞాన నాశనకరమయినది. సామాన్యముగా జనము, ద్విజులు చిత్తశుద్ధి కొఱకు వేదాంతము పఠింతురు. అనంతరము వాదోపవాదములకు దిగి తర్కసామర్థ్యమున కలహింతురు. బహువ్యామోహకారణమయిన వేదాంతములవలన చిత్తశుద్ధి చేకూరదు. చిత్త శుద్ధికై జటాతీర్థము సేవించుకోవలెను. లోకోపకారార్థము గంధమాదనమున శంకరులీతీర్థమును నిర్మించిరి. రావణసంహారానంతరము శ్రీరామచంద్రులు ఈ తీర్థజలముల జటలను క్షాలనము చేసెను. అందువలన జటాతీర్థమని పేరు కలిగినది. అంతఃకరణశుద్ధికి, అజ్ఞాననాశమునకు ఈతీర్థము పెట్టినదిపేరు. అజ్ఞానము నశించ ముక్తి అలవడును. ఈ అర్థమునకయి తండ్రికుమారులు' వ్యాస శుకుల సంవాదముకలదు, వినుడు: వ్యాసుని గూర్చి శుకుని ప్రశ్న—భగవన్! తాత! అంతఃకరణ మలములు దూరమయి జ్ఞానోదయమయి, తరువాత శాశ్వతమయిన ముక్తస్థితి దేనివలన చేకూరునో తెలుపగోరెదను. వ్యాసుడందులకు రామసేతువున గంధమాదనమున మహాపుణ్యప్రదమయినది జటాతీర్థమున్నది. యజ్ఞయాగాదులు చేయకయే ఈ తీర్థస్నానమున అజ్ఞానము.నశించునని రామచంద్రుడు తీర్థమునకు వరమిచ్చెను. ఈ తీర్థస్నానము సర్వపాపవినాశనకరము. మంగళములకును మంగళప్రదము. ఈఅర్థమునే వరుణుడు భృగువునకు తెల్పెను. శంకరాంశసంభూతుడు దూర్వాసుడును ఈ తీర్థమున స్నానముచేసి బ్రహ్మానందమును గాంచెను'' తండ్రిమాట లాలించి శుకుడు జటాతీర్థమున కేగెను. ఈ తీర్థమున స్నానము భుక్తి ముక్తి ప్రదము. కర్మ వినాశమునకయి జప తప హోమాది క్రతువులు తదంగములు ఎన్నియో కలవు. అవి కష్టసాధ్యములు, ఈ తీర్థస్నానము నియమియయి చేసిన ఆయాపుణ్యకర్మలు యజ్ఞతపోదానములు చేసిన ఫలములంది ముక్తి గాంచును.

★

# బ్రహ్మ ఖండము

## 21-వ అధ్యాయము

తరువాత లక్ష్మీతీర్థమున్నది. ఇయ్యది సర్వకామప్రదము. సంపత్తు లిచ్చును. దుఃఖములంత మగును. పూర్వము ధర్మరాజు ఇంద్రప్రస్థముననున్న సమయమున శ్రీకృష్ణుని చే బోధితుడై ఈ తీర్థము సేవించెను. విపులమయిన శ్రేయస్సులు పొందగల్గెను. పంచపాండవులు ఒకమాసము అటగడపి గో భూ తిల హిరణ్యాది దానములిచ్చి ద్విజోత్తములను తృప్తిపరచిరి. అనంతరము ధర్మరాజు రాజసూయముచేయ తలపెట్టెను. దూతనుపంపి కృష్ణునాహ్వానించి, ఆతడు రా తలంపెరిఁగించెను. కృష్ణుడందుల కంగీకరించెను. అయితే ముందుగా దిగ్విజయమొనరించి రాజులందరివద్ద కప్పములు గ్రహించి ప్రభూతముగ వచ్చిన ఆ ధనరాశులతో యజ్ఞము చేయవలెనని బోధించ ధర్మజుడు నలువురు సోదరులకీవార్త విన్పించెను. వారుత్సహించి నలువురు సైన్యములతో నాలుగు దిక్కుల పయనించిరి. ఏ దిక్కుకేగినవారు ఆ దిక్కునగల రాజులను జయించి వారిచ్చిన ధనకనక వస్తు వాహనములు గొనుచు ఇంద్రప్రస్థమునకు తిరిగివచ్చిరి. కృష్ణప్రేరితులై యాదవులును శతకోట్లు సువర్ణములర్పించిరి. యజ్ఞమున ధర్మజుడు బ్రాహ్మణులకు సర్వస్వము పంచి ఇచ్చెను, ఆ నోట ఆ నోట ఇంతవృద్ధికి కారణము లక్ష్మీతీర్థ స్నానమని ప్రజలు పలుకసాగిరి.

# బ్రహ్మ ఖండము

## 22-వ అధ్యాయము

అనంతరము సేవించదగినది అగ్నితీర్థము. సర్వాభీష్టప్రదము సర్వపాపనాశనము. దానికాపేరు కల్గుటకు హేతువువినుడు:

రావణ సంహారానంతరము రామచంద్రుడు, వానరులతో విభీషణుడు, తగు మాత్రము పరివారముతో అనుగమింప వారధి మార్గముననే తిరిగి సేతువునకు గంధమాదనమునకు వచ్చెను. దివ్యు లెల్లరును కూడిరి. సీత పరిశుద్ధి నిమిత్తము రామచంద్రుడు అగ్నిసా వాహనము చేసెను. సప్తజిహ్వాలతో అగ్నిమూర్తి రామునిముందు ఆవిర్భవించి ఇట్లనెను. 'రామచంద్రా! ఈ సీత లక్ష్మియే. జగన్మాత. నీ అవతారములతో పాటామెయు జనించి నిన్ననుసరించియే యున్నది. ఇపుడు సీత అయినది'. అన అగ్నివచనమున నిర్మల యయిన సీతను రాముడనుమతించెను. లక్ష్మీతీర్థమున కనతిదూరమున అగ్నిసాక్షాత్కరించిన ప్రదేశమే, ఆ సముద్రభాగమే, అగ్నితీర్థమని ఖ్యాతిగాంచినది. ఇట స్నానముచేసి బ్రాహ్మణులకు అన్నదానాదిక మిచ్చిన, విష్ణు సాయుజ్యమందుదురు.

పూర్వము పాటలీపుత్రమున, పశుమంతుడను వైశ్యుడు గో బ్రాహ్మణ రక్షణరతుడుండెను. ఆతనికి ముప్వురు భార్యలు. పెద్దభార్య సుపణ్యాం, పణ్యావంతః, చారుపణ్యాం అను నామములు కల ముప్వురు పుత్రులను కన్నది. మధ్యభార్య ఇరువురు తనయులు, సుకోశ, బహుకోశులను వారలనుకన్నది. మూడవభార్య ముగ్గురు తనయులు మహాపణ్యా, మహాకోశ, దుష్పణ్యులనువారలను కాంచెను. ఇట్లాపశుమంతునికి అష్టపుత్రులు ముప్వురు భార్యలవలన జనించిరి. తనవృత్తియందు దాబాలురకు బాల్యమునుండియు మంచి శిక్ష చేకూ

ర్చెను. ఏడుగురు తండ్రి ఆజ్ఞాపాలకులు, మంచివారు కాగా ఎనిమి దవవాడు దుష్పణ్యుడు దుర్మార్గుడై తండ్రిమాట వినడాయెను పుత్రులు యౌవనులయిరి. దుష్పణ్యుడు బలవంతుడయి నగరమున తోడివారలను సరస్సులలో నదులలో, త్రిప్పి గిరవాటు వైవసాగెను. ఎవ్వరును ఆ బాలురాతీరున జలముల బడుటకు కారణమీతడని తెలి యరయిరి. చనిపోయి నీట తేలునందాక వారి వారి తనయులను గూర్చి ఆ తండ్రులకు తెలియుటలేదు. నిత్యమీతీరున బాలురను నీటవైచి చంపసాగెను. ప్రజలు రాజువద్దకుపోయి మొరలిడ రాజు మారకుని కనిపెట్ట పాలకులను నియమించెను. కాని వారు కార ణము తెలియజాలక రాజునకు పోయి చెప్పిరి. రాజు చింతాక్రాంతు డయి ఆలోచించసాగెను. ఒకనాడు దుష్పణ్యుడు అయిదుగురు బాలురతో పూలుకోయు మిషతో తామరకొలనుకుపోయి, క్రోశదూరము జలముల వారిని ముంచి చనిపోయిరనుకొని ఇంటికి పోయెను. బాలురు చావలేదు. నెమ్మదిగా తీరము చేరనుండ, వెదకుచు వచ్చిన వారి తండ్రులకు కన్పించిరి. వారటులగుటకు కార ణమడుగ దుష్పణ్యు డీతీరున తమ్ము నీట బడవైచి పోయెనని తెల్పిరి. నగరవాసులు ఈ బాలుర వాక్యములు నిజములుగ గ్రహించి రాజున కీవృత్తాంతము తెల్పిరి. రాజు పశుమంతుని పిలిచి ఆతని కుమారుని దుశ్చరితమును తెల్పెను. తానేమి చేయవలయునో తెలుప వైశ్యునే అడిగెను. "నీవు ధర్మతత్పరుడవు. నీవే తీర్పు చెప్పు" మనెను.

"రాజా, ఈ సందర్భమున అడుగవలసిన దేదియునులేదు. వీనికి మరణదండనమే ఈయవలయును. నా కుమారుడయినను ఈతడు నాకిపుడు శత్రువే. నిజమే చెప్పుచున్నాను. వీడు చంపదగిన వాడు" అనెను. నగరవాసులు, చంపవలదు, పురివిడిచి పోనాజ్ఞ యిడినచాలుననిరి. రాజాతనిని "దూరదేశమునకు పొమ్ము. పురమున

ఉండరాదు. తిరిగి నగరమున కన్పించిన వధింతు''మని తెల్పి, యాతనిని పురమునుండి తరలించి దూరదేశమున విడువ దూతల నాజ్ఞాపించెను. దుష్పణ్యుడు భయమున దేశము విడిచి అరణ్యముల కేగెను. అక్కడను ఒక మునికుమారుని నీటముంచెను. ముని ఉగ్రశ్రవులా సంగతి తెలిసి కుమారుని బ్రదికించుకొని దుష్పణ్యుని చరితమిదియని తెలిసి, నీకు జలముల మునిగి చచ్చుటయే ప్రాయశ్చిత్తమని శపించిరి. చచ్చి చిరకాలము పిశాచత్వమనుభవింతువనిరి. శప్తుడై ఆ అరణ్యము విడచి, ఇంకొక అరణ్యమున కేగెను. అట మహావాతయుతము వర్షము కురియసాగెను. వృక్షములు కూలి పడుచున్నవి. మహావాతము, మహావర్షము సహించలేక క్రూరమృగములు, గజసింహాదులు గుహల వృక్షషండముల దూరుచున్నవి. గొప్ప ప్రవాహమేర్పడి వనమున ప్రవహించ సాగెను. ఆ ప్రవాహమున గజములు కొట్టుకొని పోవు చుండ, నీట మునిగి తేలుచున్న దుష్పణ్యునితోపాటు గజము కడుపు నిండ నీరుత్రాగ, గజోదరమున నీటిలో దుష్పణ్యుడు ఊపిరితిరుగక యుండ, గజము తేలుచు సముద్రమున బడెను. నీటి నెగజిమ్ముటలో చనిపోయిన దుష్పణ్యుడుదరమునుండి సముద్రజలముల బడెను. ఈ తీరున ఆతడు మునిశాపమున మరణించి వెంటనే పిశాచత్వమందెను. అరణ్యమాశ్రయించి, తినుటకేమియును లభించకపోగా, ఘోరముగ అరచు చుండెను. క్రమముగా దండకారణ్యము చేరెను. అగస్త్యాశ్రమమునకు సమీపమున సంచరించుచు అట మునులను చూచి తన కథ వారికి తెల్పుచు రక్షించుడని ఆక్రోశించసాగెను. తపోధనులా పిశాచ వాక్యములు విని పోయి ఆతని వృత్తము గురున కగస్త్యునకు నివేదించిరి. ఈతడు మహాపాపి అయినను పశ్చాత్తప్తుడు. ఈతనిని రక్షించ తామే సమర్థులనిరి. వీరిమాటలు వినిఅగస్త్య మహార్షి ప్రియశిష్యుని, సుతీక్ష్ణుని పిలచి ఇట్లనెను.

'గంధమాదనమున అగ్నితీర్థము, పిశాచమోక్షణ సమర్థమయినది కలదు. నీవటకేగి సంకల్పించి ఈతని పిశాచత్వము పోతలంచి స్నానమాచరించుము. నీ సంకల్ప స్నానాదికముల బలమున ఈతని పిశాచత్వము పోవు'నని తెల్పి పంప ఆతడటులనే తీర్థమునకేగి, మూడుదినములు నియమియయి స్నాన జపాదులొనరించి, ఆ తీర్థజలములు కమండలమున బట్టి తెచ్చి ఆశ్రమమున అనతి దూరమున దుఃఖించు నా పిశాచముపై చల్లగా నాతడు పిశాచత్వము విడచెను. ఆ క్షణముననే తీర్థమహత్వమున దివ్యశరీరుడాయెను. వెంటనే దివ్యస్త్రీ పరివేష్టితమయిన విమానమురాగా దాని నధిరోహించి, మునులకు పునః పునః ప్రణామము లాచరించి, స్వర్గమునకేగెను. ఇది అగ్నితీర్థ మహిమాదికము.

∴

# బ్రహ్మ ఖండము

## 23-వ అధ్యాయము

అనంతరము చక్రతీర్థమును సేవించవలెను. ఏయే కోరికలు కోరి చక్రతీర్థమున స్నానముచేసిన ఆయాకోరికలు పొందుదురు.

పూర్వము అహిర్బుధ్న్యుడను ముని ఇట సుదర్శనమునుగూర్చి నియమియయి తపమాచరించెను. అట తపోధనులను రాక్షసులు పీడించుచుండిరి. మునులు ప్రార్థించ సుదర్శన మేతెంచి ఆ రక్కసులను చంపి వారిబాధలు తొలగించెను. నాటినుండియు చక్రము అహిర్బుధ్న్య తీర్థమున సన్నిధానమై యుండి మునుల బాధలు తీర్చుచునుండెను. ఆ తీర్థమానాటినుండి చక్రతీర్థమని ఖ్యాతిగాంచెను. సుదర్శనప్రసాదమున ఆతీర్థమున స్నానముచేసిన, రాక్షసపిశాచకృత పీడ తొలగును.

పూర్వము ఛిన్నపాణి అయిన రవి స్నానముచేయ హిరణ్యపాణికాగల్గెను. (పోయినచేయికిమారుగా బంగారుచేయి వచ్చినదనుట) ఆగాథ మునులకు సూతు డిటుల వివరించెను: పూర్వము దివ్యులు సదా అసురులచే పీడితులై బ్రహ్మను శరణంద ఆతడు మహేశ్వర మహా యాగముచేసిన అసురపీడ తొలగునని తెల్పి, ఆ యజ్ఞము మునుల సహాయమున గంధమాదన పర్వతప్రాంతమున చేయుడని తెల్పెను. 'అట సుదర్శనము సన్నిధానవర్తి. దాని అనుగ్రహము మీకలవడి రాక్షసబాధ దూరమగును.' బ్రహ్మవాక్యములు విని దివ్యులు బృహస్పతిని ముందుంచుకొని, పోయి మహాత్ముడు అహిర్బుధ్న్యునికి నమస్కరించి, ఆయన అనుమతి ఆయన ఆశ్రమమునకు సమీపమున యజ్ఞవాటముకల్పించిరి. యజ్ఞకర్మకుశలులయిన తపోధనుల సహాయమునుగొని యజ్ఞమారంభముచేసిరి. స్వయము బృహ

స్తుతి హోతగా ఇతరులువలసిన ఇతరాంగములుగా యజ్ఞకర్మ సాగించిరి. అష్టావక్రుడధ్వర్యుడాయెను. ప్రతిప్రస్థాత విశ్వామిత్రుడు. వాయువుఉద్గాత. ఇంద్రుడు యజమానుడు. ఉపద్రష్ట శుకుడు. మహేశ్వర క్రతువునకు విధివిహితముగ ఇంద్రుడు దీక్షితుడాయెను. యజ్ఞకర్మ నిర్విఘ్నముగా పూర్తిఅయి పురోడాశము, తమతమభాగములు ఋత్విజులు స్వీకరించిరి. తనభాగము ప్రాశితమును సూర్యుడు గ్రహించ, దురాసదమయిన దానిని గ్రహించిన క్షణముననే అతని కరము విరిగినది. ఋషులాశ్చర్యపడి ఆలోచించుచుండ, అష్టావక్రుడు కారణమేదయిననేమి, కుంటి, గ్రుడ్డి, అంగలోప మేదయినను పూరించుశక్తి ఇట చక్రతీర్థమునకు కలదు. సూర్యుడాతీర్థమున స్నానమాచరించ పోయిన కరములభించునన, తక్షణమే సూర్యుడటకేగి, ఆ తీర్థమున స్నానమునకయి మునిగి లేచునంతలో హిరణ్యామయమయిన బాహువు అమరెను. దివ్యులు రాక్షసుల నోడించి స్వర్గమున కేగి సుఖముండిరి.

# బ్రహ్మఖండము

## 24-వ అధ్యాయము

అనంతరము సేవించవలసినది శివతీర్థము. ఇట స్నానముచేసి కాలభైరవుడు బ్రహ్మహత్యాపాతకము పోగొట్టుకొనెను. పూర్వము కొలదికారణమున తానుపెద్ద, తానుపెద్ద అని బ్రహ్మ విష్ణులకు కలహమేర్పడెను. -దివ్యులమధ్య బ్రహ్మ తాను సృష్టికర్తకాగా తన కన్న గొప్పవారితరులు లేరనెను. హరితానేజగత్కర్త, యజ్ఞ విభుడను, నేనులేనిదే ప్రపంచమునకు జీవనమేలేదనెను. ఇట్లు వివదించు వారిముందు మూర్తిమంతములయి నాలుగు వేదములు నిలచినవి, వేదవాక్యములిట్లున్నవి:

'బ్రహ్మ విష్ణువులు! మీ యిరువురిలో నెవ్వరును జగత్కర్తలు కారు. పరాత్పరతరుడు, విభుడు, ఈశ్వరుడు జగత్కర్త. ఆయన మాయాశక్తికృతము ఈ జగత్తున సర్వమును. జగత్తులను సృజించ పెంచ లయించ ఆ ఈశ్వరుడే సమర్థుడు.' అన హరి బ్రహ్మలు దాని నంగీకరించ లేదు. ప్రమథగణముల కధిపతి, సదా పార్వతి నాలింగనము చేసికొన్న సాంబుడు సర్వాధికుడను పెట్లన నింతలో ప్రణవము మూర్తిభవించి నిలచి ఇట్లనెను.

'ఈ శంభుడు మహాదేవుడు, పార్వతి ఆతని కాత్మస్వరూపమే. ఆయన స్వయంప్రకాశుడు. సృష్టికాలమున ఈమహాదేవుడే రజోగుణప్రధానుని నిన్ను - బ్రహ్మను, సృష్టికార్యమునకు, సత్త్వగుణప్రధానుని హరిని రక్షకుడు - పాలకునిగా, తమోగుణుని కాలరుద్రుని లయకర్తగా నిల్పెను. కాన మీకు స్వతంత్ర్యమన్నదిలేదు. ఉమ శంకరుని శక్తియే. ఆ ఇరువురికిని, శివశక్తులకు భేదములేదు. కావున మహేశ్వరుడే నిర్వికల్పుడు, స్వతంత్రుడు, విశ్వాధికుడు, సర్వనియంత,

కాని హరిబ్రహ్మలు అంగీకరించక పోగా, ఇంతలో వారలకొక అద్భుతదర్శన మయినది. అనంతాదిత్య-సన్నిభమయిన తేజము గగన మంతయును వ్యాపించినది. ఆ తేజము చూడ బ్రహ్మముఖము జ్వలించినది. ఆ తేజమున నీలలోహితుడు, కన్పించ ఆతడు తన లాలాటమున జన్మించినవాడేననుచు గర్వించ, మహేశ్వరుని కోపమున కాలభైరవుడు జనించి బ్రహ్మతో పోరతలపడెను. బ్రహ్మ యొక్క పంచమశిరస్సు భైరవుడు హరించెను. బ్రహ్మ తన్నుదా తెలిసి శంకరుని నుతించ, ప్రసన్నుడై బ్రహ్మ నాతని పదమునసిల్పి, భైరవునిచేతపడి విడువని బ్రహ్మ పంచమశిరస్సు, హత్యాపాతకము కాగా, శివునుపదేశమున కాలభైరవుడు గంధమాదనమున శివతీర్థమునకేగి స్నానమాచరించి ఆ పాతకమును పోగొట్టుకొనెను. అట కేగుటలో, కపాలపాణియయి, భిక్షాటనమొనరించుచు, కాశికేగి మూడుభాగములు పాతకమటతొలగ, శేషము శివతీర్థస్నానమున దూరీకరించుకొగల్గెను. శివునాజ్ఞచే భైరవుడు పాపముతొలగ, కాశికేగి కపాలమొకచో స్థాపించెను. అది కపాల తీర్థమని కాశిలో ఖ్యాతిగన్నది. ఇది శివతీర్థమహిమాదికము.

★

# బ్రహ్మ ఖండము

## 25-వ అధ్యాయము

బ్రహ్మహత్యాది పాపవినాశమునకు శివతీర్థమును సేవించి అనంతరము శంఖతీర్థమును చేరవలయును. ఇట స్నానమొనరించిన కృతఘ్నుని పాతకమయిన నశించును. భూమికి భారభూతుడు కృతఘ్నునికన్న అన్యుడులేడుకదా! మాతాపితలను గురువులను ఎవడు గౌరవించి వినయవంతుడయి ప్రవర్తించడోవాడు కృతఘ్నునితో సమానుడే. వీరెల్లరు శంఖతీర్థసేవనమున పాపములనుండి ముక్తులగుదురు. హరిభక్తిచేయుచు పూర్వము శంఖుడను పేరుగల ముని గంధమాదనమున తపోనియతి చిరముండెను. తన స్నానమునకై అట ఆముని తీర్థము కల్పించుకొనెను. ఆ నిర్మాణమున ముని ఉపయోగించిన సాధనము శంఖము, అందువలన దానికి శంఖతీర్థమని నామమేర్పడినది.

ఇతిహాసము:— పూర్వము వత్సనాభుడను ఋషికలడు. సత్యవంతుడు, నియమి, భూతదయాపరుడు శత్రుమిత్ర సముడు, విజితేంద్రియుడు, తత్త్వబ్రహ్మనే ఆశ్రయించిన పరబ్రహ్మతత్త్వవిదుడు. నిశ్చలుడై స్వాశ్రమముననేయుండి ఆ తావునుండి పరమాణువంతకూడ చలించక చిరముండెను. అనేకవందల సంవత్సరములు నిశ్చలుడై తపముచేసెను. ఆతని శరీరమంతయు కప్పివైచి పుట్ట మొలిచెను. అట్లయ్యెనని ఆతనికి తెలియదు. తదేకధ్యానమున హృదబ్జమున హరిని నిలిపియుండెను. ఇంద్రుడేకధారగా పదుదినములు అతివేగమయిన ధారాపాతముగ వర్షము కురియించినను ధ్యాననిమీలితనయనుడైన వత్సనాభుని ధ్యానము సడలలేదు. వల్మీకముపై పిడుగుపడి దాని శిఖరము వికలమాయెను. ధర్మునికి కరుణజనించి గొప్ప మహిషమయి ఆ పుట్టను కప్పునట్లు

నిలచి వర్ష వేగమును తన కఠిన శరీరముచే నాపెను. వారముదినము లయిన తర్వాత వర్ష వేగ మాగిపోయినది. మహిషరూపి ధర్ముడు వల్మీకమున కనతిదూరమున నిలచియుండెను. తపోనియతి సడలించి మహర్షి కనులు తెరచి నల్దిశలు తిలకించి సర్వము కొండలు, అరణ్యములు, ప్రదేశములు జలమయములయియుండ తాను సురక్షితముగ నుండుటకు హేతువెయ్యదియోయని చింతించుచు దూరముననున్న మహామహిషమును చూచి ఇట్లనుకొనెను.

'తిర్యగ్జంతువయ్యు దీనియందు ధర్మశీలతయున్నదే! ఈ మహిషమే మహావర్ష పాతమునుండి నన్ను రక్షించినది. ఇది చిరాయువగుగాత' అని తలంచి మరల తపము చేయనారంభించెను. ఆతని నిశ్చయము కని మహిషరూప ధర్ముడు పులకితగాత్రుడయి ఆనందమున నోలలాడెను. అయితే తనమనసు పూర్వమువలె పరబ్రహ్మయందు లగ్నము కాలేదు. వత్సనాభు డాలోచనలోబడెను. "మనసున మాలిన్యమంటిననే చంచలమగును. మనసుచలించుటకు హేతువు పాప బాహుళ్యము. నాయందు పాపము లేశమయిననులేదు. ఎందుకు నిశ్చలత్వమునందుటలేదు". దోషహేతువును మరల మరల వెదుక సాగెను. ఒక ఆలోచన తట్టెను. "నేను దురాత్ముడను. మూఢుడను. కృతఘ్నతయను మహాదోషము నాకంటినది. ఇట్టి ఘోర వర్షపాతమునుండి నన్ను రక్షించిన ఈ మహిషోత్తమమును ఊరక చూచి పూజించలేకపోయితిని. ఈ విషయమున కృతమునకు గౌరవము చూపకపోవుట కృతఘ్నతకాదా! నాకు ప్రాయశ్చిత్తము ఈ పాపమునకు లేనేలేదు. అట్టివానికి లోకములులేవు, బందుగులును లేరు. ఆ దోషము వలననే నాచిత్తము మలినమయినది. విశ్వాస ఘాతునివలెనే కృతఘ్నుడును నరకమందును. ధర్మజ్ఞులందురుకదా "కృతఘ్నునికి ప్రాయశ్చిత్తము మరణమే" అని వెంటనే మేరు శిఖర మధిరోహించి క్రిందపడి చనిపోవ నిశ్చయించి, ముందుగా పితరులకు

గురువులకు మనసా ప్రణమిల్లెను. పడబోవ వలదు వలదని ధర్ముడు మాహిషరూపము త్యజించి "వత్సనాభ! మహాభాగ! చిరంజీవివికమ్ము. దేహత్యాగము వలదు. నీ ధర్మబుద్ధికి సంతసించితిని. అయినను నీ మనసున శంకయుండరాదు. కృతఘ్నతా మలినముపోవ గంధమాదనమున శంఖతీర్థమున్నది. అటకేగి తీర్థస్నానమాచరించుము. పాపము తొలగి మనోనైర్మల్యమందుదువు. అనంతరము శాశ్వతమయిన పదము ప్రాపింతువు. నేను ధర్ముడను. సత్యముచెప్పుచున్నాను." అన సంతసించి ధర్మునకు ప్రాంజలి ఘటించి వెంటనే శంఖతీర్థమునకేగి స్నానముచేయ, పాపము శాంతించి మనసు నిర్మలతనందెను. కాలాంతరమున బ్రాహ్మీభూతుడాయెను-పరమపదము నందెననుట.

# బ్రహ్మఖండము

## 26-వ అధ్యాయము

ఆ తరువాత యమునా, గంగా గయా తీర్థములు సేవించవలెను. ఈ మూడు తీర్థముల స్నానదానాదులవలన సర్వ విఘ్నములు, సర్వ రోగములు, నివారణమయి అజ్ఞాన నాశనమగును. జ్ఞానబోధయగును. పూర్వము జానశ్రుతుడను రాజశ్రేష్ఠుడు ఈ తీర్థములు సేవించి రైక్వుడను మునివలన ఉత్తమజ్ఞానము పొందెను. ఆ గాథ వివరణము :

పూర్వము గంధమాదనము మహాతపస్వి రైక్వుడను మహర్షి యుండెను. తపోబలమున దీర్ఘాయువయి యుండెను, జన్మతః ఆతడు కుంటివాడు-తీర్థములకు పోవసమర్థుడుకాడు. సమీపమున గల తీర్థములకు శకట సహాయమున పోవుచుండుటచే లోకమాతనిని సయుగ్వుడనుచుండిరి. యుగ్వమనశకటము. పూర్ణజ్ఞాన మలవడునట్లు తపమొనరించెను. గ్రీష్మమున పంచాగ్నిమధ్యమున, వర్షకాలమున కంఠము పర్యంతము నీటనిలచియు, తపముచేయ శరీరమున దురద-కండూ-సంభవించి దివారాత్రము బాధపడుచు డెను. ఆతనికొక తలంపుకలిగెను. "తీర్థత్రయమున స్నానము చేయుటమంచిదేకాని శకటసహాయమున నేనంతదూరము పోలేను. నేనేమిచేయుదును. యమునా గంగాగయా తీర్థములకేగ తీవ్రేచ్ఛయున్నది. నాకు తపోబలమున్నది. దానినే నేనావాహనము గావింతును, (పిలుతుననుట)". వెంటనే తూర్పుముఖముగ ఆసీనుడై, ఇంద్రియములు నిలిపి, మూడుమారులాచమించె. మూడు తీర్థములు పాతాళమును. భేదించుకొని మూర్తులు ధరించి పైకివచ్చి, సయుగ్వాహానుని ముందు నిల్చి "మునీంద్రా నీవు మమ్ముతలంచితివి. నీముందు వచ్చినిల్చితిమి. మావలన నీకేమి కావలయునో తెలుపగోరెదము" అన ఆ వాక్కులు

విని మునిధ్యానము చాలించి కనులువిప్పి ముందున్న మూడు మూర్తులను కనెను. రైక్వుడు వారిని విధిపూర్వకముగ పూజించి, ఇట్లనెను.

"గంధమాదనమున నాకుమీరు సన్నిధానవర్తులుగానుండుడు. ఎట మీరు భూమిని భేదించివచ్చితిరో అటమీ నామములతో తీర్థములు గావించియుండుడు". అట్లగుగాకయనుచు తీర్థమూర్తులంతర్ధానము నందినవి. నాటినుండి ముని నిత్యము తీర్థములస్నానముచేయుచు, కాలము గడుపసాగెను. ఈ కాలమున జానశ్రుతియనురాజు, సదా అతిధులకన్న పానాదులు కల్పించి తృప్తులనుజేసి సంతసించువాడు. ఆతనిపట్ల సంతసించి దేవర్షులెల్లరు హంసరూపములు ధరించి మాల కట్టివచ్చి ఆతని సౌధోపరితలమున ఆగిరి. అందొకహంస "ఓయి భల్లాక్ష! ముందుకుచూడు ముందు సౌధమధ్యమున జానశ్రుతుడు రాజున్నాడు. ఆతడు పూజనీయుడు. ఆతని తేజస్సు దురాధర్షము. ఆరాజర్షి నతిక్రమించిపోరాదు. అతిక్రమించితివా ఆ తేజము నిన్ను తిరస్కరించి బాధించును". ఆ మాటలాలించిన హంసము, "మంచి వాడవు, నుతించ దగినవాడవు, అయినను ఈతనినంతగా పొగడపని లేదు. ఈతని మహిమ అంతంతమాత్రమే. తత్త్వజ్ఞాని రైక్వుడను మహర్షి తేజమున నతనిమహిమ కలామాత్రమే. ఆతని పుణ్యరాశి అనంతము. భూమిమీది రేణువులు, ఆకాశమున తారకలు లెక్కించ వచ్చునేమోకాని, రైక్వుని పుణ్యమహామేరు సమూహములెక్కించన శక్యము. జానశ్రుతి ధర్మమంతటిది కాదని నామతము. ఇట్టివార లనేకులున్నారు. వీరితో మనకేమి. జన్మతః కుంటిఅయ్యు రైక్వుడు సయుగ్వుడని ఖ్యాతిగన్న ఆ మహర్షి మహత్వము సర్వోన్నతము" ఇట్లు వివదించుచు హంసరూపులయిన మహర్షులు బ్రహ్మలోక మును గూర్చి సాగిపోయిరి. రాజు ఈ సంవాదమాలించి, తనకు రాజ్యముతోపనియేమని కృపానిధి రైక్వుని శరణంద నిశ్చయించెను.

ఆఋషివలన ఆత్మవిజ్ఞానము సంపాదించతలంచెను. ఈ ఆలోచనతో రాజు అతి కష్టమున ఆ రాత్రి గడపెను. నిశావసానమున మంగళ రవము, తూర్యఘోషము వినియు శయనముననే యుండి సారథిని పిలిపించుకొనెను. ఆ సారథితో నిట్లనెను. "అతి శీఘ్రముగ ముని శ్రేష్ఠుని రైక్వుని చూడపోవలయును." అన రథముతేగానే రాజు బయలుదేరి ఆశ్రమములు, గిరులు, వనములు వెదకుచు క్రమముగా విచారించుకొనుచు గంధమాదనము చేరుకొనెను. ఒడలు గీరు కొనుచు శకటముననున్న మునిని కాంచిరి. సారథి ఆ ఋషిని సమీపించెను. నిష్కలము అద్వైతబ్రహ్మ చింతనమున నిమగ్ను డయిన ఆ ఋషినిచూచి ఆతడే రైక్వుడని నిశ్చయించి సమీపించి వినయమున ఇట్లు ప్రశ్నించెను.

"బ్రహ్మన్-రైక్వుడని, సయుగ్వుడని పేర్వడసిన మహర్షులు తామేనా" అన సమాధానము "ఆరైక్వుడను నేనే". సారథి ఆతడు కుటుంబ భారమున అనగా దారిద్ర్యముచే బాధపడుచున్నట్లు తెలిసికొని రాజునుచేరి తాను తెలిసికొన్నదంతయు విన్నవించెను. వెంటనే రాజు ఆరువందలు గోవులు, నిష్కభారము ధనము, అశ్వ తరితో (ఉత్తమాశ్వము - కంచరగాడిద అని నిఘంటువు) కూడిన రథముకూర్చి తెచ్చి మునికి నివేదించెను. రాజా మునిముందు నిలచి "మహాముని! నేనిచ్చు వీనిని గ్రహించుడు. ఈసర్వము గ్రహించి శిష్యునిగ నన్నేలిశాసించుడు. నాకు అద్వైత బ్రహ్మవిజ్ఞాన ముప దేశింపుడు." ఆ మాటలు ఆలించి రైక్వుడు రాజునకిట్లనెను. "రాజా ఇవి నీవద్దనే యుంచుము. దీనికి వందలు రెట్లిచ్చినను నాకుటుంబ భరణమునకు చాలదు." రాజు ఆ వాక్యము విని "మహర్షీ-మీరుప దేశించు విజ్ఞానమునకిది మూల్యముకాదు. దాని విలువ ప్రపంచ మునలేదు. తాము గ్రహించుడు-కాదనుడు. నాకు మాత్రము తాము నిష్కలాద్వైత విజ్ఞానముపదేశించుడు".

రైక్వుని వాక్యము – "ఎవనికి సంసారమన్న, పుణ్యపాపము లన్న నిర్వేదము కలదో–చింతించడో, లబ్ధివినాశములను తలంపడో ఆతడే జ్ఞానోపదేశము చేయసమర్థుడు. నీకు సంసారమున రక్తి లేక పోయినను పుణ్యపాపములపట్ల భావము నశించలేదు. ఆ భావము పునర్జన్మకు హేతువు. రాజా! వాటికి భోగము వినా నాశములేదు. నన్నాశ్రయించితివి కాన వానికి నాశోపాయము తెల్పెదను, శ్రద్ధగా వినుము. ఇష్టములు నెరవేర్చగల తీర్థత్రయమిందు గలవు. భక్తితో ఈ యమునా గంగా గయాతీర్థములలో స్నానమాచరించుము. దాన సర్వప్రారబ్ధములు నశించును'. వెంటనే రాజు మూడుతీర్థములలో స్నానముచేయ నిర్మల మనస్కుడయ్యెను. తిరిగివచ్చి మునిముందు నిలచి ప్రాంజలికాగా, ముని రాజునకు దుర్లభమయిన బ్రహ్మజ్ఞాన ముపదేశించెను. మాయావరణము తొలగిపోవ, రాజు కేవలము బ్రహ్మభావమునందెను.

*

# బ్రహ్మ ఖండము

## 27-వ అధ్యాయము

అనంతరము సేవించవలసినది కోటితీర్థము. సర్వసంపత్కరము, సర్వపాప ప్రశమనము. ఇట స్నానకర్మ విఘ్నముల దూరీకరించి శాంతిని సమకూర్చును. లీలగా ఈ తీర్థరాజమును శ్రీరామచంద్రులు విల్లుయొక్క కోటిశూలమువంటి కొనతో నేర్పరచెను. రాముడు రావణ వధానంతరము బ్రహ్మహత్యాపాతక వినాశమున కొక లింగమును ప్రతిష్ఠించి దానిసమీపమున వింటికోటితో ఈ కోటి తీర్థమును లోకానుగ్రహము కోర్కి నిర్మించెను. దీనికి కారణము తాను స్థాపించిన లింగమున కభిషేకార్థము సమీపమున వెదకినను శుద్ధమయిన జలములు లేకపోవుటచే, వింటికోటిచే భూమిలో రంధ్రము చేసి మనసా గంగనాహ్వానించెను. రాముడొనరించిన వివరము నుండి పాతాళ గంగ పైకుబికిరాగా ఆ జలములచే నా లింగమునకు అభిషేకముచేసెను. గంధమాదనమునగల ఇతర తీర్థముల స్నానము వలన పోక శేషించిన పాపము సమూలముగ కోటితీర్థస్నానమున శమించును. ముందుగనే భక్తి తత్పరత కోటితీర్థములో స్నానమాచరించి తీరమున లింగము నభిషేకించి అర్చించిన సర్వపాప ప్రశమనమగుటచే అనంతరము ఇతర తీర్థసేవన మవసరములేదు. ఈ మాటలు విని ఋషుల ప్రశ్న: అట్లయిన ఆ యా తీర్థముల వివరణము, ఫలశ్రుతులు వ్యర్థములేగదా అన సూతుని సమాధానము-శాస్త్రవిధి ఇది కదా. యాత్రకేగునపుడు మార్గముననున్న తీర్థమును ఆలయములను సేవించకున్న మర్యాదాతిక్రమణ దోషము సంభవించును. ఈ అర్థము నారదునితో శంకరులు తెల్పిరి. తీర్థాతిక్రమణ దోషము సంభవించకుండ ఆ విధముగ తీర్థములన్నియును సేవించదగినవే. కోటితీర్థమున స్నానముచేసి పాపములు పోనాడి క్షణముకూడ గంధమాదన

మున నుండరాదు. శ్రీరాముడుకూడ కోటితీర్థమున స్నాన మాచరించి రామలింగేశ్వరు నర్చించి తక్షణమే సీతాలక్ష్మణులతో కపివీరులతో విభీషణునితో పుష్పకవిమాన మధిరోహించి ముందుకు సాగిపోయెను.

ఋషుల ప్రశ్న :— శ్రీకృష్ణుడు మేనమామ కంసుని వధించి దోషపరిహారమునకై కోటితీర్థస్నానము చేసెనని వింటిమి. కంసుని కృష్ణుడు చంపుటకు హేతువు తెలుపుమన సూతుడనుచున్నాడు:

యదుకులమున శూరపుత్రుడు వసుదేవుడు కలడు. ఆతడు దేవకుడనువాని తనయ దేవకిని వివాహమయి రథారూఢుడై తన పురమున కేగ పయనించెను. కంసునికి దేవకి చెలియలు కాగా తాను సూతుడై రథము తోలసాగెను. 'ఉత్సాహమున చెలియలి రథసారథి వయితివి. ఈమె అష్టమగర్భము నిన్ను చంపు'నని అశరీరవాణి పలికెను. వెంటనే కంసుడు ఖడ్గమెత్తి చెలియలిని చంప నుద్యుక్తుడు కాగా, ఆతనిని శాంతిపజేయుచు మంచిమాటలతో వసుదేవుడిట్లను చున్నాడు. 'ఆమెను భయపెట్టవలదు. పుట్టినసుతులను పుట్టినట్లే నీకొప్పింతునని' తెల్ప వారిని తిరిగి తననగరమునకే కొనిపోయి వారిరువురిని సంకెళ్లువైచి కారాగారమున బడవైచెను. క్రమముగా దేవకి ఆరుగురు సుతులను కన్నది. వసుదేవుడా తనయులను కంసున కీయ వారలను వధించుచు వచ్చెను. సప్తమగర్భముగ ఆదిశేషువు ప్రవేశించెను. కాని గర్భస్రావమయినదని లోకవార్త. ఇది విష్ణు మాయాకృతము. అనంతరము అష్టమగర్భముగ విష్ణువు ప్రవేశించెను. పదిమాసములునిండిన అనంతరము, నాలుగు భుజముల శంఖచక్ర గదా ఖడ్గములు ధరించి, కిరీటముతో, హరి వసుదేవునికి కారా గారముననే దర్శనమీయ, వసుదేవుడు హరిని స్తుతించెను. "నమో నమః కృత్రిమమానుషాయ! విరాట్ స్వరాట్ సామ్రాట్టువు నీవే. విశ్వము విశ్వపతివి నీవే." అని స్తోత్రముచేయ 'కంసుని వధింతును.

నీవు భయపడవలదు. నందగోపునిభార్య యశోదకుమార్తెను కనును. సర్వలోక విమోహనమయిన నా మాయాబలమున నీవు నన్ను ముందు రోజుననే కొనిపోయి నన్నా యశోద శయనమున నుంచి ఆమె తనయను తీసికొనివచ్చి దేవకిశయ్య్యే చేర్చుము'. ఆవిధముగనే వసుదేవుడొనరించెను. మాయాశిశువు దేవకి శయనమున ఏడువ సాగెను. రోదనమువిని నిదురలేక పొరలుచున్న కంసుడు కారాగారమునకు పర్విడిపోయి బాలను దేవకి హస్తములనుండి బలాత్కారముగ లాగివేసి ప్రక్కనున్న శిలమీదవైచి కొట్టెను. తక్షణ మామాయాశిశువు సాయుధము అష్టభుజములదేవియై అంతరిక్షమున నిలచి, "నీకుమృత్యువు బాలకుడు ఇంకొకతావున పెరుగుచున్నాడు. నిన్ను వెదకుకొని వచ్చి చంపునులే" అని అంతర్ధాన మందెను. వెంటనే బాలగ్రహాదులను పూతనాది శిశుహంతలను దేశమంతటా వెదకి శిశువులను చంప పంపించెను. కంసునిపంపున పోయిన వారెల్లరు నందగోపకులమునకేగి బాలకృష్ణునిచే నిహతులయిరి.

క్రమముగా రామకృష్ణులు గోకులమున పెరుగుచుండిరి. శైశవక్రీడలు, కౌమారము వెళ్లించిరి. కంసుడు రామకృష్ణులను తీసికొనిరమ్మని అక్రూరుని గోకులమునకు పంపించెను. పూర్వమే నియమించిన ప్రదేశమున వారలను విడచి అక్రూరుడు కంసునికని బాలురను తెచ్చితినని విన్నవించెను. మరునాడు ఉదయమే రామకృష్ణులు ప్రాకారముదాటి పురద్వారమున మధురానగరము ప్రవేశించిరి. పోవుచునే ఆయుధశాల ప్రవేశించి వారించు వారిని భంగపఱచి ఒక మహాధనువెత్తి బాణము సంధించి వంచ నది పెద్దఘోష పెట్టుచు విరిగెను. వీరిని హింసించవచ్చిన ఆయుధశాలా రక్షకులను విరిగిన విల్లు ఖండములతో మోది రామకృష్ణులు చంపివేసిరి. ద్వారమునకు సమీపముననున్న కువలయా పీడమను మహాగజమును చంపివేసిరి. దాని దంతములు రెండునులాగి చెరియొకటియు కర

ముల ధరించిరి. ఆ గజ దంతముల మూపుల ధరించి మల్లభూమి చేరిరి. చాణూర ముష్టికులను మహామల్లులతో పోరి వారిని యమాలయమునకు పంపిరి. రంగమున ఎత్తైన ఆసనముననున్న కంసుని చూచి కృష్ణుడు కంసుని క్రిందకు లాగి రంగభూమిపై బడవైచెను. రెండుకాళ్లుపట్టి గిరగిర త్రిప్పి నేలనవైవ రక్తము క్రక్కుచు కంసుడు మరణించెను. బలరాముడు కంసుని ఎనమండుగురు సోదరులను ముష్టిఘాతముల చంపివైచెను. కృష్ణ, బలరాములు చెరనున్న తలిదండ్రులకు నమస్కరించుచు వారల శృంఖలలు విడిపించి ఆనందమున మునిచిరి. కృష్ణుడు పూర్వము బంధీకృతుడయి కంసునిచే బాధలందిన ఉగ్రసేనుని, అటనున్న వృద్ధుల బంధువుల రావించి ఆతనిని రాజ్యమున కభిషేకించెను. తరువాత దేవకీవసుదేవుల నట నేయుంచి రామకృష్ణులు, గోకులమున నందయశోదలకు మనశ్శాంతికై కొలది కాలమటయుండి మధురకే తిరిగిపోయిరి.

ఒకనాడు నారదాది మునులను స్మరించి వారురాగా శ్రీకృష్ణుడు (ప్రాయశ్చిత్తమునుగూర్చి) వారల ప్రశ్నించెను. నారదుని సమాధానము "నిత్యశుద్ధుడవు ముక్తుడవు, పరమాత్మవు, సనాతనుడవు, సచ్చిదానందరూపుడవు. యాదవనందనా! నీకు పుణ్యాపాపముల స్పర్శ యుండదు. అయినను లోకులకు తెలియుటకై ప్రాయశ్చిత్తము కోరుట యుక్తమే. తెల్పెదవినుము. గంధమాదనము, రామసేతువున, రామనాథలింగము రామునిచే స్థాపితమయినది కలదు. అతడు ధనుష్కోటితో ఆలింగము నభిషేకించు నిమిత్తము కోటితీర్థమును నిర్మించెను. అట స్నానముచేయుము, పాపము నశించును. మాతుల వధా దోషము తొలగును." ఋషులనెల్లరను పూజించి సత్కరించి పంపివైచి, వెంటనే కృష్ణుడు కొలది దినములలో ధనుష్కోటికేగి విధిపూర్వకము సంకల్పయుతము కోటితీర్థమున స్నానముచేసెను. అనేకదానములు చేసెను. రామనాథునర్చించి స్వపురము, మధురకు తిరిగిపోయెను.

*

# బ్రహ్మ ఖండము

## 28-వ అధ్యాయము

అనంతరము జితేంద్రియు నియమియు నయి సాధ్యామృత తీర్థమునకు పోవలయును. ఆ తీర్థ జలస్పర్శ అయిన క్షణమున దేహ గత పాపము నశించును. కర్మబంధమున జన్మాది మధ్యవయసు వఱకు చేసిన జ్ఞానాజ్ఞాన కృతపాప సంఘము, పూర్వవయసున ఈ తీర్థ స్నానమున నశించి అంతమున నాతడు విష్ణుసాయుజ్యము ప్రాపించును. ఈ తీర్థ వాసము ఎన్ని దినములు చేసిన అన్ని వత్సరములు శివలోకమున సుఖులయి యుందురు. తమస్సును విదళించి సూర్యుడుదయమున నెటుల ప్రకాశించునో ఆ విధమున ఈ తీర్థస్నానమున పాపములు తొలగి నరుడావిధమున కీర్తితో ప్రకాశించును. కామ్యములన్నియును పొందును.

పూర్వము నరపతి పురూరవుడు తుంబురు శాపమువలన తనకు సంభవించిన ఊర్వశి సంబంధి విప్రయోగమును తొలగించుకొనెను. ఆగాథ సూతుడిటుల వివరించెను:

ఇంద్రతుల్య పరాక్రముడు పురూరవుడను రాజుకలడు. ధర్మ తత్పరుడయి ప్రజాపాలనము చేయుచుండి, దేవతలను ద్విజులను అనేకయజ్ఞములుచేసి దానములిచ్చి తృప్తిపఱచు చుండెను. ఆ కాలమున మిత్రావరుణుల శాపమున ఊర్వశి భూలోకమునకు వచ్చెను. స్వర్గమునుండి పతనమయ్యెననుట. ఆమె పురూరవుని పురాంతికమున విహరించ సాగెను. ఉపవనమున వీణవాయించుకొనుచు గానము చేయసాగెను. రాజు ఉపవనమున విహరించవచ్చి ఊర్వశిని చూచి ఆమె తనకు భార్యఅయిన మంచిదనుకొనెను. ఆమెయు కామాతురయయి ఆ రాజుకోరిక నంగీకరించుచు ఒక సమయము

అంగీకరింప చేసెను, తనకు రెండు మేకపిల్లలు కలవనియు, వానిని సుతనిర్విశేషముగ రక్షించవలయుననియు, ఎన్నడును నగ్నముగ తన కారాజు కనపడరాదనియు, తాను ఉచ్ఛిష్టము భుజించుననియు అట్లయిన రాజు నంతిపురినుందు ననెను. నెయ్యిమాత్ర మాహార ముగా నుందునన రాజు అందుల కంగీకరించెను. ఈ నియమము సడలిన తాను రాజును విడచి పోదుననెను. రాజుతో అంతిపురి చేరెను. అలకాతీరమున, సరస్వతీ సరిదంతికమున చిరమామెతో విహరించుచు క్రీడించుచుండెను. ఈ తీరున అరువదియొక్క సంవత్సర ములు గడచిపోయినవి. ఊర్వశి దేవలోకమే మరచిపోయినది. ఊర్వశి రాజునందలి యనురాగమున, రాజు తనవద్దలేక స్వర్గము తనకు ప్రియము కాలేదు. దేవతలు ఇంద్రుని పంపున ఊర్వశిని నాక మునకు తేదలంచిరి. ఆమెలేక సురలకు స్వర్గము రాణించుటలేదు విశ్వావసువు కొందరు గంధర్వులతో భూలోకమున రాజు నగరు చేరెను. రాజుతో ఊర్వశి గావించిన సమయము వారికి తెలియును. వారు మధ్యరాత్రి శయనాగారముననున్న రెండు మేకపిల్లలను హరించిరి. శయనమున ఆమెతో నగ్నముగనున్న రాజుతో, ఎవడో నా మేకపిల్ల నొకదానిని హరించికొను పోవుచున్నాడు రక్షించు మని ఊర్వశి శరణన్నను నగ్నభయమున రాజు శయనము నుండి లేవలేదు. ఇంతలో రెండవదానినికూడ మరియొక గంధ ర్వుడు కొనిపోయెను. రెండవదానినికూడ ఎవడో చోరుడు హరించి కొని పోవుచున్నాడు రక్షించుము రక్షించుముదేవా అని దేవి ఆక్రో శించ, అంతయు చీకటిగనున్నది కదాయని రాజు ఖడ్గపాణియయి, దుష్టుడా ఆగు మాగుమని పర్విడ, గంధర్వులు మెరుపులు గావించ, ఆ వెలుగులో దేవి విగతాంబరుడయిన రాజును కాంచెను. సమ యము సడలినదని ఊర్వశి అంతిపురి విడచియేగెను. గంధర్వులును మేకపిల్లలను విడిచి అదృశ్యులయిరి. రాజు సంతోషమున మేక

పిల్లలతో శయనాగారమునకు రా నట ఊర్వశి కానరా లేదు. ఉన్మత్తుడయి, వివస్త్రమునసే ఆమెను వెదుకసాగెను. దేశములు తిరుగుచు కురుక్షేత్రమునకేగి ఒక పద్మసరోవరమును కని నలువురు అప్సరసలతో క్రీడించు ఊర్వశిని చూచెను. "నన్ను విడిచిపోయితివా" అన "రాజా ఇంతకు చాలించవలెను. నీ వీర్యము నా గర్భమున పెరుగుచున్నది. మహావీరుడు కుమారుడున్నాడు. సంవత్సరమునకు తిరిగి ఈ సరోవరమునకు రమ్ము. అప్పుడు నీతో ఒకరాత్రి విహరింతును." ఇట్లూర్వశి వచనములు విని రాజు సంతసించి తనపురమునకు తిరిగి యేగెను. ఆ సఖులతో ఆరాజు సంగతి తెల్పి తానారాజుతోనే చిరముంటినన, మేమయితే ఎప్పటికిని రాజునంతిపురి నుండెడివారమనిరి. సంవత్సరాంతమున రాజా సరోవరమునకు రాగా కన్న కుమారుని ఆయువును ఇచ్చి అనురాగమున ఒకరాత్రి రాజుతో విలాసముగ గడపెను. వెడలిపోవుచు గంధర్వులు వత్తురు వారు నీ కోరిన వరమిత్తురనుచు, ఇపుడు నా గర్భమున అయిదుగురు పుత్రులున్నారు. కాలాంతరమున వారు నిన్ను చేరుకొందురని తెల్పి పోవ నాతడు విచారమున ఊర్వశిలేని స్థితి అసహ్యామనుకొనుచుండ గంధర్వులు వచ్చిరి. వారువరము కోరుమన ఊర్వశియున్న లోకమున నామెతో తానుండుటయే వరమన వారు అగ్నిస్థాలినొకటిచ్చి వేదానుసారముగ దీనిని మూడుభాగములుచేసి యజ్ఞముచేయుము' ఊర్వశియున్న లోకము ప్రాపింతువని స్థాలినిచ్చి వారేగ, రాజు ఊర్వశిలేనిది తనకీలోకమున పనియేమని స్థాలినొకవనమునునుంచి పురికేగెను. రాత్రి నిదురించ, విశ్రాంతి లేకపోయినది. వెంటనే వనమునకేగి స్థాలిని వెదుక ఆస్థానమున శమీగర్భమున అశ్వత్థముతో నున్న ఆ ప్రదేశమునుచూచి, (ఇది వహ్ని రూపము) దీనినే కొనిపోయి అరణిచేసెను. చేయుచు గాయత్రి జపించెను. ఆ అరణినుండి అగ్నిత్రయము ఉత్పాదనచేసి, కోరినకోరిక ప్రాప్తించు నుద్దేశమున, ఆ

అగ్నితో అనేక యజ్ఞములు చేసెను. దానివలన గంధర్వలోకము ప్రాపించెను. ఊర్వశితో, ఆ గంధర్వలోకమున, చిరకాలము రాజు క్రీడించెను. ఒకమారు ఇంద్రసభలో సురాంగనల నృత్యము తిలకించెను. ఒక్కొక్కరుగా నృత్యముచేసి యేగ ఊర్వశియు నృత్యము చేసి తన సామర్థ్యమునకు తానే హసించ రాజుకూడ హాసముఖుడయ్యెను. నృత్యమధ్యమున ఊర్వశి చేష్టకు నాట్యాచార్యుడు తుంబురుడు కోపించి వారిరువురిని

ఈ మీ అకార్యమునకు, మీకు తత్ క్షణమే వియోగము కలుగుగాత యని దివ్యాత్మలెల్లరును విన శపించెను. రాజు ఇంద్రుని శరణందెను. "ఆమెతో నుండుటను కోరి యజ్ఞములు చేసితిని. వియోగము సహించలేను." అన, ఇంద్రుని ప్రతివచనము:—"భయపడవలదు. రాజా, నీకు శాపాంతము తెల్పెదను వినుము. గంధమాదనమున దక్షిణసముద్ర తీరమున సాధ్యామృతమను తీర్థమున్నది. దివ్యాత్మలెల్లరు ఆ తీర్థమును సేవించుచుందురు. సనాకాది దివ్యర్షులును ఆ తీర్థ సేవనమున సంతసింతురు. అది ముక్తి భుక్తిప్రదము, సర్వశాప విమోక్షణసామర్థ్యముకలదియును. అటకేగి స్నానముచేయుము. ఊర్వశితో పునస్సమాగమము కాగలదు. అనంతరము నా లోకమున వసించ నేర్తువు." వెంటనే రాజు సాధ్యామృత తీర్థమునకేగి స్నానముచేసిన వెంటనే శాపముపశమించెను. విమానస్థురాలయి ఊర్వశివచ్చి ఆతనితో విమానముననే నాకమున కేగెను. నిష్కాములు మానవులా తీర్థమును సేవించిన మోక్షము ప్రాపింతురు. పూర్వమీ చరిత సనకాదులకు, చతురాననుడు తెల్పినదే మీకిపుడు వివరించితినని సూతుడు విరమించెను.

## 29-వ అధ్యాయము

అనంతరము సర్వతీర్థమును సేవించవలెను. ఆ తీర్థస్నానము చేసిన క్షణముననే సర్వపాప ప్రణాశనమగును. అంతవఱకు శరీర మునంటియున్న పాపపూరుషుడు తొలగిపోడు. దూరము నుండియే తీర్థమును చూచిన లోనున్న పాపములు తమకు సర్వనాశన మగునని భయపడి వణకిపోసాగునట. దేవతాగారముల పూజలు, వేదపారాయణములు, యజ్ఞయాగాది కర్మలు, పలుదానములు, మంత్రపునశ్చరణలు - ఇత్యాదికములవలన లభించు ఫలములన్నియును ఈ సర్వతీర్థ స్నానముననే అలవడును. ఈ తీర్థమునకు ఈ పేరు ఈ ఖ్యాతి కల్గుటకు గాథ—పూర్వము సుచరితుడను ముని నియమవ్రతుడు, భృగువంశమున పుట్టినవాడు, పుట్టుకతోనే గ్రుడ్డివాడు, వార్ధక్య దుఃఖితుడు, తీర్థయాత్రలు చేయజాలనివాడు కాన, సర్వతీర్థముల స్నానముచేయు తలంపూని జనులసహాయమున, దక్షిణసముద్రతీరమున, గంధమాదనమున కేగి తీవ్ర నియమము పాటించి శంకరునిగూర్చి తపముజేసెను. త్రికాలములయందు శంకరు నర్చించుచు, ఉపవాసదీక్ష చేపట్టి, జితేంద్రియుడై, ఆయా ఋతువుల సహించరాని, శీతవాతాతపములు సహించుచు, జీర్ణ పర్ణములు, జలము, వాయువు భక్షణముగ, భస్మధారి, రుద్రాక్ష మాలికాలంకృతుడుగా, పదిసంవత్సరములు ఉగ్ర తపమొనరించెను. చంద్రశేఖరుడు - శంకరుడాతని తపమునకు సంతసించి సుచరితునకు దర్శనమిచ్చెను. వృషభము నధిరోహించి, భూత సంఘ పరివృతుడై, సగముదేహమున గిరిజతో, శూలపాణి, నాగభూషణుడునై రాగా పుట్టంధువయ్యు శంకరు ననుగ్రహమున కనులురాగా దైవమునుదర్శించి ఇటుల నుతించెను. "జయదేవ, మహేశాన, జయశంకర, ధూర్జటే!

జయఉమేశ, మహాదేవ, కామాంతక, త్రియంబక నమస్తుభ్యం భక్త రక్షణ దీక్షిత. వ్యోమకేశ నమస్తుభ్యం, త్రాహిమాం'' అని ప్రార్థించ వరము వేడుకొనుమని శివుడానతీయ, సర్వతీర్థములకేగి సేవించ జాలను, జర ఆక్రమించినది. కాన ఆ వాంఛ తీరు ఉపాయము కల్పిం చుమని ప్రార్థించెను. మునిప్రీతికై శంకరులు సర్వతీర్థములను ఆ ప్రదేశమునకే ఆవాహనముచేసి 'మునివర్యా నీకయి సర్వ తీర్థములిందే సన్నిధివహించినవి. సర్వతీర్థమని ఖ్యాతివహించు ఇందు స్నానముచేయుము. నీకే కాదు ఇందు ఇకమీద ఎవ్వరు స్నానము చేసినను సర్వతీర్థములు సేవించిన ఫలమందుదురు. మనసా నేను తీర్థములనన్నింటిని ఆకర్షించితిని గనుక మానస తీర్థమనియును ఖ్యాతిగాంచును. వేదాంత విజ్ఞానము వినా ఈ తీర్థస్నానము సద్యో ముక్తిప్రద''మని వరమిచ్చెను. వెంటనే ముని పార్వతీ పరమేశ్వరుల సన్నిధినే ఆ తీర్థమున స్నానమాచరించెను. వెంటనే ముని తరుణుడు సుందరుడుగా రూపించెను. శంకరులా సుచరితునితో నిట్లనెను.

''సదానన్ను స్మరించుచు ఈ తీర్థమును సేవించుచుండుము. ఇతరతీర్థముల కన్యప్రదేశములకు నీవు పోవలదు. కాలాంతరమున శరీరము పతనముకా నా పదము ప్రాపింతువు. ఇట స్నానముచేసిన నరులెల్లరు నీవలెనే నా పదము నందుదురు''. అని శూలి అంతర్హితు డయ్యెను. చిరము ముని అందేయుండి దేహాంతమున బంధవిముక్తి కని శంకరు పాలికేగెను.

★

# బ్రహ్మ ఖండము

## 30-వ అధ్యాయము

అనంతరము బ్రహ్మహత్యాది పంచమహాపాతకములను నశింప చేయు ధనుష్కోటి సేవించుకోవలెను. స్మరణమాత్రమున మానవులు ముక్తికాంతురు. ఇరువది ఎనిమిది విధములయిన నరకములు వీరిని అంటవు. ధనుష్కోటి తీర్థస్నానమున ఎటువంటి ఘోరపాప మయినను శమించును. ఆచారహీనుడు, దుష్టుడు హింసాపరుడయినను పూతుడయి పుణ్యగతి కాంచును. ఇందు స్నానమాచరించినవానికి పాపమున బుద్ధితగులదు. సర్వభూతదయ ఏర్పడును. సమస్త దానములు చేసిన పుణ్యఫలములన్నియును ధనుష్కోటిని స్నానముచేసిన ప్రాపించును. ఇందుస్నానము చేసిన పుణ్యునికి ప్రజ్ఞా, లక్ష్మి, కీర్తి ధర్మము, విరక్తి ఇత్యాది సద్గుణములలవడి బంధముక్తిగాంచి అంతమున కైవల్యము ప్రాపించును. పంచమహాపాపములాచరించినవాడు ఆతని సంసర్గమునందినవాడు, వీరుభయులు నిందుస్నానముచేసి పవిత్రులగుదురని, నాలుకచివర కాల్చిన ఇనుప శూలమును ధరించి చెప్పగలను. నిస్సంశయము. ఈ వచనములు అర్థవాదములుకావు. ధనుష్కోటి తీర్థస్నానము అద్వైతజ్ఞానమును కూర్చును. భుక్తి ముక్తులిచ్చును. ఆ శుచిమంతుడు తిరిగి తల్లిపాలు త్రాగడు అవగా పునర్జన్మ కాంచడనుట. ఆ పేరా తీర్థమునకు వచ్చిన విధానమిది. రామచంద్రుడు రావణుని వధించి సీతాలక్ష్మణునితో, వానరులతో, విభీషణునితో, తిరిగి సేతుమార్గముననే దక్షిణతీరమునకురాగా, విభీషణుడు రామచంద్రునిట్లు ప్రార్థించెను. "రామా" నీకార్యము సఫలమయినది. సేతువు నిల్లేయుంచిపోయిన నరులు దుష్టులనేకులు మమ్ము బాధించవచ్చును. అందువలన సేతువును ఖండించివేయుము. ఆ విధముగ మాకభయము చేకూర్చుడన, రామచంద్రుడు ధనువు

కోటితో సేతువును ఖండించివేయ, లంకకు మార్గము లేకపోయినది. ఆ కోదండపు వ్రేటులున్న తావులు, ఆ వ్రయ్యల రేఖలు కాంచిననే పాపములు పోవును. గర్భవాస దుఃఖముండదు. రేఖాదర్శనముననే ముక్తి అలవడునన, స్నానఫల మెంతయని తెలుపుదును అని సూతుని వివరణము. ధనుష్కోటి రేఖలు దర్శించిననే, హృదయ గ్రంథులు విడిపోవును. సర్వసంశయములు తొలగును. (సంశయములు తొలగు ననుటకు కారణము "సంశయాత్మా వినశ్యతి" అని యున్నదిగదా) విభీషణుని హితముకొఱకు సేతువును ఖండించిన రేఖలు దర్శించిన వైకుంఠము, కైలాసము, ఇత్యాది దివ్యలోకములకు సులభమార్గ మేర్పడును. ముక్కోటి దేవతలందే యుందురు. స్త్రీలుగాని, పురుషులుగాని, పుట్టినది మొదలు చేసిన పాపకార్యములు, ధనుష్కోటి మాఘమాసమున స్నానము, తొలగించును. ముప్పది దినములీ తీర్థమున వాసముండి నియమియయి నిత్యము స్నాన సంధ్యాద్యనుష్ఠానములు కావించిన ఆతనికి తీరనికాంక్షలుండవు. సర్వకామ్యద మనుట. అందువలన నరులు ప్రయత్నించి ధనుష్కోటిన మాఘమాసమున స్నానము చేయుట భుక్తి ముక్తిప్రదము. ముఖ్యముగా శివరాత్రి నియమము లనుసరించ హరపదప్రాప్తి. తీర్థమున పిండప్రదానము ఋణవిముక్తికి హేతువగును. నిదురించు శిశువులను చంపిన పాపమును అశ్వత్థామ ఈ తీర్థస్నానమున పోగొట్టుకొనెను.

# బ్రహ్మ ఖండము

## 31-వ అధ్యాయము

ఆ వివరము సూతుడు తెల్పుచున్నాడు: రాజ్యమునకై కురు పాండవులు కురుక్షేత్రమున పదునెనిమిది దినములు రణమొనరించ తుదకు దుర్యోధనుడు భీముని గదా ఘాతమున తొడలువిరిగి నేల పడియుండెను. సాయంత్రము కాగా సర్వులు తమ తమ శిబిరముల కేగిరి. పార్థుడు, కృష్ణుడు, సాత్యకియు వెంటరా నిర్జనమయిన దుర్యోధను శిబిరము ప్రవేశించిరి. వీరలనుగాంచి కురురాజు అంతః పురవాసు లెల్లరు నమస్కరించ, అందలి ధనములాహరించి శిబిరము ననేయుంచి మంగళార్థమునకని బయటనేయుండవలెనని కృష్ణుడన పాండవుల శిబిరములకు బయలి ప్రదేశముననేయుండిరి. నదీతీరమున ఆ రాత్రి వెళ్ళించిరి. కృతవర్మ, కృప, అశ్వత్థామలు సాయంసమయ మునకు రారాజును సమీపించిరి. తొడలువిరిగి, రక్తసిక్తమయిన అంగములతో భూమిని దొరలాడుచున్న రారాజును, వారుచూచి కనుల నీరుగార్చిరి. దుర్మార్గులు ఛలమున నా జనకుని చంపిన విచా రించలేదు. భీమునిచే నిట్లయిన నిన్నుచూచి దుఃఖింతును. అని అతి కోపమున అశ్వత్థామ రారాజున కిట్లనెను. "నీవానతి యిమ్ము. ఈ రాత్రి పాండవులను చంపివేయుదును. కృష్ణుడు చూచుచుండ గనే ఇట్లొనరింతును. నాకనుమతి యిచ్చి పంపు "మన అట్లే కాని మ్మని రారాజు తెలిపి, కృపుని పిలిచి కలశముతో ఉదకము తెమ్మని ఆనాటికి అశ్వత్థామను సేనాపతిగా అభిషేకము చేయించెను. రారాజును ద్రౌణి ఆలింగన మొనరించుకొనెను. కృప కృతవర్మలు వెంటరా దక్షిణ దిశగా పయనించి సూర్యాస్తమయ సమయమున శిబర సమీపమున కాముప్పు రేగిరి. ఆ సమీపమున అర్జునుని భీషణ వాక్యము లాలించి భయమున కొంతదూరము వెనుకకు పారి

పోయిరి. నదీతీరము చేరుకొని రథములు దిగి సాంధ్యకృత్యములు తీర్చుకొనిరి. సూర్యుడస్తమించి చీకటులు సర్వత్ర అలముకొన్నవి. ముప్పురును దుఃఖించుచు సమీపముననున్న అశ్వత్థవృక్షముక్రింద కూర్చుండిరి. శ్రమపడినవారగుట కృపకృతవర్మలు నిద్రకు వశు లయిరి. కలుషితమయిన మనసుచేత ద్రౌణికి నిదురరాలేదు. చుట్టు నున్న భయంకరమయిన అరణ్యమును తిలకించసాగెను. అనేకములు కాకులతో కూడిన రావిచెట్టును చూచెను. కాకులన్నియును శాఖ లలో తమతమ గూండ్లలో నిదురపోయినవి. ఒకగుడ్లగూబ ఘోర ముగ శబ్దముచేయు శాఖలమీద వ్రాలి క్షణములో ఒక్కటొక్కటిగా కాకులను చంపివేసెను. రాత్రి అవశములయియున్న పలు కాకు లను ఒక్కగూబ ఈ విధముగ చంపుటచూచి శత్రువులను తానుకూడ ఆ విధముగ చంపదలంచెను. ఋజుమార్గమున శత్రువులను తాకిన నాకే చావుతప్పదు. ఛిద్రములు వెదకి రేయి సమయమలవడ బలవంతు లయిన రిపులను చంపవలెనని శాస్త్రమనుచున్నది. ఈ నిశ్చయము నకు వచ్చి కృప కృతవర్మలను లేపి నిదురించు శత్రువులను చంపు దము పదుడన కృపాచార్యులు నిదురించువారిని చంపరాదనెను. తనయముపోయి ధృతరాష్ట్రుని, పతివ్రత గాంధారిని, ధర్మాత్ముడు విదురుని కలసి కర్తవ్యమాలోచింత మనెను. అశ్వత్థామ వినలేదు. తన తండ్రిని అన్యాయముగ ధృష్టద్యుమ్నుడు శిరము ఖండిం చెను. భీష్ముడు శిఖండివలన అస్త్రసన్యాస మొనరించెను. వీరి నిరు వురను పాండవులు ఈ ధర్మయుద్ధమున జయించలేదు. ఆ విధముగనే నేనీరేయి వారలను వధింతుననెను. వెంటనే తురగమెక్కి శిబిరము వైపునకు పోగా చేయునదిలేక కృప కృతవర్మ లాతని వెంటనేగిరి. అశ్వత్థామ శిబిరద్వారమునకేగి రథముదిగి నిలబడి మహాదేవుని మనసా ఆరాధించెను. భక్తసులభుడు మహాదేవుడొక ఖడ్గమాతని కిచ్చెను. ద్వారమున కృప కృత వర్మలను నిలిపి, ఖడ్గము చేబూని

రేయి శిబిరమున తిరుగసాగెను. నెమ్మదిగా ధృష్టద్యుమ్నుని శిబిరము చేరెను. అటనందరును రణపరిశ్రాంతులయి నిదురలోనుండిరి. నిదురనున్న ధృష్టద్యుమ్నునిచేరి ఒకపాదమున తాడించ, అతడు లేవబోవ కేశాకర్షణమున క్రిందపడవైచి, బొమ్ముత్రొక్కి వింటి నారిచే కంఠము బిగించి కోసి చంపివేసి, అతని సైన్యమునంతను ఆ విధముగనే యముపాలి కంపెను. అటనున్న ఉపపాండవులను, శిఖండిని ఇతరులను ఖడ్గమునకు బలియిచ్చెను. పారిపోయి ద్వారమునకువచ్చిన ప్రతివానిని కృప కృతవర్మలు చంపివేసిరి. వెంటనే పార్థు భయమున ముగ్గురు మూడు దిశలకు పారిపోసాగిరి. అశ్వత్థామ రేవా నదీతీరమును చేరెను. అట అనేకులు ఋషులు వేదవిదులు పుణ్యకథా కథనమున ఆనందించుచుండిరి. ఈతడట కేగిన క్షణముననే వారు దివ్యజ్ఞానమున అశ్వత్థామ దుశ్చరితమును తెలిసికొని ఇట్లనిరి. "పాపివి, నిదురలోనున్న వారిని చంపితివి. నీతోడి సంసర్గమున మాకు పాపమంటును. మా ఆశ్రమమును వీడిపొమ్ము" అన వెనుదిరిగిపోవ పోయినచోట్ల ఎల్లరు అదే విధమున తన్ను నిందించసాగిరి. ప్రాయశ్చిత్తము తెలియగోరి, లజ్జించి తుదకు బదరి చేరెను. వ్యాసుని శరణందెను. కాని వ్యాసులు ఆతనిని తన ఆశ్రమమును విడచి పొమ్మనెను. ద్రౌణి అనుచున్నాడు. "భగవన్! సర్వులు నిందించినట్లు మీరును నిందించిన నేనెవరిని శరణందవలెను. కరుణయుంచి, పాపము శాంతించు ప్రాయశ్చిత్తము తెలుప ప్రార్థించెదను." వ్యాసుని సమాధానము "ఈ నీపాపమునకు స్మృతులయందు ప్రాయశ్చిత్త విధి కానరాదు. కాని ఒక ఉపాయమున్నది వినుము. రామసేతువున ధనుష్కోటి తీర్థమున్నది. ఒకనెల నీవట వసించి నిత్యము స్నానము చేయుచు ధ్యానము జపము చేయుము. అనంతరము నిశి జాగరముండి రామనాథేశ్వరుని ముందు ఆనందమున నాట్యము చేయుము." ఆతడట్లు నర్తించుచుండ ముందు మహాదేవుడు ఆవిర్భ

వించెను. ప్రాంజలియయి ఇట్లు నుతించెను. "మృత్యుంజయ, త్రినేత్ర, కృపచే నన్ను రక్షించుము; శూలపాణి, గంగాధర, నీకు నమస్కారము." మహాదేవుని వచనము. "ధనుష్కోటి స్నానమున సుప్త మారణ పాపముపోయినది; వరము కోరుమన"-నీ దర్శనము ననే కృతార్థుడనయితిని. పాపులకు నీ దర్శనము కాదుగదా! నీ పాద పద్మములయందు నిశ్చలమయినభక్తి తనకుండునట్లు వరమీయ వేడు కొనెదననెను. కోరినవరమిచ్చి మహాదేవుడంతర్హితుం డయ్యెను. ఇట్టిది ద్రౌణి విమోచనమని సూతుడు మునులకు వివరించెను.

# బ్రహ్మ ఖండము

## 32-వ అధ్యాయము

ఇంకను ధనుష్కోటి మాహాత్మ్యము సూతుడిటుల శౌనకాది మహర్షులకు తెలుపసాగెను. చంద్రవంశపురాజు నందుడను పేరుగల మహారాజుకలడు. సాగరాంతముగాగల మేదినిని ఆతడు ధర్మతత్పరత పరిపాలన సాగించెను. ఆతనికి ధర్మగుప్తుడను సుతుడుదయించెను. యౌవనము ప్రాపించిన కుమారునిపై రాజ్యభారము మోపి నందుడు తపోవనమున కేగెను. ధర్మగుప్తుడు, తండ్రి వనవాసమున కేగ, నీతిని తప్పక ధర్మమునందే మనసుంచి ప్రజాపాలనము చేయసాగెను. ఇంద్రునితో సర్వదేవతల తృప్తికై అనేక యజ్ఞము లొనరించి బ్రాహ్మణులకు ధనము, సుక్షేత్రములు దానముచేసెను. ఆయన రాజ్యమున సర్వులును స్వధర్మమును తప్పకయుండిరి. ఈతిబాధలు లేవు. ఒకనాడు ధర్మగుప్తుడు వేటతమకమున అశ్వారూఢుడై వనములకేగి క్రూరసత్వములను వేటాడసాగెను. ఇంతలో తెలియకయే రాత్రివడెను. అట సరోవరమొకదానిని కని తత్తీరమున అశ్వము దిగి సాయంసంధ్య నిర్వర్తించి వేదమాత గాయత్రిని జపించెను. రాత్రికాలము కాన అశ్వము నొకచో బంధించి ఒక వృక్ష శాఖపై నెక్కి రాత్రి గడుపదలంచెను. ఇంతలో ఒక భల్లూకమును తరుముచు సింహముురా, భల్లూకము భయమున వృక్షమెక్కెను. ఎక్కినబుక్షము అటనున్న రాజును చూచెను. రాజుతో ఎలుగిట్లనెను. "మహారాజా భయపడవలదు. మనము ఇరువురము రాత్రి ఈ వృక్షమున గడుపగలము. నీవు తొలిభాగము నిదురపొమ్ము నిన్ను నేను కాచి యుందును. అనంతరము నేను నిదురించ నీవు రక్షించగల" వన రాజు ఎలుగును విశ్వసించి త్వరలో నిదురపోయెను. ఇంతలో మహాకాయము సింహము వృక్షము పొంతకేతెంచి ఎలుగునుచూచి "నరు

లను నమ్మరాదు. రాజును క్రిందపడవేయుము. నేనాతనిని తిని నా ఆకలి తీర్చుకొని వెడలిపోయెద" నన ఎలుగు "అది ధర్మముకాదు. విశ్వసించిన రాజును నేను రక్షించవలెను. విశ్వాసఘాతుకునకు, మిత్ర ద్రోహికి లోకమున గతులులేవు. భూమి పర్వతములనంతముల భారము మోయగలదు గాని విశ్వాసఘాతుకుడు, భూమాతకు భారము, సహించరానివాడు" అనునంతలో ధర్మగుప్తుడు మేల్కొన ఆతనిని విశ్వసించి ఎలుగు నిదుర మునింగెను. కాని సహజముగ నిదురించుచునే ఎలుగు వృక్షశాఖను చేతులతో బంధించుకునే నిదురించును. శిరముమాత్రము రాజు తొడమీదనుంచి నిదురించెను." సింహము రాజునకిట్లనెను. "రాజా నేను వెడలిపోయిన అనంతర మీ ఎలుగు నిన్ను చంపి తినును". చపలుడై రాజు ఎలుగును క్రిందకు త్రోయబోవ నది పడలేదు. తాను కామరూపధరుడు, భృగుకుల జాతుడు ధ్యానకాష్ఠుడనని తెల్పుచు ఆ అకార్యమునకు ఉన్మత్తుడై చరించ శాపమిచ్చి సింహముతో నిట్లనెను. "నీవు మహాయక్షుడవు, కుబేరునకు మంత్రివి. ఒకనాడు భార్యతో హిమవంతమున తెలియక గౌతమాశ్రమమున విహరించసాగితివి. నీవు పూర్ణ పాద వివసనుడవై భార్యతో క్రీడించితివి. ఇంతలో తృణకాష్ఠ హరణమునకై గౌతముడటు వచ్చి మిమ్ముకని కోపించి సింహరూపు తాల్చుచు వనముల తిరుగుమని శపించి వెడలిపోయెను. నీపేరు భద్రుడు"-ఈ తనవృత్తాంతము వినుచునే సింహము యక్షరూపమునంది మునికి అంజలించి సీతో సంవాదమున నా శాపము మరలునని గౌతములే తెల్పిరి. అట్లే అయినది అనుచు విమానమురా కుబేరపురి, అలకాపురమున కేగెను. మునియు వెడలిపోయెను. ధర్మగుప్తుడు శాపమున ఉన్మత్త స్థితిలో స్వనగరము చేరెను. మంత్రులు ఆ రాజును రేవా తీరమున తపము చేయుచున్న ఆతనిని జనకుని వద్దకు కొనిపోయిరి. కుమారుని మతి భ్రంశమును ఆతనికి నివేదించిరి. కుమారుని తీసికొని జైమిని మహర్షి కడకేగి తనకుమారుని ఉన్మత్తావస్థ తొలగు ఉపా

యము తెలుప వేడెను. జైమిని కొంత ధ్యాననిమీలిత నయనుడయి విషయము గ్రహించి నందరాజున కిట్లనెను. "ఈతడిట్లగుటకు కారణము ధ్యానకాష్ఠుడను ముని శాపము. దక్షిణాంబుధి తీరమున, గంధమాదనమున ధనుష్కోటి అను తీర్థమున్నది. కుమారుని కొనిపోయి ఆతీర్థమున స్నానము చేయించుము. తత్క్షణమే ఉన్మాదము తొలగు"నన వెంటనే కుమారునితో నటకేగి అతనిని స్నానము చేయించ స్థిమితమలవడెను. భక్తితో తానును తీర్థమున స్నానమాచరించెను. నందుడు తిరిగి తపోవనమునకేగ ధర్మగుప్తుడు రామనాథేశ్వరునకు బహుధనములర్పించి, అట ద్విజులకు విత్తము, క్షేత్రములు దానముచేసి మంత్రులతో తనపురమునకు వెడలిపోయెను. ధర్మ్యముగ రాజ్యపాలనము చేసెను. ఈవిధమయిన శాపాదులు పాపము తొలగించు ధనుష్కోటిని కాదని ఇతర తీర్థసేవనము కాంక్షించువారు, గోక్షీరములను త్రోసివైచి జెముడుపాలు (స్నుహీ ఒక విధమయిన విషఓషధి. కాడలు మాత్రమే ఉండును.) త్రాగినవానిగతి కేగుదురు. ఏ జలాశయ మందయిన స్నానము చేయుచు ముమ్మారు ధనుష్కోటి అని స్మరించిన ఆతీర్థస్నానఫలములందు కొందురు. స్మరించినంతనే బ్రహ్మహత్యాదిపాతకములు నశించును.

*

# బ్రహ్మ ఖండము

## 33-వ అధ్యాయము

ధనుష్కోటి తీర్థ మహాత్మ్యమునకు సంబంధించినదే ఇంకొక గాథను సూతు డిట్లు వివరించెను:

పూర్వము పరావసువు అను బ్రాహ్మణుడు, వేదవేదాంగ వేత్త, తెలియక తండ్రిని చంపి ఆ దోషపరిహారమునకై ధనుష్కోటిని సేవించి పాపవిముక్తుడయ్యెను. ఆ గాథ సూతు డిటుల వివరించెను:

పూర్వము బృహద్ద్యుమ్నుడను చక్రవర్తి యజ్ఞము చేసెను. విద్వాంసుడు, పరమధార్మికుడు, రైభ్యుడు యాజకుడై యజ్ఞము నడిపించెను. ఆయనకు తనయులు ఇరువురు పరావసువు, అర్వావసువు. వారు షడంగములు పఠించినవారు శ్రౌతస్మార్త కర్మల యందు కుశలులు. సాంఖ్య యోగములయందు, పాణినీయవ్యాకరణమున సిద్ధహస్తులు. శ్రుతిస్మృతి పురాణములు వారికి పుక్కిట పట్టినవికాగా సత్రయాగమున సహాయార్థము బృహద్ద్యుమ్నుడు వారిని యాచించెను. రైభ్యననుమతివడసి వారలేగిరి. రైభ్యుడాశ్రమమున పెద్దకోడలితో నుండెను. అన్నదమ్ములు ఇరువురు రాజుచే యజ్ఞకర్మ జరిపించుచుండిరి. ఎందునను స్ఖాలిత్యములేక కర్మ జరిగినది. యజ్ఞముచూడ మునుల ననేకులను రాజు ఆహ్వానించెను. వసిష్ఠ, నారద, మార్కండేయ, పులహ పులస్త్యాదులు వచ్చిరి. వారివెంట వారిశిష్య ప్రశిష్యులును ఏతెంచిరి. రాజు వారల నెల్లరను అర్ఘ్యపాద్యాదులిచ్చి పూజించెను. మిత్ర సామంతరాజ సమూహముకూడ కాన్కలతో వచ్చిరి. నాలుగు వర్ణముల ప్రజానీకమునుకూడ రాజు ఆహ్వానించి గౌరవించెను. ఉచితరీతి నెల్లరను

సత్కరించి అన్నపానీయాది వసతులు కల్పించెను. వస్త్రమాల్యాభరణములిచ్చి ఆదరించి పూజించెను. రైభ్యుని కుమారుల విద్వత్తు, కర్మకుశలతను వసిష్ఠాదులు శ్లాఘించిరి. విధ్యుక్తములు కర్మలు నిర్వర్తించి పరావసువు తృతీయ సవనము పూర్తిచేసి అర్వావసువుని యాగశాలయందే విడచి, గృహకృత్యములు తండ్రికి సమకూర్చ తానాశ్రమమునకేగెను. కనుచీకటి పడుచున్నది. కృష్ణాజినము కప్పుకొని వనమునసంచరించు తండ్రినిచూచి యజ్ఞకార్యమున చాలఅలసి నిదురలేమి కనులు భారములుగా, చీకటిలో తన్ను మృగము చంప వచ్చుచున్నదని తలంచి చేతనున్న ఆయుధముతో ఆ మృగమును - తండ్రిని—చంపెను. సమీపమునకేగిచూడ చనిపోయినవాడు తండ్రియని తెలిసి దుఃఖించెను. పితృకార్యము నిర్వర్తించి తిరిగి యజ్ఞశాలకే పోయెను. అజ్ఞానమున జరిగినదంతయు తమ్మునికి తెల్పెను. అర్వావసువు చిరము దుఃఖించెను. పెద్దవానిమాటలు - నేనీపాపము చేయుటచే బ్రహ్మహత్య సంక్రమించినది. యజ్ఞకర్మలో పాల్గొననాకర్హతలేదు. దీనికి ప్రాయశ్చిత్త మొనరించుకోవలెను. నాకొఱకు నీవు చిన్నవాడవు వ్రతచర్య జరుపవలెను. నేను యజ్ఞకార్యభారము వహించగలను. అన సరేఅని జ్యేష్ఠుని యజ్ఞకార్యము జరుపవిడచి, ప్రాయశ్చిత్త విధికై తాను వెడలిపోయెను. పన్నెండు సంవత్సరములు నియమియయి తీర్థములు సేవించి తిరిగి యాగశాలకువచ్చెను. కాని బ్రహ్మహత్యాపాతకుని రానీయవలదని రాజునకు తెలిపి పరావసువుకూడ వారితోకలియ, చేయునదిలేక, రాజు అర్వావసుని వెడలిపొమ్మనెను. అర్వావసువు నిర్దోషి. అన్నను పవగించుకొని మునులచే నిండిన తపోవనమునకేగి దుష్కరమయిన తపముచేసెను. భాస్కరునిగూర్చి సమాహితమనస్కుడై ధ్యానించ ఇంద్రాది దివ్యులు సేవించ కర్మసాక్షి సూర్యభగవానుడు ప్రత్యక్షమయ్యెను. ఇంద్రాది దేవతలిట్లనిరి—ఓయీ! అర్వావసూ! నీవు తపోధనుడవు, బ్రహ్మచర్యవ్రతమున అత్యంతము శుచివయితివి.

పరావసువు, నీఅన్న, నిన్నవమానించినను, క్షమాయుక్తుడవయి కోపించవయితివి. వరము వేడుమనీ వారన తండ్రిని బ్రదికించుడని వేడుకొనెను. వారటులనే అనుగ్రహించి ఇంకొక వరము వేడుకొమ్మనిరి. అయిన నాఅన్నకు సంక్రమించిన దురితము లేకపోవుగాక అన వారందుల కంగీకరించలేదు. ఆతనికై నీవు వ్రతచర్య యొనరించినను నిన్ను వంచించెను. ఆదుష్టత్వము తీసి వేయజాలమనిరి. కాకున్న దానికి ప్రాయశ్చిత్తము తెలుపగోరెను. ధనుష్కోటి సేవించ నీ అన్న పరావసుని బ్రహ్మహత్య తొలగునని ఉపాయము తెల్పిరి. అనంతరము దివ్యులు తమ ధామమునకేగిరి. వెంటనే అర్వావసువు అన్ననుచేరి ప్రీతితో దివ్యులు తెల్పిన ప్రాయశ్చిత్తవిధి తెల్పి, అన్నతో తానుకూడ ధనుష్కోటికేగెను. ఇరువురును సంకల్ప పూర్వకము తీర్థస్నానముచేయ అశరీరవాణి "పరావసు! నీవు జనకుని చంపిన దోషముతొలగినది" అని తెల్పెను. ఇరువురు అన్నదమ్ములు రామనాథేశ్వరునర్చించి తండ్రి ఆశ్రమమునకుపోయిరి. జీవించియున్న తండ్రి వచ్చినసుతులను దరికిచేర్చి ఆనందించెను. అట నున్న మునులును ప్రాయశ్చిత్తము చేసికొని శుద్ధుడయిన పరావసునితో అర్వావసుని శ్లాఘించుచు ఆశ్రమవాసమున కియ్యకొనిరి.

*

# బ్రహ్మ ఖండము

## 34-వ అధ్యాయము

ధనుష్కోటి మహాత్వమును గూర్చిన ఇంకొకగాథ :—

నక్క కోతి సంవాదము—జాతి స్మృతి వీరికికలదు. మానుష జన్మలో వారిరువురును స్నేహితులు, జంతుయోనుల జనించియు మిత్రులుగనే యుండిరి. ఒక సమయమున స్మశానవాటికలోనున్న నక్కతో పూర్వజాతిని స్మరించి, స్మశానమధ్యవాటిని చూచి కోతి అనుచున్నది. "పూర్వముచేసిన పాపమెట్టిదో ఇపుడు స్మశానమున దుర్వాసనతో కూడిన మాంసము తినుచున్నావు" అన నక్క సమాధానము :—

పూర్వము నేను వేదమభ్యసించిన బ్రాహ్మణుడను. పేరు వేదశర్మ. ఆజన్మలో ఒక బ్రాహ్మణునకు కొంతధనమిత్తునని ఈయలేదు. అందువలన సృగాలజన్మ వచ్చినది. ఇత్తునని ఈయకున్న పది జన్మలుగ ఆర్జించిన పుణ్యము నశించును.

ఇట్లని కోతికా వానరజన్మ ఏలవచ్చినదో తెలుపుమన వానరము తెల్పుచున్నది. "పూర్వము నేను వేదనాథుడను పేరుగల విప్రుడను. నా తండ్రి విశ్వనాథుడు. తల్లి కమలాలయ. ఓ సృగాలమా! మనకు పూర్వజన్మలోకూడ స్నేహము కలదు. నీకావివరము తెలియదు. కొంతపుణ్య గౌరవమున నాకు తెలియవచ్చినది. ఒక బ్రాహ్మణునింట శాకము హరించిన పాపమున నరకమనుభవించి అనంతరమే వానరజన్మ గాంచితిని. అందువలన ఇంచుకయినను బ్రాహ్మణధనము హరించరాదు. విషము త్రాగిన, వాడే మరణించును. బ్రాహ్మణ ధనము విషమునకే విషమయి హరించినవాని కులమంత యును నశింపజేయును. ముందు మనకేగతి పట్టునో, మనల నిరు

వుర నీనీచయోని జాతులుగ నొనరించిన పాపమునకు ప్రాయశ్చిత్తము మాత్రము నాకు తెలియుటలేదు.'' అని వానరమనుచుండ వారల పూర్వ పుణ్యాతిశయమున ఆ ప్రదేశమునకు మహాతేజస్వి సింధుద్వీపుడను పేరుగల మహాముని ఏతెంచెను. సృగాల వానరములా మహర్షికి నమస్కరించి తమపట్ల కృపయుంచి పాపము తొలగు ఉపాయము తెలుప ప్రార్థించినవి. ముని క్షణము ధ్యానించి వారల పూర్వ నామధేయములు, చేసినపాపములు తెల్పి దక్షిణ సముద్ర తీరమున రామధనుష్కోటికేగి స్నానముచేసిన పాపనాశన మగునని తెల్పెను. ఇంకను వారికా ధనుష్కోటి మహిమ నిటుల వర్ణించెను:

పూర్వము ఒక కిరాతస్త్రీ సంసర్గమున సుమతి అను బ్రాహ్మణుడు పతితుడయి ధనుష్కోటిస్నాతుడై పాపవిముక్తి కాంచెను. ఆ గాథ వినుడు. మహారాష్ట్రదేశమున ఆస్తికుడు ఒక బ్రాహ్మణుడు యజ్ఞదేవుడు వేదవేదాంతవిదుడు కలడు. అతిథులన్న ఆదరించును. శివనారాయణులపట్ల భక్తికలవాడు. ఆతనికి సుమతి అనుకుమారుడు కలిగెను. వాడు విటగోష్ఠి ప్రియత్వమున తలిదండ్రులను పతివ్రత అయిన భార్యను విడచి ఉత్కలదేశమున కేగెను. మార్గమున యువకులకు ఆకర్షణీయమయిన తరుణి కిరాతస్త్రీని చూచెను. ఆమె వెంటనంటి పోయి కొంతకాల మామెతోనుండి తనధనమంతయును ఆమెకిచ్చెను. నిర్ధనునాతనిని కిరాతి ఆదరించక ఇంటినుండి పొమ్మనెను. ధనము పలుతావుల చౌర్య కర్మచే, సమకూర్చి ఆమెకిచ్చుచు ఆమె ఇంటనే భుజించుచు చిరమామెతో సుఖించెను. ఆమెతో ఒకేపాత్రయందు సురత్రాగెను. కొందఱు కిరాతులతో కూడి కిరాత వేషమున చౌర్యమునకై లాటదేశమేగెను. ఖడ్గహస్తుడై ఒక బ్రాహ్మణునింట ప్రవేశించెను. ఆ గృహ యజమాని బ్రాహ్మణుని చంపి బహుధనము చేజిక్కించుకొని కిరాతి ఇంటికేగెను. వెంటనే బ్రహ్మహత్య నల్లని వస్త్రము ఎర్రని వెండ్రుకలు గల రూపుగొని గర్జించుచు వెంబడించెను.

ఆతడు భయపడి పర్విడుచు పలుతావులు తిరుగసాగెను. క్రమముగా బ్రహ్మహత్య వెంటనంటి పీడించ తనగ్రామమే చేరెను. ఇల్లు గుర్తించి ఇంటికేగి తండ్రిని రక్షించ ప్రార్థించెను. ఆతడడ్డు రాబోగా బ్రహ్మహత్య ఆ బ్రాహ్మణుడు యజ్ఞదేవున కిట్లనెను. "ఇతడు సురాపానము చేసి, చోరకర్మలనేకములు చేసి బ్రాహ్మణుని చంపెను. పాపి, మాతృద్రోహి, పితృద్రోహి, భార్యను విడిచెను. వీనిని విడువుము. కిరాతి సంసర్గమున కులపాంసనుడు. విడువకున్న మిమ్మెల్లరను వీనితో పాటు తినివేయుదును. ఇతనిని విడచిన మిమ్ము వదలి పోయెదను. ఈతనికొఱకు నీతోపాటు కులమునంతను చంపుకొనకుము". యజ్ఞదేవుని సమాధానము. "సుతస్నేహము నన్ను బాధించుచున్నది. ఎట్లు విడువగలను," అన బ్రహ్మహత్య సమాధానము. "ఇతడు పతితుడు, వర్ణాశ్రమ బహిష్కృతుడు. ఆతనిని చూచిననే పాపముల వడును. పుత్రస్నేహము విడువుము." ఇట్లనుచు సుమతిని తాడించ సాగ "తాత తాత"అని వాడాక్రోశించెను. తలిదండ్రులు భార్యయును ఏడువసాగిరి. ఇంతలో వారల అదృష్టమున శంకరాంశజుడు దూర్వాస మహాముని అటకేతెంచెను. యజ్ఞదేవుడు ముని పాదములబడి పుత్రకారణముగ రక్షయాచించెను. ఆయనతో నిట్లనెను. "మునీంద్రా మీవంటివారి దర్శనము పాపులకు దుర్లభము. నా సుతుడు పాపి. బ్రహ్మహత్యచేయ ఆ పాతకము వాని దహించుచున్నది" అన ముని భయపడవలదనుచు 'వెంటనే వీనితో మీరు రామధనుష్కోటికేగి స్నాన మాచరించిన బ్రహ్మహత్య తొలగి పోవు'నని ఉపాయ ముపదేశించుచు పూర్వమింతకన్న పాపి దుర్వినీతుడను విప్రుడు గురుస్త్రీగమ పాపమును పోనాడెను. అన ఆగాథ తెలుప మునిని యజ్ఞదేవుడు వేడుకొనెను.

★

# బ్రహ్మ ఖండము

## 35-వ అధ్యాయము

"పూర్వము పాండ్యదేశమున బహుశ్రుతుడను బ్రాహ్మణు డుండెను. భార్య ఇధ్మవాహ. వారల తనయుడు దుర్వినీతుడు. బాల్యముననే తండ్రి మరణించ పారలౌకికములు నిర్వర్తించి విధవ అయిన తల్లితో కొంతకాలము గృహముననే యుండెను. యౌవన మతి శయించ ఒకనాడు మూఢుడయి వలదను చున్నను మాతతో రమించెను. ఆతడేమిచేయుచున్నదియు ఆతనికి తెలియదు. మాత వివశయయినది. కార్యము తీరి తెలివంది వాడు అతిగదుఃఖించెను. అగమ్యాగమన పాపము నాకెటుల పోవుననుచు తల్లిపాదములపై బడి దుఃఖించుచు సమీపముననున్న మునికులమునకేగి గురుస్త్రీగమ పాపమునకు ప్రాయశ్చిత్తము తెలుపుడని ఏడ్చుచు వారి పాదముల వ్రాలెను. మరణము కానిదేదయిన నొనరింతునని పాప ప్రాయశ్చి త్తము తెలుప వేడెను. కొందఱు పాపీ పొమ్మని నిందించిరి. ఆతనితో ప్రసంగమే పాపమని కొందఱు మౌనమేవహించిరి. ఇంతలో కృష్ణ ద్వైపాయనుడటకేతెంచి, సంగతి తెలిసికొని, మునులను వారించుచు సూర్యుడు మకరముననుండ మాఘమాసమంతయును జితేంద్రియు డవయి, నిరాహారుడవయి నీ జననితో ధనుష్కోటియందు నిత్యము స్నానమాచరించుచు రామేశ్వరు నారాధించుము. నీ పాపము తొలగును. నా వాక్యమే ప్రమాణముగ వెంటనే నీ జననితో ధను ష్కోటి కేగుమన అటులనేచేసి మాసాంతమున తల్లిని వెంటగొని మరల వ్యాసునంతికమునకేగి ఆ మునీంద్రునికి తనచరితము విన్పిం చెను.

ఈపైన తానాచరించ వలసిన విధులుపదేశించ మునిని వేడెను. సంఘము నిన్నిపుడాదరించును. మీ ఇరువురి పాపము తొలగినది.

నీవు వివాహమాడి గృహస్థ ధర్మమాచరించుము. ప్రాణిహింస చేయ వలదు. సనాతనమయిన ధర్మమునే చేపట్టుము. భక్తితో సజ్జనుల సేవించుము. సంధ్యాది నిత్యకర్మలు శ్రద్ధగా చేయుము. ఇంద్రియ ములను సంయమనము చేయుము. క్రోధాదులువిడచి పరాపవాద విడనాడుము. పరదారలను తల్లివలె నిత్యముచూడుము. అతిథుల నాదరించుము. వేదవేదాంగములు పరిశీలించుము. లజ్జవిడచి అభేద బుద్ధితో హరిశంకరులను కీర్తించుము. ప్రణవ సహితముగ పంచా క్షర, అష్టాక్షర మంత్రరాజముల జపించుము.'' ఇయ్యది దుర్వినీతుని చరితము. వింటివికదా! యజ్ఞదేవా! నీ సుతునితో కుటుంబముతో ధనుష్కోటికేగి స్నానమాచరించుము. ఆతని బ్రహ్మహత్య తొలగును. మీకు సుఖములలవడును. అని దూర్వాసముని తెల్పెను. ఆ విధముననే యొనరించి పాతకము తొలగ కుమారునితో కోడలితో తాను భార్యయు స్వగ్రామమునకేగిరి. ఇట్లని సింధుద్వీప ముని నక్కకు వానరమునకు తెల్పి అందువలన మీరిరువురును ధనుష్కోటికేగి స్నానముచేసిన మీ పాపములు తొలగునని నెను. వారటులచేసి ఆ తిర్య గ్యోనులు విడచి దివ్యరూపములు ధరించి నాకమునకేగి ఇంద్రునిచే గౌరవములు వడసిరి.

⁂

# బ్రహ్మ ఖండము

## 36-వ అధ్యాయము

ధనుష్కోటి మాహాత్మ్యమును గురించినదే ఇంకొకగాథ :—

దురాచారుడను బ్రాహ్మణుడు గౌతమీతీర మాశ్రయించిన వాడు, పాపి, క్రూరుడును. పంచమహాపాతకములను చేసినవాడు, సదా అటువంటి దుర్మార్గులతోనే సహవాసము. ఇట్లగుటచే ఏమి యును మిగులక బ్రాహ్మణ్యము ఆతనిపట్ల నశించినది. ఆతనితో నాలుగుదినములెట్టి సత్పురుషుడు ప్రమాదమున గడపినను, సంసర్గము కలిగినను, ఆతడనేకజన్మములుగ చేసిన పుణ్యరాశి నశించిపోవును. ఈపాపి దురాచారుని ఒకనాడు భేతాళ గ్రహమావేశించ మతిచెడి పురములు, గిరులు, వనములు తిరుగుచు పుణ్యలేశమున ధను ష్కోటి చేర పర్విడసాగెను. భేతాళగ్రహమాతనిని తీర్థజలములబడ వైవతక్షణమే పాపము నశించి తెలివంది "నేనెక్కడనున్నాను. ఈ తీరమెట్టిది, ఈ ప్రాంతమెయ్యది. గౌతమీతీరమునుండి నేనీప్రాంత మున కెటులరాగల్గితిని." ఇట్లని చింతించుచు అట ప్రజానీకమువలన ఆ ప్రాంతమున దత్తాత్రేయులను పేరుగల మహర్షి కలడని విని వారి వద్దకేగి పాదములు పట్టుకొని మునీంద్రా నేనీప్రాంతమునకేల వచ్చితినో దయయుంచి తెల్పుడని ప్రార్థించెను. ముని ఇంచుక ధ్యానించి నిన్ను భేతాళగ్రహ మావేశించి ఇటకు తెచ్చి జలముల బడవైచెను. నిన్నావేశించి తీర్థస్నానము చేయుటచే నీపాతకముల తోపాటు ఆతని పాతకములును నశించినవి. ఆతడు పూర్వమొక ద్విజుడు. భాద్రపద కృష్ణపక్షమున పితరుల నాతడు తృప్తిపఱచక పోగా వారాతనిని భేతాళత్వమందు గాతయని శపించిరి. ఆతడి పుడు ముక్తినందెను. భాద్రపదము కృష్ణపక్షము మహాలయమున శక్తికొలది పితరులతృప్తికై బ్రాహ్మణులకు భోజనమిడి సత్కరించిన

శివునితో కైలాసమున నుండగలడు. కృష్ణపక్షమున నే తిథియందైయినను పితరులనుద్దేశించి బ్రాహ్మణులకు భోజనమిడిన సర్వసంపదలు చేకూరి అంతమున పరాపదమందుదురు. ద్వాదశి తిథియందర్చన వలన జనార్దనుడు, లక్ష్మీపతి అనుగ్రహము పొందును. ద్వాదశిమహాలయమొనరించకున్న ఆతని క్షేత్రముల సంపత్తునశించును. ద్వాదశినాడు మహాలయము కల్పించిన ఆతనిపితరులు సంతసింతురు. సహస్రకల్పములు ఆరువందల సారులు తిరిగినంతకాలము వారు సుఖపదములనుందురు. మహాలయ అమావాస్య పితరులనర్చించిన అనంత ఫలములందుదురు. పార్వణవిధానమున మహాలయము నిర్వర్తించిన నరుని ఉభయవంశములవారు-మాతృవంశము, పితృవంశము-దశ పూర్వాం, దశాపరేషాం-ముందువెనుకలు అనేకతరములవారు తరింతురు. నరకమునందరు, ముక్తిపదములనందుదురు. భాద్రపదమాసము మహాలయపక్షమున పితరులనుద్దేశించి బ్రాహ్మణభోజనము దక్షిణతో కూడ చేయకున్న కులనాశనమగుటయేకాక బ్రహ్మహత్య సంక్రమించును. శక్తిలేనివాడు యాచించి అయినను మహాలయము నిర్వర్తించుకోవలెను. ఈయాచన శిష్టులయిన బ్రాహ్మణులను యాచించవలెను. పతితులను యాచించరాదు. ద్విజులెవ్వరివలనను పితృకార్యమునకు సహాయములభించకున్న గోగ్రాసమునయిన ఈయవలెను. లేదా అరణ్యమునకుపోయి రోదనము చేయవలయును. పితరులనుద్దేశించి, తాను దరిద్రుడని, యాచించినను ఏమియు లభ్యముకాలేదని అందువలన తన్నుక్షమించుడని ఏడ్చుచు పితరులను ప్రార్థించవలెను. ఇటుల రోదించిన పితరులు తృప్తులయి అమృతపానము చేసినట్లయి వారు అమరులయ్యెదరు. మహాలయమొనరించిన భూతభేతాళాది గ్రహములు, అపస్మారాదులు తొలగును.

పూర్వము వసిష్ఠునుపదేశమున రాజు దశరథుడు మహాలయము నిర్వర్తించి వంశవర్ధనులు రామాదిసుతులను బడయగల్గెను. మహా

లయ మొనరించి యయాతి యదు ముఖ్యులగు కుమారులను గాంచెను. దుష్యంతుడు, నలుడు మహాలయము చేసినపుణ్యమున కష్టములుబాసి సామ్రాజ్య మనుభవించిరి. రామచంద్రుడు దండ కారణ్యమున మహాలయము సలిపి రావణుని సంహరించి సీతను పొందగల్గెను. ధర్మరాజు దుఃఖసాగరమును దాటెను. అత్రి, భృగు గౌతమాది మహామునులు మహాలయము నిర్వర్తించి అణిమాద్యష్ట సిద్ధులను ప్రాపించిరి. ఓయీ దురాచార! పితురుల శాపమున నిన్ను భేతాళగ్రహ మావేశించినది. ధనుష్కోటి స్నానమున ఆపిశాచము వదలినది. నీ పాపములు నశించినవి.'' ఇట్లు దత్తాత్రేయ మునివలన విని దురాచారుడు సదాచార మతిమంతుడై స్వగ్రామమునకు తిరిగి వెళ్ళెను. విధివిహితములు కాని ఎట్టిదురాచారములయినను, తెలిసి కాని, తెలియకగాని చేసినను, శ్రద్ధాళువులయి ధనుష్కోటిస్నానము చేసి రామేశ్వర మహాలింగము నర్చించిన, సర్వపాపములు నశించి, సుఖములందుదురు.

# బ్రహ్మ ఖండము

## 37-వ అధ్యాయము

సూతుడనుచున్నాడు-ఓహో మహర్షులారా! రామసేతువును గంధమాదనమున చక్రతీర్థాది ధనుష్కోట్యంతమునగల ఇరువది నాలుగు తీర్థముల మాహాత్మ్యము మీకు వివరించితిని. ఇంకేమి విన వలతురో తెల్పుడన ఋషులప్రశ్న—చక్రతీర్థము క్షీరకుండము సమీప మున నున్నదనికదా తెల్పితివి. సూతమహర్షీ! దానిఉదంతము తెలుపు మన సూతుని వివరణము:—

పుణ్యావతియయిన దేవీపురమునకు తూర్పుదిశగా అనతి దూర మున, మహత్తరమయిన స్థానము ఫుల్లగ్రామ మనునది కలదు. ఇటనుండియే రామునిచే నిర్మించబడిన సేతువు ఆరంభమయినది. ఆ గ్రామముననే పాపవినాశకరము, చూచిన, ముట్టిన, ధ్యానించిన, కీర్తించిన మోక్షము ప్రాపించు క్షీరకుండమున్నది. పూర్వము వేద మార్గ నిరతుడు ముద్గలుడనుముని యుండెడివాడు. ఆతడు ఫుల్ల గ్రామవాసి. నారాయణ ప్రీతికరమయిన యజ్ఞమొకటి చేసెను. హరిసంతసించి యజ్ఞవాటమున ప్రత్యక్షమయ్యెను. ముని, కాలమేఘ కాంతివంటి కాంతిగల శరీరము, పీతాంబరధారి, గరుడారూఢుడు, వక్షమున కౌస్తుభమణి అలంకారము నాలుగు బాహువుల శంఖ చక్ర గదా పద్మములు ధరించి లక్ష్మితోకూడిన హరినిచూచి భక్తి పరవశుడై హరినిటులస్తోత్రము చేయసాగెను. 'జగదుత్పత్తి స్థితిలయ ములకు కారణభూతుడవయిన నీకు నారాయణునకు నమస్కా రము, దశావతారమూర్తికి నమోవాకములు. జగత్పతివి. నన్ను రక్షించుము. జీవసంజ్ఞనుపొంది పలుదోషముల కాకరమయిన ఈ నన్ను కాపాడుము.'' ఆనుతికి సంతసించి హరి ముద్గలునితో తానటకు హవిర్భాగము గ్రహించుటకు వచ్చితిననెను. ముని కృతా

ర్థత నందితినని తన భార్యయు కృతార్థురాలయినదనెను. నేడే నా వంశము ఆశ్రమము సఫలమయినవి. నా సర్వస్వము సఫలమయినది. యోగులు, యోగ నిరతులు ఏ పరమాత్మని, హృత్పద్మమున వెదకుచుందురో ఆ నీమూర్తి నాయజ్ఞవాటమున నాకు కాన్పించినది, ఇట్లని హరిని చందనాదులిచ్చి పూజించి హరికొఱకు పురోడాశాదికమగు హవిర్భాగమర్పించెను. స్వయము కరముసాచి హవిర్భాగము గ్రహించి హరి భుజించెను. హరి హవిర్భాగము భుజించ ముక్కోటి దేవతలు సంతృప్తి వడసిరి. ఆ యజ్ఞవాటమునను లోకమునగల చరాచరము హరి తృప్తినంద సర్వులును తృప్తివడసిరి. వరము కోరుమన ముద్గలుని వాక్యము: ప్రభూ! నీవే ప్రత్యక్షముగ హవిర్భాగమునందుకొని భుజించ నా కన్యమేమి కావలయును. సర్వాత్మనా కృతార్థుడను. అయినను ఇట్లగుగాక. సదా నిశ్చలమయినభక్తి నీపద రాజీవముల నాకుండుగాత. ఆ సాయంసంధ్యలు సురభి గోక్షీరముతో, నీ రూపమయిన అగ్నినర్చించుచు, హోమముచేయ కాంక్షింతును. నాకు గోవులు లేవు. నేను ధనహీనుడను తపస్విని', అన హరి ఆనందించి విశ్వకర్మను ధ్యానించి రావించి, ఆతనిద్వారా శోభనమయిన ఒక సరోవరము, స్ఫటిక మణిమయావృతము, కల్పించెను. సురభిని హరి ఆహ్వానించి "ఈ ముద్గలమహర్షి సాయం ప్రాతస్సంధ్యల గోక్షీరముతో అగ్నికాహుతి నా కొఱకు కల్పించ తలంచెను. దేవి! సురభీ! నీవు నిత్యమిటకువచ్చి ఈ సరోవరమున పయస్సులతో నింపుము. ఆ క్షీరములతో నిత్యము రెండువేళలముని హోమము కల్పించును' అని ఓంకారస్మరణచేయ సురభి అంతర్హితకాగా మునితో సురభిపూరించు క్షీరముతో నీ సంకల్పానుసారము హోమముచేయుము. నేను ప్రీతుడనయ్యెదను. ఈ సరస్సునకు క్షీరకుండమని ఖ్యాతికల్గును. ఇట స్నానముచేసిన నరులకు సమస్త పాతకములు నశించును. దేహాంతమున బంధవిముక్తుడవయి నా

పదము ప్రాపింతువనుచు హరి అంతర్హితుండయ్యెను. ఇది క్షీర సరోవృత్తాంతము. ఈ తీర్థమున స్నానముచేసి, కాశ్యపుపత్ని కద్రూ, మోసగించి సపత్నిని కాదని జయముగాంచిన దోషము పోగొట్టు కొన్నది. క్షీరకుండ సంబంధి గాలిసోకినచాలు పాపములు తొలగి బ్రహ్మలోకము ప్రాపింతురు.

# బ్రహ్మఖండము

## 38-వ అధ్యాయము

కద్రూ వృత్తాంతము వివరించ మునులుకోరగ సూతుని వివరణము :—

పూర్వము కృతయుగమున బ్రహ్మకిరువురు తనయలు కద్రూ వినతలుకల్గిరి. వారుభయులును కశ్యపప్రజాపతికి భార్యలయిరి. వినత అరుణుని గరుడుని పుత్రులుగా బడసెను. కద్రూ అనంతములు నాగములు—సర్పములను—తనయులుగా బడసెను. ఒకనాడాసవతు లిరువురును సముద్రతీరమున విహరించు వారు దూరమున ఉచ్చైశ్శ్ర వసమును-తెల్లగుర్రము—చూచిరి. కద్రూవినతతో అన్నది:'ఈ అశ్వము తెల్లనిదే కాని వాలము చివరనల్లగా ఉన్నది. ఔనా కాదా అని ప్రశ్నించ నాకు వాలమంతయును తెల్లగా కన్పించు చున్నదని వినత సమాధానము'. 'కాదునలుపే. దూరముగా అశ్వమేగినది. మరునాడు పరిశీలింతము. నామాట నెగ్గిన నీవు నాకు దాసివి కావలయును. నే నోడిన నీకు నేను దాసినగుదునని''ప్రతిన యొప్పించి సాయం సమయము కాగా నాటికి వారు గృహమున కేగిరి. రేయి కద్రూ వాసుక్యాది నాగములను పిలిచి అశ్వముతోక నైల్యముగా చేయు డన వారంగీకరించకపోగా ముందు పరీక్షిత్తనయుడు జనమేజయుని సర్పయాగమున మీరు చత్తురుగాక యనెను. ఇంతలో కర్కోట కాదులు శాపమునకు భయపడి తల్లితో తాము అశ్వముతోక నైల్యా ముగా చేతుమని తెల్పి యేగిరి. మరునాడుదయమే ఇరువురును సముద్ర తీరమునకేగి యట తిరుగుచున్న ఇంద్రుని వాహనముచ్చైశ్శ్రవ సమును కనిరి. తోకచివర సూక్ష్మరూపులయి కర్కోటకాదులు కలచి పట్టియుంచ, తోక చివరినైల్యమని వినత అంగీకరించ వలసి వచ్చినది. వినత కద్రూచెంత దాసివలె వర్తించు చున్నది. ఇంతలో

వినత కన్న అండరూపము బ్రద్దలయి పర్వతాకారముతో పక్షిరాజు గరుడుడుద్భవించెను. లోకములు ఆ ఆకృతిచూచి భీతిల్లినవి. దేవతలు గరుడుని నుతించిరి. భయంకరమయిన తనరూపు సామాన్యముగా నొనరించుకొని అరుణుని మూపుపై నెక్కించుకొని గరుడుడు తల్లి వద్దకువచ్చెను. ఆ సమయమున కద్రూ వినతతో ఇట్లన్నది. "చేటి! నేను నా సుతులతో నాగాలయమునకు పోతలంచితిని. నీ సుతుని గరుడుని మమ్మిటకు మోసికొనిపొమ్మని నియోగించు మనెను. వినత తనయుని గరుడుని పిలిచి కద్రూచెప్పినట్లు చేయుమనెను. గరుడుడంగీకరించెను. కద్రూని ఆమె తనయులను మూపునవహించి ఆకాశమార్గమున కెగయ ఇంచు మించు సూర్యుని సమీపించ వారలు తాప తప్తులయిరి. వెంటనే క్రిందికిరా, బాధతొలగ కద్రూ ఇంద్రుని నుతించ వర్ష ధారలు కురి యించి దేవరాట్ వారల తాపము శాంతింపచేసెను. నాగులు గరుడునితో తమకు ద్వీపాంతరముచూడ కోరిక కలదని, అటకు తమ్మెల్లర కొనిపో నియోగించిరి. అటులేచేసి, అనంతరము, గరు డుడు తల్లి వద్దకువచ్చి తాను వారి ఆజ్ఞానువర్తియగుటకు హేతువు తెలుపగోర వినత తన దాసీభావమునకు కారణముతెల్పెను. అ నిర్బం ధము తొలగు ఉపాయము లేదా అన నాగులనే అడుగుము వారి కోరిక చెల్లించుమన వెంటనే నాగులనుచేరి తనతల్లి దాసీత్వముపో నుపాయమడుగ వారు స్వర్గమునుండి అమృతము తెచ్చి తమకిచ్చిన ఋణమున తనమాత దాసీత్వము తొలగుననిరి. సంతసించి గరుడుడు నాకముపై దాడిచేసెను. అటుల పోవుటకు ముందుగా తన కాకలిగానున్నది, ఆహారమిమ్మని తల్లిని వేడుకొనెను. వినత "తనయా! సముద్రమధ్యమున కొందఱు శబరులున్నారు. వారిని తిని అమృతమిటకు తెమ్మన్నది. తల్లి ఆశీర్వాదము గ్రహించి పర్వతమువలె పెరిగి నోరుతెరచి శబరాలయమున వారినెల్లరను

గ్రసించసాగ వారిలోకలసి ఒక బ్రాహ్మణుడుండెను. కంఠము దహించుకు పోవుచున్నది. ఓ బ్రాహ్మణుడా! శబరులతోకలసియున్న నీవు పాపివయ్యు అవధ్యుడవు. కావున కంఠమునుండి బహిర్గతుడవు కమ్ము అన బ్రాహ్మణుడు నాభార్య కిరాతియున్నది. ఆమెయునాతో రావలయునన నామెతోకూడ బహిర్గతుడవుకమ్మన వారిరువురటుల బయటకురా వారిని వదలి, మిగిలిన శబరునెల్లరును తిని తన తండ్రి కశ్యపునిపాలికేగెను. ఎటకేగతలంచితివన తల్లి దాస్యము విడిపించ స్వర్గమునకేగి అమృతము హరించి తేబోవుచున్నాను. శబరులనెల్ల తిన్నను నాకాకలి తీరలేదు. అంతులేని ఆకలి నన్ను బాధించుచున్నదని. ఆహారము చూపవేడ పూర్వము సుప్రతీకవిభావసులను ఇరువురు సోదరులు వైరమున ఒండొరులను శపించుకొనిరి. సుప్రతీకుడు ఏనుగయి, విభావసువుకూర్మమాయెను. గజము ఏడుయోజనములు ఎత్తు, పదునాలుగు యోజనములు పొడవు, కూర్మము మూడుయోజనములుఎత్తు పదియోజనములు పొడవు — బద్ధవైరమున చిరకాలముగ అరణ్యమున పోరాడుచున్నారు. నీవేగి వారలను భక్షించి నీకార్యము సాధించుకొమ్మని బోధించెను. గరుడటకేగి పోరుచున్న గజకచ్ఛపములను చెరియొకదానిని నఖాగ్రముల రెండుకాళ్ళలో నిరికించుకొని ఆకాశమున నెగురుచుపోయి పక్షిస్వభావమున ఏవృక్షముశాఖపై నిలచి తిందునాయని వెదుకుచు పైననే వాటినెత్తుకొని తిరుగుచు, విశంబతీర్థమునకేగ ఆతీర్థమున, ఒడ్డుననున్న రోహిణియనుపేరుగల మహావృక్షము వైనతేయునాహ్వానించి తనశాఖపై నిలచి ఆతని ఆహారము గజకచ్ఛపములను తిన వేడుకొనెను. ఆవృక్షశాఖలు శతయోజన విస్తీర్ణములు. సరేనని గరుడుడు తన భారముతో నొక శాఖపై వ్రాలనది భగ్నమయినది. ఆశాఖను ఆలంబముగ వ్రేలాడుచున్న వాలఖిల్యాది మహర్షులను కని శాఖాపాతమున వారికి హాని కల్గునని చింతించి ఆశాఖను ముక్కునపట్టుకొని, గజకచ్ఛపములను

రెండుకాళ్ళ నిరికించుకొని ఆకాశమార్గముననే ఎగురుచు తండ్రి ఆశ్రమమునకేగి పై పై తిరుగుచుండ, కశ్యపులు సుతుని ఆశయము గ్రహించి, నిర్మానుష్యమయిన ఒక కొండశిఖరమునకేగి శాఖను విడిచి ఆహారము తినుమని తెలుప, వైనతేయుడు నిష్పురుషమను గిరిశిఖర మునకేగి శాఖనట విడచి గజకచ్ఛపములను తినివేసెను. వెంటనే స్వర్గమున కెగిరి స్వర్గద్వారమును చేరుకొన ఆ మహోత్పాతము, ధ్వని, విని ఇంద్రుడు మంత్రి-గురువు-బృహస్పతిని తత్కారణమడుగ బృహస్పతి ఇంద్రునకిట్లు తెల్పెను:

"పూర్వము కాశ్యపఋషి హరినుద్దేశించి క్రతువొనరించెను. హరిని తలపించు సుతులు కావలెనని కోరిచేసెను. ఆ యజ్ఞ మునకు సంభారములు సమిధలు ఇత్యాదులు సమకూర్చ దివ్యులు, ఋషులుచేరి తమకు తోచినవి తెచ్చి యజ్ఞవాటమున నిడుచుండ, వాలఖిల్యులు అంగుష్ఠమాత్రులొక సమిధను మోయుచు దారిలో గోపాదమున పడి లేవలేక పోగా వెనుక గిరిభారము సమిధలు మోయుచు నీవు నవ్వితివి. వారది గ్రహించి ఇంద్రుని జయించు సుతుడుద్భవించవలెనని సంకల్పించి సమిధలందించిరి" ఆ కశ్యపు సుతుడు గరుడుడు అమృత హరణార్థము ఇపుడిటకేతెంచెను." అన ఇంద్రుడు దివ్యులను పక్షినెదుర్కొన సిద్ధముకండనుచు తాను సిద్ధము కాగా దివ్యులతో గరుడునకు పోరుకలిగెను. దివ్యులెల్లరు రణభూమి వివిధాయుధములతో ఎదురించి నిలువ పక్షములతో మహావాయు వును లేప దానితో ధూళి క్రమ్మ దివ్యుల కనుల ధూళి క్రమ్మి కన్పించక పోయినది. పక్షములతో, నఖములతో దివ్యులను బాధించ వారు అమృత స్థానమునువీడి పలాయనము చిత్తగించిరి. గరుడుడు తనముందు జ్వలించు అగ్నిని కాంచెను. దానినీ శమింపచేయ నుద్యోగించెను. సముద్రముల నదుల నీరుతెచ్చి పోసిను శాంతించ లేదు. ఇంచుక అవకాశము జ్వాలామధ్యమున కన్పించ గరుడుడు

సూక్ష్మరూపమున లోనప్రవేశించి పేటిక సుభిన్నముచేసి అమృత కల శమును హరించెను. అట హరి ప్రత్యక్షమయి సంతసించితి వరము వేడుమన జరామరణములు లేకుండుటయు సదా హరిపై ననే తానుండుటయు కోర అట్లే అగునన, గరుడుడును హరిని వరము వేడుమన ఆతడు (గరుడుడు) తనకు వాహనము కావలయునని హరియన ఇట్లగునని (రథముపై ధ్వజముమీద గరుడుండుననియు గరుడధ్వజుడు, హరిగరుడ వాహనుడును.) ఉభయులు వరప్రసాదమున సంతసించిరి. అమృతము కొనిపోనున్న గరుడుని ఇంద్రుడు వజ్ర పాణియయి ఎదిరించి వజ్రముచేకొట్ట దానికి తనపక్షమున ఒక ఈక బలిగానిచ్చి ఇంద్రునకు తనబలము తెల్పగా, ఇంద్రుడు చేయునది లేక అమృతముతో నీకేమిపని జరామరణములు లేవుకదా, అన మాతృదాస్య విముక్తికే అని తెల్పి 'నేను నాగములముందు కల శమును దర్భలమీదనుంచి, వారలను స్నానముచేసి శుచులయి అమృ తము త్రాగుడని తెల్పుదును. నా తల్లి దాస్యము తొలగెనని వారిచే ననిపించుకొని నేనేగ నీవు వెనువెంట వచ్చి కలశమును హరించు నుపాయము చూచుకొ'మ్మనుచు విహాయసమునకు కలశముతో నెగసిపోవ, ఇంద్రుడదృశ్యుడై వెన్వెంట నేగెను. గరుడుడు ఒక కొలనియొడ్డున నాగులను పిలచి దర్భలమీద అమృతకలశమునుంచి, స్నానముచేసి శుచులయి అమృతము సేవించుడనియు, తనమాత దాస్యము తొలగినదికదా అని అనిపించుకొని, తనదారినేగెను. తల్లిని తనవెంటకొని పోయెను. కద్రూతో తల్లి దాస్యము తీరిన దనెను. ఆమెయు సుతులను కలసికొనెను. వారెల్లరు స్నానమునకై సరోవర జలములలోనికి దిగి స్నానము చేయుచుండ ఇంద్రుడు కలశమును హరించికొని పోయెను. వారు స్నానము చేసివచ్చి కల శము లేకపోగా కలశముంచిన దర్భలను నాక జిహ్వలు రెండుగా చీలిపోయినవి. అందుచేత నాగములు ద్విజిహ్వులయిరి. అమృతము వంటి విషము వారియందుండెను. మృత్యుముఖులయిన వెంటనే

గరళముపోయ బ్రదుకుటకలదు. కనుక గరళము అమృతముగానగుట కలదు. గరుడుడు కద్రూను కోపించి మోసగించి నా తల్లికి దాసీ భావము కల్పించితివి కనుక పతిని సేవించ నీకర్హత లేకపోవుగాక యనిశపించి తనదారినేగెను. కద్రూ వినతలు భర్తసన్నిధికేగిరి. కశ్యపుడు కద్రూని చూచి ఛలమున నీవు వినతను హింసించితివి కాన నా పరిచర్యకు నీవు తగవు. ఎవరయినను మోసగించి జయము గొన్నచో వారు పాపులే అగుదురు. మోసమున విజయము సాధించిన వారితో ప్రసంగించిన బ్రహ్మహత్యా పాతకమబ్బును. నీవు ఆశ్రమము విడిచిపొమ్ము అన కద్రూ ఏడ్చుచు పతి పాదములబ్రాలి లేవకుండెను. వినత భర్తకు నమస్కరించి ఇట్లనెను. "భగవాన్ దయయుంచి ఈ నా చెల్లెలిని స్వీకరించుడు. అజ్ఞానమున ఈమె ఈ పాపము చేసినది. సాధుజనము దయాన్వితముకదా. ఈమెను క్షమించు"డనెను. కాదేని పాపమునకు ప్రాయశ్చిత్తము తెలుపవేడెను. ఏమి చేసిన ఈమె తమపరిచర్యకు అర్హురాలగునో తెలుపుడన్న, కశ్యపుని సమాధానము: "దక్షిణ సముద్రతీరమున ఫుల్లగ్రామ సమీపమున క్షీరసరోవరముకలదు. అందుస్నానముచేసిన క్షణమునసే ఈమెపాపము శమించును." కుమారుల సహాయమున, పతికి నమస్కరించి, కద్రూ వెంటనే క్షీరసరోవరమున కేగెను. సంకల్పపూర్వకముగ క్షీరకుండమున తనయులతోసహా స్నానముచేసెను. ఉపవసించుచు మూడుదినములు నిత్యము స్నానముచేయుచు ఆ సరోవర తీరమున గడపెను. నాలుగవ దినము స్నానము చేయుచుండ అశరీర వాణి 'నీపాపము తొలగినదని' విన్పించెను. పతిశుశ్రూష కర్హత సంపాదించితివనియును విన్పించెను. గరుడుని శాపముకూడ నివర్తితమయినది. పతిచెంతకేగుము ఆయన నిన్ను స్వీకరించునని తెల్పెను. కద్రూ తీర్థమునకు ప్రదక్షిణ నమస్కారము లొనరించి పుత్రులును తానును కలసి స్వాశ్రమమునకేగెను. పతి శుద్ధురాలిని కాంతను స్వీయపరిచర్య కనుమతించెను.

*

# బ్రహ్మ ఖండము

## 39-వ అధ్యాయము

కపితీర్థవైభవము:— ఇది పైన వివరించిన తీర్థములన్నింటికన్న ముందుగా సర్వుల ఉపయోగమునకు కపులచే నిర్మించబడినది. రావణ వధానంతరము సీతా రామ లక్ష్మణ సుగ్రీవ విభీషణాదులతో దక్షిణతీరముచేరిన అనంతరము అతిముదమున హనుమదాది కపులు మోక్షప్రదము పాపహారము అగుగాతయని ఈ కపితీర్థము నిర్మించిరి. నరకస్పర్శయుండదు, దారిద్ర్య దుఃఖనాశనకరమున్ను. కపితీర్థమును సేవింతుననుకొనుచు నూరుఅడుగులు వేసిన నరుడు స్నానఫలము పొందును. రామచంద్రుని కపులు తీర్థమునకు మహా మహిమ సమకూర్చవేడిరి. రామచంద్రుని ప్రసాదమున ఈ తీర్థ స్నానమున గంగాస్నానఫల మలవడును. ప్రయాగాది సర్వతీర్థములు సేవించిన ఫలము ప్రాపింతురు. గాయత్ర్యాది మహామంత్రములు పున శ్చరణగావించిన ఫలములలవడును. గో హిరణ్యాది ఉత్తమ దాన ఫలము, అశ్వమేధాదిక్రతువు లొనరించిన ఫలములును చేవడును. పూర్వము రంభ కౌశిక శాపమున శిల అయి ఈ తీర్థస్థానమున స్వీయ రూపమును పొందగల్గెను. ఆ గాథ:—

పూర్వము కుశిక వంశమున విశ్వామిత్రుడను రాజర్షి యుండెడివాడు. ఆ రాజు రాజ్యము తిలకించు వేడుకతో రాజ్య మంతటను తిరుగసాగెను. ఈ విధముగ సంచరించుచు వసిష్ఠు నాశ్ర మమున కేగెను. విశ్వామిత్రుని తన ఆతిథ్యము గ్రహించుమన సాష్టాంగ దండ ప్రణామ మాచరించి రాజు బ్రహ్మమానస పుత్రుని ఆతిథ్యము స్వీకరించ నంగీకరించెను. ముని రాజునకు తన కామధేనువు మహిమవలన సర్వము సిద్ధముచేసి రాజును

ఆతని సైన్యమును సత్కరించెను. రాజు మునిని తనకా కామధేనువు నీయుమనెను. తనకు తపో నియమాదుల కుపక రించు కామధేనువు నీయజాలనన బలాత్కరించి రాజు సురభిని కొనిపోతలంచ సురభి విసృష్టమయిన మ్లేచ్ఛబలముచే రాజు పరా జితుడై వెడలిపోయి మహాస్త్రసంపాదనకు ఈశ్వరునిగూర్చి తప మొనరించెను. భక్తసులభుడీశ్వరుని వరబలమున బ్రహ్మాస్త్రాది మహా స్త్రములు సంపాదించి ముని ఆశ్రమమునకుపోయి అస్త్రములు ప్రయోగించి మునిని జయించ తలంచెనుకాని ఆతడు ప్రయోగించిన సకల దివ్యాస్త్రములను ఒక బ్రహ్మదండముచే తన తపః ప్రభావమున ముని నాశనముచేసెను. రాజు సిగ్గుపడి తన రాజ బలమును ఛీ అనుకొని బ్రహ్మబలమే బలమని నిశ్చయించి బ్రాహ్మణ్యము అన బ్రహ్మఋషి కావలయునని తపోవన మున కేగెను. పూర్వపశ్చిమ దక్షిణదిగ్భాగముల తపమునకు విఘ్న ములు కలుగగా ఉత్తరదిక్కుగా హిమవన్నగమునకేగి కౌశికీ తీర మున తపశ్చర్యనుండెను. ఇంద్రుడు రంభనుపోయి ముని తపమునకు విఘ్నము కల్పించుమన రంభ ముని తన్నుశపించునన్న భయమున్న దన, భయపడవలదు మన్మథునితో తానును ప్రచ్ఛన్నముగ ఆమె వెంట నుందునని ఇంద్రుడభయహస్తమిచ్చి పొమ్మనెను. ఆమె మున్యాశ్రమమునకేగి లావణ్యరూపముతో పాడుచు విహరించ సాగెను. ముని మనశ్చాంచల్యము నరికట్టి అది ఇంద్రుని పంపు అని తెలిసి నూరేండ్లు శిలయయి పడియుండుమని రంభను శపిం చెను. అనంతరము బ్రాహ్మణులు రక్షించ నీ రూపము పొందుదు వని శాపాంతము తెల్పెను. వెంటనే రంభ శిలగామారెను. అనంత రము తీవ్ర నియమ మనుసరించుచు కఠోరతపము మునిచేసి వసిష్ఠు వాక్యమున బ్రాహ్మణ్యము సంపాదించి బ్రహ్మర్షి అంతవాడాయెను. ఆ ఆశ్రమముననే అగస్త్యుని శిష్యుడు శ్వేతుడనుముని మోక్షము కోరి తపమొనరించెను. ఒకనాడాశ్రమమునకు అంగారక అను

రాక్షసి ఏతెంచి రక్తమాంసాదులు వర్షించి ఆశ్రమమును దూషించి ఇతర ఉపద్రవములు కల్పించి మునిని బాధించ వాయవ్యాస్త్రముతో మంత్రించి శిలారూపముననున్న రంభాశిలను రాక్షసిమీద ప్రయోగించ రాక్షసి భయభ్రాంతయయి పారిపోసాగెను. శిల ఆమె వెన్వెంటనే పోవుచుండెను. పర్విడి రాక్షసి కపితీర్థమునచేరి శిలాతాడనమున శిలతోపాటు తీర్థమునపడి చనిపోయెను. రాయి రంభఅయి ఊర్వశ్యాదులు విమానముతే నధిరోహించి వారితో స్వర్గమునకేగెను.

*

# బ్రహ్మ ఖండము

## 40-వ అధ్యాయము

### గాయత్రీ సరస్వతీ తీర్థముల మాహాత్మ్యము:—

పూర్వము బ్రహ్మ తాను సృజించిన వాగ్దేవతను కాముకుడయి కోర లజ్జించి లేడిఅయి పారిపోసాగెను. బ్రహ్మయు హరిణమయి హరిణీరూపధారిణితో రమించ పర్విడసాగెను. దివ్యులు బ్రహ్మ కానిపని చేయబోనున్నాడని అసహ్యమనస్కులుకాగా, శంకరులు పినాకమను తన ధనువు గ్రహించి తాను వ్యాధుడై ఒక నిశిత బాణము నెక్కిడి బ్రహ్మను తాడించ బ్రహ్మ నేలపై బడెను. ఆ బ్రహ్మ శరీరమునుండి మహాజ్యోతిలేచి ఆకాశమున నక్షత్రరూపమునందినది. అదియే మృగశీర్షా నక్షత్రము. ఆర్ద్రానక్షత్ర రూపమున హరుడును దాని ననుగమించెను. నేటికిని మృగశీర్షానక్షత్ర సమీపమున వ్యాధ రూపమున హరుడు దృశ్యమానుడగును. బ్రహ్మ ఇట్లుకాగా గాయత్రీ సరస్వతులు భర్తను పునరుజ్జీవింప చేసికొనుటకు గంధ మాదన పర్వతమునకేగి తపముచేయ నారంభించిరి. శివు నుద్దేశించియే వారు తపోనియతి నుండిరి. మహాదేవుడు కరుణామూర్తి. పార్వతి గణపతి, కుమారస్వాములతో వారికిదర్శనమిచ్చెను. వారిరువురును దర్శనమిచ్చిన హరునిటుల నుతించిరి. "సంసారధ్వాంతమును తొలగించు మహాతేజోమూర్తివి. హాలాహలమును మ్రింగి లోకములను రక్షించిన దేవదేవుడవు. జగన్మోహను కాముని కాల్చిన మూర్తివి. జగదంతకు యముని శాసించిన వాడవు, నమస్తే గిరిజానాథ నిన్నే శరణంటిమి. మమ్ము రక్షించుమని ప్రార్థించిరి. మహాదేవుడు ప్రసన్నుడై వారు కోరినవరము— తమభర్త చతురాననుని జీవింపచేయమనుటను, శంకరులు ప్రసాదించెను. చతుర్ముఖుడు జీవించెను. బ్రహ్మ

హరుని నుతించెను. "శంకరా! నీకు నమస్కారము మరల ఇట్టి నిషిద్ధాచారము నా మనసున లేకుండ వరమీయుము. ఇదియే మహాప్రసాదము. ఇక ముందిట్టి ప్రమాదము లేకుండ జాగ్రత్త పడుమని శంకరులన బ్రహ్మ గాయత్రీ, సరస్వతులతో తనలోకము నకేగెను. తపోనియతి నున్న ఈ కుండద్వయమున, కళారూపమున మీరు సన్నిధానవర్తులయి యుండుడు. ఈ తీర్థద్వయము లోకోప కారకము కాగలవు. ఇట స్నాన మాచరించిన వారి మనసులు శుద్ధములగును. మహాశాంతి లభించును. ఔపాసనము చేయనివారు, పంచయజ్ఞములను ముట్టనివారు, మీ కుండముల స్నానముచేసిన ఆ కృత్యములు చేయని దోషములు తొలగి పరిశుద్ధులయి ఆ కార్యములొనరించిన ఫలములు పొందుదురు.

*

# బ్రహ్మ ఖండము

## 41-వ అధ్యాయము

గాయత్రీ సరస్వతుల సంబంధమయిన ఒక గాథ సూతుడు ఋషులకు తెల్పుచున్నాడు:—

కశ్యపుడను బ్రాహ్మణుడు కలడు. నాడు అభిమన్యుసుతుడు పరీక్షిత్తు హస్తినాపురము రాజధానిగా రాజ్యపాలనము చేయు చుండెను. ఆతడొకమారు వేటతమకమున వనముల సంచరించు చుండెను. ఆతనికపుడు అరువది వత్సరములు కాన శ్రమకోర్వలేక పోయెను. దాహ మధికమయ్యెను. అరణ్యమున మార్గము తప్పి అనుచరులకు దూరమయ్యెను. ఒక మునినిచూచి జలమీయవేడెను; కాని ఆ ముని ధ్యానమునుండి తెలియక సమాధాన మీయకపోగా రాజు కోపించి వింటికొనతో నొక మృతసర్పము నాముని కంఠమున వైచి తనపురమునకేగెను. ఇంతలో మునికుమారుడు శృంగి ఇతర ముని బాలురతో ఆటలాడుచుండ ఆబాలురలో నొకడు శృంగీ! నీదర్పము విడువుము. ఎవడో నీ తండ్రిమెడలో చచ్చినపామునువైచి యేగెను. అన శృంగి కోపించి ఆపనిచేసినవాడు ఏడురాత్రులలో తక్షకుని కాటుకు మరణించుననీ శపించెను. ఆ ముని పేరు శమీకుడు-తనయుడు రాజునకిచ్చిన శాపవార్త విని కడు దుఃఖించుచు బాలునిచేరి "ఎంతపని చేసితివి, లోకరక్షకుని రాజునేల శపించిరి. రాజులేని రాజ్యమున సుఖముగ మనమెట్లుండగలము. క్రోధమున పాతకమేగాని సుఖము రాదు." అనుచు శిష్యుని గౌరవముఖుని పిలచి రాజునకు తన సుతుడిచ్చిన శాపవార్త తెలిపి వెంటనే ఆశ్రమమునకు తిరిగిరమ్మని పంపెను. వెంటనే గౌరవముఖుడేగి రాజదర్శనముచేసి ఆ శాపవార

తెల్పి శీఘ్రగతి నాశ్రమమునకేగెను. రాజు విచార సాగరమున మునిగెను. రక్ష మానవప్రయత్నము కానమంత్రులను రావించి ఈ వార్త తెలిపి ఒక సరోవరమధ్యమున ఒంటికంబమున మండపము నిర్మింపచేసి అందు తాను ప్రవేశించి అంతటను గారుడ మంత్రవిదులును విషనాశక ఓషధీప్రయోగములుచేయు వైద్యులను నిలిపి యుండెను. అనేక దేవర్షి రాజర్షి ముఖ్యులను సమీపమున నుంచుకొని ఆధ్యాత్మిక చింతనము చేయుచుండెను. ఈ వార్త విని కాశ్యపుడను మంత్రవేత్త రాజధానీ నగరమునుగూర్చి పయనించెను. ఆతడు దరిద్రుడు బహుళధనములు రాజిచ్చునని పోసాగెను. దారిలో తక్షకుడు. బ్రాహ్మణవేషమున కాశ్యపునికని ఆతడేగు కార్యము ప్రశ్నించి తెలిసికొని 'నీ కా వృథాప్రయాసమేల నేనే తక్షకుడను. నా విషము పోగొట్ట నీతరమా. నీ యిష్టము.' నా బలము చూడుమని బ్రాహ్మణుడన సమీపముననున్న మహావటమునుచూపి అందు పలుపక్షులు ఆకులుకోయు ముని బాలురనుచూపి ఈ వృక్షమును నేను కాటు వేయుదును ఇన్ని జీవజాలముతో అది భస్మమగును. నీ మంత్రము పనిచేయకున్న ఇంతమందిని చంపిన పాపము నీకంటునని అటనున్న బ్రాహ్మణులతో సరేనని అంగీకరించ తక్షకుని కాటున వృక్షము ఆ క్షణమున పక్షులతో మునిబాలురతో బూడిదఅయ్యెను. ఆ భస్మము పోగుచేసి కమండలోదకము మంత్రించి చల్ల యథాపూర్వముగ వృక్షము పక్షులతో ముని బాలకులతో కలకలలాడుచుండెను. జరిగినదేమియును తెలియకయే బాలురు ఆకులు కోయుచునే యుండిరి. తక్షకుడు బ్రాహ్మణుని ప్రశంసించుచు "వినుము కాశ్యప బ్రహ్మన్-విప్రశాపము వృథాకారాదు. నీ మనసుననున్న ధనమునకు రెండింతలు రత్నములు రాసులు నీకిత్తును తిరిగి పొ''మ్మన కాశ్యపుడు రాజు అల్పాయుర్దాయము జ్ఞాననేత్రమునచూచి మరుమాటాడక రత్నరాశులు గ్రహించి ఇంటికి తిరిగిపోయెను. తక్షకుడు పలువురు

నాగులను పిలిచి బ్రాహ్మణవేషములు ధరించి ఫలములు రాజున కుపహారమిచ్చి మీ దారిని పొండని ఆ ఫలములలో ఒక మంచి బదరీ ఫలమున చిన్న క్రిమిరూపమున తానుండెను. బ్రాహ్మణరూపధారులు నాగులు ప్రవేశముకనక ఫలములు ప్రతీహారులు తీసికొన తమ దారినేగిరి. ఫలములు రాజుముందుంచ కనులకందముగనున్న ఆ బదరీఫలమే గ్రహించి వాసనచూడ క్రిమిరూపముననున్న తక్షకుడు రాజును చుట్టవైచుకొన ప్రక్కనున్నవారుభయమున పారిపోయిరి. తక్షకుడు రాజును కాటువేయ నా విషానలముచే రాజుతో ప్రాసాదము కాలిపోయెను. వెంటనే మంత్రులాతని కుమారుని జనమేజయునికి పట్టముగట్టిరి. కాశ్యపుడింటికేగ ఆతడొనర్చిన అకార్యమునకు (ధనాశచే రాజుమరణమునకు కారకుడని) ద్విజులాతనిని బహిష్కరించిరి. పోయిన తావుల నందరాతని నవమానించిరి. సతీసుతులు, బందుగులు పాపి అని దూషించిరి. తోచక గ్రహముపట్టినట్టు దేశమెల్ల భ్రమించుచు కాశ్యపుడు కష్టముల పాలాయెను. క్రమముగా శాకల్యముని ఆశ్రమమునకేగి తనచేష్టితము తెల్పి తెలిసినచో ఆ దోషము పోనాడు ప్రాయశ్చిత్తవిధి తెలుప వేడెను. శాకల్యుడు కొంత శాస్త్రవాదము తెల్పెను: "శక్తియుండియు లోభమున నీవు రాజును కాపాడక వెనుదిరిగిపోయితివి. నీ జ్ఞానదృష్టిచే రాజు అల్పాయువయ్యు ఊపిరియున్నంతకు రాజరక్షణము నీ కర్తవ్యము. అందువలన పంచమహాపాతకముల నొకటి యయిన బ్రహ్మహత్యా దోషము నీకు సంక్రమించినది. నీతో మాటాడుటయు సంసర్గదోషము". "కార్యము ముగిసిన అనంతరము బందుగులు తూలనాడ నేను అకార్యముచేసితినని తెలిసికొంటిని. అందులకే తాము కృపాళువయి ప్రాయశ్చిత్తము తెలుపవేడుచున్నానన శాకల్యుడు ధ్యానించి గంధమాదనమున గాయత్రీ సావిత్రీ అను రెండు తీర్థములున్నవన తత్క్షణమే అటకేగి తీర్థస్నానమాచరించి కొంతకాలమట భక్తిచేతమున

కాలముగడుప నాతనిముందిరువురు యువతులు కన్పించిరి. వార లెవ్వరని ప్రశ్నించ తాము బ్రహ్మకు ప్రియురాండ్రు గాయత్రీ సావిత్రీ దేవులమసిరి. వారల దర్శనమున తన పాపము శమించిన దనుచు 'నేను నాతావుకేగ మార్గమునను స్వగ్రామమునను బ్రాహ్మ ణులు బందుగులు నన్ను ఆదరించి గౌరవించునట్లు వరమీయు' డని వేడుకొనెను. దేవులు అట్లే అగుగాక యనుచు అంతర్హితులైరి.

*

# బ్రహ్మఖండము

## 42-వ అధ్యాయము

ఈతీర్థములుకాక పలుతీర్థములు నామములు విశ్రుతములు కానివికలవు. అందుముఖ్యముగా ఋణతీర్థము –

ఆర్ష, పైతృక, దైవికఋణములు లేకుండ చేయగలయది కలదు. బ్రహ్మచర్య వ్రతపాలనమున ఋషిఋణము, యజ్ఞయాగాది వైదిక కర్మాచరణమున దైవఋణము, సంతానవంతుడు కాగా పితౄణము తీరిపోవును. ఇట్లు కాకున్నను ఋణమోచన తీర్థస్నానమున ఋణత్రయము నశించును. సంపన్నుడగును. అనంతరము పంచపాండవతీర్థముకలదు. ఆ ప్రదేశమున పాండవులు యుద్ధానంతరము ఇట నియమవంతులయి ఋణత్రయ విమోచనము గావించుకొని దేవతల నాహ్వానించి వారలను తృప్తులను గావించిరి. ఇట స్నానమున పునర్జన్మయుండదు. దేవతీర్థమనునదింకొకటి కలదు. సర్వపాపప్రశమనమగును. దేవతలలో మధుసూదనుడు దేవతలకాది దైవమయినట్లు తీర్థములన్నిటిలో దేవకుండము మొదటిది. నూరేండ్లు అగ్నిహోత్రము నుపాసించినఫలము దేవకుండస్నానమున లభించును. ముముక్షువులు దేవతీర్థమవశ్యము సేవించవలెను. ఐహికాముష్మికములీస్నానమున సాధ్యములగును.

రామసేతువున సుగ్రీవతీర్థమొకటి కలదు. ఇట స్నానము సూర్యలోకప్రాప్తి. ఇట స్నానమున వైదికకర్మలన్నియు చేసిన ఫలము లభించును. అనంతరము నలతీర్థమున్నది. తరువాత (అగ్నిపుత్రుడు) నీలతీర్థమున్నది. గవాక్షుడు అంగదుడు ఇత్యాది వానర శ్రేష్ఠులు తమపేర తీర్థములు నిర్మించిరి. వీరెల్లరు శ్రీరామచంద్రుని

పూజించి తమ తమ తీర్థముల స్నాన దాన పూజాదికములవలన నరులకు సుఖప్రాప్తియు, పాపనాశనమగునట్లును వరములు వడసిరి. విభీషణకృతము తీర్థమన్యమున్నది. కుంభీపాకాది నరకనాశన కరము. విభీషణ మంత్రులు నలువురు చేసిన తీర్థములున్నవి. ఇవి సంపత్ప్రదములు — రామ సేతువున సరయువు రామేశ్వరు సన్నిధి సదాయుండును. గంగాది దివ్యనదులు, పుణ్యాశ్రమములు గిరులు గంధమాదనమున కామరూపముల ఆశ్రయించి యుండును. ఎందువలన అటపతీర్థస్నానమయినను భుక్తి ముక్తిదము, పాపనాశనము, అనంతఫలదమున్ను. శ్రీరామచంద్రుని కోరిక ప్రకారము ముక్కోటిదేవతలు దేవర్షులు ఇట గంధమాదనముననే అంశారూపములనుందురు.

*

# బ్రహ్మ ఖండము

## 43-వ అధ్యాయము

రామనాథ వైభవము – శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠించిన లింగము రామనాథేశ్వరము. దర్శనమాత్రమున నరులు ముక్తి వడయుదురు. కృతయుగమున పది సంవత్సరములలో సాధించిన పుణ్యము. త్రేతాయుగమున ఒకసంవత్సరమున సాధించిన పుణ్యము, ద్వాపరమున ఒకమాసమున సాధించిన కలిలో ఒకదినమున ఆర్జించిన పుణ్యము, దానికి కోటిగుణితము ఒకనిమిషము రామనాథేశ్వరు దర్శనమాత్రమున పొందగలరు. రామేశ్వర మహాలింగమున సకల తీర్థములు, సర్వదేవతలు, ఇది సన్నిధినుందురు. స్మరణమాత్రమున సర్వకామఫలప్రదము, పాపనాశనము, ముక్తిదము.

కాశీగయా ప్రయాగాది క్షేత్రముల దర్శనఫల మొకనిమిషము రామనాథదర్శనమున లభించును. దుఃఖములు పోవును. నరక స్పర్శయుండదు. ఈ మహాలింగమును కీర్తించిన, దర్శించిన, పూజించిన రుద్ర సారూప్యమలవడును, అగ్నిలోవైచినవెల్ల భస్మమయినట్లు రామేశ్వరు దర్శనమున పాపసంఘము నశించును. సర్వవర్ణముల వారికి దర్శనమాత్రమున భుక్తిముక్తులు లభించును.

ఊర్ధ్వరేతస్కులగు యోగులకు అలవడు మహాపదము సర్వ జంతువులకు రామేశ్వర దర్శనముననే లభించును. అల్పమాత్రదాన మీ క్షేత్రమున అక్షయఫలప్రదమగును. మహాదేవు, త్రిలోచను, రామ నాథేశ్వరు నే నరుడు శరణందునో ఆతనికి లాభము, జయము కలుగును. త్రికాలములయందు దర్శన పూజన ధ్యానాదిక ఫలమింత

యని తెలుప శక్యము కాదు. రామేశ్వరునికి గోక్షీరములతో అభిషేకము చేయించిన అతని కులమున ఇరువదియొక్కతరమువారు పవిత్రులై శివసాయుజ్యమందుదురు. ఇటులనే, ఇక్షురసము నారికేళ ఫలవారి వీనిచే లింగమున కభిషేకము చేయించిన సర్వపాప నాశన మగును. అరటిపండ్ల గుజ్జు లింగమునకు పూయించిన పాపఘ్నము. చందనముతో కలిపిన నీటిధారలచే స్నానము చేయించిన గంధర్వ లోకప్రాప్తి. పుష్పామోదముతో కూడిన జలములచే నభిషేకించిన స్వర్గప్రాప్తి. పాలిచ్చు గోవును క్షేత్రమున రామేశ్వరున కర్పించిన అశ్వమేధ ఫలప్రాప్తి. ఛిన్నభిన్నములయిన క్షేత్ర ప్రాకారములు బాగుచేయించిన అనంతఫలప్రదము. రామేశ్వరునుద్దేశించి స్వల్పము దానమిచ్చినను అష్టైశ్వర్య ప్రాప్తియగును. పాలతో అభిషేకము చేయించిన ఆ మరణాంతము, ముసలితనము రాకముందు, ఇంద్రియ వైకల్యము రాకమున్ను. సుఖములే వడయుదురు. పురాణముల శాస్త్రముల వివరించిన ధర్మములన్నియును ఒక వంక, పయసా అభిషేకము ఒకయెత్తున తులతూగగలదు.

# బ్రహ్మ ఖండము

## 44-వ అధ్యాయము

శౌనకాది మహామునులు సూతు నడిగిన ప్రశ్న — శ్రీరామచంద్రులు ఏవిధానమున రామలింగేశ్వరుని ప్రతిష్ఠించెనో తెలుపుమని. — సూతుని సమాధానము — సీత రావణునిచే అపహృతకాగా కపిసేనతో సేతువునిర్మించి సముద్రముదాటి లక్ష్మణసహితుడై లంకాపురిచేరి పౌర్ణమినాడు రాత్రి, సూర్యుడస్తమించిన అనంతరము సువేలాద్రి వధిరోహించి, తన సౌధాగ్రమున నిలచిన లంకాపతి రావణుని, చూచెను. సుగ్రీవుడు రావణుముకుటమును (కిరీటమును) తన్ని నేలపడవేయ, గృహములోనికేగెను.

అనంతరము రామచంద్రుడు తనవారితో గిరినుండి క్రిందకు దిగి లంకాసమీపమున విడిసెను. రావణానుచరులు మహావీరులు వానరసైన్యముతో తలపడి ఎల్లరును మరణించిన, అంతమున రావణుడు రణరంగమునకు రాగా రామరావణులకు ద్వంద్వయుద్ధము జరిగెను. అటులనే లక్ష్మణునితో ఇంద్రజిత్తు, విరూపాక్షునితో సుగ్రీవునకు, ధూమ్రునితో నలునకు, ఇతరులతో వానరవీరులకును రాక్షసవీరులకును ద్వంద్వయుద్ధము సంభవించెను. రావణ ప్రేరితమయిన సైన్యమంతయు నశించినది. ఇంద్రజిత్తు ప్రయోగించిన నాగాస్త్రము గరుడునిచే తిరస్కరించబడినది. ప్రహస్తుడు విభీషణునిగదతో తాడించ అష్టగంటలతోకూడిన శక్తి నభిమంత్రించి విభీషణుడు ప్రహస్తుని శిరముపై ప్రయోగించెను. ఆశక్తిపాతమున ప్రహస్తుడు మరణించెను.

ధూమ్రాక్షుడు కపిసేనపై బడగా హనుమ వానిని సంహరించెను. కుంభకర్ణుని రణమునకు రావణుడు పంపెను. లక్ష్మణు

డాతనిని బ్రహ్మాస్త్రము ప్రయోగించి యమసదనమునకు పంపెను. విశ్వకర్మ సుతుడు నలుడు వజ్రదంష్ట్రుని హతమార్చెను. వానరవీరుడు కుముదుడు అకంపనుని మట్టుపెట్టెను. లక్ష్మణునిచే అతికాయుడు ప్రాణములు వీడెను. దేవాంతక నరాంతకులు సుగ్రీవునిచేతను, కుంభ కర్ణసుతు లిరువురు హనుమంతునిచే, ఖరునికొడుకు మకరాక్షుడు విభీషణునిచేతను హతులయిరి. రావణుడు ఇంద్రజిత్తును రణమునకు పంపెను. ఇంద్రజిత్తు అదృశ్యుడయి రామలక్ష్మణులను కపులను బాధించి మేఘముల చాటున కన్పడకపోగా, రాజరాజు-(కుబేర) శాసనమున గుహ్యకు లిరువురు జలములతెచ్చిరి. విభీషణుని వాక్య ములు విని ఆ జలములతో సర్వుల నేత్రములు క్షాళనముచేయ, అదృశ్యుడయ్యు వారల కింద్రజిత్తుకన్పించెను. లక్ష్మణునిచే ఇంద్ర జిత్తు నిహతుడయ్యెను. రామునిచే మూలబలమంతయు నశించినది.

ఇంద్రుడు మాతలిచే దివ్యఅశ్వములతో రథమును పంపి దాని నధిరోహించి బ్రహ్మాస్త్రమున రావణుని జయించుడని పంపగా, రాముడటులనే రావణుని సంహరించెను.

దేవతలు బుషులేతెంచి రామునికి జయవెట్టిరి. పుష్పవర్ష ములు కురిపించిరి. విభీషణుని లంకారాజ్యమునకు పట్టము గట్టి లంకనువీడి సర్వులను పుష్పకవిమానమున ఆసీనులజేసి సీతాలక్ష్మ ణులతో రాముడు గంధమాదనమునుగూర్చి పయనించెను. దండకా రణ్యావాసులు మునులు రామచంద్రుని దర్శించవచ్చిరి. వారెల్లరు రామచంద్రుని నుతించిరి. రామచంద్రుడు అనంతరము కృతాంజలి యయి మునుల కిట్లనెను:

"నేను సకలమానవకోటి రక్షణమునకవతరించితిని. నాదృష్టి గోచరమయిన జంతువు నిత్యమోక్షప్రాప్తి గాంచును. అయినను విప్రులు నాకు పూజ్యులు. రావణుని సంహరించిన పాపముశమించు నుపాయము తెల్పు" డనెను.

మునుల వాక్యము - సత్యవ్రతుడవు, జగన్నాథుడవు, రక్షా భారము వహించిన దైవమవు. లోకోపకారార్థము శివార్చనము గావించుము. గంధమాదన సమీపమున, సముద్రతీరమున శివలింగమును ప్రతిష్ఠించుము, రావణవధ వలనిపాపము శమించును. నీచే స్థాపితమయిన లింగదర్శనమున కాశ్యాదిక్షేత్రముల లింగార్చన ఫలము లభించును. ఇది అనంతకోటి ఫలప్రదమగును.

మునుల వాక్యములు విని శ్రీరాముడు హనుమంతుని కైలాసమునకేగి శివలింగము తెమ్మని పంపెను. రెండుఘడియల కాలమే సుముహూర్తము, అతిత్వరితము తేవలెనన హనుమ ఆకాశ గమనమున మనోవేగమున కైలాసమునకేగి లింగరూపు శివుని కానక తపముచేయసాగెను. హనుమరాలేదు. ముహూర్త మతిక్రమించినది, సీత లీలగా సైకత లింగము చేసినది. మునులు దానినే స్థాపించగోరిరి. జ్యేష్ఠమాసము, శుక్లపక్షము-దశమిన రాముడు శివలింగమును స్థాపించెను. పార్వతితో లింగమున శంకరుడు ప్రత్యక్షమాయెను. శంకరుని వాక్యము - "నీవు స్థాపించిన ఈ లింగదర్శనమున మహాపాపములన్నియు నశించును. ధనుష్కోటి, సర్వతీర్థములు సేవించిన లభించు ఫలితములు ఈ నీ లింగదర్శనమున లభించును." శ్రీరాముడు రామేశ్వర లింగమునకెదుటిభాగమున నందికేశ్వరుని స్థాపించెను. అభిషేకమునకై ధరను భేదించి ఒకకూపము సృష్టించెను. ఆ కూపజలములచే శంకరు నభిషేకించెను.

*

# బ్రహ్మ ఖండము

## 45-వ అధ్యాయము

ఈ విధముగ రామచంద్రుడు రామనాథేశ్వరలింగ ప్రతిష్ఠ చేసిన తరువాత మారుతి లింగముతో అతి శీఘ్రగమనమున వచ్చెను. సైకతలింగమును పూజించుచున్న వారిని కని కోపించెను. "రామా! నాశ్రమ వృథాఅయినది. రాక్షసులచే పలుబాధలు సహించితిని. ఏ తల్లియు నావంటివానిని కనకుండు గాత. భవసాగరమున అనంత దుఃఖమనుభవించు నావంటి సుతునిగన్న మాత కేమిసుఖము? పూర్వము సేవచేసి ఖిన్నుడనయి యుద్ధమున అధికముగ శ్రమపాలయితిని. రామా! వానరుల నెల్లరను విడచి నన్నే ఈ కార్యమునకేల నియోగించితివి! కైలాసమునకేగి లింగమును కానక సాంబుని తపస్సుచే సంతోషపెట్టి లింగమును శంకరుప్రసాదమున గైకొని త్వరితగతి యేతెంచితిని. నీవు సైకతలింగమును ప్రతిష్ఠించితివి. కైలాసమునుండి తెచ్చిన ఈ లింగము వృథాశ్రమయేకదా! జానకీరమణా! ఈదుఃఖము నేను సహించలేను. నేనేమిచేయను. ఎటకుపోదును. గతిఏది. నీవవమానించుటచే ఈ శరీరము నేత్యజింతును" అనుచు క్రోధశోకమూర్ఛితుడై రామున కంజలించచు నేలపై వ్రాలెను. రాముడు నవ్వుచు హనుమకిట్లనెను.' నాకంతయును తెలియును. నాకార్యము, పరులకార్యము నాకు తెలియక పోలేదు. స్వీయ కర్మవలన జంతువు జననమరణ చక్రమున భ్రమించుచుండును. పరమాత్మ నిర్గుణము. తత్త్వమిట్టిదని తెలిసికొని దుఃఖము మానుము. ప్రకటితమయిన పాంచభౌతికసృష్టి జాలము నతిశయించి జ్యోతి ఒక్కటియే. నిరంజనము, నిరాశ్రయము, నిర్వికారము నిత్యము

అయిన ఆత్మను దర్శించుము. తత్త్వజ్ఞానమునకు విఘ్నము కల్పించు శోకమేలపొందెదవు? ప్రాణిహింస విడిచి ధర్మము నాశ్రయించుము. ఇంద్రియముల జయించి సాధుపురుషులను సేవించుము. ఇతరుల దోషమును కీర్తించుట మానుము. సదా శివ విష్ణ్వాది దేవతలను పూజించుము. దుఃఖము మానుము. సత్యమేపలుకుము. చందనాగురు కర్పూరాదులు స్పర్శమాత్రమున మలినములగు - ఈ శరీరమువలన సుఖమెటులుండును. మనోహరములయిన భక్ష్యభోజ్యాదులు మలమగు శరీర స్పర్శవలన సుఖమెట్టిది ?

హృద్గతములయిన కామములు విడనాడి ఇటనే మర్త్యుడమర్త్యుడగును. అహోరాత్రములు గడచిపోవుచు నరుల ఆయువు క్షీణించుచున్నది. నిలబడినా పర్విడినా ఆయువు నశించును. నదీ వేగమున కాష్ఠములు సంయోగ వియోగములందునట్లు భార్యాపుత్రాదులతో సంయోగవియోగము కలుగుచుండును. సద్రూపము, అమలమగు బ్రహ్మమునే దివానిశలు చింతించుము. నీవుతెచ్చిన లింగమును శుభముహూర్తమున స్థాపింతును. అది నీపేరిట ఖ్యాతి గాంచును. నీలింగము హనుమదీశ్వరమును పూజించిన అనంతరమే నాచే ప్రతిష్ఠితమయిన లింగమునర్చించిన ఫలప్రదమగును.

ఈ ఉభయలింగముల ననేకయోజనముల దూరమునుండియు స్మరించినంతమాత్రముననే సాయుజ్యమునందుదురు. ఏకాదశరూపుడీ శివుడు, జానకి, లక్ష్మణ, విభీషణ, అంగద, నీలఇత్యాదులు స్థాపించిన వీనియందే సదా సన్నిహితుండయి యుండును. పోనిమ్ము. ఈలింగమును తీసివేయుము. ఆస్థానమున నీవుతెచ్చిన లింగమును ప్రతిష్ఠింతును విచారించకు" మన హనుమ సంతోషించి సైకతలింగమున తీసి వేయ బలమున దానినెత్తబోయెను. కాని అది చలించలేదు. తోకను లింగమునకు చుట్టి బలమంతయు నుపయోగించియు కదల్పలేక

పోయెను. భూమి సప్తద్వీప సప్తకుల పర్వతములతో కదిలి, రక్తము కక్కుచు క్రోశదూరమునపడి మూర్ఛిల్లెను. నవరంధ్రములనుండియు రుధిరము స్రవించసాగెను. ఆ ప్రదేశమున రక్తకుండమేర్పడెను. సీతారామలక్ష్మణులు కపులును హనుమపడియున్న తావునకు పర్విడిరి. తాత తాత అనుచు సీత హనుమంతుని స్పృశించినది. హనుమ శరీరము తనతొడపై నిడుకొని రాముడు నిమురసాగెను. కన్నీరుకార్చుచు సీతారాములు వాయుసూనుని చూడసాగిరి.

# బ్రహ్మ ఖండము

## 46-వ అధ్యాయము

ఇంకను హనుమంతునితో రాముడనుచున్నాడు. "వానర శ్రేష్ఠుడా, పంపారణ్యమున మేము దీనస్థితిలోనుండ నీవు మమ్మాశ్వాసించి సుగ్రీవునితో సఖ్యమొనరించితివి. నిన్నుచూచుకునియే మేము జనకుని, కౌసల్యను, బంధువులను స్మరించక సుఖభావమున నుంటిమి. నీవు మాకనేకరీతుల ఉపకరించితివి. మా నిమిత్తమే నీవు దుర్ఘటమయిన సాగరము లంఘించితివి. మా నిమిత్తమే నాగమాతను సురసను నీవు జయించితివి. ఛాయాగ్రాహిణిని చంపితివి. సాయంకాలమునకు లంకలో ప్రవేశించి సువేలాద్రినిచేరి లంకిణిని చంపితివి. రాత్రికాలమున లంకలో ప్రవేశించి వెదకి సీతను అశోకవనమున చూచి మా ఆనవాలు సీతకిచ్చి అనంతరము ఎనుబదివేలు రాక్షసులను ఇనుపకంబమునుత్పాటించి దానితో చంపితివి. అభిజ్ఞానముద్ర సీతకిచ్చి చూడామణితెచ్చి మాకొసంగి సుఖవార్తతెల్పితివి. రావణసైన్యమును, ప్రహస్తుని కుమారుని, జంబుమాలిని, ఏడుగురు మంత్రిపుత్రులను నానిమిత్తమే మహాపరాక్రమముచూపి మట్టుపెట్టితివి. ఇంద్రజిత్తునకు ఇష్టముననే కట్టువడి రావణుని తృణీకరించి లంకనంతను కాల్చివైచితివి. తిరిగి ఋష్యమూకాద్రికి వచ్చితివి.

ఇట్టి పాట్లన్నియును నానిమిత్తమే నీవనుభవించితివి. నీవు బ్రదుకకున్న మేము ప్రాణములు త్యజింతుము. సీతాలక్ష్మణులతో సోదరులతో నాకేమి కార్యమున్నది. తెమ్ము శీఘ్రముమే కందమూలములు తెమ్ము. స్నానము చేయవలయును. కలశము తీసికొనిరా, అజినము, దర్భలు వస్త్రములు తెమ్ము. లక్ష్మణ ప్రాణదాతవు.

హానుమ! అంజనాసుత! సీతాశోకవినాశన! మమ్మువిడిచి ఇట్లేల నేలపై శయనించితివి. అయోధ్యకు మాతో నీవు రావలదా.''

ఇట్లు దుఃఖించ నెమ్మదిగా హానుమ కనులుతెరచి భక్తిచేత మున లేచి రామచంద్రు నిటులనుతించెను.

"నమోరామాయ విష్ణవే ప్రభవిష్ణవే ఆదిదేవాయ దేవాయ।
భక్తార్తిహారిణేతుభ్యం సీతాయాఃపతయేనమః॥
రక్షమాం కరుణాసింధో రామచంద్ర నమోనమః॥

ఇట్లు నుతించ రామచంద్రులానందించి హానుమతో నిట్లనుచున్నారు:

"నేను స్థాపించిన ఈ లింగమును లోకముల ఎవ్వరును పెకలించలేరు. నీవు సాహసము చేసితివి. మహాదేవుని కపరాధ మొనరించి ఇట్లయితివి. ఇక ముందెన్నడును శూలికి ద్రోహము తలపెట్టకుము. నీవు పడిన ఈ తావున ఈ కుండము నీపేర ఖ్యాతిగాంచును. ఇందు స్నానముచేసిన మహాపాతకములు నశించును. గంగాయమునా గౌతమీ నదీత్రయమున స్నానముచేసిన ఫలము ఈ కుండస్నానమువనే లభించును. దుర్లభమయిన నీకుండముచేరి పితరులనుద్దేశించి శ్రాద్ధాదికముచేయకున్న ఆ పితరులకు మోక్షము లేదు. మునులు, దేవతలు ఆనరుని కోపింతురు.'' రామాజ్ఞచే హానుమ తానుతెచ్చిన లింగమునట స్థాపించెను. నేటికిని ఆలింగమున హానుమతోక చుట్టియున్నది.

*

# బ్రహ్మఖండము

## 47-వ అధ్యాయము

మునుల ప్రశ్న రాక్షసులు ద్విజులా? రావణుని వధించిన కారణమున రామునకు బ్రహ్మహత్య సంక్రమించుట ఎట్లు? దీనికి సూతుని సమాధానము:

బ్రహ్మ కుమారుడు పులస్త్యుడు. అతని కుమారుడు విశ్రవసువు. ఇతడు చిరకాలము దేవతలనుగూర్చి తపముచేసెను. ఆసమయమున సుమాలి అను రాక్షసుడు పాతాళమునుండి భూలోకమునకు వచ్చి అంతటా విహరించసాగెను. విశ్రవసువు కుమారుడు కుబేరుడు విమానమున విహరించుచుండ సుమాలి తన తనయతో తిరుగువాడు ఈ కుబేరునివంటి పుత్రుడు మాకు జనించిన మాకులము వృద్ధియగు నను చింతచేసెను. ఆ సుత పేరు కైకసి. 'నేను తిరస్కరింతునని నిన్నెవ్వరును యాచించరైరి. నిన్ను యౌవనవతిని తగిన వరున కీయకున్న మాకుదుఃఖమేకదా? నీవెవరిని వరింతువో అనే దుఃఖము నన్ను పీడించుచున్నది, నీవు స్వయముపోయి బ్రహ్మకులోద్భవుని ముని విశ్రవసుని వరించుము. కుబేరతుల్యుడు తనయుడు నిశ్చయముగ నీకుదయించగలడు.' అన కైకసి జనకునివాక్య మంగీకరించి పర్ణ శాల ముందుకేగి మునిముందు సిగ్గుతో తలవాల్చి నిలబడెను. ఆ సమయమున విశ్రవసువు అగ్నిహోత్ర శాలలో అగ్ని నుపాసించుచుండెను. తనకార్యము తీర్చి ఆమెనుకని విశ్రవసు వామెతో నిట్లనెను:

"నీ వెవరితనయవు, ఇట కెందుల కేతెంచితివి, ఏకార్యము నీకు కావలయును, నిజము తెల్పుము." ఆమె చేతులు జోడించి మునికిట్లనెను. "పులస్త్యకుల దీపకుడవు. తపఃప్రభావమున నా

మనసు తెలియగలవు కదా. నాతండ్రి పనుపున నేను నీవద్దకువచ్చితిని. మిగిలినది జ్ఞానదృష్టి తామే తెలియవలెను." అన ముని క్షణము ధ్యానించి, కుమారునికోరి నీవు వచ్చితివని తెలిసికొంటిని. కాని ఇది క్రూరమయినకాలము సాయంకాలము. రాక్షసులు క్రూరకర్ములు నీకు సుతులుదయింతురన కైకసికేల్మోడ్చి మునీంద్రా మీవలన నిట్టి తనయులు జనించుట శుభముకాదుకదా అన అందొకడు ధార్మికు డుండుననెను. ఆమె మున్యాశ్రమమున కొంతకాలముండి సకాల మున ముంగగా పది తలలుగల రావణునికనెను. దశగ్రీవుడని విఖ్యాతనామము. అనంతరను కుంభకర్ణుడు పుట్టెను. తరువాతకన్య శూర్పణఖ క్రూరురాలు జనించెను. తుదివాడు విభీషణుడు కలి గెను. ఈతడు ధీమంతుడు, వేదశాస్త్రవిదుడు, ధర్మాత్ముడు. ఈ హేతువుచే రావణ కుంభకర్ణుల వధవలవ రామచంద్రునకు బ్రహ్మహత్యాపాతకము సంక్రమించినది. బ్రహ్మహత్యానాశనమను తీర్థమేర్పడినది. రావణుడు నేడును ఛాయారూపమున అట నున్నాడు. దానిమీదనే బిలమున్నది. దానిపైననే మండపము నిర్మింపబడినది. రక్షార్థము రాముడు భైరవుని స్థాపించెను. భైరవు నకు భయపడి బిలమునుండి పైకి బ్రహ్మహత్య రాజాలక అందే యుండెను. రామనాథేశ్వరున కిరువలంకుల సూర్యచంద్రులున్నారు. ఎదుట అగ్నిదేవుడున్నాడు. ఆవల ఇంద్రుడున్నాడు. దక్షిణభాగ మున యముడు ఇట్లే ఎనిమిది దిక్కుల దిక్పాలురున్నారు. లింగ మున కీశాన్యముగ వినాయకుడు, కుమారస్వామి కలరు. రామ నాథుని నైవేద్యభోగాదులకు అనేక గ్రామములును, బంగారు ఆభరణములును శ్రీరామచంద్రుడు కల్పించి ఇచ్చెను. నరులు స్నానము చేతురు కాన గంగాదినదులు వారి పాపములను తాముగ్రహించి, తమ పాపములు పోవుటకై అంశారూపమున రామనాథేశ్వరు సేవకై ఆతీర్థమునసే యుండును.

# బ్రహ్మఖండము

## 48-వ అధ్యాయము

రామనాథేశ్వరుని గురించి ఒక పావనమయిన గాథ:—

శంకరుడను పేరుగల పాండ్యరాజుడు కలడు, వైదికాచారమన ఇష్టము, పురాణములు స్మృతులు తెలిసినవాడు. నిత్యము శివ విష్ణ్వాది దేవతలను పూజించువాడు. బ్రాహ్మణులకు నిత్యము మహాదానములు చేసి సంతృప్తి చేయువాడు ఒకనాడు తపోవనములకు వేటకేగెను. అనేకులు సైనికులతో ఆఖేటమున సహచరులతో మహారణ్యమున ప్రవేశించెను. అతని వేషము: పాదుకలచే గూఢముగ చరణములున్నవి. ఎఱ్ఱనిపాగ, పచ్చనిబట్ట, వ్రేళులకు గోధాంగుళి, విల్లమ్ములు చేనందెను, నడుముకు ఖడ్గము, తెల్లని గుఱ్ఱము, ఇటుల సేనతో వనవిహారముచేయుచు రమ్యమయిన అడవులు, పర్వతములు, దాటుచు మృగములను వెదుకసాగెను. అతడు సింహపరాక్రముడు, చంపుడు చంపుడు అదిగో మృగమన గుఱ్ఱమును పర్వెత్తించి రాజే దానిని చంపెను. పర్విడు సింహాదులను చంపుచు ఒకచో వ్యాఘ చర్మధరుని మునినిచూచి వ్యాఘ్రమనుకొని బాణపాతమున చంపెను. ఆ బాణము చేతనే పతిప్రాణ రక్షణార్థము అతని సరసనున్న పత్ని కూడ మరణించినది. చనిపోయిన తలిదండ్రులకు రోదించుచు వారల కుమారుడు వారిమీదపడి ఏడ్చెను 'తాత! నీవులేక నాకు వేదశాస్త్రము లెవరు బోధింతురు. అమ్మా! నాకు భోజనము ఎవరు పెట్టెదరు. కులాచారాదులెవరు నాకు తెల్పుదురు? మిమ్ములను ఏపాపి ఈ ఆశ్రమ ప్రాంతమున చంపెనో?' ఆరోదనము విన్పించుగుహవద్దకు శంకర నృపుడేగ, ఇంతలో సమీపమున నున్న మునులును అటకేతెంచిరి. మునులు బాలునితో నాయనా ఏడవకుడు, మృత్యువు సమవర్తి. బాలవృద్ధ

విభేదము నెంచడు. పుట్టుకతోనే మృత్యువు వెన్నంటియేయుండును. కాలము వచ్చిన, నీవు, మేము, శరీరము విడవవలసిన వారమే. ఏకులము, ఏవయసు వాడయినా మృత్యువు వాత పడవలసినదే. విచారించుట మంచిది కాదు. అద్వయము సచ్చిదానందము, ఆత్మశుద్ధము, నిత్యము. చనిపోయినవారు బందుగులు ఏడువ ఆ కన్నీటిని త్రాగవలసిన వారగుదురు. కుమారా నీతలిదండ్రులకు శ్రాద్ధకర్మచేయుము. అన శాంతించి జాంగలుడు, శాకల్యముని తనయుడు, పితరులకు సర్వము పితృమేధ మొనరించెను. మరునాడు అస్థులనుతీసికొని హాలాస్యమున కేగెను. అనంతర మీ కుమారుడు జాంగలుడు రామేశ్వరము చేరెను. మునులు తెల్పిన రీతిని అస్థులు తీర్థముల కలిపి శ్రాద్ధాదులొనరించి యొక సంవత్సరము రామేశ్వరముననే యుండెను. ఆబ్దికము పెట్టెను. రాత్రి కలగనెను. తలిదండ్రులు శంఖచక్ర గదాధరులయి గరుడ వాహనారూఢులయి తులసిమాలాలంకృతులయి, మకరకుండలములు తేజరిల్ల, ఉరముల కౌస్తుభమణులు దాల్చి కన్పించ జాంగలుడు సుప్రసన్నుడయి తన ఆశ్రమమునకే తిరిగిపోయి సుఖముగ నుండెను. తన కల అట మునులకు తెల్ప వారు సంతసించిరి.

రాజునతో మునులు బ్రాహ్మణదంపతులను చంపితివి. నీ శరీరము అగ్నికాహుతి గానిమ్ము. అన మీ సన్నిధినే బ్రహ్మహత్యా పాపము పోనాడ అగ్నికాహుతి అయ్యెదననుచు మంత్రులను పిలచి నా కుమారుని సురుచికి రాజ్యాభిషేకము చేసి మీరు పాలన సాగించుడనెను. మంత్రులు మీరు విచారించవలదు. దైవవిధి శిరసావహించవలసినదేయనిరి. త్వరలో కర్రలుతెచ్చి అగ్ని సిద్ధము చేయుడన వారటులనే యొనరించిరి. రాజు మనసార ఉమాపతిని ధ్యానించి అగ్నికి; బ్రాహ్మణులకు ప్రదక్షిణ మొనరించి చితి నెక్కనారంభించెను. అశరీర వాణి మునులకటనున్న వారెల్లరకు మంత్రులకు రాజునకు ఇటుల విన్పించెను "భో! భో! మహారాజ! అగ్నిలో

పడవలదు. వెంటనే నీ వేగి రామనాథేశ్వరునకు అభిషేకము, పాయసాన్నములతో నైవేద్యము, సమస్త భోగములు జరుపుచు ఒక సంవత్సరము సేవించుము. నీ పాపము పోవును" అన ఆవిధముగనే రాజాచరించెను. సంవత్సరాంతమున శంకరులు ప్రసన్నులుకాగా రాజు శంకరునుమాపతిని నుతించెను. "రక్ష రక్ష దయాసింధో। పాహిమాం। నిష్పాపునిగ నన్నొనరించుము. మరల మరల నమస్కరించుచున్నాను. పాపశమనము చేయుము." అన రాజుముఖమునుండి బ్రహ్మహత్య బయటికిరా రుద్రశాసనమున భైరవుడు దానిని సంహరించెను. రాజు కృతార్థుడయి మంత్రిపురోహిత సేనావారముతో తన పురమునకేగెను. దేహాంతమున రామనాథేశ్వరుల చింతనమున శివసాయుజ్య మందెను.

*

# బ్రహ్మ ఖండము

## 49-వ అధ్యాయము

రామనాథస్తోత్ర అధ్యాయము :

మహాపుణ్య ప్రదము. శ్రీరామచంద్రుడు లింగముప్రతిష్ఠించి శూలినినుతించెను. ఆ విధముగనే లక్ష్మణుడు సీత, సుగ్రీవాదికపులు బ్రహ్మాదిదేవతలు అగస్త్యాదిఋషులు ప్రత్యేకముగా రాఘవేశ్వరుని నుతించిరి. ఆ యా నతినిట విన్పింతును, చదివిన, విన్నముక్తి యబ్బడును. శ్రీరామచంద్రుడిటుల నుతించెను. "మహాత్ముడు, మహామాయాసమన్వితుడు, శూలి, భక్తుల ఆర్తిహరించువాడు, సర్వభూషణుడు. దేవతల కధిదైవము, సర్వసాక్షి, వేదాంతములవలన తెలియదగినవాడు, యోగులకు తత్త్వము తెల్పుదైవము, ఆనందపూర్ణుడు విశ్వనాథుడు, శంభవుడు, సాక్షాత్పరాత్ముడు, అద్భుతవీర్యుడు, మహాపాతకముల నశింపచేయువాడు. కాలానికేకాలుడు, కాలస్వరూపుడు, కాలాతీతునకు నమస్కారము, పార్వతీపతి, కైలాస నిలయుడు, గంగాధరుడు విరూపాక్షునకు నమస్కారము. అని శ్రీరామచంద్రుడు రామనాథేశ్వరుని నుతించెను. లక్ష్మణనుతి - "త్రిపురఘ్నుడు పార్వతీజీవితేశుడు, గణేశస్కందులకు జనకుడు, సూర్యచంద్రాగ్నులు, కనులుగాగలదైవము" సృష్టిస్థితిలయములకు హేతువయినదైవము మహాదేవుడు, వరదుడు, వరములిచ్చు భక్తసులభుడు, సంసార రోగము మాన్పువాడు, గణముఃకుపతి. అసన్మార్గమున రతినాకు కలుగకుండుగాక, వైదికాచారముననే నాకాసక్తియుండుగాక, పరమకారుణికుడవు, సదా నీ పదపద్మములయందే భక్తినాకుండుగాక నమో శర్వాయ". సీతానుతి - "నాథ త్వయందచంచలభక్తినాకిమ్ము. దేవా, గంగాధర, విరూపాక్ష, నీలలోహిత, శంకర, రామనాథ నీకు

నమస్కారము, రక్షమాం కరుణాకర, పరేశ పరమానంద శరణాగత పాలక, పాతివ్రత్యము సదానాకిమ్ము. నీకు ఇవే నమస్సులు". హనుమ అంగదుడు, జాంబవంతుడు, నీలుడు, నలుడు, కుముద పనస ఇత్యాది కపులు రామేశ్వరుని స్తుతించిరి.

సుగ్రీవుడు "సంసారసాగరమున మునిగి తేలు నన్ను రక్షించు. గిరిజానాథ! రామనాథ! నీకు నమస్కారము". విభీషణునినుతి "సంసారమున మార్గము తెలియక అంధునివలెనున్న నాకు జ్ఞాన నేత్రము ప్రసాదించుము దేవాధిదేవా, సచ్చిదానందరూపా". బ్రహ్మాదిదేవతలు, అష్టదిక్పాలురును నుతుల సంతసపరచిరి. బృహస్పతి "నిత్యుడవు, నా అజ్ఞానము తక్షణమే నశింపచేయుము దేవా." అగస్త్యులనుతి "ఆదిదేవ, మహాదేవ, విశ్వేశ్వర, శివ, అవ్యయ, ప్రసీద నా అపరాధములు క్షమించుము, పుత్రాదులయందలి మమకారము విడిపించుము." ముక్తినిమ్ము. ఈ విధముగ రామాదులు దివ్యులు దివ్యర్షులు దిక్పాలురు స్తోత్రముచేసిరి. వారలనుతులకు సంతసించి ప్రత్యక్షమయి రామేశ్వరులనుచున్నారు "మీవలన ఆదరమున చేయబడిన ఈ స్తోత్రాధ్యాయము ఎవరుచదివిన విన్న, విన్పించిన నా అర్చాఫలము లభించును. రామచంద్ర ధనుష్కోటి సంవత్సరముస్నాన జపాదు లొనరించిన ఫలమే అధ్యాయ శ్రవణమున లభించును. జన్మజరా దుఃఖములుండవు."

*

# బ్రహ్మఖండము
## 50-వ అధ్యాయము

### సేతుమాధవ వైభవము:

పూర్వము చంద్రవంశపురాజు పుణ్యానిధి కలడు. హాలాస్యేశ్వర నిలయమయిన మధురను పాలించెను. ఆ రాజు ఒకనాడు చతురంగ బలములతో అంతఃపుర పరివారముతో, మధురలో తన కుమారుని నిల్పి, స్నానకౌతుకమున రామసేతువునకు పయనించెను. సంకల్ప పూర్వము పరివారముతో ధనుష్కోటి స్నానము చేసెను. అటనున్న ఇతరతీర్థములను సేవించి భక్తిచేతమున రామేశ్వరుని సేవించుకొనెను. రాజు చతురంగబలములతో అంతఃపుర కాంతలతో పరిచారక పరిచారికలతో చాలకాలమా రామనాథ క్షేత్రముననే యుండెను. రామ సేతువుననే వసించి గంధమాదనపర్వతమున విష్ణుప్రీతికై యజ్ఞమొకటి చేసెను. యజ్ఞావసానమున పత్నులతో అవభృథస్నానము చేసెను. తిరిగి తీర్థమున తన వాసగృహము చేరుకొనెను. వైకుంఠమున కమల ఈ రాజు భక్తి పరీక్షించ తలచి వినోదమునకై హరితో కలహము చెలరేపెను. లక్ష్మి హరితో ఒక సమయము – నియము - ప్రతిన తెల్పి- దంపతు లిరువురును రాజు భక్తి పరిశీలించ తలంచిరి. లక్ష్మి ఎనిమిదేండ్లవయసు బాలికయై వైకుంఠమునుండి గంధమాదనమున కేగెను, ధనుష్కోటియందుండెను. రాజు పుణ్యానిధి – గుణనిధి యను ఇంకొక నామము - సైనికులతో పత్నితో రామ ధనుష్కోటి స్నానమునకేగెను. నియమపూర్వకముగా రాజు స్నానముచేసి తులా పురుషాది ముఖ్యదానము లొనరించెను. ఇంటికి పయనము కానుండ ఒక కన్యను చూచెను. ఆమెచిరునగవుగల, సుందరి, ఎనిమిదేండ్ల కన్య, చారువిలోచన ( అందమయిన కనులుకలది ) సర్వాంగములు సుంద రములు. ఆమెను" నీ జననీజనకులెవరు, ఇటకెందుల కేతెంచితివి. వత్సే,

నీకిటనేమికావలయును" అని ప్రశ్నించ కన్య సమాధానము - "నాకు తలిదండ్రులు బందుగులెవ్వరును లేరు. నే ననాథను. నీ కుమార్తెగా నుందును. నా తండ్రినిగా నిన్నే చూచుకొనుచు నీ గృహమున నుందును". గుణనిధి సమాధానము "నీవు కోరినట్లే సర్వ మొనరింతును. నా కొకే కుమారుడు కులపాలితుడు కలడు. తనయలు లేరు. నీ కేది కావలసిన సమకూర్తును. నా యింటికి రమ్ము నా అంతఃపురమున నివసించుము. నా పత్నికి కుమార్తెవై నీ కిష్టము వచ్చిన రీతిని ప్రవర్తించుము". కన్య రాజుతో అతని గృహమున కేగెను. రాజ పత్ని వింధ్యావలి కన్యతో ఆమెకడ కేగి ఈ వార్త తెలుప ఓంకారము స్మరించి వింధ్యావలి కన్యను స్వీకరించెను. కన్నకుమార్తె వలె ఆ కన్యను రాణి పోషించి పాలించెను. హరి వైకుంఠమును వీడి గరుడవాహనమెక్కి లక్ష్మిని వెదుక బయలుదేరెను. దేశములన్నియును తిరిగి లక్ష్మిని కానక హరి క్రమముగా రామసేతువు చేరెను. ఉద్యానోపవనమున కన్యసఖులతో పూలుకోయసాగెను. అటకేతెంచి హరి బ్రాహ్మణరూపము ధరించి, గంగాస్నానమునకేగు బ్రాహ్మణుని వలె వేషమువైచుకొని విభూతి మేన నలందుకొని కుశపాణియై శివ నామ స్మరణచేయుచు రాగా నిశ్చేష్టుడై నిలచెను. ఎనిమిదేండ్ల కన్యగానున్న తన లక్ష్మినిచూచి హఠాత్తుగా ఆగిపోయి ఆ కన్య కరముపట్టెను. సఖులతోనున్న కన్య అరచెను. ఆ కేకవిని రాజు అట కేతెంచెను. కొందరు భటులు రాజుననుగమించిరి. ఆక్రోశించుటకు కారణము ప్రశ్నించ కన్నీరుకార్చుచు కన్య తెల్పుచున్నది. "ఈ బ్రాహ్మణుడు హఠాత్తుగా నన్నుపట్టుకొనెను. చూడు తండ్రీ ఈ వృక్షమూలమున నిర్భయముగ కూర్చునియున్నాడు". ఆ మాటలువిని రాజు గుణనిధి వెంటనేపోయి ఆ బ్రాహ్మణుని పట్టుకొని రామనాథాలయమునకు తెచ్చి శృంఖలాబద్ధునొనరించెను. కన్యనూరడించి శుద్ధాంతమునకు కొనిపోయెను. రాత్రి నిదురలో కలగనెను. కలలో బ్రాహ్మణుని చూచెను.

ఆ బ్రాహ్మణుడే శంఖచక్రగదావనమాలా విభూషితుడుగా కాలమేఘశ్యాముడుగా, శేషపర్యంకశాయిగా, నారదాదిమునులు నుతులుచేయ, తన కన్య పద్మాసనాసీనురాలయి, కమలము హస్తమునధరించిన మహాలక్ష్మిగా చూచెను. ఆ బ్రాహ్మణుని, తన తనయను స్వప్నమున ఆ విధముగా చూచి వెంటనే శయనమునుండి లేచి కన్యాగృహమున కేగెను. స్వప్నమున చూచినట్లే కన్య నట కాంచెను. సూర్యోదయము కాగానే కన్యతో రామనాథాలయమున బ్రాహ్మణుని నిల్పిన తావునకేగెను. ఆ మండపమున హరిరూపమున నున్న బ్రాహ్మణుని చూచెను. పుణ్యనిధి "నమస్తే కమలాకాంత! ప్రసీద గరుడ ధ్వజ, నమస్తే పుండరీకాక్ష! శ్రియఃపతే, నమస్తే శ్రీనివాసాయ నేను నీ రూపు తెలియక శృంఖలములు తగిలించితిని. నా అపరాధము క్షమించుము దేవా." కన్యారూపమున తనయింటనున్న లక్ష్మినిస్తుతించెను. హరి సంతసించి రాజుతో నిట్లనెను "నీ వపరాధము చేయలేదు. నా కిష్టమయిన యజ్ఞముచేసి నాకు ప్రియమయిన భక్తుడవయితివి. భక్తపరాధీనుడననుట కిట్లుచేసితిని. లక్ష్మి రాజుతో నన్న వాక్యములు: "రాజా నన్ను నీ గృహమున రక్షించితివి. నీ భక్తిని శోధించుటకే మే మిరువురము వినోదకలహ కారణముగా భూలోకమునకు వచ్చితిమి. మా పాదములయందచంచలమయిన భక్తి నీకుండుగాత' హరి: "నీవుశృంఖలముల నన్నుబంధించిన రూపముననే సేతుమాధవనామమున నుందును. నేనే సేతువు నిర్మించితిని కనుక దానిని రక్షించుటకే నిట నీ రూపమున నుందును. నిత్యము బ్రహ్మయు సేతువున నుండును. ఇంద్రాదిలోకపాలురు నుందురు. వారితో నే నిట నుందును. నిగళబద్ధుడనుగానున్న నన్ను సేవించినవారు సాయుజ్యమందుదురు. వారల అభీష్టములన్నియును నెరవేరగలవు-పాపశాంతియగును" రాజు యావజ్జీవము సేతువుననే గడపెను. మధురలో తనయుడు రాజ్యపాలన సాగించెను.

*

# బ్రహ్మఖండము

## 51-వ అధ్యాయము

సేతుయాత్రా క్రమము:— సంకల్ప పూర్వకము ఆచమించి రామనాథేశ్వరు ప్రీతి కొఱకు, రాఘవు ప్రీతికై, బ్రాహ్మణులకు భోజనమిడి భస్మరుద్రాక్షలు ధరించి, పంచాక్షర అష్టాక్షర మనువులు జపించుచు గృహమునుండి బయలుదేరవలెను. పాదుకలు ఛత్రము ధరించరాదు. తాంబూలము సేవించరాదు. తైలాభ్యంగన మొనరింప రాదు. సంధ్య నుపాసించి మధ్యేమార్గమున రామాయణ పఠనమో రామచింతనమో చేయుచు, ప్రతిగ్రహము చేయక, పంచ యజ్ఞములు యథాశక్తి సల్పుచు, దారిలో తటస్థించిన యతులకు భిక్ష యిడుచు, సేతుమూలము చేరుకొనవలెను. ఒక శిలను ముందుగా నీటవైచి సముద్రావాహనము చేసి నమస్కరించి సముద్రునకు అర్ఘ్యమిచ్చి ధ్యానించవలెను. ఉదధిస్నానమున కనుమతి కోరవలెను. మనసా హరిని స్మరించుచు మునులకు, దేవతలకు, కపులకు, పితరులకు తర్పణము లీయవలెను. ఏడు శిలలుగాని ఒకటిగాని దానమీయవలెను. స్నానఫలముదక్కును. పాషాణ దానమంత్రము :

> "పిప్పలాద సముత్పన్నే కృత్యే లోక భయంకరే।
> పాషాణంతే మయాదత్త మాహారార్థం ప్రకల్ప్యతామ్" ॥

సముద్రాయ ప్రణమామి. ఈ తీరున అర్ఘ్యప్రదానమునకు, అనుజ్ఞాపనమునకు, ప్రార్థనకు, మంత్రములు వివరించబడినవి. ఆ తీరుననే తర్పణ క్రమము తెలుపబడినది. పవిత్ర పాణియయి తర్పణములు విడువ వలెను. పితృపిండ ప్రదానము చేయవలెను. గో భూ తిల హిరణ్యాది దానములు శక్తిననుసరించి ఈయవలెను. ధనుష్కోటి నీ తీరున ఆచరించవలెను. తరువాత చక్రతీర్థము, పశ్చిమమార్గముగా

దర్భశయనం, కపితీర్థము, సీతాకుండము, ఋణమోచనతీర్థముల స్నానము చేయుచు రామేశ్వరమునకు నమస్కరించుచు, లక్ష్మణ తీర్థము, అనంతరము దేవాలయము చేరవలెను. అట పాపవినాశనము, గంగా యమునా సావిత్రీ తీర్థములు, సరస్వతీ, గాయత్రీ తీర్థ స్నానము చేసి హనుమత్కుండ స్నానము చేయనగును. అనంతరము బ్రహ్మ కుండము, నాగకుండము, అగస్త్యకుండము సేవించి అగ్నితీర్థమున స్నానమాచరించవలెను. ఈ తీర్థముల స్నానదానాదికములు తీర్చి రామేశ్వరుని సేవించవలెను. సేతుమాధవ దర్శనముచేసి ధనుష్కోటి స్నానముచేయ పోవలయును. నియమియయి తరువాత కోటి తీర్థము సేవించుకొనగును. మరల రామనాథుని సేవించవలెను. సేతు మాధవ సన్నిధికేగి ధూప దీప నైవేద్యములు కల్పించి ఇంటికి రావలెను. బ్రాహ్మణ భోజనము తీయవలెను. పాపములు శమించి సంతతి ప్రాపించి శుభములందుదురు. అంతమున ముక్తి కాంచెదరు. పోలేనివారు గ్రంథము చదివి మహాత్మ్యము పఠించ ఆ ఫలముతే అలవడును.

*

# బ్రహ్మ ఖండము

## 52-వ అధ్యాయము

సేతువు వైభవమునుగూర్చి ఇంకను సూతుడు వివరించుచున్నాడు. అన్నిస్థానములకన్నను ఇది ఉత్తమస్థానము, ఇట చేసిన జపము, హోమము, తపము, దానము అక్షయ ఫలప్రదము. ఈ స్థానమున ధనుష్కోటిని స్నానముచేసిన కాశిలో పదిసంవత్సరములుండి నిత్యము స్నానముచేసి శివునభిషేకించిన ఫలమలవడును. ధనుష్కోటి స్నానమాచరించి రామేశ్వరుని, శివుని దర్శించి భక్తి యుక్తుడయి మూడు దినములున్న పుండరీక పురమున పదిసంవత్సరములు వసించిన పుణ్యములభించును. షడక్షర మంత్రము అష్టోత్తర సహస్రము జపించిన శివసాయుజ్యమందును మాఘమాసమున ధనుష్కోటి స్నానము శ్రీశైలము కంచి ఇత్యాది శివక్షేత్రములన్నియును సేవించిన ఫలమలవడును. చంద్రసూర్య గ్రహణసమయములలో సేతు స్నానమున, కాశిలో (అవిముక్తము) పదిసంవత్సరములుండి నిత్యము గంగాస్నానము చేసిన ఫలముపొందును. కోటిజన్మల చేసిన పాపము శమించును.

సేతువు దర్శించిన చాలును. ఏడు జన్మలు చేసిన పాతకములు పోవును. ఇట్లే పర్వములయందు సేతుస్నానము మహాపుణ్యము. మాఘమాసము రామసేతు స్నానము, అట నివాసము వలని ఫలముతో తుల్యమన్య ప్రదేశములు రాదు. గర్భవాసక్లేశము బ్రహ్మహత్యాది మహాపాతకములు నశించును. ఎక్కడ స్నానము చేయుచున్నను రామసేతువును స్మరించి స్నానముచేసిన ఆ ఫలములందును. నరుడు ధనుష్కోటి సేవించిన వేదములు సంతసించును. పితరులు తృప్తులగుదురు. మునులు దివ్యులు తృప్తులగుదురు. ఆ నరుని కులము వారు సర్వులు

తరింతురు. అర్ధోదయ మహోదయముల సేతుస్నానఫల మనంతము. కాలముతో సంబంధములేక సేతువున ఎప్పుడు స్నానము చేసినను చెప్పిన మహాఫలములన్నియు పొందజాలును. సేతుమధ్యమున బ్రహ్మాది దేవతలెల్లరు ఈశ్వరాజ్ఞ శిరసావహించి నిత్యము సన్నిహితులయి రక్షార్థముందురు, ఇందులకు వశిష్ఠుడు తెల్పిన ఇతిహాసమొకటి కలదు. దిలీపుడు వసిష్ఠుని దానమీయ నర్హులను వివరించ ప్రార్థించెను. వసిష్ఠుని సమాధానము: ఉత్తముడు దానార్హుడు-వేదాచార పరాయణుడు. అంతకన్న ఎవని ఉదరమున శూద్రాన్నముండదో వాడు దానార్హుడు. అంతకన్న దరిద్రుడు కుటుంబికుడు దానమున కర్హుడు. సత్పురుషుడు లభించకున్న మహాదేవునుద్దేశించి ధారతో ధనము విడిచి ఎటులయిన పంచివేయవలయును. లేదా తన మనసున సత్పాత్రయున్న ఆతని నుద్దేశించి సేతుస్నానానంతరము జలముతోసహా విడిచి అదికొనిపోయి ఆ పాత్ర కీయవలెను. సేతువుతో తుల్యమయిన తీర్థము, తపము, పుణ్యము, గతియునులేదు. పుణ్యసమయములలో అర్ధోదయ ముత్తమ సమయము. అటులనే మహోదయమును. నక్షత్రములు, యోగములు, కరణములు, తిథులు ప్రత్యేక ఫలము లిచ్చునవియున్నను సేతువున ఎప్పుడు స్నానమాచరించినను విధ్యుక్తములయిన ఫలము లందుకొనును. హరిక్షేత్రములు శివక్షేత్రములు చాలగానున్నవి. ఆయా క్షేత్రములు సేవించుకొన్న ఫలితములు సేతుమాధవ సేవనమున, రామనాథేశ్వరు పూజనమున లభించును. రామచంద్ర ధనుష్కోటి జపము, స్నానము, దానము ఎప్పుడుచేసినను అనంత ఫలప్రదము. ఇందు సంశయములేదు. సూతుని వాక్యము - మునులారా మీకు సేతుమహాత్మ్యము వివరించితిని. అది మహాదుఃఖ ప్రశమనము, మహా రోగ నివారణము, పుణ్యప్రదము, అపమృత్యు నివారణము స్వర్గాప వర్గ ప్రదము.

స్కాందమున బ్రహ్మఖండాంర్గత సేతుమాహాత్మ్యమున
52 అధ్యాయములు సమాప్తము.

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతరఖండము

## 1-వ అధ్యాయము

**ధర్మారణ్య ఖండము:**

శ్రీ గణేశాయ నమః — సంసారసాగరము తరించుటకు ముల్లోకములకు నావ, సృష్టి, స్థితి, లయకారకుడు, వేదాంతవేద్యుడు, సహజప్రకాశయుతుడు, అమలుడు రామచంద్రప్రభువునకు నమస్కరింతును. దారాపుత్రులు, పరిజనము, బంధువర్గము, ప్రియులు, తల్లి తండ్రి, అన్నదమ్ములు, అత్తమామలు, వారి బాంధవులు, ఐశ్వర్యము విద్య, రూపము, మంచిభవనము, యౌవనము ఈ సర్వము వ్యర్థము. మరణసమయమున ధర్మమొక్కటియే సహాయపడునది. సత్రయాగ నిమగ్నులయిన శౌనకాదిమహర్షులు అటకేతెంచిన సూతుని చూచి ఆనందపరవశులయి ఆసనభోజనాదులిచ్చి విశ్రాంతిగైకొన్న యనంతర సూతనిని పాపహారమయిన కథలు వినిపించవేడిరి.

ఒకనాడు దేవర్షులు దిక్పాలు వసువులు రుద్రులు దేవగణములున్న బ్రహ్మసభలో యముడు సంతోషముగ సౌమ్యరూపమున కన్పించ నారదుడు యమధర్మరాజు నొకప్రశ్న చేసెను. ఆ సమయముననే వ్యాసులు ధర్మారణ్యకథ, దివ్యము సుమనోహరమైన దానిని, ధర్మార్థకామ మోక్షప్రదమైన దానిని, పుత్రపౌత్ర ధనధాన్య సంపత్ప్రదాత్రిని తెలుపసాగెను. సర్వులతోపాటు యమధర్మరాజు ఆనందపులకితగాత్రుడయి బ్రహ్మకు నమస్కరించి అనుమతివడసి లేచిపోనుండ అతిహర్షముగనున్న యమరాజు ఆకృతిచూచి ఆశ్చర్యపడి నారదుడా ధర్ముని ట్లు ప్రశ్నించెను. "యమధర్మరాజా! నీ వేమి చూచితివి, మహాత్మ్యదము నీకేమి లభించినది. నీవు సదా దుష్టకర్మనే చేయుచు క్రోధ

రూపము ధరించియేయుందువు నీకీ సౌమ్యరూప మెట్లలవడినది. నీ సంతోషమునకు కారణముతెల్పి నా సంశయము తీర్చుమని ప్రశ్నించ నారదునకు ధర్మరాజిటుల సమాధానించెను. "బ్రహ్మపుత్రా! నారదా వినుము. నీ సంశయము తీర్చెదను. పూర్వము నేను బ్రహ్మకు నమస్కరించ తలంచి బ్రహ్మసభ కేగితిని. అట ధర్మవర్గసమన్విత మయిన అనేకగాథలు వింటిని. కథకుడు నారాయణాంశసంభూతుడు వ్యాసమహర్షి. ఆ కథలువిన్న ఫలము పాపశమనము. ఇరువది యొక్క తరమువారు పితరులు తరింతురు" అన నారదుడు ధర్మరాజా ఆ అద్భుతమయిన కథ ఎట్టిదో నాకు విన కుతూహలముగ నున్నది అన మరల ఆనందపులకితగాత్రుడయి ఆ గాథ స్మరించి ఒడలు మర చెను. కృష్ణద్వైపాయనులు తెల్పిన ధర్మారణ్యకథను వింటిని. శుభము సుఖము, క్షేమము, జయము సమకూర్చు గాథ అది. నారదా నేను సదా సుఖములేని వాడను-కారణము నేనయి లోకులను బాధించను. వారివారి కర్మానుసారము సుఖదుఃఖములు పొందుదురు. యంత్రము వలె భగవన్నియమములను నేను పాలింతును. అయినను సాధుసంగ మున ధర్మము లభించును, సాధుసంగతి ఇహాపరముల సుఖశాంతి సాధనమగును. ఆ గాథ యమునివలన పరిపూర్ణముగ విని నారదు డొకనాడు మర్త్యలోకమున పాలించుచున్న ధర్మరాజుకడ కేగెను. వచ్చు నారదునిచూచి సింహాసనమునుండి లేచి ఎదురేగి నమస్కరించి తోడ్తెచ్చి అర్ఘ్యపాద్యాదులిచ్చి మహాసనమున కూర్చుండజేసెను. చేతులు జోడించి నామముతెల్పి సంప్రదాయములన్నియు నడిపిన అనంతరము కుశలప్రశ్న చేసి తపము సుఖముగ జరుగుచున్నదా అని ప్రశ్నించెను. నారదుడు సర్వము శుభస్వరూపమే అని ధర్మజుని ఆతని పట్ల సర్వము శుభమేకదా అని ప్రతిప్రశ్న చేసెను. సోదరులతో ధర్మచింతన చేయుచు సుఖములు కనుచున్నావు కదా అనెను. తన రాష్ట్రము, తాను, బంధు మిత్రులెల్లరు సుఖులనుచు మునిదర్శనమున తాను పాపరహితుడు కృతార్థుడు నయితినని ధర్మజుడు సమాధానిం

చెను. ముని ఆగమన కారణము ప్రశ్నించెను. నారదుని సమాధానము "ధర్మజా నేను యముని సన్నిధినుండి వచ్చితిని, ఆతనివలన వ్యాసముని బ్రహ్మసభలో తెల్పిన ధర్మారణ్య సంబంధమయిన అద్భుత గాథ విని వచ్చితి" ననెను. ధర్మజుని ప్రశ్న "నారదా లోకహితము కొఱకు నా శాంతికి ఆ గాథ తెలుపుమని కోరెను. ధర్మారణ్యసంబంధ తీర్థముల వివరణము తెలుప ప్రార్థించెను. ఈ స్థానము ఎవరిచే స్థాపితము. రక్షకులు పాలితులెవరు. ఏ కాలమున అది నిర్మితమయినది. త్రికాలములయందా స్థానమున సంభవించు విషయములు తెలుప మునిని ధర్మరాజు ప్రార్థించెను.

*

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము

## 2-వ అధ్యాయము

నారదుడు వివరించుచున్నాడు. "ధర్మజా! నీప్రశ్నలోక కల్యాణమున కయినది. ధర్మారణ్యగాథ తెల్పుచున్నాను శ్రద్ధగా వినుము. ఆ అరణ్యము త్రిలోకముల చరాచరము సంచరించు పుణ్య ప్రదేశము. అట మృతిచెందిన చరాచరమున పశుపక్షికీటకాదులు నరులు వారి ఇరువదియొక్క తరము సద్గతి కాంతురు. సదాపుణ్య ప్రదము. ఫలములతో కూడియుండునది. వృక్షలతాదులతో శోభితము. శ్వాపదములున్నను ఎల్లరును నిర్భయులయి ఆ అరణ్యమున సంచరింతురు. గోవులు పులులతో క్రీడించును, స్వభావవైరములు వీడి సర్వప్రాణులు మైత్రియేపాటించును. శుక శారికలు వేదవచనములే పల్కుచుండును, శివమూర్తి అపారసంసారసాగర ముత్తరించసహాయ పడును. బ్రాహ్మణు లతిపవిత్రులు: తపోనిధులు శాపానుగ్రహసమర్థులు, ధర్మారణ్యవాసుల నెల్లరను స్వర్గమున దివ్యులు ప్రశంసింతురు. ఈ వివరములు విని ధర్మజుడు—

"త్రిదశులు ధర్మారణ్యము నెపుడు ప్రతిష్ఠించిరి. అట నివసించు బ్రాహ్మణుల సంఖ్యఎంత, ఆద్విజులను పూర్వమెవరుస్థాపించిరి. బ్రహ్మ సత్తములు ఆ బ్రాహ్మణులు ఎవరివంశమున జన్మించిరి. చతుర్వేద పారగాములు తపోనిధులు, శుభాచారులు, నిత్యభోజనము ఆ ప్రదేశమున తపోనియమవంతులను దానవులు భూతభేతాళగణము లేల బాధించవు ఇత్యాది సర్వము తెలుపవేడెను.

*

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము

## 3-వ అధ్యాయము

ఈ ప్రశ్నలకు నారదు సమాధానము వినుము :

ఒక సమయమున ధర్ముడు కఠిననియమము పాటించుచు తపము చేసెను. తొలుత త్రేతాయుగమున ముప్పదివేల వత్సరములు తపో నియతినుండ రక్తమాంసములు శరీరమునకుప్కించినవి. నేత్రములు తేజో వంతములుగా నుండ జీవమున్నదనిమాత్రము తెలియుచున్నది. దివ్యు లాతని తపమునకు భయపడి శంకరునభయము వేడ కైలాసమునకేగిరి. ఉమాసహితుడయినశంకరునిదర్శించిరి. గణములు పరివేష్టించియుండెను. బ్రహ్మలేచిముందు నిలచిశంకరునిటునుతించెను. "అనంతరూపునకు నీల కంఠునకు నమస్కారము. తెలియనిస్వరూపము కలదైవమవు—కైవల్యా మృత ప్రదుడవు. అద్యంతములు తెలియని దైవము, నీకు నమస్కార ములు. వాకులకందని మూర్తివి నీకు నమస్కారము. యోగుల హృదయముల నిశ్చలధ్యాన నిమీలితనయనములతో గోచరించు దేవాధి దేవుడవు నమస్కారము. బ్రహ్మాండము నీరూపము. అంత ర్లీనమయిన చైతన్యము నీవే. పంచేంద్రియములకధిష్ఠాతవునీవే. పంచ భూత భూతాత్మకుడవు. నిత్యానిత్య స్వరూపుడవు. సదసత్పతివి" ఇట్లని బ్రహ్మనుతించ మహాదేవుని సమాధానము—"మీరెల్లరు దీను లయియున్నారు. కారణము తెల్పుడు". అన బ్రహ్మ "మహేశ్వర! యమధర్మరాజు చిరకాలముగ తపోనియతినున్నాడు. నీ పదముల యందచంచల ధ్యానముంచెను. నీ దర్శనముననే ఆతడు లేవగలడు" అని తెల్ప సర్వులు రుద్రునకు ప్రదక్షిణముచేసి తమధామములకేగిరి. వారల కభయమిచ్చి శంకరులను మతియిడి పంపివైచెను, ఇంద్రుడు

మాత్రము స్వర్గమునకేగి నిదురలేక సుఖములేక బాధపడసాగెను. తనలో ఇటు చింతించెను. 'ధర్ముడు నాస్థానముకోరి తపముచేయు చున్నాడేమో' దివ్యులనందరిని రావించి వారితో నిట్లనెను 'దేవతలారా మీరెల్లరును వినుడు నా దుఃఖకారణము. నా పదమును యముడు కోరుచున్నట్లున్నాడు. బృహస్పతులవారు ఉపదేశమేమయిన ఈయ గలరో తెలియగోరుచున్నా' నన బృహస్పతి ఇట్లనెను. తపముపలన స్వర్గమురాదు. అచ్చరలేమలనటకు పంపవలెను: అన ఇంద్రుడచ్చరలను రావించి ధర్మారణ్యమున కతిశీఘ్రముగపోనానతిచ్చెను. అటధర్మరాజు తపముచేయుచున్నాడు. ఆతనిని ఆకర్షించి తపోవిఘ్న మొనరించుడని పంపివైచెను. అచ్చరలు పరమపావనమయిన ధర్మారణ్యమునకేగిరి. ఆ వనమున సూర్యప్రకాశము కానరాదు. అంతయు చీకటిలోమునిగి నది. బహుయోజనముల విశాలము. నిత్యానుష్యముగనున్నది. ఘోరమృగముల సంచారమున్నది. వృక్షలతాదులు బాగుగ పుష్పించి యున్నవి. పక్షులు మధురముగ కూయుచున్నవి. అన్ని ఋతువుల సంపదయు ఆ అరణ్యమున కన్పించినది. సూర్యపుత్రుడటనున్నాడు. అచ్చరలతో ఇంద్రుడేగుట పరిపాటి. ఆతడట ధర్మరాజును కనెను. "ఈతడే ధర్మరాట్. ఉగ్రతపశ్చర్యనున్నవాడు" అచ్చర లతో 'పొండాతనిచెంతకు. విఘ్నము కల్పించయత్నించు" డనెను. ఇంద్రుని వచనానుసారము ఊర్వశి, తిలోత్తమ, సుకేశి, మంజుఘోషా, మేనక, విశ్వాచి, యశస్విని, వీరెల్లరును ఆతనిచెంతకేగి ఒండొరులను చూచుకొనుచు భయశంకితులయిరి. అయినను అందరిలో పెద్ద వర్ధని అను అచ్చర ఎందుకు సంశయము మాయరూపబలము మాకున్నది. వర్ణధర్మము అనుసరింతుము అననీవు వెంటనేపోయి కార్యముసాధించు మని ఇంద్రుడన వర్ధనీకాంత మనోహరమయిన రూపముతాల్చి గజ్జెలు తాల్చి వీణియ ధరించిపాడుచు జగన్మోహనముగ నర్తించసాగెను. జితేంద్రియుడయిన ధర్ముపువెంటనే విమనస్కుడాయెను. తనలో "ఔరా! మదమత్తులయిన యువతులుకంట బడనంతవరకే తపో నైశ్చల్యమేమో, అనుకొనెను.

*

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము

## 4-వ అధ్యాయము

ధర్ముని అనంతరచేష్టితము వినుమని నారదుడు ధర్మజునికి తెల్పుచున్నాడు, అదివినిన యమదూతలవలన భయముండదు. ఆమెను చూచి ధర్మరాజనుచున్నాడు. "నిర్జనమయిన ఈ వనమునఏకాకివై ఏలసంచరించుచున్నావు. ఎటనుండి వచ్చితివి, నీ వెవరిపత్నివి, ఎవని కుమార్తెవు, దివ్యవనితవా, రాక్షసకాంతవా, అప్సరసవా, యక్షిణివా, లేదా వనదేవతవా. నిజము తెల్పుము. నీకేమికావలయునో తెల్పిన ఇచ్చెదను." ఈ మాటలు అప్సరవర్ధని అనుచున్నది. "ప్రభూ! స్థావర జంగమములన్నియు ధర్మమువలనే నిలువ గల్గునవి. అట్టి ధర్మ స్వరూపుడవు నీవు ఎందులకీ కఠిన తపశ్చర్యనున్నాడవు." అన యముని సమాధానము "ఈశానుని రూపము ఎట్టిదో చూడ కోరికకలదు. శివానితో శంకరుని చూచు తలంపున తపము చేయుచున్నాను. యుగయుగమున యశస్సు సుఖము నాకు కలుగవలెనని ఈ తపము చేయుచున్నాను, నాకు కీర్తికావలయును, కల్పకల్పమున మహాకల్పము నేను కీర్తికామించియే తపము చేయుచున్నాను. భద్రే! నీ రాకకు కారణము తెల్పుము". వర్ధని సమాధానము "ధర్మాత్ముడవు. నీ తపమువలన ఇంద్రుడు భయపడుచున్నాడు. ఆతడు నీతపమునకు విఘ్నమొనరించ నన్ను పంపెను. ఆతని రాజ్యము నీవు కాంక్షించుచున్నావన్న భయమున నన్ను పంపెను. సత్యమే తెల్పితిని'' అన సత్యవాక్యమున కానందించి సూర్యపుత్రుడు, ధర్మరాజు, ఆమె కిట్లనెను సర్వులకు ధర్మరూపుడను. దుర్లభమయినను "సత్యము తెల్పితివి కాన" నీవు కోరిన దిత్తును. తెల్పుమన అచ్చర వర్ధని సమాధానము-" ఇంద్రుని

ఆస్థానమున నాకు రమ్యము సుస్థిరమయిన స్థానముండునట్లు" వరమీయ వేడెను. ఇంతమాత్రమేనా అది అట్లే అగును. ఇంకొక వరము కోరుము నీ గానమునకు నేను సంతసించితినన ఈ క్షేత్రమున తన పేరున పాపఘ్నమయిన తీర్థము కల్పించ వరమడిగెను. ఆ తీర్థము సర్వపాపక్షయముగా వరమీయకోరెను అట్లే అగునన మునికి, ధర్మునికి మున్మూరు ప్రదక్షిణ మొనరించి నాకమున కేగెను. పోయి ఇంద్రునకు గాన్పించుకొని "ప్రభూ! మీకు సూర్య తనయునివలన భయమువలదు. ఆతడు స్వార్థమునే, యశమునే కోరి శివునిగూర్చి తపము చేయుచున్నాడు" అన ఇంద్రుడామెను గౌరవిం చెను. దేవకార్యము సాధించి ఆతని తపశ్చర్యకు కారణమడిగి దివ్యుల భయము తీర్చినందుకు ప్రశంసించెను. ఇంద్రునకు నమస్కరించి వర్ధని తనతావునకు మరలిపోయెను ఆమె వెడలిపోయిన అనంతరము పూర్వమువలెనే ధర్ముడు తపము చేయసాగెను. మరల ఇంద్రునితో దివ్యులు శంకరుని శరణందిరి. ఆతడు వెంటనే ఎద్దునెక్కి యముడు తపముచేయు స్థానమున కేగి సూర్యతనయా నీ తపమునకు మెచ్చితిని లెమ్ము వరము వేడుమని మున్మూరు భవానీపతి వచించెను. ఆ సమ యమున ధర్మరూపుపై పుట్ట పెట్టినది. పుట్టనుండి లేచి, దర్శనమిచ్చిన మహేశ్వరునకు కరములు జోడించి ఇట్లనెను. "యోగరూపునకు ఈశ్వరునకు నీలకంఠునకు, స్థూలాయ సూక్ష్మాయనమః, త్రిపురాంతకు నకు నమస్కారము. నేను నుతించిన ఈ నామములు పఠించిన పాపములు శమించుగాక. పంచమహాపాతకములు పటాపంచలగుగాక." అటులే అగుగాక వరము కోరుమన నేను తపమొనరించిన ఈ ప్రదేశమున నా పేరుతో ఖ్యాతిగాంచుగాక - ధర్మారణ్యమని, పుణ్యప్రదము, పాపనాశనమును అగుగాక, నీకు తోచిన వరమిచ్చి ముల్లోకముల నాకు ఖ్యాతికలుగునట్లు వరమిమ్ము. అన యుగ యుగముల ఈ తావు ధర్మారణ్యమను ఖ్యాతిగాంచును. ఇంకేది అయినను కోరుమన రెండు యోజనముల విస్తీర్ణమున ఈ తీర్థము ముక్తిదము పావనముగ నగు

గాక అనెను. దివ్యులు పూలవాన కురియించిరి. శంకరులు ధర్ముని చూచి "వత్సా నాతావునకు పోయెదనన "నా స్థానము వీడవలదు. కైలాసమునకన్న అధికముగ మీ వచనమున ఈ స్థానము వరలుగాత!" అన అద్భుతమయిన ఒక లింగమట నిల్చెను. దివ్యులెల్లరు తమ తమ నామముల ఈశ్వరలింగములు స్థాపించిరి. స్వయం దృశ్యమానమయిన లింగము స్వయంభువమను ఖ్యాతి కాంచినది. తీర్థము ధర్మవాపి అను పేర నిలిచెను. ఇట "యమాయ, ధర్మరాజాయ, మృత్యవే౽౦త కాయచ" అని కీర్తించి స్నానము చేసిన పాపశాంతి యగును, యమస్థాపితము ధర్మేశ్వరుడని పేరు.

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము

## 5-వ అధ్యాయము

ధర్మారణ్యవాసుల చరితము - ధర్మారణ్యమున జనించిన బ్రాహ్మణులు సదాచారులు పవిత్రులు బ్రహ్మవిదులు పదునెనిమిది వేలు. వారి దర్శనము మహాపాప విముక్తికగును. యుధిష్ఠిరుడు వ్యాసుని సదాచారము తెలుపగోర వ్యాసుని సమాధానము. ఆచార్యము సదా ధర్మసమ్మతము, లక్ష్మీప్రదము. ప్రాణికోటిలో నరజన్మ ఉత్తమము. అందునను సదాచార సంపన్నుడు విద్వాంసుడు వినీతుడుత్తముడు. ధర్మమూలమయిన సదాచారము నడపువాడు నూరేండ్లు సుఖజీవనము చేయును. దురాచారుని ఎల్లరును గర్హింతురు. అతడు రోగములకు చిక్కి అల్పాయువగును. ఏ కర్మ చేసిన అంతరాత్మ విమలమగునో అట్టికర్మ చేయవలయును అంతరాత్మ బాధపడు కర్మ చేయరాదు. ధర్మమునకు మున్ముందు మూలము యమ నియమములు. అనగా బాహ్యము అభ్యంతరము అయిన కర్మలను (ఇంద్రియములను) నియమించుకొనుట. సత్యము, క్షమ, అహింస, దమము, ప్రసాదము, మాధుర్యము మృదుత్వము ఈ గుణములు సాధించుకోవలెను. శౌచము దానము తపము మౌనము ధ్యానము వ్రతాదులు నియమములు. కామక్రోధాదులారును శత్రువులు. వీనినిజయించి ధర్మమును కూడబెట్టుకోవలెను. కొమ్మున్న పురుగు పుట్టను పెంచినట్లు, ఇహమును పరిరక్షించి పరము శుభలోకము ప్రాపించునది ధర్మమే. వేదము చదువక, సదాచారము నతిక్రమించి, అలసుడై దురాన్నము తిను బ్రాహ్మణుని యముడు దండించును. అందువలన ప్రయత్నపడి సదాచారము నభ్యసించవలెను. నిదురపోవునపుడు మేల్కొనునపుడు

తొలుత గణపతిని అనంతరము సాంబసదాశివుని ధ్యానించవలెను అనంతరము విష్ణ్వాది దివ్యుల స్మరించవలెను. దివ్యక్షేత్రములు నదులు యథాశక్తి సేవించవలెను. జననీ జనకులు ఉత్తమ తీర్థములు. వారి పాదములకు ప్రణామమాచరించ కొదువ తీర్థములవకాశమున్న సేవించ వగును. స్నానము ఆచమనము సంధ్యోపాసనము ఇత్యాదులు కులాచారములు పాటించుచు మనోనైర్మల్యము సంపాదించుకోవలెను. ప్రత్యక్షదైవము సూర్యునారాధించిన ముక్కోటి దివ్యుల నారాధించిన వారు కాగలరు. వేదవిదుడు నిత్యము శిష్యులకు పాఠ్యప్రవచనము తీయవలెను, మౌనముగ భుజింపవలెను. పండ్లు కొఱుక రాదు. సంధ్యాదు లవకాశమున్న శివసన్నిధియయిన అనంత ఫలప్రదము. ముఖ్యములయినవి ఇవి. శిష్టులవలన కులపాలకులు తెలిసి ఆచారము పాటించవలెను.

*

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము

## 6-వ అధ్యాయము

గృహస్థాశ్రమ ధర్మములు:— ఆశ్రమములన్నిటిలోను గృహస్థాశ్రమము అతి ముఖ్యము, ఉత్తమ మయినదియును. పితరులు, మునులు, దేవతలు, భూతములు, మనుష్యులు, క్రిమికీటక, పశుపక్ష్యాదులు గృహస్థు నాశ్రయించి బ్రదుకుదురు. గోవువలె గృహస్థు సర్వులకాధారము. మానవులెల్లరును గోవునువలె గార్హస్థ్యమును పూజించుకొనవలెను. రెండు యామముల సమయమున శ్రాంతుడై ఆకలిగొని వచ్చిన అతిథి సాక్షాద్విష్ణుస్వరూపుడు. ఆతనికన్నమిడిన సర్వయజ్ఞములొనరించినఫలము గేస్తుడందుకొనును.

వివాహములు ఎనిమిదివిధములు - బ్రాహ్మవివాహము - వరుని పిలిచి సాలంకృతకన్యనిచ్చుట, 1. ఉభయకులముల 21 తరము వారు తరింతురు. 2. యజ్ఞమున ఋత్విజునకు కన్యనిచ్చిన పదునాలుగు తరములు తరించును. ఇది దైవమను వివాహము. 3. రెండు గోవులను వరునివలన గ్రహించి కన్యనిచ్చుట ఆర్ష వివాహము - ఆరుతరముల వారు పూతులగుదురు. 4. ధర్మము కొఱకు ఇరువురు వధూవరులు వరించుట ప్రాజాపత్యము. 5. వధూవరులు స్వేచ్ఛగా ఇష్టపడిచేసికొన్న వివాహము గాంధర్వము. 6. బలవంతముగ కన్యను హరించికొనిపోయి వివాహమాడుట ఆసురము. ఇది నిందితము, 7. మోసముచేసి కన్యను హరించి వివాహమాడుట పైశాచము. 8. ఒరులతోపోరి ఇష్టములేని కన్యను వివాహమాడుట రాక్షసము.

విధ్యుక్తమయిన కాలమున భార్యాగమనము శుభము ఆయుర్వర్ధనము. దివాభిగమనము ఆయుర్హీనకరము. శ్రాద్ధముల

పర్వమున కామినిని స్పృశించరాదు. కన్యవలన విత్తముకొనుట నింద్యము. కన్యావిక్రయము అతినింద్యము. తనరూపము నీటిలో చూచుకోరాదు. నగ్నముగనున్న స్త్రీని చూడరాదు. నగ్నముగ జలముల ప్రవేశించరాదు. ఆలయము, బ్రాహ్మణుడు, గోవు, జాతివృద్ధుడు, వయోవృద్ధుడు, అశ్వత్థము, గురువు, సిద్ధాన్నము, దధి పెరుగుకావడి, దారిపోవునపుడు తారసిల్లిన ప్రదక్షిణ మొనరించవలెను లేదామనసానమస్కరించవలెను. పితరులను దేవతలను తృప్తిపఱచక భుజించరాదు. ప్రాణిహింసచేయరాదు. సంధ్యవేళల భుజించరాదు. మార్గమున ఒంటరిగాపోరాదు. తన ఇంటనైనను ద్వారమునపోవలెను. ద్వారము విడచి ఇంకొక విధమున ప్రవేశించరాదు. తడికాళ్లు చేతులతో భుజించరాదు. పతితులతో సహవాసముకూడదు, వైదిక మంత్రముల ననర్హునకీయరాదు నిజము ప్రియము చెప్పవలెను. అప్రియమయినను సత్యము చెప్పవలెను. ప్రియమయినను అనృతముచెప్పరాదు. వృద్ధులకు తన ఆసన మీయవలెను. ఇతరత్రా జలాశయమున స్నానము చేయునపుడు అయిదుమూరులు మృత్పిండము జలములలో వేయవలెను. పాత్రునకు శ్రద్ధగా శక్తివంచనలేకదానము ఈయవలెను. భూదానమున సుఖియయి మండలాధి పత్యమలవడును. జలదానమున సురూపము, అన్నదానమున సంపద్వృద్ధియగును. గోదానమున సూర్యలోకప్రాప్తి. హిరణ్యదానమున దీర్ఘాయువు, వస్త్రదానమున చంద్రలోకప్రాప్తి. శ్రద్ధగా ఇచ్చినది శ్రద్ధగాతీసికొన్న ఉభయులు స్వర్గము ప్రాప్తింతురు. అశ్రద్ధవలన నరకమే.

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతరఖండము

## 7-వ అధ్యాయము

ధర్మారణ్యమున ధర్మవాపి పితృతర్పణము, పిండప్రదానము పితరులకు తృప్తికలిగించును. కలిలో నరులు అచంచలులు, పరుల కు ద్వేగమునే కల్పింతురు.

పతివ్రతల లక్షణములు. పతివ్రతఇంటనున్న ఆతని జీవనము సఫలము. పతిభుజించిన అనంతరమేభుజించును. పతికి మున్నే నిదుర మేల్కొనును. కార్యమున పతి దేశాంతరమునకేగ అలంకారము విసర్జించును. భర్తపేరు తెలుపదు. అన్య పురుషులనామము స్మరించదు. పతి పిలుపువిని గృహకార్యమువిడిచి వెంటనేపోయి పనివినును. చిరము ద్వారమున నిలువదు. పనిలేక ముఖద్వారమునకుపోదు. చెప్పకయే పూజోపకరణములు సర్వము సిద్ధముచేయును. పతితో కాక యాత్రలకు వివాహములు చూచుటకుపోదు. ఒంటరిగాపోదు. నగ్నముగస్నానము చేయదు. భర్తకిష్టమయిన వాటన్నిట తాను ప్రియముచూపును. భర్తమాట జవదాటదు. ఇది పతివ్రతలక్షణములు. ఎత్తయిన ఆసనమున నుండదు. పరుల గృహములకేగదు భర్తయే గురువు దైవము. అందు వలన సర్వమును విడచి పతినర్చించవలెను. మాతను విడచి అన్య కాంతలు భర్తలేని వారిని చూడరాదు. చూచిన అమాంగల్యమే. పతివ్రత పితృవంశము, మాతృవంశము, పతివంశము పావనముచేయును. శీలభంగమయిన నారి మూడువంశములను నాశనముచేయును. పతి హీన పతి ననుగమనించవలెను. (ఇత్యాది నియమములు కాలమును

బట్టి ఔచిత్యమెఱింగి వర్తించవలయును.) పతికి సుఖము, గృహము, ధర్మమునకు, కాంతయేమూలము. గంగాస్నానమున శరీరము పవిత్రమయినటుల పతివ్రతవలన గృహము పావనమగును. ధర్మవాపిన దానము అక్షయఫలము. ధర్మకూపమున స్నానదాన పితృతర్పణాదుల నంతఫలప్రదములు. ధర్మారణ్యమున పుణ్యకర్మ అక్షయఫలప్రదమయినటులే ఆ పుణ్యప్రదేశమున పాపముచేసిన అనంతమయి బాధించును.

# బ్రహ్మఖండము

## 2-వ అవాంతర ఖండము

## 8-వ అధ్యాయము

స్థాణువు ధర్మారణ్యము పుట్టుపూర్వోత్తరముగాథ. స్కందునకు తెల్పినదే వ్యాసులు ధర్మరాజునకు తెల్పినట్లు సూతుడు శౌనకాది మహర్షులకు తెల్పుచున్నాడు: ఒకానొక సమయమున కైలాస శిఖరమున నాసీనుడయియున్న దేవదేవుని, జగద్గురుని, అయిదు ముఖములు, పదిభుజములు, మూడు కనులుగల శూలపాణిని గణపరివృతుని సురాసురులచే నమస్కరించబడు జనకునికి నమస్కరించి స్కందుడడిగినప్రశ్న: బ్రహ్మాదులు ఇంద్రాదులు మీ దర్శనమునకై నిత్యము ద్వారమున వేచియుందురు. మీముందుండి నేనేమిచేయవలయునో ఆజ్ఞాపించి పని గానుడనెను. ఇంతలో శంకరులు ఆసనము నుండి వృషభారూఢుడు కాక ముందుకుపోవుచుండ స్కందుడు పనియేమి? వాహనములేక ఎటకేగుచున్నారన దివ్యులతో తాను ధర్మారణ్యమునకు పోదలంచితినని సమాధానమిచ్చెను. అక్కడ కార్యమేమని స్కందుడు మరలప్రశ్నించెను.

శంకరుని సమాధానము: తొలుత సృష్టికి పూర్వము ప్రలయము సంభవించినది. అంతయును అంధకారమయమయినది. నిర్గుణ బ్రహ్మ మిగిలెను. మహాకల్పాంతము చరాచరము లయమాయునది. జగన్నాథుడు లీలామానుషవిగ్రహుడు చిరము క్రీడించి ఒకవటము పుట్టించెను. బాలభావముగ్రహించి వటపత్రశాయియయి లోకము సృజించతలంచెను హరినాభికమలమునుండి బ్రహ్మజనించెను. అంతయు జలమయముగ చూచి ఏమిచేయవలయునో తెలియక వ్యగ్రుడు కాగా అశరీరవాణి తపముచేయుమని వినబడెను బ్రహ్మదుష్కరమయిన తపమాచ

రించెను. కృపాళుడయి బాలరూపుడు హరి బ్రహ్మకిట్లనెను. సృజన చేయుము. బ్రహ్మాండ గోళమున నానా విధమయిన సృష్టితరుగుల్మ లతాదులు పిపీలికాదులు సింహవ్యాఘ్రాదులు, నరులు పదునాలుగు దేవయోనులు సప్తపాతాళములు సప్తఊర్ధ్వలోకములు నవద్వీపమండితము వసుంధర, సప్తగిరులు సప్తసాగరములు ఇటుల సృజనచేయుమని వినబడినది. బాలుడంతర్హితుడాయెను బ్రహ్మపైన వివరించిన సర్వము సృజించెను. ఆ బ్రహ్మాండమునకు పితామహుడు ప్రజాపతి-బ్రహ్మమానస పుత్రులు, దక్షుడు, దక్షపుత్రులు దేవర్షులు నారదాదులు, సప్తఋషులు, వశిష్ఠాదులు అనేకులు రాజర్షులు, దిక్కులు పంచభూతములు సంవత్సరము, ఋతువులు, మాసము తిథ్యాదికాల చక్రము భచక్రము సూర్యచంద్రగ్రహ నక్షత్ర తారాగణములు, యుగాదులును.

ఈ విధముగ బ్రహ్మాండము కాలచక్రమున భ్రమించి లయించి మరల సృష్టి చేయబడుచుండును. సృష్టి క్రమమున బ్రహ్మనుండి జనించినదించుక తెల్పెదను వినుము బ్రహ్మమానసపుత్రులు ఆరుగురు మహర్షులు మరీచి, అత్రి, అంగిరస, పులస్త్యపులహ అనువారలు. మరీచికి తనయుడు కశ్యపుడు ; ఆతనివలన కొదువ ప్రజానీకము ప్రజాపతులలో దక్షుడొకడు. ఆతని కన్యలు పదియుమువ్వురు అదితి దితి మొదలయినవారు. కశ్యపునకు అదితివలన పన్నిద్దరు సూర్యులు జనించిరి. సూర్యపుత్రుడు ధర్మరాజు, ఆతనిచే నిర్మితము ధర్మారణ్యము, పుణ్యాశ్రమము. అట ఇంద్రాదిదివ్యులు బ్రహ్మ. నేను సదా ఉందుము నేనటకేగుచున్నాను- అన స్కందుడు అనుమతి వడసి తానుకూడ ధర్మారణ్యమునకు పయనమయ్యెను బ్రహ్మ వైకుంఠుని ధ్యానించహరి దర్శనమిచ్చెను.

*

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము

## 9-వ అధ్యాయము

దర్శనమిచ్చి బ్రహ్మాదులను తనవద్దకువచ్చిన కారణము తెలుప గోరెను. భయమేదియయిన తటస్థించెనా అన బ్రహ్మ - భయ కారణము లేదు. ఒక విజ్ఞాపన చేయవచ్చితిమి.

ధర్ముడు స్థాపించిన ఉత్తమతీర్థము ధర్మారణ్యము కలదుకదా, దానిని చూడపోదలంచితిమి. దేవా! తాముకూడ రావలయుననెను. తనకును కుతూహలము కలదనుచు హరి గరుడ వాహనారూఢుడై రా సర్వులు ధర్మారణ్యముకేగిరి. ధర్ముడు వచ్చినవారలెల్లరును పూజించి సత్కరించెను. హరి సంతసించి యముని వరము వేడుమన ధర్మారణ్యమున మహాపుణ్యమయిన ఋష్యాశ్రమము కల్పించ వేడెను. హరి పదునెనిమిదివేల బ్రహ్మణ్యముత్తమ ధర్మనిష్ఠుల నట స్థాపించెను. ద్విజులు ఇరువదినాలుగు గోత్రములవారు వారి శాఖలు ప్రతిశాఖలును, భారద్వాజ, కౌశిక, కుశ, శాండిల్య, కాశ్యప, గౌతమ, ఋతుకర్ణ, పరాశర, కౌండిన్య, ఇత్యాదులు మూల ఋషులు ప్రవరకాద్యులు. ఇటుల వారిశాఖలు ప్రతిశాఖలు వర్ధిల్లినవి. వంశములు వారి ప్రవరలు వివరించబడినవి,

ఋషి వాటిక ఈ విధమైన బ్రాహ్మణ వంశీయులగు ఋషులతో నలరారుచుండ ఒకకాలమున జృంభకుడను యక్షుడు తపోనిధులకు ద్వేగ కారకుడయి సమీపమున చరించసాగెను. మునులు దివ్యులను నుతించి భయకారణము తెలుప వారు రక్ష కల్పించిరి. కులదేవిని. నిల్పిరి. శ్రీమాతా, తారణీదేవీ, ఆశాపూరీ, గోత్రపా, ఇచ్ఛాభర్త్రి

నాశినీ, పిప్పలీ, జగన్మాతా, సిద్ధా, భట్టారికా, మాతంగీ, చాముండీ ఇత్యాది రక్షామాతృకలను త్రిమూర్తులు స్థాపించిరి. యోగినులను నిలిపిరి. తపోధనులు తమ తమ తావుల రక్ష కల్పితముకాగా సుఖముగ నియమములు సాగించుకొనుచుండిరి. దివ్యులు తమ తమ తావుల కేగిరి. నూరువత్సరములు గడచిపోయినవి. మరల ధర్మారణ్యము తిలకించ త్రిమూర్తులు సూర్యోదయముకాగానే విమానములధిరోహించి దిక్కులు నిండ దివ్యులతో ధర్మారణ్యము చూడనేగిరి. కాని ద్విజులు సమిత్కుశపుష్పాదులు కొనితేర నడవులకేగిరి. దివ్యులదిచూచి వారల శుశ్రూష కుపాయము కల్పించ సంకల్పించి కామధేనువును స్మరించ ధేనువటకేతెంచెను.

*

# బ్రహ్మఖండము

## 2-వ అవాంతర ఖండము

## 10-వ అధ్యాయము

సురల యానతి కామధేనువు పదునెనిమిదివేల బ్రాహ్మణుల పరిచర్యకు ఒక్కనికిరువురుగా ముప్పదిఆరువేలు శ్రోత్రియులను, పురాణజ్ఞులు, శాస్త్రవేత్తలను హుంకారమాత్రమున కల్పించినది ఒక్కొక్క ఋషికి ఇరువురుగానయి మూలపురుషుని గోత్రముతో ఆ ఇరువురు వృద్ధిగాంచిరి. శిష్యులుగా ఇద్దరద్దరిని కల్పించి వారిననుసరించి కార్యములు చెప్పిన చేయుచు గురుగౌరవమున శిష్యులయి చరించుడని సురలు వారినాజ్ఞాపించిరి. వారలకై పూజోపకరణములు సమకూర్చుచు నిత్యము సేవించుడని ఆనవెట్టిరి. వారల నవమానించిన మీకు దుఃఖములే కలుగునని నియమముచేసి దివ్యులు తమ తావుల కేగిరి.

సురలు కామధేనువునిటుల నుతించిరి. "నీవేతల్లివి, యజ్ఞమునకు కారణభూతురాలవు, తీర్థములలోకెల్ల నీవే ఉత్తమ తీర్థప్రాయవు, నీ లలాటమున సూర్యచంద్ర అరుణులు, హుంకారమున నాగులు, వెనుక గంధర్వులు నాలుగు వేదములును, ముఖాగ్రమున తీర్థములు. నీవు సుఖముగ పిదుకుము. బ్రాహ్మణులు తపోధనులు నీవలన క్షేమముగ నుందురుగాక."

వారలెల్లరకు గేస్తులగుటకు రుద్రుడు యముడు గంధర్వకన్యల నాహరించి యిచ్చిరి. గంధర్వరాజు విశ్వావసువు. అతని ఇంట 60 వేల కన్యలుకలరు. వారల ఇల్లు అంతరిక్షమున గంధర్వనగరమని, ఆకన్యలు రూపవతులు యౌవనవతులు, - శివాజ్ఞచే విజయను పంపిరి. ఆమె యేగి గంధర్వరాజుతో ధర్మారణ్యావాసుల నిమిత్తము నీకన్యల

నందరిని శివుడు యాచించెనన గంధర్వలోకమువిడచి మనుష్యులకు నాకన్యల నీయనన విజయ తిరిగిపోయి శూలికావార్త తెల్పెను. శంకరులకు ఆగ్రహమువచ్చి శూలహస్తుడై గణపరివృతుడై గంధర్వ లోకమున కేగెను.

గంధర్వులు నగరమువిడిచి పారిపోయిరి. రాజు నగరమువిడిచి మేరువు నాశ్రయించెను. కన్యలను కొనిపోయి శూలి భటులు ధర్మా రణ్యముచేర్చి విధ్యుక్తముగ ద్విజులుకిచ్చి వివాహముజరిపించ యముని పర మొనరించిరి. వారి సంతానము అనంతముగా వర్ధిల్లెను. ఈ సంతానము శిష్యప్రశిష్యులదిగా వణిగ్జాతముగానయి బ్రాహ్మణులకు పూజాపరి రములు సమకూర్చుచు వారిని సేవించువారుగానయిరి.

*

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము

## 11-వ అధ్యాయము

కొంతకాలము గడచిపోగా యుగాంత సమయ మాసన్నమయి నది. త్రేతాయుగాదిని లోలజిహ్వుడను రాక్షసుడు జనించ ఆతనిచే లోకత్రయము భయాక్రాంత మయ్యెను. లోకములన్నియును జయించి వాడు ధర్మారణ్యము చేరెను. ముందుగా పురముకాల్చెను. ద్విజులు ధ్వంసమయిరని తలంచి వచ్చిన దారినే వెడలిపోయెను.

ఇంతలో త్రిమూర్తి స్వరూపిణులు, కమండలం, శూలము, చక్రము ధరించినవారు నగు మాతలేతెంచి లోల జిహ్వాది రాక్షసుల నెదుర్కొనిరి. హరియు వచ్చి చక్రప్రయోగమున లోలజిహ్వాదులను యమపురికి పంపించెను. దివ్యులు గంధర్వులు సంతసించిరి. దివ్యులు గంధర్వులు నలుమూలల భయాక్రాంతులయి దాగిన ద్విజులకు 'రాక్షస సంహారమయినది.' భయము లేదని తెల్పి వారిని పురముచేర్చి యథా పూర్వము నిల్పిరి. కామధేనువు ననుగ్రహమున పురము యథా పూర్వము సుశోభితమయియుండ తపోజనము భృత్యాను భృత్యులతో ధర్మారణ్యమున సుఖముగ నుండిరి. నాటినుండి వారల యావాసనగ రము సత్యమందిరమని ఖ్యాతిగాంచెను. కృతయుగమున ధర్మారణ్యము త్రేతాయుగమున సత్యమందిరము. ద్విజులు పత్నులతో సుతులతో భృత్యులతో యథాపూర్వము యజ్ఞయాగాది క్రతువులు, నిత్య పూజలు నిర్వర్తించుకొనుచు సుఖములు గాంచిరి.

*

# బ్రహ్మఖండము

## 2-వ అవాంతర ఖండము

## 12-వ అధ్యాయము

దేవతలు వారిరక్షణకై సత్యమందిరము స్థాపించిరి. ఆ మంది రముతోపాటు ధర్మారణ్యారక్షకే పూర్వదిశగా ధర్మేశ్వరుని, దక్షిణ దిగ్భాగమున గణపతిని, పశ్చిమమున భాస్కరుని, ఉత్తరముగా స్వయంభువుని దివ్యులు నిలిపిరి.

గణేశస్థాపన వివరములు : తొలుత దివ్యులు మాతలు (మాతృ కలు) ధర్మారణ్యమున చండికాసుతుని స్థాపించిరి. మందిరమున ధ్వజశోభితమయిన ప్రాకారము నిర్మించిరి. ప్రాకారమండలాయతనము నకు లోపల బ్రాహ్మణుల గృహములు నిర్మించిరి. మండలమధ్యమున ఇష్టకలతో పీఠ నిర్మాణము గావించిరి. తోరణములచే ప్రవేశ ద్వార ములు శోభిల్లినవి.

గణేశజననము : ఒకనాడు శరీరమున నలుగు గ్రహించి పార్వతి ప్రతిమనుచేసి అందముగనుండ చూచి జీవము పోసెను. వెంటనే ఆ బాలుడు తల్లిముందు నిలిచి ఆజ్ఞ యేమో తెల్పుమమ్మా చేసెదననెను. నేను అంతర్మందిరమున స్నానము చేయబోయెదను. నేను నీకీ వివిధాయుధములు కల్పించి యిచ్చితిని. నీ వీ ద్వారముననేయుండి, అవసరమయిన వాటి నుపయోగించుము. లోనికెవ్వరిని రానీయ కుము, అని సాయుధు నాకుమారునట నిలిపి లోనికేగి స్నానము చేయసాగెను. ఇంతలో మహేశ్వరుడువచ్చి లోనికి పోబోవ గణేశుడు పోనీయకపోగా కోపించి మహాదేవుడు యుద్ధమునకు దిగెను.

గణపతి గొడ్డలితో మహాదేవులలాట స్థానముతాడించ కోపించి శూలి శూలముచే శిరము త్తరించి నేలబడవైచి లోనికేగునంతలో కల

కలము విని పార్వతి ద్వార దేశమునకువచ్చి శిరము త్తరించబడిన కుమా రునికై విలపించసాగెను. ఇంతలో గజాసురుడటకురాగా ఆతనిని సంహరించి ఆ తల గణపతిశిరమునకు చేర్చి బాలుడు లేచెను. గణములన్నియు నటకేతెంచినవి. గజాననుడని పేరుపెట్టిరి.

దక్షిణదిగ్భాగము ఆతనికాశ్రమముకల్పించి దివ్యులు ఋషులు గణములు, ఆయనను పూజించిరి. ఆకృతిలో, వామనుడు, నాగ యజ్ఞోప వీతము, మూడుకనులు, మహాకాయము, ఏకదంతుడు, సర్వ విఘ్న వినాశకరుడు. నగరమునకు దక్షిణభాగమున రక్షకుడుగా గణముల కధ్యక్షుని గావించి నిల్పిరి. పూజలొనరించి మోదకాదులు నైవేద్యముచేసి అరగించనిచ్చిరి, నుతించిరి. గణేశ్వరుడు సంతసించి దివ్యులను వారికోరికలేమని యడిగెను. విఘ్నములులేక, చాతుర్వ ర్ణములవారు నిన్నుపూజించి సుఖింతురని మా ఆశయము. ముందుగా వివాహాది కర్మలయందు నిన్ను పూజింతురు. సర్వులకు రక్షకల్పించ నిన్ను ప్రార్థింతుమన గణపతి అట్లేయగుననెను.

*

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము

## 13-వ అధ్యాయము

ధర్మేశ్వరునకు పశ్చిమముగ రవిక్షేత్రము నిల్పిరి. రవిలోకము నుండి భానుడు భూలోకమునకువచ్చుటకు హేతువు, అశ్వినుల ఉత్పత్తి సూతుడుమునులకు తెల్పుచున్నాడు:

విశ్వకర్మకూతురు సంజ్ఞ కలదు. సూర్యుని చూచినపుడు ఆమెకనులుమూసికొనసాగ భాస్కరుడు కోపించి నీకు మూఢుడు ప్రజలను సంహారించువాడు యముడు దుదయించుననెను. కండ్లు తెరువతలచి సంజ్ఞ సూర్యుని చూడబోగా దృష్టులు విలోలము లయినవి దానిని కని విలోలితయను కుమార్తె యుదయించుననెను. యముడు, యమున అను నదియునుకలిగిరి. సంజ్ఞ విచారించసాగినది. ఎటకుపోవలెను. నా భర్తకు కోపమెటుల శాంతించును. అని చింతించి తనఛాయను నిలిపి జనకునింటికేగెను. కొంతకాలము తండ్రియింటనుండ ఒకనాడు తండ్రి తనయతో అమ్మా చిరము కాంత పుట్టినింట ఉండరాదు. ధర్మలోపము కారాదు. చిరము బందుగులింట నుండిన కాంతకు కీర్తిలోపించును. నీకాంతుడు రవి త్రిలోకాధిపతి, వెంటనేనీవు పతికడకేగుము, నాదర్శనమునకీవు మరలరావచ్చును" అన తండ్రికి నమస్కరించి ఆమె ఉత్తరమేరు భూములకేగెను. అట వడవ (ఆడగుర్రము) రూపముధరించి సూర్యతాపము సహించలేక తపము చేయసాగెను. సూర్యుడుసంజ్ఞయే అనుకొని ఛాయతో క్రీడించి ఇరువురు కుమారులను ఒక కుమార్తెను కనెను. తన కుమారులను ప్రేమించి పోషించినట్లు ఛాయ యముని ప్రేమించలేదు. ఒకనాడు యముడు కోపమున తన్నుటకై పాదమెత్త భూలోకమునకేగుమని శపించెను. యముడు తండ్రివద్దకేగి కుమారుడెంత తప్పుచేసినను తల్లి దూషించదు. ఈమె నన్నుశపించినది. నాతల్లి సంజ్ఞ కాదేమో ఈమె అని తన సంశయము

తెల్పగా, రవిపోయి ఆమె నిజస్థితి తెల్పుమన ముందు తానే సంజ్ఞ అనియును, సంశయముననుండి తానుఛాయయని నిజము తెల్పినది. వెంటనే రవి మామఇంటికేగి సంజ్ఞ ఎటనని యడుగ నాతడు నీయింటికే పంపితినన రవిధ్యానించి ధర్మారణ్య ప్రాంతమున తపోనియతి బడబరూపముననున్న కాంతను తెలిసికొని వెంటనే అటకేగెను. తాను పోయినతోడనే తపోనియతినున్న సంజ్ఞ బడబఆయెను రవి ఆమెతో బాడబమయి కలియ అశ్వినులుదయించిరి. బ్రహ్మాదులువచ్చి సంజ్ఞకు వరములొసంగిరి. రవి నా ప్రదేశమున స్థాపించిరి. రవికుండము కల్పించిరి. రవివారము, సప్తమి, అట స్నానము పుణ్యదము. ఆ రవికి బకులార్కుడని ఖ్యాతి, బకులార్క పూజవలన సర్వగ్రహశాంతి. సర్ప భయముండదు రవికుండ స్నానమున స్త్రీలకు వంధ్యాదిదోషములు పోయి సుపుత్రులు కలుగుదురు. రోగములు శమించును. వ(బ)కులార్కుడను పేరువచ్చుటకు కారణము - సంజ్ఞ భర్తయొక్క తేజము తనకు సహ్యముకావలెనని వకుళవృక్షమూలమున (పొగడ) తపముచేసినది. తన ఎదుటవచ్చి నిలచిన రవినిచూచి వడవ ఆయెను. వకుళమువద్ద శాంతుడయిన పతినిచూచి ఆనందించెను. ఇరువురు సుందర పురుషులను కనెను. ఆ కారణమున రవి వకుళార్కుడాయెను.

# బ్రహ్మాఖండము

## 2-వ అవాంతర ఖండము

## 14-వ అధ్యాయము

హరి ధర్మారణ్యమున కఠినమయిన తపముచేసిన హేతువు స్కందునకు మహేశ్వరుడు తెల్పినట్లే సూతుడు ఋషులకును వ్యాసుడు ధర్మజునకును తెల్పెను.

హరి ఒకనాడు హయాననుడుగాగా సురూపసిద్ధికై తపమొనరించెను. హరి అద్భుత కృత్యములకాకరము. దశావతారమునెత్తి లోకరక్షణ గావించువాడు. దశావతారములలో అద్భుత కృత్యములొనరించి లోకకల్యాణమునకు, ధర్మస్థాపనకు పూనినహరి అశ్వముఖుడగుట ఆశ్చర్యమని స్కందుడన మహేశ్వరుని సమాధానము; పూర్వము దేవతలు భూలోకమునకువచ్చి ఒకయజ్ఞము తలపెట్టిరి. హరి నాహ్వానించ వైకుంఠమునకేగిరి. క్షీరాబ్ధికేగిరి. పాతాళమున వెదకిరి, హరి కానరాలేదు బృహస్పతిని ప్రశ్నించిరి. ఆయనధ్యానించి హరి ధ్యానముననున్న వాడటకు బోదముపదుడని వారలతో హరితపోనియతినున్న తావున కేగెను. సమాధియందున్న వాడు; వింటినాధారముగా ధ్యాననిమీలితనయనుడయిన హరినిచూచిరి. దివ్యులు వమ్రిని-చెదపురుగులు-పిలిచి ధనువు నారి కొరికి వేయగోరిరి. నారితెగి విల్లుకంపించ హరి మేల్కొనునని వారి ఆశయము. తమతోపాటు ఆ క్రిములకు యజ్ఞభాగము కల్పించ అవి నిద్రాభంగము చేయనంగీకరించినవి. జ్యాఘాతమున హరి శిరము, గగనమున ఎగసి కన్పించకపోయెను.

*

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము

## 15-వ అధ్యాయము

విశ్వకర్మను హరి కబంధమునకు శిరమదుక ప్రార్థించిరి. ఆయన తనకు యజ్ఞ భాగములేదు కదా అన వారలావిశ్వకర్మకును యజ్ఞ భాగము కల్పించిరి. వెంటనే ఆతడశ్వమొకదానిని మధ్యాన్న సమయమున కని దానిశిరము త్తరించి హరి కబంధమున కదికించెను. అంత హరి హయగ్రీవుడాయెను. దేవతలు హయగ్రీవు నిట్లు నుతించిరి. "జగత్తులకు బీజరూపుడవు, కమలాపతివి, కమలేక్షణుడవు, భూతముల స్థితికి హేతుభూతుడవు నీవే, దుష్టులను శిక్షింతువు. దేవా! నీకొఱకే యజ్ఞములు చేయుదురు. యజ్ఞపతివి, యజ్ఞరూపుడవు యజ్ఞఫల ప్రదాతవునీవే, కాలమునకు కరాలరూపుడవు, గుణములునీవే, గుణాతీతుడవునీవే." అన హరి వారినిట్లడిగెను. "మీరిటకేలవచ్చితిరి. మీకువచ్చిన భయమేమి" నీ దర్శనమునే కాంక్షించితిమి, అంతయు నీమాయ. యోగనిద్రలోనున్న నిన్ను మేల్కొలుప నీ శీర్షముపోయినది. సూర్యాశ్వశిరము విశ్వకర్మ నీకదికించెను. అని యజ్ఞము చేయునంతకాలము సన్నిధినుండ వేడిరి. బ్రహ్మ యజ్ఞము పూర్తిచేసి విమికి విశ్వకర్మకు భాగము కల్పించియిచ్చి హయాననునకు నమస్కరించి తన ధామమున కేగెను.

ఇంకొక ప్రశ్న : "శీర్ష ఘాతమునకు కారణమేమి? ఎవనిచే ఈ లోకము సర్వము ఆక్రాంతము" అన వ్యాసుని సమాధానము:

"ఈశ్వర చరితము ఎవరికి తెలియును, ఒకమారు ఇంద్రాది దివ్యులు బ్రహ్మసభ కేగిరి. భూలోకవాసులు స్థావరజంగమములు ఋషులను బ్రహ్మకు నమస్కరించనేగిరి. మంత్రకారణమున విష్ణువు

కూడ సభకు ఏతెంచెను. ఆ సభలో బ్రహ్మ ఒకసంశయము తెల్పెను. మీరెల్లరును వినుడు. మాలో - బ్రహ్మ విష్ణు శివులలో - మహాత్కారణ మెవ్వరు తెల్పుడనెను. సత్యము తెల్పుడనెను. హరి ఇట్లనెను: విష్ణుమాయ మీకెల్లరకు దురతిక్రమము. అందరును విష్ణుమాయా మోహితులు. అన బ్రహ్మ అంగీకరించక ఏముఖముతో ఇట్లంటివో ఆముఖము అల్పకాలములోనే పతనముకాగలదని కోపమున పల్కెను. హరి శాంతుడయి "సత్యము, సత్యము అట్లే కాగలదు" అనెను.

హరి ధర్మారణ్యమునకేగి తపము చేయసాగెను. అనంతర వృత్తాంతము, హయశీర్షము అదికించుటయు ఇతఃపూర్వము తెల్పితిని కదా. శీర్షముపతనమగుటకు హేతువు తెల్పితినికదా. బ్రహ్మయు ధర్మా రణ్యమున విష్ణు మాయామోహితుడు కాకుండవలెనని తపముచేసెను. ముక్తేశమను లింగమును స్థాపించెను. ఎదుట తీర్థము కల్పించెను. అది మోక్షతీర్థము. కృత్తికానక్షత్రమున కార్తీక మాసమున స్నానము ఇట ప్రశస్తము. ఇటుల ధర్మారణ్యమున త్రిమూర్తులును తప మొన రించ స్థానములు పవిత్రవంతములున్నవి. శుభప్రదమయినది దేవసరస్సు. దాని నీరు అతి స్వచ్ఛము, మధురము, గంగోదకసమము. దివ్యాలు త్రవ్వినది, మిక్కిలి లోతుగలది, విశాలమయినది, నానావిధ జల విహంగ విహారములతో నలరారునది. ఇట స్నానమాచరించి దానాదులిచ్చి పితరులకు పిండ ప్రదానము చేసినవారు శాశ్వత బ్రహ్మలోకము ప్రాపింతురు.

*

# బ్రహ్మఖండము

## 2-వ అవాంతర ఖండము

## 16-వ అధ్యాయము

ఋషులు - ధర్మారణ్యావాసుల రక్షణకై శక్తులు నానా దిక్కుల స్థాపితమని వింటిమి. ఆశక్తుల నామములు శక్తులు తెలుపుమని గోరిరి. సూతుని సమాధానము - నాలుగుదిక్కులలో శ్రీమాతా, మదారికా, శాంతా, నందాపురీ అను నాలుగు శక్తులు. వనమధ్యమున సావిత్రీశక్తి - జ్ఞానసముజ్జ్వలము, పార్శ్వమునగాయత్రి, ఉపరి భాగమున ద్వారవతి, యథాయోగ్యములు దశదిశలాస్థాపితములు. గరుడారూఢురాలు త్రిశూలధారిణి, సింహారూఢ అన్యముశక్తి. ఆ శక్తులముందు సరోవరము కల్పితమయినది. స్నానసంధ్యల నొనరించిన పాపఘ్నము, ముక్తిదము. ఆనందయనుశక్తిఅక్షమాలాలంకృతమయిన హస్తము.కలది ఇది సాత్త్వికీశక్తి.

*

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము

## 17-వ అధ్యాయము

దక్షిణముగ బలశక్తి శాంతాదేవి స్థాపితము. విచిత్రాంబర ధారిణి, వనమాలకంఠమున అలంకారము, తామసీశక్తి, మధు కైటభులను సంహరించినశక్తి, శివపత్ని హరిచే స్థాపితము, పూజితము. ఎనిమిదిభుజములు, నల్లని దేహచ్ఛాయ, నల్లని అంబరములు వ్యాఘ్రవాహనము. ఈమె ఆరాధనము శత్రునాశనము, దుర్గ రక్షణమున్ను. ఇంకొకశక్తికులమాతృక. కుమారి, బ్రహ్మపుత్రి, శ్రీమాత అనిపేరు. కమండలధారిణి, అక్షమాలకరముల, శుభ రూపిణి, రాక్షసనాశని, ఎర్రనివసనము రక్తమాల్యములు, పదిభుజ ములు, అయిదుముఖములు, సురేశ్వరి, సాక్షాత్సరస్వతీరూపిణి, ద్విజులారాధించుశక్తి, సర్వోపద్రవములను దూరీకరించు మాతా స్వరూపిణి, సర్వవిఘ్నవినాశినీ, వివాహాదికార్యములయందు పూజితు రాలు, విఘ్నేశ్వరుడు ముందుగా ఎటుల పూజనీయుడో అటులనే శ్రీమాత పూజనీయురాలు, ఏదిభుజించతలంచినను అది ఆమెకు నివేదించి భుజించవలెను. భోజనమునకు పూర్వము పూజనిర్వర్తించి కించిత్తు నివేదించిన దేవి సంతసించును. విఘ్నములు తొలగును. శ్రీలు వర్ధిల్లును.

*

# బ్రహ్మఖండము

## 2-వ అవాంతర ఖండము

## 18-వ అధ్యాయము

శంకరులు స్కందునకు ధర్మారణ్య సంబంధమయిన ఒక గాథ తెల్పుచున్నారు. ధర్మారణ్యమున కర్ణాటకుడను దుష్టుడుకలడు. వాడు రహస్యముగపోయి దంపతులను బాధించసాగెను. ద్విజులు, వణిజులు వానిభయమున ధర్మారణ్యము విడిచిపోసాగిరి. మాతంగి రూపమును ధరించి శ్రీమాత ఆతనిని సంహరించెను. మరలసర్వు లును ధర్మారణ్యమునకు తిరిగి సుఖజీవనముచేయుచు శుభకార్య ములయందు ముందుగా శ్రీమాతను, మాతంగీశ్వరిని పూజించుచు, ఆమెవలన విఘ్నములులేక రక్షపొందుచు ఆనందమున జీవించసాగిరి. ఆ కర్ణాటకుడను దైత్యునిపుట్టు పూర్వోత్తము లిట్లు వివరించబడినవి, మహారాష్ట్రదేశమునపుట్టి మహాబలుడయి భూలోకమునువారిని జయించి దివ్యులపై దాడివెడలెను. వేదవిహిత కర్మలకు, ధర్మము నకు, ముల్లోకములలో ముప్పుతెచ్చెను. ఆ అసురుడు మాయావి. తనవారితో సర్వత్ర సంచరించుచుండ పురముల, గ్రామముల, అరణ్య ముల, త్రిలోకముల వేదపాఠము సాగుటలేదు. యజ్ఞకార్యము అంత రించినవి. వ్రతములు తీర్థయాత్రలు చేయుటకై ఇల్లువిడిచిపోవ జనము భయభ్రాంతులయిరి. కాని శ్రీమాత రక్షణయున్నదికదా యని కొంతకాలముగా ధర్మారణ్యము ప్రవేశించ ఆలోచనచేయ సాగెను. రహస్యవేషమున, ద్విజుడుగానయి వివాహము జరుగుచున్న సమయమున హఠాత్తుగాపోయి దంపతులను గగనమునకెత్తుకొని పోయి పురుషుని చంపి నూతనవధువుతో రమించుచు తుదకామెను తన పొట్టనిడుకొనుచుండెను. నూతన వధువు రాక్షసాక్రాంతయయి

భయముననే అశువులు విడుచుచుండెడిది. ద్విజులు వణిజులు ధర్మా రణ్యమున ఒకచోటచేరి ఈ దానవుని సంహరించు ఉపాయము ఆలోచించు సమయమున అశరీరవాణి ఇట్లు విన్పించెను. "శ్రీమాతను సేవించుడు" అని, వెంటనేవారు శ్రీమాతను అర్చించుటకై ధూప దీపచందనకర్పూర నైవేద్యములు కల్పించిపూజించ సాగిరి. సత్య మందిరమున శ్రీమాతనువారు పూజించి నుతించిరి. "నీవే మాకు కులదేవతవు. హ్రీంకారరూపిణివి. దుష్టాత్ముడీ దానవుడు మమ్ము బాధించుచున్నాడు. స్నానసంధ్యాద్యనుష్ఠానములకే విఘ్నములు కల్పించుచున్నాడు. మహాదేవి, మహేశ్వరి! మమ్ము రక్షించుము." అన వారివలన శ్రీమాత రాక్షసుని కృత్యములువిని కోపారుణిత లోచనయు, జ్వాలామాలాస్ఫులింగ వ్యాపినియు కాగా ఆమె ఆగ్రహావేశమునుండి కామరూపిణి మాతంగి, కాళి, కరాళవదన జనించినది. పదునెనిమిదిచేతులు ధనుర్బాణములు ఖడ్గ ఖేటాదులు కరముల ధరించి విరాజిలినది. కర్ణాటదానవునిపట్టి కుపితయయి వానితో కాళి పోరసాగెను. అయితే రహస్యరూపుడు వీడెట్లుమాతంగిచేత బడెనో అని సంశయమువలదు. ఒకనాడు చైత్రమాసమున ధర్మారణ్యావాసులు వేదప్రవచనములు చేయుచుండ ఆ వేదఘోష విని కర్ణాటదానవుడు తనవారితో ద్విజులను బాధించరాగా మాతంగి, భువనేశ్వరి సింహనాదమొనరించి త్రిశూలము చేబూని అసురమూకలోదూకి చించి చెండాడసాగెను. త్రిశూలముచే పొడువ వాడు మూర్ఛితుడై లేచి మాయనుపూని అంతటా తానే అయి భయముకొలుపసాగ ఆమె ఆ అసురుని కరాళవదనయయి మ్రింగి నాసారంధ్రము, వదనము మూసివేయ కర్ణరంధ్రమునుండి బయటకువచ్చి మరల యుద్ధముచేయక సుందరరూపము ధరించి ఆమెవద్దకువచ్చి తన్ను వివాహముచేసి కొమ్మన నాచెలియలుశ్యామ యున్నది, ఆమెను వరించు మొమ్మనవాడు ఆమెచూపిన ప్రదేశమున

కేగి శ్యామలాదేవిని వేడి వరించుమన ఆమె కోపించి వానితో దుర మునకు తలపడెను. · చిరముపోరి మాఘమాసము కృష్ణ తృతీయ మధ్యాహ్న సమయము ధర్మారణ్యమున శ్యామలాంబ దుష్టుడగు కర్ణాటకాసురుని సంహరించినది. ద్విజులు పాయసాదులు కల్పించి దేవినర్చించి నివేదనచేసిరి. ద్విజులానాటినుండి శ్యామలా మాతంగీ దేవతల రక్షణగాంచి దంపతులును సుఖముండిరి. ఈ రాక్షసునిపేర, "మాతచే మృతిచెందిన అనంతరము పుణ్యపదమున కేగుటచేత" ఆ ప్రదేశము కర్ణాట( కన్నడ) మని విశ్రుతమయినది.

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము

## 19-వ అధ్యాయము

ఇంద్రుడు ధర్మారణ్యమున నగరమున కుత్తరభాగమున తపమొనరించెను. శివునిగూర్చి తీవ్రనియమము పాటించుచు తపో నియతి చిరకాలనుండెను. ఇంద్రుని తపమునకు సంతసించి వృషభ ధ్వజుడు ప్రత్యక్షమయ్యెను. ఇంద్రుడు తపముచేయుటకు కారణము వృత్రాసురసంహారమున సంక్రమించిన పాపముపోగొట్టుకొనుటకే. హరు డింద్రుని కోరిక తెలుపుమన శంకరా! దేవా, బ్రహ్మ హత్యాపాపము నన్ను బాధించుచున్నది దానిని తొలగించుమన ఏపాపమయినను ధర్మారణ్యమున శివార్చనమున తొలగును నీ వటకేగుమన ఇంద్రుడుతానా ప్రదేశమున లింగమునుస్థాపించి పూజగావించు నిమిత్తముహరుని సన్నిధానవర్తి కాగోర శంకరులటు లనే ఇంద్రుడు కోరిన తావున ధర్మారణ్యమున ఇంద్రేశ్వరుడని ప్రసిద్ధ లింగరూపమున నుండెను. ఇంద్రుడట ఇంద్రసరోవరము నిర్మించు కొనెను. ఆసరోవరస్నానము, ఇంద్రేశ్వరుపూజ సర్వపాపప్రశమనము, సుఖదము. అష్టమి, చతుర్దశి ఈ తిథులయందు మాఘమాసస్నానము ఇంద్రసరమున పుణ్యదము. ఇంద్రతీర్థమున రత్నస్థాపితమయిన సువర్ణ నయనము బ్రాహ్మణునకు దానముచేసిన అంధత్వముపోవును. ఇంద్ర సరోవరము, ఇంద్రేశ్వరమునకు పలువరములిచ్చి హరుడంతర్ధానము నందెను. జయంతుని చేతనుకూడ ఒకలింగము స్థాపితమయినది జయంతేశ్వరము. ఇంద్రేశ్వర పూజాతుల్య ఫలములిందునుకలవు.

*

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము

## 20-వ అధ్యాయము

అనంతరము శివతీర్థమున్నది. ఇట స్నానము పునర్జన్మ లేకుండును. ఒక సమయమున కైలాసమున పార్వతి శంకరుని నుతించ సాగెను. అంతకుమున్ను జగదంబ ప్రశ్నకు సమాధానముగా మంత్రములు, జలాజరములు, కవచము, అర్గళము కీలకము ఇత్యాది విభాగములాధర్వణచోదితములు తెల్పెను. ప్రకటములు కొన్ని మాత్రమే. ప్రకటితములుకానివి. సరహస్యముగ గురుముఖమున తెలియదగినవి అనంతములు. అని వివరించ కొన్నిమంత్రములు గ్రహించి అంబ అంతకు పూర్వము ధర్మారణ్య వృత్తాంతము విని యున్నది కాన ఎట శంభుమూర్తి సదాసన్నిధానవర్తియో ఆ శివ తీర్థమునకేగెను. వెంటనే మూర్ఛపోయెను. కారణము అటసాధకు లననేకులను చూచెను. సర్పులు ప్రేతాసనముననుండి, కాల కూటము వ్యాప్తముకా అటువంటి తాపునజపము చేయుచున్నారు. వహ్ని కాలకూటమునుండి సువ్యాప్తమగుచుండ వహ్నిభయమున గౌరి అధోముఖియయినది. శంకరునుద్దేశించి తపముచేయసాగినది. జగన్మాత శూలిని స్తోత్రముచేసెను, ఆ ప్రదేశము ధరాక్షేత్రమని ఖ్యాతి గాంచినది. సాంగముగ రుద్రజపముచేసిన పిశాచాదులు విడిచిపోవును పాపములుతొలగ శుద్ధచేత స్కులయ్యెదరు. రోగములు శమించును, ధరాక్షేత్రమునచేసిన దానాదులు అక్షయఫలదములు.

*

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము

## 21-వ అధ్యాయము

అట తపమొనరించి దేవి తన శరీరమునుండి కులదేవతలను పుట్టించినది భట్టారికీ, వారు భద్రకాలి, మాహేశీ, ధనమర్దినీ, శాంత, శేషదేవి, వారాహి, భద్రయోగిని, కులేశి, తారణి, కనకానందా, చాముండా, సురేశ్వరీ,-ఇవి ప్రత్యేకించి నూరేశిశక్తులను పుట్టించ శక్తులు నానారూపముల అనంతములుగా విశ్వవ్యాప్తమయినవి. ఈఅనంతశక్తులకు ప్రవరలు, అధిష్ఠానములు, దివ్యర్షులు, మహర్షులు పలువురుకలరు. కాశ్యప, భార్గవ, చ్యవన, శ్యామాయన ఇత్యాదులు. వివాహయోగ్యలయిన కన్యలు అసవర్ణలు, తరభేదముల అంగీకరించ యోగ్యలు వివరములుకలవు.

*

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము

## 22-వ అధ్యాయము

### స్థానవాసినులు యోగినులు — వీని వివరము:

త్రిమూర్తులు ధర్మారణ్యమున నివాసులరక్షణార్థము ఈ యోగినులనునిల్పిరి. సర్వాలంకార శోభితలు, విచిత్రాంబరధారిణులు, పలు ఆయుధములు ధరించినవారు, వివిధవాహనములతో విప్రుల భయనాశనమునకు ధర్మారణ్యమున నిల్పబడిరి. అన్నిదిక్కుల యందును ఆయా యోగినులు రక్షా కార్యమున నుందురు. ఆశాపురీ, పిప్పలాంబ, శాంత, భట్టారిక, ఇత్యాదులు. భట్టారికమహాశక్తికి నాలుగుచేతులు, సింహావాహనము. వరప్రద, జలదానమున సంత సించును. దక్షిణమున వింధ్యవాసిని, ఆమె ఆయుధపాణి, రూపసంపన్న, భయహారిణి. పశ్చిమమున నింబజాదేవి, మహాబల. బ్రహ్మాణీ ప్రముఖులు నానారూపధారిణులు సర్వత్రారక్షా కార్యములు నిర్వర్తింతురు.

*

# బ్రహ్మఖండము

## 2-వ అవాంతర ఖండము

## 23-వ అధ్యాయము

దేవతలొకమారు బలవంతులగు నసురులబాధపడలేక బ్రహ్మను శరణందిరి. దానవనాశమున కుపాయము తెలుపవేడిరి. బ్రహ్మ "పూర్వము భూలోకమున యముడు తపమొనరించిన ప్రదేశము ధర్మారణ్యమని ఖ్యాతిగన్నది. అటశర్వుని లింగరూపముల నేను, హరి, దివ్యులెల్లరును స్థాపించితిమి. ఆ ప్రదేశమునచేసిన జపహోమదానాదు లక్షయ ఫలప్రదములు. కనుక అట దానవులకు చొరరాదు. మీరట కేగి శంకరునర్చించుడు" అన బ్రహ్మనుకూడగట్టుకొని దివ్యులు ధర్మారణ్యమునకేగి సత్రమొకటి తలపెట్టిరి. అత్రి అంగిరస మార్కండేయాదులు ఋత్త్విజులుగా దివ్యులు యజ్ఞమారంభించిరి. గణపతి కుమారస్వామి, ఇంద్రుడు, జయంతుడు నాలుగు ద్వారముల రక్షించుటకునిలువ, ఋత్త్విజులు రక్షోఘ్న మంత్రములు పఠించుచు హోమముచేయసాగిరి. నానారసోపేతములగు భక్ష్యభోజ్యములన్నములు యజ్ఞేశ్వరునకు నివేదించి ద్విజులను తృప్తిపరచిరి. వేయి సంవత్సరములుదీక్షగా యజ్ఞముసాగించిరి. ఆబలమున దివ్యులు రాక్షసులను సంహరించి నాకమునకేగిరి. కాలముగడువ పర్యాయమున కృతయుగమురాగా లోహాసురుడుపుట్టి బ్రహ్మవేషమున చాతుర్వర్ణ్యములవారికి భయము కల్పించి ఉపద్రవములు వ్యాపింపచేయసాగెను. యజ్ఞకార్యములు పాడుచేయుచు హోమద్రవ్యములను భక్షించసాగెను. అగ్నివాటముల రక్తమాంసములజిమ్మి అపవిత్రములొనరించ మొదలిడెను. నిర్జనమయి పుణ్యాతమమయిన ముక్తారణ్యమునకు అసురభయమున ద్విజులుపారిపోయి డాగిరి. లోహాసురునిచే ధర్మారణ్యము శూన్యముగా చేయబడినది. ద్విజులువిడచిపోగా తీర్థములు నామమాత్రముకాగా దానవుడట నివాసమేర్పరచుకొని త్వరలోనే దానినివిడచి సంతోషముగా తన స్థానమునకు తిరిగిపోయెను.

*

# బ్రహ్మఖండము

## 2-వ అవాంతర ఖండము

## 24-వ అధ్యాయము

పూర్వము తెల్పితినికదా, ఒకనాడు వ్యాసుని వాక్యమువిని ధర్మరాజు ధర్మారణ్యమునకేగెను. పాతకనాశముకోరి, సాధుపాలనము తనకు కావలెనని కాంక్షించి తీర్థములస్నానముచేసి దేవతల నారాధించి ఇష్టాపూర్తములు సర్వము నిర్వర్తించి పాపములుపోనాడి తన పురమునకే తిరిగి యేగెను. కోటిజన్మల చేసినపాపము ధర్మారణ్యతీర్థసేవనమున స్నానమాత్రముననే నాశనమయి ముక్తికాంతురు. ఈ విధముగ ధర్మారణ్య చరితము మునులకు సూతుడు విన్పించెను.

*

# బ్రహ్మఖండము

## 2-వ అవాంతర ఖండము

## 25-వ అధ్యాయము

మార్కండేయమహాముని సత్యలోకమునుండి సరస్వతిని ధర్మారణ్యమునకు తీసికొనివచ్చెను. ఒకనాడా వివరములు తెలుప మార్కండేయునే మునులు ప్రశ్నింప నేగిరి. ఆ సరస్వతీ తీర్థము ఉత్తమోత్తమము. వీరలేగుసమయమునకు మార్కండేయ మహాముని సరస్వతీ తీరమున సుఖాసనముననుండెను. శాంతముగ, యోగాసనముననున్న, జ్ఞాని, బ్రహ్మతుల్యుడునగు, ఆతనికి నమస్కరించిరి. తీర్థమహిమ ప్రశ్నించ మునిసమాధానము "సత్యలోకమునుండి సరస్వతి నాహ్వానించి తెచ్చి సురేఖాద్రిన ప్రవహింపచేసితిని. శరణార్థులకు శరణ్యామీ తీర్థము. భాద్రపదశుద్ధ ద్వాదశి అతి పుణ్యమయిన దినము. ద్వారావతీ తీర్థస్నానము పుణ్యదము, పాపఘ్నము, అట చేసినదెల్ల అక్షయమగును. సరస్వతి కామధేనువువంటిది"

*

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము

## 26-వ అధ్యాయము

మార్కండేయులచే ఆనీతమైన సరస్వతీ తీర్థమున దేహము చాలించిన నరుడు విష్ణుసాయుజ్యమందును. ద్వారవతీ తీర్థమున దేహత్యాగము సుదుర్లభము. ఆ విధముగా చేయగాంచిన విష్ణులోక ప్రాప్తి భువి ఇంతకన్న పవిత్రతీర్థములేదు. అట ఉపవాసమునకు తుల్యమయిన తపస్సులేదు. వేదమును మించిన శాస్త్రములేనటుల, తల్లితో సమము గురువులేనటుల, ఇట స్నానముచేసి పితృతర్పణ మొనరించి కేశవునర్చించిన, పాపములుతొలగి విష్ణులోకము ప్రాపింతురు. - ఇది ధర్మారణ్యమున ద్వారికామాహాత్మ్యము,

*

# బ్రహ్మఖండము

## 2-వ అవాంతర ఖండము

## 27-వ అధ్యాయము

దాని ప్రక్కనే మార్కండేయులచే నిర్మించబడినది గోవత్స మను తీర్థరాజముకలదు. అంబికాపతి గోవత్సరూపమున, స్వయంభూలింగముగవెలసెను. బలాహకుడనే మహాబలుడు రుద్రభక్తుడుండెడివాడు. ఆ ఖేట విహారమున విలాసముగ తిరుగుచుండ ఒక భటుడు రాజుతోననెను. "మహారాజా! సింహములమధ్య నొక గోవత్సమును చూచితిని. తల్లిలేని ఆ ఆవుదూడమీద ప్రేమతో మృగములు వర్తించుచున్నవి". ఆమాటలాలించి రాజు పదాతివెంట సింహముల మధ్యనున్న గోవత్సమును చూడబోయెను. సింహములు రాజభటులనచూచి పారిపోగా ఒక పొదలోనున్న గోవత్సమును భటుడు రాజునకు చూపించెను. దానిని పట్టుకొనయత్నించ అది లింగముగ మారిపోయెను. ఉజ్వలమయిన లింగమును చూచుచుండగనే రాజు దేహమువిడచి స్వర్గమునకేగెను. సురలు పూలవానకురియించిరి. మహాదేవుని ఆరూపమున అటనేగుదాని నిలువప్రార్థించ శంకరుడటులనేయనెను. గోవత్సముతోపాటు రాజు బలాహకుడు శివలింగమునందే స్థాపించెను. ఆ లింగమును దినమునకొక అణుప్రమాణముగ వర్ధిల్లసాగ దివ్యులు భయపడి మహాదేవునే ప్రార్థించిరి. అశరీరవాణి - భయపడకుడు లింగముముందు చండాలుని తెచ్చి నిలుపుడనవారటు లొనరించిరి కాని లింగము పెరుగుటమానలేదు. మరలదివ్యులు ప్రార్థించ కర్మచండాలుని నిలుపుడను వాణి విన్పడినది. ఆశ్చర్యపడి వారు గ్రామములకేగి వెదుకసాగ నొకచో పాపకర్మరతుని, జన్మతః బ్రాహ్మణబ్రువునికని, దుర్బలుడు

కృారుడు ఎండినమాంసము తిను నాతనితెచ్చి లింగము సమ్ముఖ
మున నిల్పిరి. గోవత్సాగ్రమున నిలుపవెంటనేవాడు భస్మీభూతు
డాయెను. ఆ క్షణమునుండి లింగము సౌమ్యభావమంది పెరుగుట
మానినది. అది చండాలస్థలమని పేర్వడసినది. కృష్ణపక్షము చతుర్దశి
గోవత్సేశ్వరు దర్శన పూజన స్తోత్రాదులు పాపవినాశకరములు
మోక్షదములును. ఇట స్నానము రుద్రలోక ప్రాప్తిహేతువు.

∴∵

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము

## 28-వ అధ్యాయము

గోవత్సమునకు నైరృతిభాగమున లోహాయష్టిక కలదు. అట రుద్రుడు స్వయం భూలింగరూపమున నుండును. ఇది పితరులకత్యంతము ప్రియము. ఇటతిలోదకములిచ్చి పిండప్రదానము చేసి దక్షిణలతో బ్రాహ్మణులకు భోజనము కల్పించ ప్రేతయోనివిడచి పితరులు సద్గతికాంతురు. భాద్రపదమాసము అమావాస్య పితృతర్పణమునకు ముఖ్యమయినతిథి. రుద్రతీర్థమున వస్త్రాదులతో అలంకృతమయిన గోదానము, విష్ణుతీర్థమున హిరణ్యామునిచ్చుట మోక్షప్రదములు. గయలో పితృరూపమున స్వయంజనార్దనుడు తృప్తుడయి ఋణత్రయము తొలగించును. కృష్ణచతుర్దశి పిండప్రదానము పితరులకక్షయతృప్తి నిచ్చును. లోహాయష్టి పితృతర్పణము సుఖములిచ్చి వారలకు సత్పదప్రాప్తికూర్చును.

*

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము

## 29-వ అధ్యాయము

### లోహాసురునికథ - బలుని నూర్వులు సుతుల చరిత్ర :

లోహాసురుడు తనలో నిటులచింతించసాగెను. "ఎటకుపోవల యును. తపముచేయుట కుత్తమస్థానమెద్ది? ఏదైవము నారాధించ వలయును. ఎవనిశిరమున గంగయున్నదో, కనులు సూర్యచంద్రులో, హృదయము నారాయణుడో, కటిభాగము బ్రహ్మయో దేహమంత టను ఇంద్రాదిదేవతలో, ఆ మహేశ్వరునిగూర్చియే తపమాచరింతును" అని నిశ్చయించుకొని ఘోరమయిన నియమములు పాటించుచు తపము చేయసాగెను. శంకరుడు ప్రసన్నుడై ప్రత్యక్షమయి వరము వేడుమన తనకు ముసలితనము లేకపోవలయునని, మృత్యువువలన అభయము, ఆజన్మలో శంకరులు తన హృదయమున నుండవల యునన ఆ వరములిచ్చి భవుడంతర్ధానమాయెను. శర్వునివలన వరము లందియు ఆతడు సరస్వతీ తీరమున సంసారతరణోపా యముకోరి తిరిగి తపశ్చర్యసాగించెను. ఆతని తపోబలమున కింద్రుడు భయపడెను. ఆతని వద్దకుపోయి బలమునతాడించ ధ్యానమువిడచి ఇంద్రునితో ఆతనితోడి సురలతో యుద్ధమొనరించి వారలను నొప్పించి పారిపోజేయవారు హరిని శరణందిరి. హరివచ్చి లోహా సురునితో రణమునకు తలపడెను. శతవత్సరములు పోరుకలిగినను. వాడోడలేదు. కారణము ఆతని హృదయమున హరుడు, కటిస్థాన మున బ్రహ్మ, పాదములయందుహరి, శరీరమంతటా-దివ్యులు ఇటుల శివునివరము. అయితే లోహాసురునికోరిక భూలోకమున తానున్నంత కాలమిట్లుండవలెనని. బ్రహ్మ అసురుని కిట్లనెను.- "నీవు సత్య

వాక్కునిలుపుకోవలెను. లేకున్న నీపితరులు నరకముపాలయ్యె దరు. భూలోకమువిడిచి స్వర్గాదిలోకములవైపు నీవు రాజనదు" అనవాడు సంతసించి భూలోకమునకేగెను. దివ్యులు భయముతీరి నాకముననుండిరి. సత్యవాక్ప్రభావమున అసురుడు తపముచేసిన స్థానము, ధర్మారణ్యసంబంధ మహాపవిత్రమయిన తీర్థమయినది. త్రిమూర్తులు అసురునితో నీ స్థానము అతిపవిత్రమయి గంగాగయా ప్రయాగలకన్న అచిరఫలప్రదము, అక్షయపుణ్యలోకప్రాప్తి అని వరమిచ్చి ఆతనిని వానితావుననే నిలిపి వారంతర్హితులయిరి. రుద్ర స్థానము సదా పితరులకు ముక్తి హేతువు.

*

# బ్రహ్మా ఖండము

## 2-వ అవాంతర ఖండము

## 30-వ అధ్యాయము

పూర్వము త్రేతాయుగమున వైష్ణవాంశమున సూర్యవంశమున రాముడు జనించెను విశ్వామిత్రుని యజ్ఞరక్షణకై మునివెంట రామలక్ష్మణులేగుచుండ దారిలో విఘ్నమాపాదించ వచ్చిన తాటకిని ముని ఆనతి రాముడు చంపెను. గౌతమ శాపమున శిలగాపడి యున్న అహల్య రామపాదపరాగ స్పర్శ, పావనియై స్త్రీగా మారెను. యజ్ఞమునకు విఘ్నమాపాదించ వచ్చిన మారీచ సుబాహువులను ఎదిరించి సుబాహువునుచంపి మారీచుని సముద్రముల కావల వాయవ్యాస్త్రమున పారజిమ్మెను. శివునివిల్లు విరిచి సీతను పెండ్లాడి అయోధ్యకేగుచు, అడ్డిన పరశురాముని నిర్జించెను. సీతతో పన్నెండు సంవత్సరములు, సుఖముగ గడిపెను. ఇరువదిపడవ సంవత్సరము యౌవరాజ్యమున కళిపి క్తునిచేయు దశరథుని తలంపుకాదని కైక ఒకదాన రాముడు జటాధరుడయి పదునాలుగు సంవత్సరములరణ్యవాసము చేయవలెనని, రెండవదిగ భరతునకు యౌవరాజ్యమీయవలెనని, రెండు వరములుకోర రాముడు సీతా లక్ష్మణులతో పురము విడచి యేగి చిత్రకూటమున అయిదు రోజులుండెను. విచారమున దశరథుడు మరణించెను. ఆ వార్త భరత శత్రుఘ్నులు పోయి రామునకు తెల్పి తిరిగివచ్చి రాజ్యభారము వహించ ప్రార్థించిరి. కాని రాముడు పితృవాక్యము పాలించివచ్చువఱకు, భరతుని ప్రార్థన ననుసరించి పాదుకలిచ్చి పంపివేయ భరత శత్రుఘ్నులు పాదుకలర్చించుచు నందిగ్రామమునయేయుండి రాజ్యపాలన మంత్రుల సహాయమున సాగించిరి. రాముడు అత్రిమహర్షిని దర్శించి అనుమతి వడసి దండ

కారణ్యము ప్రవేశించెను. రాక్షస సంహారమునకు తొలికబళముగా విరాధుని చంపివేసిరి. పదియు మూడున్నర సంవత్సరములు పంచ వటిలో వసించిరి. అట శూర్పణఖను విరూపిగానొనరించిరి. రాముడు లేకుండచేసి పంచవటిలోని సీతను మాఘ శుద్ధ అష్టమినాడు రావణుడు హరించి లంకకు తీసికొనిపోయెను తమ్ము దూరముగ కొనిపోయి బంగరులేడిరూపమున వంచించిన మారీచుని సంహరించి తిరిగి పర్ణశాలకు రాగసీతహరించబడినదని రామలక్ష్మణులు కనుగొనిరి. సీత ఆక్రందనము విని జటాయువు రావణుతోపోర పక్షములు ఛేదించి పక్షిని నేల కూల్చి రావణుడు లంకకు సీతతోనేగెను. మాఘశుద్ధ నవమి సీత లంకలో ప్రవేశముచేయబడినది. సీతను వెదకుచు దక్షిణముగా పయనించు రామలక్ష్మణులు నేలపడి కొనయూపిరితోనున్న జటాయువువలన సీతను రావణుడు హరించి కొనిపోయెనన్న వార్తవిని భక్తితో ఆతనికి అగ్నిసంస్కారముచేసి పంపాసరోవరము చేరిరి. అట శబరిననుగ్రహించి పంపాజలములు స్పృశించియుండ హనుమ వారివద్ద కేతెంచెను. ఆతనితో రాముడు సఖ్యమొనరించి సుగ్రీవునితో మైత్రి గూర్చి సుగ్రీవునికొఱకు వాలిని సంహరించెను. అంగుళీయకము గ్రహించి దక్షిణసముద్ర తీరమునకు వానరులు హనుమతోనేగ అట సంపాతి పదవమాసమున వానరులకు లంకలో సీత కలదన్న వార్త చెప్పగా, హనుమ వారధిదాటి రాత్రి లంకలో సీతను వెదుకసాగెను. ద్వాదశినాడు శింశుప (అశోక) వృక్షముక్రింద శోకమూర్తివలెనున్న సీతనుకాంచెను. సీతకు ముద్రిక చూపి విశ్వాసము కల్పించి యూరడించి రామునితో వత్తునని తెల్పి, త్రయోదశినాడు అక్షయకుమారాది అసురుల ననేకులను హనుమ సంహరించెను. త్రయోదశినాడే ఇంద్రజిత్తునకు బ్రహ్మాస్త్రమున కట్టువడి వాయుసూనుడు రావణుని నిందించెను. తోకను కాల్చ రావణుననుమతివడసి యసురులటు లొనరించ బ్రహ్మాస్త్రమునుండి విడివడి దేహముపెంచి లంకంతయు కాల్చివైచెను. పూర్ణిమనాటికి మహేంద్రగిరికి హనుమ తిరిగివచ్చెను.

మార్గశీర్షము పంచమినాటికి తిరిగి కపులువచ్చి మధువనము ధ్వంసముచేసిరి. సప్తమినాడు ప్రత్యభిజ్ఞ (సీత ఇచ్చిన చూడామణిని)ను హనుమ రామునకిచ్చి తాను లంకలో జరిపిన వార్తసంగ్రహించి, సీత వార్తనివేదించెను. అష్టమి, ఉత్తరఫల్గుణి, విజయ మధ్యాహ్నం రెండు యామముల రాఘవుల ప్రస్థాన భేరిమ్రోగినది. ఏడు రోజులకు రామలక్ష్మణులు సుగ్రీవ సైన్యముతో దక్షిణ సముద్రతీరము చేరుకొనిరి. పుష్య శుక్ల తృతీయనాటికు ఉపస్థానం. చతుర్థి విభీషణుడు రాముని శరణందెను. సముద్ర తరణమునకు పంచమినాడు ఆలోచన చేసిరి నాలుగురోజులు రాముడు ప్రాయోపవేశ మొనరించెను. దశమి ఆరంభించి త్రయోదశికి సముద్రుడు తెల్పిన ఉపాయమున సేతువు నిర్మాణము గావింపబడెను.

చతుర్దశినాడు వేలాది సైన్యము నిలచి పౌర్ణమి కృష్ణ పాడ్యమి, విదియ మూడుదినములలో వానరసైన్యము సముద్రము దాటినది. వెంటనే లంకను ముట్టడివేసిరి. తృతీయ మొదలు దశమి పర్యంతము-ఎనిమిది దినములు ముట్టడివైచియుండ ఏకాదశినాడు శుకసారణులట కేతెంచిరి. పుష్యశుద్ధ ద్వాదశివరకు సేనల సమీకరణము ఉభయసేనల, బలాబలవర్ణనము కపులుగావించిరి. శుక్ల త్రయోదశి మొదలు యమాంతం అమావాస్యవఱకు మూడు దినములు రావణుని సేనా సన్నాహము మాఘశుద్ధ పాడ్యమి అంగదుని రాయబారిగా రాముడు పంపించెను. సీతకు మాయారాముని శిరముచూపబడినది. మాఘశుద్ధవిదియ మొదలు అష్టమివఱకు ఏడు దినములు రాక్షస వానరులకు సంకుల సమరము జరిగినది. మాఘ శుద్ధనవమి రాత్రి సమయమున ఇంద్రజిత్తు రామలక్ష్మణులను నాగపాశబద్ధులను గావించెను. వాయుదేవుని ఉపదేశమున రాముడు గరుడుని స్మరించ నాగపాశ విమోచనము గరుడుని రాకవలన నయినది. అది దశమినాడు జరిగినది. దశమి ఏకాదశియుద్ధము. ద్వాదశి

నాడు హనుమ ధూమ్రాక్షుని వధించెను. హనుమయే త్రయోదశి నాడు అకంపనుని సంహరించెను. రావణుడు మాయాసీతను చూపి రామాదులను వానరులను భయభ్రాంతులుగా నొనరించెను. మాఘ శుద్ధ చతుర్దశి కృష్ణపాడ్యమి-మూడుదినముల యుద్ధమున నీలునిచే ప్రహస్తుడు మరణించెను. మాఘ కృష్ణవిదియ - చతుర్థి - మూడుదిన ములు తుములయుద్ధమున రాముడు రావణుని రంగమువిడిచి పారిపో నొనరించెను. పంచమి మొదలు అష్టమి - కుంభకర్ణుని మేల్ కొల్పుట కాగా నాలుగు దినములు కుంభకర్ణుడు భోజనముచేయు చునే యుండెను. నవమి మొదలు నాలుగు దినములు కుంభకర్ణుడు యుద్ధముచేసి పలువురు వానరులను తిని రామునిచే హతుడయ్యెను. అమావాస్య లంకలో శోకసంకుల మయ్యెను. - ఫాల్గుణ శుద్ధపాడ్యమి మొదలు చతుర్థివఱకు నాలుగు దినములు - నరాంతకాదులయిదుగురు హతులయిరి. పంచమి మొదలు సప్తమి అతికాయవధ, అష్టమి మొదలు ద్వాదశి అయిదు దినములు కుంభనికుంభులవధ - మకరాక్షుడును, అయిదు దినములు ఫాల్గుణ కృష్ణ ద్వితీయ నాటికి విదియనాడు ఇంద్ర జిత్ విజృంభణము లక్ష్మణమూర్ఛ - ఓషధి సంజీవనిని హనుమ తెచ్చుట త్రయోదశినాటికి- అయిదు దినముల యుద్ధమున లక్ష్మణునిచే ఇంద్రజిత్తు సంహరించబడెను. చతుర్దశినాడు రావణుడు దీక్షవహిం చెను. అమావాస్య యుద్ధరంగమునకు బయలుదేరెను. చైత్రశుద్ధ ప్రతిపదాది పంచమీ పర్యంతము-అయిదుదినములు రావణుడు యుద్ధము చేయు కాలమున విఖ్యాతులయిన రాక్షసులెల్లరు హతులయిరి. చైత్రశుద్ధనవమి సౌమిత్రి శక్తిపాతమున మూర్ఛితుడు కాగా రాముడు కోపించి రావణుని పలాయితు నొనరించెను. విభీషణుని ఉపదేశమున హనుమ యుద్ధముచేసి రాక్షసులనేకులను వధించి లక్ష్మణుని కొఱకు ద్రోణాద్రికి ఓషధులను తేనేగెను. విశల్యను తెచ్చి లక్ష్మణుని సుఖస్థితికి తెచ్చెను. దశమిరాత్రికాలమున రాక్షసులు

రణమారంభించిరి. ఏకాదశినాడు ఇంద్రునిపంపున మాతలి రాముని కొరకు రథము తీసికొనివచ్చెను. శుక్ల ద్వాదశి మొదలు కృష్ణచతుర్దశి పర్యంతము, పదునెనిమిది దినములు రామరావణుల సంగరము అంత మున రావణవధ అయినది. అమావాస్య రావణాదుల సంస్కారము – ఔర్ధ్వదైహికము - జరుపబడినది.

మాఘ శుక్ల ద్వితీయ ఆరంభము - చైత్ర కృష్ణ చతుర్దశి పర్యంతము ఎనుబదిఏడు దినములు-మధ్య పదునైదు దినములు మొత్తము విరమణముకాగా డెబ్బదిరెండు దినములు సంగ్రామము జరిగినది. వైశాఖ శుద్ధ పాడ్యమి రాముడు రణభూమినుండెను. విదియ నాడు లంకారాజ్యమునకు విభీషణుని అభిషిక్తునొనరించెను. వైశాఖ శు-తృతీయ సీతాశుద్ధి—దివ్యులు సాక్షులయిరి. సీతను ఆదరించెను. దశరథుడు దివ్యులతో నేతెంచి అనుమతిచేసెను. వైశాఖశుద్ధ చతుర్థి పుష్పకమాశ్రయించి రాముడు అయోధ్యకు ప్రయాణించెను. పదు నాలుగు సంవత్సరములు పూర్తికాగా మాఘ పంచమిన-భారద్వాజా శ్రమము మిత్ర పరివారముతో చేరెను. పుష్పకముతో షష్ఠినాడు నంది గ్రామము చేరుకొనెను. సప్తమినాడు అయోధ్యలో రాజ్యాభి షిక్తుడాయెను. (దశాహాధిక మాసాంశ్చ చతుర్దశహిమైథిలీ ఉవాస రామరహితా రావణస్యనివేశనే) 42 వ సంవత్సరమున రాముడు రాజ్యమునకు వచ్చెను. (ద్వాచత్వారింశకేవర్షే రామోరాజ్యమ కారయత్). సీతకు (త్రయస్త్రింశత్) 32 సంవత్సరముల వయస్సు. నాటికి పదునాలుగు సంవత్సరములు అరణ్యావాసము ముగించుకొని తన పురి ప్రవేశించెను. తమ్ములతో రాజ్యముచేసెను. (దశవర్ష సహా స్రాణి దశవర్ష శతానిచ। రామోరాజ్యం పాలయిత్వాజగామ త్రిదివాల యమ్) పదియునొకండువేలు సంవత్సరములు రాముడు రాజ్యము చేసినకాలము. రామరాజ్యమున సదాలోకమానందమయము. ధన ధాన్యములతో తులతూగినది, నరులు పుత్ర పౌత్రయుతులు, పర్జ

న్యుడు సకాలమున వర్షించ పృథివి సస్యశ్యామలగానాయెను. గోవులు ఘటములనిండు పాలిచ్చెడివి. వృక్షములు సదాఫలములతో నిండ యుండెడివి. ఆధివ్యాధులులేవు, నరులు పితృభక్తిపరులు, స్త్రీలు పతివ్రతలు, ద్విజులు వేద వేదాంగపరులు, క్షత్రియులు ద్విజభక్తి పరాయణులు, ఆచార సంకరముగాని, యోని సంకరముగాని రామరాజ్యమున కానరాదు, వంధ్యయనుమాట వినరాలేదు, రాముడరణ్యముల కేగ పురోహితుడు వసిష్ఠుడు తీర్థయాత్రలకేగి మునులతో తిరిగి వచ్చెను. రాముని చతురంగబలములతో ప్రజలు బంధువులు కుశలమా అని ప్రశ్నించెను. రాముని సమాధానము-తిరిగి కుశలమడిగి తీర్థ మాహాత్మ్యము, తీర్థములలో ఉత్తమతీర్థము తెలుపగోరెను.

*

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము

## 31-వ అధ్యాయము

శ్రీరామచంద్రుడు వసిష్ఠునితో ఇంకను ఇట్లనుచున్నాడు — మునీంద్రా! గురువర్యా! సీతను హరించిన కారణమున బ్రహ్మరాక్షసుల ననేకులను సంహరించితిని. ఆపాపముపోయి శుద్ధమనస్కుడ నగుటకు ఉత్తమోత్తమ తీర్థము తెలుప వేడెదను'. వసిష్ఠుని సమాధానము "గంగా, యమునా, నర్మద, సరస్వతి, గండకి, గోమతి ఇత్యాది నదులు పవిత్రములు. ప్రభాసము, నైమిశారణ్యము, కురుక్షేత్రము శ్రీశైలం, ఉజ్జయిని ఇత్యాది క్షేత్రములు మహాపుణ్యదములు, పైన వివరించిన పావనమయిన నదులు తీర్థములు ఈ ప్రదేశముల స్నానము జలపానము దానాదికములు సర్వపాప ప్రణాశనములు. ఇంతకన్న అతిశయమయినది. త్రిమూర్తులచే ఆదిలో సంస్థాపితమయినది ధర్మారణ్యముకన్న ఉత్తమము భుక్తి, ముక్తి ప్రదమయినది లేదు, బ్రహ్మహత్యాది పంచమహాపాతకములే కాదు, నరులు చేయగల ఎట్టి పాపమయినను ధర్మారణ్యమున హరి సేవనమున నశించును. యుగ యుగమున ధర్మారణ్యము సర్వసిద్ధి ప్రదము".

ఈ వాక్యమువిని శ్రీరామచంద్రుడు అమితానందమునందెను, ధర్మారణ్యమునకేగ నిశ్చయించెను. శ్రీరాముడు సోదరులతో సీతతో, ప్రకృతులనేకులు, పరివారము వెంటనంట వసిష్ఠుని ముందుంచుకొని పయనించెను. పదియవరోజున ధర్మారణ్యము సమీపించి దూరమునుండియే మండలనగరము కనెను. రాత్రి ఆపురమున నిలిచెను. శిబికలో రాముడు సీతనుంచి సేనతో ధర్మారణ్యము ప్రవేశించ సర్వులగతియు అకారణముగ మందగించెను. గురుని

కారణమడుగ, రామచంద్రునితో పాదచారియయి తీర్థమున కేగుట సనాతన ధర్మమన శ్రీరామునితోపాటు సర్వులును పాదచారులై క్షేత్రమున ప్రవేశించి పోసాగిరి. శ్రీరాముడు మార్గమున మాతృకల పూజయొనరించెను. వారు ధర్మారణ్య రక్షకులు. ఆ తీరున తీర్థమునగల దేవతాగారము, వాపీకూపతటాకములు స్నానపూజనవిధులు గురువు నుపదేశానుసారము నిర్వర్తించెను. క్షేత్రమున నదీతీరమున ఒకరాత్రి నివసించి నిదురించెను. అర్ధరాత్రియయినది. రాముడు మేలుకొని యుండ స్త్రీ రోదనము విన్పించెను. చారుల వెంటనేగి ఏడ్చుచున్న ఒక కాంతను చూచెను. దూతముఖమున ఆమె వార్త తెలుపగోర దూతకు స్త్రీ ఇట్లనెను. "భద్రుడా నీవుపోయి రామునిటకు తెమ్ము." వారితో నా గాథ తెల్పెదననెను.

⁂

# బ్రహ్మఖండము

## 2-వ అవాంతర ఖండము

## 32-వ అధ్యాయము

దూతపోయి శ్రీరామచంద్రునితో, కాంత, ఏకాకి, రోదించుచు తెల్పిన వార్తచెప్పగా, త్వరితగతి రాముడటకేగెను. ఆమెను —"అమ్మా! నీ వెవరవు? ఎవరిభార్యవు? ఈ విజన ప్రదేశమున నిన్నెవర వమానించిరి. నీ ధనము చోరులు హరించిరా, అమ్మా! నీ గాథ వివరించు" మని ప్రణతి పూర్వకముగ నడుగ ఆ కాంత రామునకు పాదాక్రాంతయయి మాటిమాటికి నమస్కరించి అభినందించుచు ఇట్లనెను — —"సనాతనుడవు, పరమాత్ముడవు, దుఃఖార్తినివారకుడవు, నీవవతరించిన కార్యముతీర్చితివి. రణమున రౌద్రులనంతము, రాక్షస సంహార మొనరించితివి. నీకేమి తెలుపను? బ్రహ్మనీనాభికమలమున నుద్భవించెను. విశ్వమంతయులోన నిమిడించుకొని బాలరూపమున వటపత్రశాయివై లీలలు సల్పితివి. కౌసల్యా దశరథులు, రఘుకులము నీ జన్మవలన సఫలము. అయోధ్యాపురము ధన్యము. లోకము ధన్యము. రామాయణకర్త వాల్మీకిధన్యుడు. నేను ధర్మారణ్యమున కధి దేవతనని తెలిసికొనుము. నా వనము నిర్జనమయి పదియును రెండు సంవత్సరములయినది. నన్నుద్ధరించ సమర్ధుడవునీవు. లోహాసురుని భయమున సర్వులు ఈ ప్రదేశము విడిచిపోయిరి. ఆ మహామాయావి భయమున నెవ్వరునిట నివాసమేర్పఱచుకొనక పోయిరి. వేదగానము, యజ్ఞాదిక్రతువులు, జలక్రీడాదులు, నృత్యములు, దేవగానములు ఈ వేడుకలన్నియును అంతరించి ద్వాదశ వత్సరములయినది. పూర్వము అటనివసించిన పదునెనిమిదివేల బ్రాహ్మణవంశములు, వైశ్యాది ఇతరజాతులు, దివ్యులు స్థాపించిన ఈశ్వరస్థానములు ఇత్యా

దుల మాత వివరించినది. శ్రీరాముడు ముమ్మాటికిని సత్యము తెలిపితివి. సత్యనగరమని తిరిగి నిల్పుదును - అని తెల్పుచు భృత్యులను పంపి అరణ్యము సుక్షేత్రముగ నొనరించి బ్రాహ్మణులను అరణ్యము నిర్విఘ్నమని తెల్పి రావించి వారలకు ధన ధాన్యాదికము ప్రభూతముగ దానముగ కల్పించి యిచ్చెను. గో సహస్రములను తెప్పించి వారల కొసంగెను.

*

# బ్రహ్మఖండము

## 2-వ అవాంతర ఖండము

## 33-వ అధ్యాయము

మాత వచనానుసారము రాముడు జీర్ణోద్ధారము గావించెను. దానార్హులయిన బ్రహ్మణులను ఆహ్వానించి దానములు గ్రహించుడన ప్రతి గ్రహపాప భయమున్నది. మేము దానము గ్రహించలేము. శాస్త్రవిధి ఇదిగదా. త్రిమూర్తులచే నిట ఆలయములు, తీర్థములు, ఆవాసములు మాకుకల్పింపబడినవి. త్రిమూర్తుల ఆజ్ఞ లేక మేము దానము గ్రహించజాలమనివారన గురువు వసిష్ఠులతో నాలోచించి రాముడు త్రిమూర్తులను స్మరించెను. స్మరణమాత్రమున విమానములధిరోహించి దేవతలెల్లరట కేతెంచిరి. రాముడు వారలను పూజించి స్మరించిన కారణ మిటుల తెల్పెను. "ఆది దేవి వచనానుసారము జీర్ణోద్ధారము చేయతలంచితిని"-ధర్మకూప సమీపమున ఈ ధర్మారణ్యమున హరిక్షేత్రమున. బ్రాహ్మణులు సర్వులు త్రిమూర్తులకు నమస్కరించి పూజించిరి. దేవతల సమక్షమున రాముడు కార్యరంభ మొనరించెను. శాలలు నిర్మింపచేసెను. గృహోపకరణములు తండులములు, నిధులు సమీకరించి బ్రాహ్మణులకిచ్చి ఒక్కొక్కనికి పయస్వినులను పదేసి గోవులను దానము చేసెను. మండలముగా ప్రదేశముల విభజించ పాలకులు మండలేశ్వరులయిరి. శ్రీమాతను, గణపతిని హరిని రక్షార్థము స్థాపించెను. వాస్తుపూజ, గ్రహశాంతులు నిర్వర్తింపజేసెను. వకుళార్కునకు శ్రీమాతకు యథాభాగము పూజాదికములు నైవేద్యములు కల్పించెను. స్నానకుండములు. సరస్సులు నిర్మాణములయినవి. ధర్మవాపి, ధర్మకూపములు విస్తరిల్లచేసెను. వాయుపుత్రుని పిలిచి నీవీక్షేత్రమున నుండుము. నీకు ద్విజులు పూజలర్పింతురు క్షేత్రమును రక్షించు భారము నీదనెను. ఆంజనేయులు శ్రీరామవాక్యము శిరసావహించెను. దివ్యులు తమ స్థానములకు తిరిగి వెళ్లిరి.

*

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము

## 34-వ అధ్యాయము

ఈ విధముగ రామచంద్రమూర్తి పూర్వము జీర్ణోద్ధారము కావించెను. శాసనమును, వ్రాయించెను. దివ్యమయిన ధర్మారణ్యమున వకులార్కుడు అధిష్ఠానముగ శూన్యస్వామి యను ద్విజునిచే స్థాపితమయిన నారాయణుడు ప్రభువుగా, సర్వజ్ఞుడు, గణనాయకుడు రక్షణాధిపతిగా, సంసారసాగరోత్తారిణి తారిణీయోగిని వాసముగా, రాఘవుని పేర తామ్రశాసనము వ్రాయబడెను. ఆశ్చర్యకరముకాదా! సర్వధాతువులు సువర్ణాదులు క్షయమయినను అనేక యుగములుగను తామ్రశాసనము నిలచియుండుట! ద్విజశాసనము అక్షయము. నానా భావ సమాశ్రితమయి, నానాభేదములతో సర్వత్రహరిగాథ వినబడుచుండును. అసురనాశమునకు ధర్మరక్షణమునకు హరి అవతరించుచుండును. ఆ పురాణ పురుషునిచే శాసనము లిఖింపచేయబడినది:—

"ఎవని ప్రతాపమున సాగరము మధ్యనున్న లంక జయింపబడి రాక్షసులు సంహరించబడిరో, ఏ శ్రీరాముడు యమలోకమునుండి ముని పుత్రుని చనిపోయినవానిని తెచ్చి బ్రదికించి మునికిచ్చెనో, దుందుభి కబంధులెవనిచేహతులయిరో, తాటక సంహరించబడి, సప్తతాళములు ఒక బాణమున పాతితములో, ఖరదూషణ త్రిశిరులు పదునాలుగు వేల అసురబలముతో క్షణములో నేలగూల్చబడిరో ఆ శ్రీరామచంద్రునిచే ఈ శాసనము లిఖితముకాగా అక్షయమెట్లు కాకుండును? శ్రీరాముడే స్వీయవంశవర్ణనము వ్రాయించ దేశకాలాదులు విధ్యుక్తములు లిఖించబడినవి. స్వీయ ముద్రచేచిహ్నితమయిన శాసనమును వేదవిదులకు దత్తముచేసెను. దశరథకుమారుడు రాముడు వయసు నలువదినాలుగు

సంవత్సరములవాడుగ నున్నపుడు - తీర్థమునజలము బంగారువలె, వెండి వలె ప్రకాశమానమయి దేవర్షి పితరులకు తృప్తినిచ్చునదికాగా, ఆతీర్థము స్వీయవంశనాయకుడు సూర్యుని ఆలయము ముందు నిర్మింపబడినది. రాముడట హరినిపూజించెను. ఆ శాసనము గ్రహించి ద్విజులటసంసార బంధనము పోనాడిరి. దుష్టులకు దురాచారులకు ప్రబోధము నిమిత్త మీదిగువ వాక్యము లాశాసనమున నున్నవి. "ఈ భూదేవిని పలువురు ప్రభువులు పలువిధములు పాలించి అనుభవించిరి. ఎవని కెట్లో వానికా ఫలితము. (ఒకరికిచ్చినది ఇతరులు గ్రహించ రాదనుట.) భూదాన మిచ్చినవారు అరువదివేల సంవత్సరములు స్వర్గముననుందురు. దానము జరుగకుండచేసినవాడు, ఆతనిచెయిదము అనుమతించినవాడు నరకము పాలగుదురు. దానమిచ్చిన భూమిలో ఒక అంగుళము హరించినవాడు అనుభవించే పాపఫలమింతయని నుడువరాదు. అటు లనే ఒక అంగుళము భూదానమిచ్చిన ఆతని పుణ్యఫలము గణించ నలవికాదు. భూదాత నూరు కన్యా ప్రదానములుచేసిన ఫలమనుభ వించును. ఆయువు, కీర్తి, సుఖం, ప్రజ్ఞ, ధర్మము, ధాన్యము, ధనము, జయము సంతానము నిత్యము వర్థిల్లును. బ్రాహ్మణులకిచ్చినది సాధు వెవడు తిరిగి తీసికొననేర్చును? రాజులెల్లరకు లోకములో ఒకేఒక చెలియలు కలదు. అనుభవించకానిది, పాణిగ్రహణము చేయరానిది - న కరగ్రాహ్యా - (బ్రాహ్మణులకిచ్చిన దానిపై పన్నువిధించి రాజు తీసికోరాదని) అది ఆ చెలియలు. బ్రాహ్మణునకిచ్చిన భూభాగము. ఈ భూమిని ద్విజులకిచ్చి ముందురాబోయే రాజులను—రామచంద్రుడు ఇటుల యాచించుచున్నాడు — ఈ ధర్మసేతువు సామాన్యము అసా మాన్యమనియును—రాజులు తమ తమ పాలనాకాలమున పాలించ వలయును". రాముడు వసిష్ఠులవారి సన్నిధిని ఈ శాసనము లిఖించి ద్విజోత్తములకిచ్చెను. నిత్యము సువర్ణ కావ్య కుసుములతో దేవతనర్చించి నైవేద్యమిడి సదా భామనుభవించుచు, నిదురలో, పగలు, ఏకాలము రామస్మరణచేసినను దుఃఖముల పాలుకారు. అంతబ్రాహ్మణుల

చేతపట్టిమిడి ప్రదక్షిణముగ వారలకు నమస్కరించెను. సూర్య చంద్ర తారకలున్నంతకాలమిటనే మీరుందురుగాక. ఎవ్వరయినను, బల వంతులురాజులుఁగాని వణిజులుగాని ఈదానము చెల్లకుండ చేయ యత్నించినచో ద్విజులు మీరెల్లరు వాయుపుత్రుని స్మరించుడు. వెంటనే మారుతివచ్చి మీ అరులను భస్మముగావించి మిమ్ము రక్షించును. శాసనపాలకులకు హనుమరక్షకుడయి సుఖములందించును. ఇట్లు వివరించి సైన్యముతో రామచంద్రుడు తనతావునకు గురువులతో మరలిపోయెను. అయోధ్యకేగి చిరము రాజ్యము పాలించెను.

*

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము

## 35-వ అధ్యాయము

అనంతరము అయోధ్యకేగి రాముడేమిచేసెనో తెలుప నారదుడు బ్రహ్మను ప్రార్థించ బ్రహ్మ సమాధానము:

రామచంద్రుని రాజ్యమున ద్విజులు వేదపారగులు, ప్రతిగ్రహముచేయనివారు. వారు రామచంద్రునికి తీర్థములమహిమ తెలుపసాగిరి. రాముడు వసిష్ఠులద్వారా ప్రయాగ, కాశీ, సిద్ధక్షేత్రముల మహిమలు వినెను. మరల ధర్మారణ్యము పోవ రామునకు తలంపుకలిగెను. యథా పూర్వము గురువులను ముందుంచుకొని సీతా లక్ష్మణులతో కొదువ తమ్ములతో సైన్యముతో నటకేగి వసిష్ఠులవారిని ఏమిచేయుదమని ప్రశ్నించ ఉత్తమమయిన యజ్ఞమొకటిచేయ పూనుకొమ్మనెను. గురునానతి యజ్ఞము ఆరంభించెను, మోహేరకమను పురమున ఆరంభించి సీత జ్ఞాపకముచేయ పూర్వము ధర్మారణ్యమున నిల్పిన బ్రాహ్మణులను ఋత్విజులుగా వరించెను. కుశిక, కౌశిక, వత్స, ఉపమన్యాదులు సీతతోరాగా బ్రాహ్మణులకు అగ్రహారములిచ్చి సీతాపురమనుపేర పురము నిర్మించి ద్విజులను భూరి దక్షిణలిచ్చి నిల్పెను. దేవులు రక్షకులు శాంతా సుమంగలా నామధారిణులు. అలా కదలి పూర్వము యముడు తపముచేసిన ప్రదేశము ధర్మాలయమను తీర్థమున కేగెను. ఇటరాముడు షోడశమహాదానములు ద్విజులకిచ్చెను. తిరిగి అయోధ్యకేగి పాలనకార్యమున నిమగ్నుడయ్యెను. ఈ సమయమున జానకి గర్భము ధరించెను.

*

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము

## 36-వ అధ్యాయము

ఆ క్షేత్రములనెవరు ఎంతకాలము పాలించిరి. అనంతరగాథ తెలుపవేడ బ్రహ్మ నారదునికి తెలుపసాగెను — త్రేతాయుగమునుండి ద్వాపరాంతము, కలిసమాగమము కానంతవఱకు హనుమంతు డొక్కడే రక్షకుడుగానుండెను. ఎవనిచే లంకిణి నిర్జించబడెనో ఆ హనుమయే రామశాసనమున రక్షకుడుగానుండెను. సదా ఆ ప్రదేశ ముల వేదఘోష విన్పించును. గ్రామముల ఉత్సవములు సాగును. పలుధర్మముల కాశ్రయములయిన పలు యజ్ఞములు నిర్వర్తింపబడు చుండును. కాలము గడువ కలి సమీపించనుండ, కలిమలములకు భయపడి, దివ్యులు ద్వాపరాంతమున నైమిశారణ్య మాశ్రయించిరి. కలిదోషములు ఎట్టివన్న ప్రశ్నకు సమాధానము :— ప్రజలు " అసత్య వాదులు, సాధునిందకులు, తలిదండ్రులన్న భక్తిలేనివారు. బ్రహ్మ విదులను ద్వేషింతురు. ఒకరికొకరు శత్రువులే. విప్రులు శూద్రాచార పరాయణులు, వేదభ్రష్టులు — దైవభక్తిలేనివారు, కన్యను విత్తమున కమ్మువారు, వేదనిందకులు, విశ్వాసఘాతకులు " ఈ వివరములు కాన్యకుబ్జ నగర ప్రభువునకు పురోహితుడు తెల్పెను. ఆ రాజుపేరు ఆముదు. ఆతని భార్యమాయాఅనిపేరు. ఆమెగర్భము దాల్చెను. కుమార్తె కలిగినది. రత్నగంగ అని పేరు పెట్టిరి. వయసు పదు నారేండ్లు నిండినవి ఎవరిని వివాహము చేసికొనలేదు. ఒకనాడు నగర మునకు ఇంద్రసూరి అను కాపాలికుడు రాగా ఆతని మంత్రశక్తి దాసి వలనవిని ఆతనిని చూడగోరెను. ఆతడు వివాహము త్వరతోనగుటకు ఒక మంత్రమిలితమయిన వేరొకటి యిచ్చెను. బ్రహ్మ వర్తపాలకుడు

కుంభినిపాలునకు రత్నగంగనిచ్చి రాజు పరిణయము చేసెను. ఆతడు ధర్మారణ్యమునకేగి తన రాజధాని నట స్థాపించెను. జైనధర్మప్రవర్త కులను నిల్పెను. సర్వులు జైన మతానుయాయులయి, బ్రాహ్మణు లను గౌరవించరు. వేదములుమన్నించరు. శాంతిపౌష్టికములన్న మాటలేదు. ఒక్కదానమయినను చేయడు. కాలమిటులజరుగ బ్రాహ్మణుల సర్వస్వము రాజుగ్రహించ వారు కలసి కన్యాకుబ్జపాలకుడు ఆమన్నృపుకడ కేగిరి. ఆతడును పాఖండులచే పరివేష్టితుడయి యుండెను. ఆ బ్రాహ్మణులు కన్యాకుబ్జము సమీపించి గంగాతీరమున విడిసిరి. చారులు రాజునకి వార్త తెల్పిరి. వచ్చిన కార్యము తెల్పు డని రాజు ద్విజులనడుగ వారు ఆతని అల్లుడు కుమారపాలకుడు తమకు శాసన దత్తమయిన ఆస్తిపాస్తులు హరించెననిరి. ఇంద్రసూరి ప్రేరితుడై జైన ధర్మమవలంబించి వేదములను విప్రులను తృణీకరించె ననిరి. రాజుప్రశ్న — ఈమోహేరక నగరమునమిమ్మెవరు స్థాపించిరి అనద్విజుల సమాధానము త్రిమూర్తులచే పూర్వము స్థాపితము-శ్రీరామ చంద్రులట నగరము నిర్మించిరి. రామచంద్రుని శాసనము ఇంతవరకు ప్రభువులు పాలించిరి. నేడు నీ అల్లుడుమమ్ము అనాదరించి మా భూములాక్రమించెను. అనరాజు మీరు ' వెంటనే బ్రాహ్మణాలయములు వారివారికిచ్చివేయుము " - నా ఆజ్ఞ కుమారపాలకునికి తెల్పుడు - అనగా, వెంటనే వారేగి రాజాజ్ఞ తెలుప ఆతని సమాధానము - " నేను రాముని శాసనము మన్నించను. మీరు హింసాపరులు. పశు హింస చేయు మీయందునాకు గౌరవములేదు " - అన పాపివికాకుము. నీ యది పాఖండ ధర్మము అన రాజు అహింసపరమ ధర్మము. అదియే పరమతపము, పరమజ్ఞానము, పరంఫలము. బ్రాహ్మణులు కోపించి రాజునకిట్లనిరి - ' అహింసపరమ ధర్మమనుమాట సత్యమే. అంతకన్న మించిన ధర్మమొకటి కలదు. వేదవిహితకర్మయందు చేసిన హింస హింసకాదని నిర్ణయము. శస్త్రముచే ఖండించిననే హింస. మంత్రోక్త విధానమున శస్త్రముపయోగించని విధి హింసకాదు. అది అజంతు

వునకు సుఖదాయకము. పుణ్యము పరోపకారమే. పర పీడనము పాపము అన రాజు మీ మాటలు నేను వినను. మానవుడు రాముడు. ఆతని శాసనము నేను పాలించను. పెద్దతోక వాడు మీ రక్షకుడా" అన ద్విజులు ఓరి మూఢుడా! మదమత్తుడవు? రాముడు చతుర్భుజుడు సాక్షాద్విష్ణువు. లోకరక్షణార్థము లీలా మానుష విగ్రహుడాయెను. అని ఇంక ఏమో తెలుపబోవ రాజు వారిని వారించి నాసమయమేల పాడుచేసెదరు. రాముడు, హనుమ మీకు రక్షకులయిన వారేవత్తురని నా మతము వారున్న చూపించుడు. నాకు నమ్మకము కలిగిన మీరు చెప్పినట్లు చేసెదను, లేకున్న ప్రజలెట్లు వర్తింతురో మీరు వారి ననుసరించుడు. అన ద్విజులు రాజు నాస్థానము విడచి గృహముల కేగి తమలో తామాలోచనకు కడగిరి. తుదినిర్ణయముగ కొందఱు రాజు ననుసరించుట యుక్తమనిరి. కొందరు రాముని హనుమను ఆశ్రయించుటకు ధర్మారణ్యము విడచి రామేశ్వరమునకు పోదమనిరి. కొంతమంది అగ్నిహోత్రములను దారా పుత్రాదులను కాపాడుట కింటనే యుండదలంచిరి. ఇటుల కార్యభారము విభజించి తపోనిధులు మూడువేలు అరణ్యము విడచి కందమూలములే తినుచు పయనించిరి. వారి శ్రమచూడ లేక శ్రీరామచంద్రుడు హనుమను వెంటనే ద్విజులరక్షణకు పంప హనుమ రామునికి నమస్కరించి వృద్ధబ్రాహ్మణవేషమున, ద్విజులను పరీక్షించ వారివద్ద కేగెను. ఎందులకెట కేగుచున్నారని ద్విజులను ప్రశ్నించ వారు సేతు బంధమున హనుమను రామేశ్వరుని దర్శనమున కేగు చున్నామనిరి. ఆ వృద్ధుడు వారికిట్లనెను. 'మార్గమంతయును ఘోరారణ్యము, సింహవ్యాఘ్రాదులున్నవి. ఎక్కడ సేతువు. ఎక్కడ రాముడు, ఎక్కడహనుమ' అన మార్గమున మరణించిన రామలోకమునకే పోగలము. బ్రదికినవృత్తిలభించును. రాఘవుడు వినా మాకు శరణమన్యములేదు. అని రాత్రి ఆగి మరునాడుదయము ప్రయాణము సాగించమరల మరియొక బ్రాహ్మణరూపముధరించి హనుమ "ద్విజు

లారా, ఎక్కడనైన వివాహమా, ఉత్సవమాఏమి? అనవారాశ్చర్య పడి తమ వృత్తాంతము తెల్పిరి. రాముఁడు రక్షించునని పోవుచున్నా మనిరి. రాజు ప్రత్యయము చూపినగాని మావృత్తులీయ ననుచున్నాఁడు ఆంజనేయులు రక్షకుడుగా రామచంద్రుడు మాకు నియమించెను. మాకోరిక ఆంజనేయుడు చెల్లించకున్న నిరాహారదీక్ష తీసికొని ప్రాణములు విడుతుమనిరి. హనుమ వారల భక్తికి సంతసించి వేలు చూపుచు అదే సాగరము, అది రామేశ్వరము, అది సేతువు, అదిగోలంక, అనుచు నతను నిజరూపువారికి చూపి దర్శనమిచ్చెను. ద్విజులానంద బాష్పములు విడుచుచునిట్లనిరి.

*

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము - ధర్మారణ్య ఖండము

## 37-వ అధ్యాయము

"నేడుమాజన్మ సఫలమయినది. జీవితము సుజీవితమయినది. లోకముధార్మికమయినది. మా ధర్మములు గృహములు ధన్యములయినవి. యజ్ఞధర్మములుద్ధరించబడినవి. అక్షయకుమార విధ్వంసకునకు రామభక్తునకు నమస్కారము. మహావీర! నీకు నమస్కారము. బ్రాహ్మణదైవమునకు వాయుపుత్రునకు నమోవాకములు, సర్వవ్యాధిహామునకు అంజనీసుతునకు చేమోడ్పులివియే. నీదర్శనమే చెప్పుచున్నవి మాకోరికలీడేర్పవచ్చితివని. మేము నిన్ను వేడుకొనుచున్నాము రామాజ్ఞ పాలింపవలసినదని. లంకలో గ్రహించిన రూపము ప్రదర్శించి దుష్టుని కుమారపాలుని, ఆమరాజును శిక్షించి మమ్ము మావృత్తులను నిల్పుము. నీసంకల్పబలమున రాజు మనసు మారవచ్చును. ప్రత్యయము నీదర్శనమున కలిగి రాము శాసనము పాలించునని మా విశ్వాసము. త్రయీధర్మమును క్షితిలోవ్యాపింప చేయనుకలవు.

**హనుమ సమాధానము**:– "కలియుగమున నా స్వరూపము మహాకాయము, చతురింద్రియ గోచరముకాదు. దివ్యమైనతేజోరాశి మయమయినదని ద్విజులు మీరెల్లరు ధ్యానింతురుగాక, అయినను వసనాంతరితముగ మీకు చూపెదను చూడుడని యవనికాంతరమున నున్నటుల మహాకాయము మహాతేజము మహావాలముతో దర్శనమిచ్చెను. ఎట్టకేలకు కనులు నులుముకొనుచు ద్విజులు హర్షపులకితగాత్రులయి నెమ్మదిగా కనులువిప్పి తమలో శాస్త్రచోదితమయిన రూపము నేడు కనగంటిమనుకొనిరి. ఇంతలో హనుమ

సౌమ్యరూపము ధరించి వారలెల్లరకు ఋత్తుతీరునట్లు ఫలములు ముందుంచెను. మీకు ధర్మారణ్యమున కేగకుండగనే యీఫలములు తిన్న ఆకలిదప్పులు తీరునన వారాఫలములారగించి తృప్తులయి అలపులేనివారయిరి. అమృతము త్రాగినట్లు వారికి తృప్తికలిగినది.

హనుమ వారికిట్లనెను:— "కలి రామచంద్రుని విడిచి మీ ధర్మారణ్యమునకు నేను రాజాలను అనుచు రెండుచేతులూర్ధ్వముగ సాచి ఎడమభుజమునుండి ఒక రోమము, దక్షిణభుజమునుండి ఒక రోమము తీసి భూర్జపత్రపుటముల వేర్వేరుగా ఉంచి వారికిటుల తెల్పెను. ఈ భూర్జపుటముల నావజ్రరోమములున్నవి. మీరు వెంటనే పోయిరాజుతో తెల్పుడు. రామదత్తము యథా పూర్వము నడుపుమని. రాజువినకున్న ఎడమపత్రపుది రాజద్వారమున చిమ్మివేయుడు. రాజగృహములు, అంతఃపురములు, పుత్రపౌత్రాదికము, సర్వసేనయు దవానలమున నున్నటుల జ్వలించిపోవును. రాజు భయపడి మీమీ వృత్తులు యథాపూర్వము నిల్పుదునని ప్రార్థించ కుడిపత్రపుటి చించి విదలించుడు. అగ్ని చల్లారును, ఎవ్వరునుచావరు ఏదియునశించదని తెల్పి, మీరు మూడురాత్రులుగడపుడు. అనంతరము ధర్మారణ్యమునకు పోవచ్చుననుచు ఒక పెద్దశిలతెచ్చి ఏర్పఱచి మహాశాల నిర్మించి ఇందు మీరుండుడు అనెను. వారు బ్రహ్మయజ్ఞము నిర్వర్తించుకొని రామహనుమ నామస్మరణములు గావించుచు మూడ హోరాత్రములా శిలామందిరమున గడపిరి. మూడవరాత్రి అర్థరేయి శిలతిరిగిపోవుచున్నట్లు వారుకంటగాంచిరి. ప్రభాతమయినది. ఆరుమాసములుగా పయనించిచేరిన సేతుబంధముకానరాదు. వారు తమ మందిరప్రాంతమున ధర్మారణ్యమున శిలతో ఆ ఆవాసముతో నుండుట్లను కనిరి. ఆ గాథ బంధుమిత్రులకు తెల్పుచు హనుమ ప్రసాదమున బడలికలు శ్రమయులేక స్వీయగృహములు చేరుకొంటిమనుచు హనుమంతునకు జయఘోష తెల్పి వేదముపఠించిరి. అక్కడ

ఇంద్రభోగతుల్యమయిన గృహములు వెలసినవి. మాతృదేవిని పూజించి బ్రాహ్మణులుండ, అరణ్యమున రక్షార్థమునిలచియున్న కొదువద్విజులు వేదఘోషవినుట కాశ్చర్యపడి నాదమువిన్న తావుకు వచ్చి ద్విజసమూహమును చూచి ఆనందపడి వారిని పూజించిరి. మరునాడు వారిలో ముఖ్యులు తాము తెచ్చిన హనుమయిచ్చిన విశ్వాసచిహ్నములు భద్రపఱచుకొని కాన్యకుబ్జనగరమునకు డోలికలు రథములు అశ్వములు వాహనములుగ—ఈ ఇంద్రభోగము హనుమ ద్విజులకు కల్పించినదే—పయనించిరి. ఉషఃకాలమునకట చేరుకొనిరి.

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము - ధర్మారణ్య ఖండము

## 38-వ అధ్యాయము

ప్రభాతముకాగా పూర్వాహ్నికములు తీర్చుకొని, శుభ్రవస్త్రములు ధరించి, ఫలాదులు కాన్కలుకొని రాజద్వారము చేరిరి. చారుల ద్వారా వారిరాక విని రాజపుత్రుడు ద్విజులను రావించుకొని మంత్రులతో-'చూచితిరా! విప్రోత్తములు రామహానుమలచెంతకేగి తిరిగివచ్చిరి. వారిని మనకు వారుచూపుదురు' అని మందస్మితమొనరించి యూరకుండెను. ద్విజులలో ఒకరు నృపుని కుశలమడుగ ఆతడు శత్రుహంత ప్రసాదమున కుశలమే అనెను. జినప్రసాదమున సర్వత్రదయ చూపవలెను. సదా యోగశాలకుపోయి, గురువందనము చేసి, శ్రమణులకే సదాదానమీయవలెను - ఇట్లనుచు జైనధర్మములుపన్యసించెను. విప్రులు రాజా! 'రాముడు', ధీమంతుడు హానుమ తెలుపమన్నారు- ధర్మాత్ముడవు ద్విజులకు వారివృత్తులీయ వలయునని తెల్పిరి, రామ వాక్యము పాలించి సుఖముగనుండుము'' అన రాజు - రాముడు హానుమ ఉన్నతావునకుపోండు. వారిత్తురు ఇటకెందులకేతెంచితిరి. ఒకగవ్వకూడ ఈయను పొండనెను. ద్విజులు కోపించి హానుమ ఇచ్చిన వామభూర్జపుటము ఆ రాజునిలయమున చింపిపారవేసి బయటకేగిరి. వారు దూరముగ గంగాతీరమునకేగ రాజ ప్రాసాదమంతయు అగ్నిజ్వాలలచే ఆవృతమయినది. ఛత్ర చామరములు, రాజు సంపద తగులపడిపోవసాగెను. కోశాగారములు, ఆయుధాగారములు. రాజపుత్రులు, గజములు, అశ్వములు విమానములు వాహనములు కాలిపోయినవి. రక్షకులు లేకరాజ భవనవాసులు, నగరవాసులు హాహాకారములు చేయసాగిరి.

రాముడు కోపించిన ముల్లోకములు మట్టికలిసిపోవును. ఈ కుమార పాలకుడొక లెక్కయా! క్షపణకులు నగ్నులు దశదిశల పారిపో సాగిరి. ఇంతలో వాయువు ప్రచలితమై అగ్ని నలుమూలలకు వ్యాప్తముకాసాగినది. విప్రులకు హితముచేయ హనుమ వాయువును ప్రసారముచేసెను. రాజు మందిరమువీడి వీధినిబడి ప్రలపించుచు ద్విజులెక్కడెక్కడఅన ఒకపదాతి ద్విజులున్న తావునకు రాజునకు దారి చూపెను. రాజు రక్షించుడని వారి పాదములమీదపడెను. మూర్ఖ మునుంగుచు-మూర్ఖుడను, రాములకు హనుమకు దాసాను దాసుడను అగ్నిని శాంతింపచేయుడని ప్రార్థించెను. నేను మీవాడను, మాట తప్పను. తప్పిన పంచమహాపాతకము లొనరించిన పాపమున పోదునసెను. బ్రాహ్మణులు రాజునకు ప్రజకు కరుణించి రెండవపుటి పారజిమ్మ సర్వము శాంతించినది. ఏదియును కాలిపోలేదు. ఎవరును మరణించలేదు. అమృతము చిలికినట్లు హనుమ రాముల ప్రసాదమున సర్వము సుఖమయమయినది. పూర్వధర్మములు నిలిపి రాజు విష్ణుభక్తి పరాయణుడయి, గో బ్రాహ్మణ పూజాతత్పరుడాయెను. పాపండులు రాజాదరణకోల్పోయి ఇతర ప్రదేశములకుపోయిరి. ద్విజులను పాలించుచు, వారివృత్తులను కాపాడుచు, రాజుధర్మ సంస్థాపకుడై సుఖముగనుండెను. ఆలయముల నిత్యోత్సవములు సాగించుచు దైవారాధనపరులుగా ప్రజలుండ చూచెను. శుభకార్యములయందు గణపతిపూజ జరుగునట్లొనరించెను. రామచంద్రుడు కల్పించి యిచ్చిన దేవాదాయములు ద్విజాదాయములు సుఖితములగునట్లు ప్రకృతి జనమునుదోబోధించెను.

*

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము - ధర్మారణ్య ఖండము

## 39-వ అధ్యాయము

దేవతలు ధర్మారణ్యావాసులవద్దకువచ్చి ద్విజులకు, వణిజులకు వృత్తులభాగములు నిర్ణయించి త్రైవిద్యులు, చతుర్విద్యులు అయిన ద్విజులచే పూజితులై తమ స్థానములకేగిరి. అయిదువేల అయిదువందల గ్రామములలో ద్విజుల నివాసస్థానములు. భారద్వాజ గౌతమ ఇత్యాదులు గోత్రనామములు. సీతాపురం, శ్రీక్షేత్రం ఇత్యాదులు స్థాననామములు. కులగోత్రములు ఎట్లుపుట్టినవో తెలుప నారదుడు అర్థించ బ్రహ్మ తెల్పుచున్నాడు:

మొదట సీతాపురమున రెండు ప్రవరలు కుశ, వత్సఅన్నవి. శ్రీ క్షేత్రమున మూడు గోత్రములవారు ఛాందనసులు, ముద్గలులు, భారద్వాజులు, రాజ్ఞము. కృష్ణవాటము, కుశ ప్రవరము ఇట్టి స్థానముల గోత్రములు ప్రవరలు ప్రత్యేకించినిలచిరి. ఈ విధముగా స్థానములు, గోత్రములు, ప్రవరలు 5,500 గ్రామములలో త్రిమూర్తులచే నిలుపబడి దానశాసనమున శ్రీరామచంద్రునిచే వృత్తి విభాగముకల్పించబడిన వారు ధర్మారణ్య క్షేత్రవాసులు. కుమారపాలునికి జ్ఞానబోధచేసి, హనుమ కరుణ సుఖస్థితి ద్విజులుండిరి. ఆయావంశములకు చాముండా, చచాఈ, యక్షిణీ మొదలయిన కులరక్షా దేవులు కలరు. ఇరువదినాలుగు వంశములవారు వేదవిదులు రామసేతువుకేగి హనుమదర్శనము కని తిరిగివచ్చినవారు, సేతువునకుపోక సంసారములు రక్షించ నిల్చినవారు క్రమముగా ఆచారభేదమున పరస్పరము భేదించిరి. వేదము నాశ్రయించక, ఆయుర్వేదము, కృషిఇత్యాది, భిన్నవృత్తులు చేపట్టుటచే వివా

పోదుల ఇచ్చిపుచ్చుకొనుటలు మానుకొనిరి. వీరిలో తగవులేర్పడిన వృత్తిభాగ విభజనము, న్యాయవిచారణము శ్రీ రామదూత స్థానముముందు తీర్పు నిర్ణయించవలెనని ఏర్పాటుగావించుకొని బ్రదుకసాగిరి. సదా హనుమపూజచేయుట మానలేదు. విఘ్న శాంతికొఱకు ఆయనదేహము తైలమున లేపనము చేయుటాచార మయినది. ధూపదీప పూజానైవేద్యములర్పించుట నిత్యవిధి - అందు లకు హనుమ వారలకోర్కెలు సఫలీకృతములు చేయుచుండును. శ్రీమాతా, బకుళార్కులకు వారిభాగముల పూజలు జరుగును. న్యాయనిర్ణయము, పక్షపాతము, విడచి హృదయ పరిశీలనమున నిశ్చయించి వాయుపుత్రునిముందు నివేదించుచుందురు. కాని కలిలో ఈ నిర్ణయములు వ్యతిరేకించి పాపాత్ములయ్యేదరు. కాని ధర్మారణ్యమున చిరము కలి వివర్జితము. దోషములకాకరము కాకచాతుర్వర్ణ్యములవారు కాలముగడిపిరి.

# బ్రహ్మ ఖండము

## 2-వ అవాంతర ఖండము - ధర్మారణ్య ఖండము

## 40-వ అధ్యాయము

త్రైవిద్యులు అగ్నిహోత్రపరులు, యజ్ఞపరాయణులు. స్థానాచారములు, కులాచారములు. అది వివరించిన స్థూలముగా త్రిమూర్తులు ధర్మశాస్త్రవిదులు తెల్పిరి. పరంపరగావచ్చే ధర్మమునే ద్విజులాచరించిరి. ఒరులకు బోధించిరి. కుమారోత్పత్తికాగా శ్రీమాతకు యజమాని బలికల్పించును. కుంకుమార్చనముచేసి రక్షాకార్యమునాశించును. సంతతి వృద్ధిదాయక మీ పూజాకార్యము. హనుమదేహమునకు తైలముపూసి అర్చింతురు. దానివలన హనుమ వాంఛితము లీడేర్చును. ఈ విధమయిన పూజలు, వేదపాఠములు, ఆచారములు కలిలో విపరీతములగును. కుమారుడయినను దోషమునకు దండ్యుడు, పక్షపాతము చూపినహనుమ వారిని శాసించును. కృతయుగమున ధర్మారణ్యము, త్రేతాయుగమున సత్యమందిరము, ద్వాపరమున వేదభవనము, కలిలో మోహేరకమని పేరులు. బ్రహ్మవాక్యము-ధర్మారణ్యాగాథవిన్న సర్వపాపములు శాంతించును. త్రివిధపాతకములు అంతరించును. ధర్మారణ్యసేవనమున సర్వతీర్థములు, సర్వక్షేత్రములు సేవించిన ఫలములనుమించి అక్షయఫల ప్రాప్తికాంతురు. బ్రహ్మవలన నారదుడు విన్నది వ్యాసులు ధర్మజునకు తెల్పిరి.

శ్రీ స్కాందమహాపురాణమున తృతీయము

బ్రహ్మఖండమున 40 వ అధ్యాయముతో 2 వ అవాంతరం

ధర్మారణ్యఖండము సమాప్తము.

*

# బ్రహ్మఖండము

## 3-వ అవాంతర ఖండము

## బ్రహ్మోత్తరఖండము

## 1-వ అధ్యాయము

శ్రీ గణేశాయనమః - శ్రీ గురుభ్యోనమః - ఓం నమఃశివాయ.

జ్యోతిర్మాత్ర స్వరూపునకు నిర్మలమయిన జ్ఞాననేత్రము కలవానికి, లింగమూర్తికి, బ్రహ్మపదవాచ్యునకు, శాంతునకు శివునకు నమస్కారము.

ఋషులు : శివుమాహాత్మ్యము, శంకరభక్తుల మాహాత్మ్యము, శివమంత్ర ప్రభావమును తెలుపవేడిరి.

సూతుని సమాధానము: అకారణముగ ఈశ్వరునియందు భక్తి కలుగుటయే, సనాతనమయిన పరము, శ్రేయము. శంకరుని యందలి భక్తి లేశముకూడ వర్ణించసాధ్యముకాదు. భక్తిపారమ్యము వర్ణించపూనుకొన్న కల్పాయువును చాలదు. సర్వపుణ్యములకన్న, సర్వశ్రేయస్సులకన్న, సర్వయజ్ఞములకన్న జపయజ్ఞము ఉత్తమము. అందువలన జపయజ్ఞమును తెల్పెదను. మహర్షులు శైవమంత్రము అరక్షరములనిరి. దేవతలలోకెల్ల పరమదైవము త్రిపురాంతకు డెటులనో అట్లే మంత్రములలో ఉత్తమ మంత్రము శివషడక్షరి. పంచాక్షరీ మంత్రము ముక్తిదాయకము. పంచాక్షరీమంత్రమున సర్వజ్ఞుడు పరిపూర్ణుడు సచ్చిదానంద లక్షణుడగు శివుడు ప్రసన్నుడు. అది సర్వోపనిషత్తులకాత్మ. భవపాశబద్ధులయిన నరుల హితము కోరి శివుడు స్వయము ఓం నమశ్శివాయ అని ఉచ్చరించెను. ఎవని

హృదయమున ఈ మంత్రరాజము సదా ప్రతిధ్వనించుచుండునో, నిశ్శబ్దముగ స్పందించుచుండునో, అతనికే సంసారబంధము పటా పంచలగును. ఒకమారుచ్చరించిన బంధములు భయవిహ్వాలము లగును. ఇది మంత్రాధి రాజరాజము, సర్వవేదాంతములకు శిరస్సు, సర్వజ్ఞానములకు ఆలవాలము. ఈ షడక్షరి అజ్ఞాన సముద్రమును హరింపచేయు బడబాగ్ని. కైవల్యమునకు మార్గము చూపుజ్యోతి, మహాపాతకములకు దావదహనము, ఈ షడక్షరీమంత్రరాజము, పంచాక్షరము సర్వఫలప్రదము. ఓంకారమును విడచిన పంచాక్షర మగును. దానిని స్త్రీశూద్ర ద్విజబంధువు లెల్లరును ధరించుట కర్హులు. దానికి దీక్ష, హోమము, సంస్కారము, తర్పణము, కాలము, ఉపదేశము శుచితోపనిలేదు. శివ అను రెండక్షర ములే మహాపాతకములను నశింపచేయును. నమస్కారముతోకూడిన శివాక్షర ద్వయము ముక్తినిచ్చును. సద్గురుముఖమున ఉపదేశము పొంది మంచిక్షేత్రమున జపించిన కోరికలు ఫలించుటలో ఆశ్చర్య మేమికలదు? ఈమంత్రరాజమును సద్గురువు నాశ్రయించి గ్రహించ వలెను. అది సద్యస్సిద్ధిదము. గురువు నిర్మలుడు శాంతుడు, సాధువు మితభాషి, కామక్రోధాదులు లేనివాడు, సదాచార సంపన్నుడు, జితేంద్రియుడు కావలయును. అట్టిగురువిచ్చిన మంత్రము సద్యఃఫల ప్రదము. జపయోగ్యమయిన క్షేత్రము లెవ్వియన ప్రయాగ, పుష్కరము, కేదారము, సేతుబంధనము, గోకర్ణము, నైమిశా రణ్యము. ఇవి నరులకు సద్యఃసిద్ధికరములు. ఒక మంగళప్రదమగు నితిహాసము వినుడు.

మధురానగరమున యదుశ్రేష్ఠుడు దాశార్హుడను రాజు కలడు. మతిమంతుడు, ఉత్సాహవంతుడు, మహాబలుడు, శాస్త్ర ములు తెలిసిన నీతికోవిదుడు, శూరుడు, గంభీరుడు, రణమున వెను తిరుగనివాడు, యువకుడు, రూపసంపన్నుడు. అతడు కాశీరాజు

కుమార్తె కళావతిని పరిణయమాడెను. కులవధువుతో తననగరుకువచ్చి ఆరేయి శయనాగారమున కామినితోనున్న సమయమున సమీపమున కామె నాహ్వానించెను, చేరకున్న ప్రార్థించెను. కాని మనసీయలేదు. బలవంతముగ ప్రేయసిని చేర్చుకొనతలంచి రాజుతెచి చేరబోవ ప్రియకాంత భర్తతో నిట్లనెను-? "రాజా! నన్నుముట్టవలదు. నేను వ్రతనియమముననున్నాను. ధర్మాధర్మములు తెలిసినవాడవు, సాహసించవలదు. ప్రీతియోగముననే దంపతులు కలియవలెను. నాకెపుడు ప్రియమగునో అపుడే నాతో నీకుసంగమము కలుగగలదు. బలాత్కారమున సుఖము ప్రీతి యుండదుగదా. ప్రీతిలేనిదానిని, రోగిని, గర్భవతిని, వ్రతనియమమున నున్నదానిని, రజస్వలను, కామములేనిదానిని బలాత్కరించి పురుషుడు కామించరాదు. ప్రియాలాపముల లాలించి, మృదువుగ రంజింపచేసి, దయచూపి, యువతిని వధువును ప్రియుడు, పతి దరిచేర్చుకోవలెను. సుఖము కోరువాడు పూలనువలె యువతులను పాలించవలెను". సాధ్వి ఇట్లన్నను కాముకుడయి రాజు దరికిచేర్చి ఆలింగన మొనరించుకొన, స్పర్శామాత్రమున తప్తలోహమును ముట్టినట్లాతని దేహము కాలినది. భయపడి ఆమెను విడచి దూరమున నిలచి ఆశ్చర్యపడి ఇదియేమి కారణమన కాంత తెల్పుచున్నది. "మహారాజా! బాల్యమున దూర్వాసమునీంద్రుడు కరుణాళువయి శివపంచాక్షరి నుపదేశించెను. ఆ మంత్రజపమున నాశరీరము కలుషములులేనిది అయినది. పాపులయిన పురుషులు నన్నంటలేరు. రాజా! నిన్ను కులటలు మదిరాపానమత్తులు సేవింతురు. శుచియయిన మంత్రము జపించవు. నిత్యస్నానములేదు, ఈశ్వరారాధనలేదు. నన్నేల స్పృశించనేర్తువు. అనరాజుదేవీమంత్రముపదేశించుమన రాజా! నీవు నాపతివి, గురువు, దైవము. గురువుకలరుగదా గర్గమహర్షి! వారి నాశ్రయించుడను నంతలో గురుదేవులు నగరుకు వచ్చినట్లు వార్త అందినది. త్వరితగతి వారికెదురేగి అర్ఘ్యపాద్యాదులిచ్చి పాదాక్రాంతుడయ్యెను.

కరుణామూర్తులు కృతార్థునిచేయుడనెను. పాపము తొలగు మంత్ర
ముపదేశించవేడెను. గురువు - శివ పంచాక్షరీవిద్య హృద్గతమయిన,
పాపములు కోట్లు కాకులవలె పారిపోవును. కోట్లు పంచమహాపాత
కములు క్షణములో భస్మీపటలమగుననుచు మంత్రముపదేశించ దంప
తులను తన గృహమునకు కొనిపోయి రాజునకు శివపంచాక్షరి ఉప
దేశించి వారలననుమతించి నగరుకు పంపివైచెను. దరిద్రునకు నిధి
అబ్బినటులరాజు ఆనందమున కాంతతో నగరు ప్రవేశించి ఆమెను
దరిచేర్చుకొని, చందన శీతలమువలె స్పర్శ సుఖమనుభవించెను, ఇది
పంచాక్షరీమంత్రరాజ మహిమ అనువర్ణితము.

# బ్రహ్మఖండము

## 3-వ అవాంతరఖండము - బ్రహ్మోత్తరఖండము

## 2-వ అధ్యాయము

### త్రిపురాంతకుని మాహాత్మ్యమున కింకొక గాథ :—

భక్తి పరమేశు పూజించిన సర్వశ్రేయములలవడును. శివ లింగ దర్శనము పరమపావనము. అందు బిల్వపత్రార్చనము అతి దుర్లభము. పదివేల సంవత్సరముల గంగా స్నానఫలముకన్న ఒక మారు బిల్వార్చనఫలమధికము. పుణ్యములన్నియు మాఘ కృష్ణ చతుర్దశినాడున్నవి. ఆనాడుపవాసమున శతములు క్రతువులొనరించిన ఫలమబ్బును. రాత్రి జాగరణము కల్పకోటి తపమొనరించిన ఫలము. ఒక బిల్వపత్రముతో శివలింగార్చనము చేసిన త్రిలోకముల చేయగలపుణ్యముల నధిగమించును.

దీని సంబంధి గాథ :— ఇక్ష్వాకు వంశమున మిత్రసహుడను రాజుకలడు. సర్వగుణసమన్వితుడు. సకల కళాకోవిదుడు, ధనుర్వేదవిశారదుడు. అతని హృదయము కరుణాపూరితము, శరీరము శోభావంతము, పాదపద్మములు సామంతరాజ కిరీట చూడామణి నీరాజితములు. ఒకనాడు వేటతమకమున పరివారముతో ఘోరారణ్యము ప్రవేశించెను. రథారూఢుడై ఒకచో జ్వాలవలె వెలిగిపోవు నొక రాక్షసుని బాణముచేకొట్టెను. ఆతని సోదరుడు కన్పడకుండ అన్నసమీపమునకేగి మృతిచెందెనని తెలిసికొని, రాజు ప్రతాపవంతుడు కాన ఆతనిని మోసగించి బాధించి అన్ననుచంపిన వైరము సాధించ తలంచెను. వాడు మానవాకృతి ధరించి, వినీతుడై, పనిచూపవేడెను. బానిసనయి యుందునని రాజును వేడుకొనెను. రాజు కొంతకాలము వేటాడి నగరమునకు తిరిగి

వచ్చి మాయామానవవేషధారుని రాక్షసుడని తెలియక మహానస
మున (వంట)—అధ్యక్షుడుగా (వంటలవారిపై అధికారిగా) నియ
మించెను. రాజపత్ని మదయంతి దమయంతి వంటి పతివ్రత. పితృ
దినము రాగా గురువు వశిష్ఠుని నిమంత్రణకు ప్రార్థించి గృహమునకు
రావించెను. సూపకారుడుగానున్న రక్కసుడు నరమాంసము కలిపి
వండినపదార్థము గురువుముందుంచెను. గురువునరమాంసము పెట్టించి
తివి - రాక్షసుడవుకమ్మని, ఆలోచించక శపించి, పునరాలోచించి
అజ్ఞానకృతమయినను అనుభవము తప్పదనుచు పన్నెండు సంవత్సర
ములు గడువుపెట్టెను. రాజు కోపించి గురువును శపింప జలములు
గ్రహించ మదయంతి ప్రార్థించి వారించెను. పత్నిని మన్నించి, ఆ
జలములు, తనకాళ్లపై పోసుకొన ఆపాదములు కల్మషములయినవి.
కల్మాషపాదుడని తరువాత రాజు ఖ్యాతివడసెను. వెంటనే రాక్షసు
డయి గురుశాపదగ్ధుడై, ఘోరారణ్యముల సంచరించుచు జంతువులను
మానవులను భక్షించుచు తిరుగసాగెను. ఒకనాడు యువతీయువకు
లగు ముని దంపతులు రమించగాంచెను. వాడేగి యువకుని పట్టుకొన
ప్రియురాలాక్రోశించినది. "రాజా నీవు రాక్షసుడవు కావు మద
యంతీప్రియుడవు. నాభర్తను చంపకుము, దుఃఖార్తులకు రాజవు నీవే
గతివి కదా! ఈతడు నాపతి, యువకుడు, శాస్త్రవిదుడు, శాంతుడు,
తపస్వి. ఈతనిని రక్షించి జగద్రక్షకుడవుకమ్ము. బ్రాహ్మణస్త్రీని
బాలను నాకు దయచూపుము" ఇట్లు వేడినను రాక్షసుడు బ్రాహ్మణుని
శిరముత్తరించి తినివేసెను. పతి అస్థులు తీసికొని చితి పేర్చుకొని
అగ్నిలో పడబోవుచు-పతితో క్రీడించువేళ నాపతిని చంపితివి కనుక
నీవు ఈనాడుమొదలు స్త్రీ సంగమ మపేక్షించి ముట్టబోవ మర
ణింతు' వని శపించి అగ్నికిఆహుతి ఆయెను. రాజు వశిష్ఠ శాపాంత
మున రాజ్యమునకు మరలిపోయెను. మదయంతి పతివ్రత కనుక
విప్రసతి శాపము తెలిసికొని రతిలాలసుడయిన పతిని, వైధవ్యభయ
మున, వలదనివారించెను. అనపత్యుడగురాజు, రాజ్యము విడిచి

తిరిగి వనములకేగెను. గురువువశిష్ఠులు వంశమునిలుప మదయంతికి బోధించి పుత్రోత్పత్తిని కల్గించి ఆతనిని రాజ్యమున కభిషిక్తునొనరించెను.

రాజు క్షేత్రములు తిరుగుచు తీర్థస్నానములు చేయుచు, అదృశ్యరాలయి బ్రహ్మహత్య వెంటనంటిరా సంచరించుచుండెను. బ్రహ్మహత్య మరలలేదు. రాజు తిరుగుచు మిథిలానగరముచేరెను. బాహ్యోద్యానమున నొక వృక్షచ్ఛాయ నాశ్రయించి చింతాపరుడయి యుండ, తలవనితలంపుగ గౌతమమహర్షి అటకేతెంచెను. శాంతుడు, సూర్యతేజస్వి. శిష్యగణములతో రాగా, రాజు మునికి నమస్కరించి పదేపదే పాదములవ్రాల రాజు రవివంశజుడని తెలిసి "రాజా, నీకు కుశలమా, నీప్రజకు కుశలమా, అంతఃపుర జనము కుశలమా, రాజ్యమువిడిచి ఇటులేల వచ్చితివి? ఏదో ఆలోచించుచున్నావు. నీవృత్తాంతము తెలుపు" మన రాజు దీనముగ తన గాథ వివరించెను. ఎన్నిమంత్రములు జపించినా, ఎన్నితీర్థములకేగినా, ఎన్నివ్రతములు క్రతువులు, దానములచేసినా పోని ఈ బ్రహ్మహత్య విడిచిపోవు నుపాయము, ప్రాయశ్చిత్తము తెలుప ప్రార్థించెను. "శివుడు రక్షకుడుండ రాజా నీకేలభయము. గోకర్ణమనే తీర్థము కలదు. కైలాస శిఖరమున, మందార వృక్షచ్ఛాయ శివు డెటుల నివసించునో, అటులనే గోకర్ణ క్షేత్రమున నుండును. ఘోరమైన తపముచేసి రావణుడు శంకరుని మెప్పించి లింగమట ప్రతిష్ఠించెను. ముక్కోటిదేవతలా ఆలయమును పరివేష్ఠించియుందురు. గోకర్ణమున శిలలన్నియును శివలింగములే. అట ఈశు పూజించి బ్రహ్మపదమందుదురు. మహాప్రదోషసమయమున శివపూజ ముక్తినిచ్చును. మాఘమాసము, కృష్ణచతుర్దశి, శివలింగము, బిల్వపత్రము ఈనాలుగు దుర్లభములు. ఈశ్వరు సన్నిధి ఉపవాసము జాగరణముల కృతకృత్యులు కాగలరు."

# బ్రహ్మఖండము

## 3-వ అవాంతరఖండము - బ్రహ్మోత్తరఖండము

## 3-వ అధ్యాయము

మునీంద్రా మార్గమున మహాదాశ్చర్యము కంటిరంటిరి. అదెద్దియో తెలుప ప్రార్థన అన గౌతమముని సమాధానము:— రాజా! కల్మాషపాదా! వినుమా ఆశ్చర్యసన్ని వేశము- నేను శిష్యులతో గోకర్ణమును సేవించుకొని తిరిగివచ్చుచు మధ్యాహ్నసమయమునకు ఒక సరోవరము చేరుకొంటిని. జలములు స్పృశించి, ఆచమించి, జలపానము చేసి విశ్రాంతి కొఱకు మేమందరమొకవృక్షచ్ఛాయ నాశ్రయించియుంటిమి. దూరమున ఒక వృద్ధచండాలస్త్రీ రోగపీడితురాలు తీవ్రమయిన ఎండలో తుదియూపిరితో తన్నుకొనుచున్న దానిని చూచితిమి. ఇంతలో ఆ కాంతమరణించిన అనంతరము పైన విమానమున శివదూతలు శివలోకమునకు కొనిపోవచ్చిరి. వారినిచూచి నేను (గౌతముడనుట) ఇట్లు ప్రశ్నించితిని - జ్ఞానలేశమెరుంగని ఈ చండాలికి శివలోక అర్హత ఎట్లన వారిసమాధానము:— పూర్వజన్మమున ఈ చండాలి ఒక బ్రాహ్మణకన్యక, సుమిత్ర పేర చంద్రబింబానన, సుకుమారి. కైకేయ అను బ్రాహ్మణుని కుమార్తె, తండ్రిఇంట పెరుగుచున్న ఆకన్యను చూచిన వారెల్ల రాశ్చర్యపోవుచుండిరి. తండ్రివిధ్యుక్తముగ ఒక ద్విజకుమారునకిచ్చి వివాహ మొనరించెను. కొంతకాలము భర్తతో కాపురముచేసినది. కాలవశమున ఆ పతి రోగపీడితుడై మరణించెను. కొంతకాలము వైధవ్యమనుభవించుచు దిన దినము యౌవనముపీడించ. బంధువులు అదుపులో నుంచినను, అవశయయి జారమార్గమాశ్రయించినది. కొంతకాలము తన రహస్యము దాచనేర్చినది. త్వరలోనే ఆమె విటదూషిత అని బంధుగులు తెలిసికొనిరి.

స్త్రీలు కామముచేతను, ద్విజులు హీనులను సేవించుటచేతను, రాజులు ద్విజులను దండించుటచేతను, యతులు భోగలాలసచేతను చెడిపోవుదురు. బందుగు లాకులట నమమధ్యనుండ నిష్టపడక దూరముగా కొనిపోయి అరణ్యములో విడిచియేగిరి. ఆమె అనుకూలించినశూద్ర సంగతి రమించుచు తిరుగసాగ ఒక శూద్రనాయకుడామె నాకర్షించి తన ఇంటికికొనిపోయి దివానిశలామెతో క్రీడించెను. వాడు మాంసము తిని సుర త్రాగి ఆమెతో దివానిశలు కాలముగడుపుచు త్రాగి ఒక రేయి గొర్రెను చంపితేబోయి పొరపాటున ఒక ఆవుదూడను చంపి తెచ్చెను ఈ కాంత దానిని చూడగనే సంస్కారలేశమింకను ఆ బ్రాహ్మణకన్యయందుండుటచేత ఆ లేగదూడను ఉపపతిచే చంపబడిన దానిని కని భయపడి శివశివా అనుకొనెను. ఇంతలో పతిప్రేరణమున సగము దేహామువండి ఇరువురు తినిరి. తప్పుకప్పిపుచ్చ మిగిలిన సగము దేహాము బయటవైచి వ్యాఘ్రము వ్యాఘ్రము అని అరచెను. గోవత్స మును చంపివేసెనని అరచెను. కొంతకాలమున కాజారిణి మరణించి యమలోకము కొనిపోబడి నీ పాపఫలమనుభవించి చండాలిగా పుట్టుగ్రుడ్డిగాజన్మించెను. తలిదండ్రులున్నంతకాలము పెంచిరి. ఎవరును వివాహాము చేసికోలేదు. తలిదండ్రులు కాలగతినంద పోషించువారు లేక కర్రసహాయముగా గ్రామాలు తిరుగుచు ఒక శివరాత్రి నాటికి గోకర్ణక్షేత్రము చేరెను. మార్గమున దూరముగా పడియుండి దారిపోవువారిని యాచించసాగెను. ఎవరును ఏమియును ఈయ లేదు. అర్ధరాత్రి సమయమున ఒక పుణ్యాత్ముడు పోనిమ్మని చేత నున్న ఒక బిల్వమంజరి ఆమెచేతవైచిపోయెను. తడుముకొనుచు తినునది కాదని తెలిసి వెనుకకు చీకటిలో పారవైచెను. ఆమె కూర్చున్న వృక్షము వెనుక పచ్చికలో ఒక శివలింగమున్నది. ఆ పారవైచిన బిల్వము శివలింగముమీదపడెను రాత్రి గడచిపోయినది. సమీపమున భద్రకాళి ఆలయమున్నది ఆకలిబాధ, బట్టలేదు. ఎండతాపము రెండ డగులు వైచిశక్తిలేక పడిపోయినది శంకరు లీమెచేసిన ఆ పుణ్యాలేశ

మున తన పదమునకుకొనిశే మమ్ము పంపించెను. శంకరుదయా స్వభావమిది. ఇది కర్మగతి. తెలియక బిల్వము శివలింగమునవైచు టయు, గోవత్సమును చంపితిన్నను ఆదృశ్యముచూచి శివ శివ అను నామస్మరణచేతను ఈ చండాలిపాతకములు నశించినవి. శివపదము చేర నర్హురాలు. గోకర్ణమున శివతిథి నుపవాస పుణ్యమింతయని తెలుపరానిది. జాగరణము చేసినది. భుజించలేదు. బిల్వమర్పించినది. ఏ కోరికయునులేకచేసిన పుణ్యమిది' అనునంతలో జీవలేశము పోయి నది. దివ్యకాంతఅయి విమానమధిరోహించినది. కింకరులు శివలోక మున కామెను కొనిపోయిరి."

రాజు గౌతముని నడిగిన ప్రశ్న — మునీంద్రా పరమేశ్వరుని లోకమెట్టిదో తెలుపప్రార్థన. దానికి గౌతమముని సమాధానము:—

బ్రహ్మాది దివ్యుల కలభ్యమాలోకము. సదా ఆనందమయము మహోజ్యోతివలె వెలుంగునదాలోకము. చీకటిమాటలేదు. గుణవృత్తు లతిక్రమించిన యోగులటకేగ నర్హులు. కాలవిభేద మాలోకమునలేదు. ఎవరు శివసంకీర్తన మొనరించిరో, సర్వభూత దయాపరులెవ్వరో, ఎవరు పాపరహితులో వారు శివలోకమును చేరుదురు. రాజా! ఇది నా ఉపదేశము నీకు స్వస్తి. మిథిలాధిపతి పురమునకేగవలయును. అని వెడలిపోగా రాజు గోకర్ణముచేరెను. అట శంభునర్చించి శివపద మందెను.

*

# బ్రహ్మఖండము

## 3-వ అవాంతరఖండము - బ్రహ్మోత్తరఖండము

## 4-వ అధ్యాయము

### శివమాహాత్మ్యబోధకమగు ఇంకొకగాథ:—

కిరాతదేశమున విమర్దనుడనురాజుకలడు. శూరుడు, పరవీర భయంకరుడు, సదా వేటయందాసక్తికలవాడు, బలవంతుడు, దయాహీనుడు, మాంసాహారి. ఇట్టివాడయ్యు నిత్యము శంభుపూజచేయును. ముఖ్యముగా శుక్ల కృష్ణపక్ష చతుర్దశి తిథులయందు శివునర్చించును. శివుముందు నర్తించును, కీర్తించును, పాడును. ఆతని భార్య కుముద్వతి శీలవతి, గుణవతి. పతి క్రూరచేష్టలకు చింతించెను. ఒకనాడు రహస్యమునయున్న సమయమున నీవు సర్వభక్షకుడవు, స్త్రీలెల్లరను కోరుదువు. హింసాపరుడవు నీకు శంకరునియందు భక్తి ఎట్లలవడినది. అన ఆ మాటలు విని త్రికాలజ్ఞుడగు - రాజు మందహాసముచేసి నేను పూర్వజన్మలో ఒకసారమేయము - శునకముగ జన్మించితిని. పంపానగరము నాశ్రయించి తిరుగుచుండెడివాడను. ఒకనాడందమైన శివమందిరమునకేగితిని. ద్వారము బయటనేయుండి చతుర్దశినాడు పూజాదులు జరుగుచుండ చూచితిని. ఒకడు దండముగొని నన్ను కొట్టరా బర్విడితిని. గుడిచుట్టు ప్రదక్షిణముచేసి మరల ద్వారమునకు రాగా నివారింపబడి మరల ప్రదక్షిణముచేసితిని. మరల వారుకొట్టగా దెబ్బలుతినుచు పర్విడి ప్రదక్షిణముచేసి తిరిగి ద్వారదేశము నాశ్రయించుచు వచ్చితిని. దెబ్బలుతిని శివమందిర ద్వారమున మరణించిన కారణమున రాజునై జన్మించితిని. పూజచూచుట, దీప మాలాదర్శనమువలన త్రికాలజ్ఞుడనయితిని. గత జన్మవాసనవలన సర్వభక్షకుడనయితిని. జ్ఞానమున్నను ప్రకృతివాసన బలీయము. జన్మవాసనవలననే

చతుర్దశి, శివు పూజింతును, భద్రే! నీవుకూడ దైవము పినాకిని శ్రద్ధగా అర్చించుము. నీవు పూర్వజన్మలో ఆకాశమున ఎగిరే పావురముగా నుంటివి. ఒకనాడు మాంసపిండము లభించ తినబోవ ఒక గ్రద్ద నిన్ను తరుముచు వెంటబడ శ్రీగిరికి పర్విడి గిరి ప్రదక్షిణముచేయుచు శివుధ్వజమాశ్రయించ అటకేవచ్చి నిన్ను చంపి మాంస మెత్తుకొని పోయెను. ఆ పుణ్యమున నృపాంగనవయితివి అన నానందించి రాణి మహారాజా! ఈ శరీరము విడచి మనగతి ముందేమగునో తెల్పుడని ప్రార్థించెను.

రాజు తెల్పుచున్నాడు: "ముందుజన్మలో సింధుదేశపురాజుగా జన్మింతును. నీవు సృంజయేశు తనయవై నన్నే పరిణయమాడుదువు. మూడవజన్మ సౌరాష్ట్రదేశపు రాజునయ్యెదను. నీవు కళింగరాజ పుత్రివై నాకు భార్యవయ్యెదవు. నాలుగవజన్మ గాంధారరాజును నేను నీవు మగధరాజు తనయవు. అయిదవజన్మ నేనుఅవంతికిరాజును నీవు దాశార్హరాజు కుమార్తెవు. నా పత్నివేకాగలవు. ఆరవజన్మ ఆనర్త రాజు, యయాతివంశకన్యవు నీవయి నన్ను చేపట్టుదువు. సప్తమజన్మ పాండ్యరాజకుమారుడనునేను-నీవు విదర్భరాజతనయవు. స్వయంవర మున నన్ను పొందుదువు. శంకరు నర్చించుచు అనేక యజ్ఞములొనరింతును. రాజ్యమునకు తనయు నభిషేకించి తపోవనమునకేగెదను. నీవు నన్ననుగమింతువు. అగస్త్యాశ్రమమునకేగి ఆ మునీంద్రునివలన బ్రహ్మజ్ఞానమును పొంది శివపదమందుదుము.

ఇయ్యది శివపూజా మాహాత్మ్యమున పొందిన పుణ్యజన్మలు.

*

# బ్రహ్మ ఖండము

## 3-వ అవాంతరఖండము - బ్రహ్మోత్తరఖండము

## 5-వ అధ్యాయము

దేహధారులకు శివుడే గురువు. దైవము, బంధుగు, ఆత్మ. జీవుడును శివుడే. శివుని కన్యము జీవునకెద్దియునులేదు. శివున కర్పించి ఏకొంచెమిచ్చినను, జపించిన, హోమముచేసిన, కార్యమొనరించిన నయ్యది అనంతఫలదాయకము. ఈ నిశ్చయము సర్వాగమముల ప్రమాణము. భక్తితో శంభుదేవునకు నివేదించిన పత్రం, పుష్పం, ఫలం, జలము అల్పాల్పమయినను అనంతమగును. ఒక్క శివుని సేవించిన బంధవిముక్తి కలుగును. శివుని కీర్తించిన జిహ్వయే జిహ్వ, ఆతనిని ధ్యానించిన మనసే మనస్సు, ఆయన కథలువిన్న చెవులేచెవులు, శివునిపూజించిన హస్తములే హస్తములు, శివపూజచూచిన కనులు, శివునకునమస్కరించిన శిరములు ధన్యములు.

ఒకగాథ: చంద్రసేనుడనురాజు ఉజ్జయినిలో ఉండెడివాడు. ఆతనికి శివభక్తాగ్రణిమాణిభద్రుడను మిత్రుడు కలడు. ఆతనికి చంద్ర సేనునియందు మంచి అనురాగము కలదు. ప్రీతితో మణిభద్రుడు రాజునకు చింతామణినిచ్చెను. అవి కోరికలన్నియు తీర్చుటయేకాక స్పృశించిన ఏలోహమయినను బంగారమగును. అది కంఠమున ధరించి రాజు సింహాసనమున నుండ దివ్యులమధ్య సూర్యునివలె వెలింగెను. ఆ వార్తవిన్న రాజులెల్లరకు చింతామణిని గ్రహించవలెనని దురాలోచనకలిగి వారందరేకమై రాజుపై దాడిచేసిరి. అది దైవదత్తమని వారికి తెలియదు. ఉజ్జయినీపురము నాలుగుద్వారములను మహాసైన్యముతో ఏతెంచి అరికట్టిరి. చంద్రసేనుడు పురదైవము మహాకాలుని

శరణువేడెను. మనోవికారమేదియును లేకుండ దృఢనిశ్చయమున రాత్రింబవళ్ళు గౌరీశునర్చించసాగెను. ఆ పురముననే ఒక గోపకాంత భర్తలేనిది ఒకేఒకపుత్రుడు కలది, చిరమందేయుండెను. ఆమె బాలుడయిదేండ్లవాడు ఆలయముననేయుండి రాజుచేసినశివపూజ తిలకించెను. పూజాంతమున దైవమునకు ప్రణమిల్లి తన తావునకు పోయెను. ఆ అయిదేండ్లబాలుని హృదయమున, నేత్రముల ఆ పూజా వైభవమునిండ శిబిరమునకు బయట ఒక శూన్యప్రదేశమున శిలయొకటి లింగబుద్ధినిలిపి శివపూజచేసెను. దొరికినపూలు తెచ్చి లింగమునభిషేకించి పూజసల్పెను. చందనము వస్త్రములు ధూపదీప నైవేద్యములన్నియు మనసాకృత్రిమములేకల్పించి పూజనిర్వర్తించెను. ఇంతలో కొడుకును తల్లి భోజనమునకు రమ్మని పిల్చెను. కాని అతడు విన్పించుకోలేదు. తల్లి కుమారునివద్దకేగి కూర్చున్నవానిని లాగి కొట్టెను. కొట్టినా లాగినా వాడు లేవలేదు. పూజ చిమ్మివేసి లింగమును దూరముగా పారవైచెను. వాడేడువసాగెను. వానిని విడిచివేసి గోపి గృహాంతరమునకేగెను. దేవా దేవా అనుచు బాలుడాక్రోశించుచు నేలపైపడిపోయెను. మరల తెలివిరాగా ఎటపూజచూచెనో ఆ శివాలయమునకేగెను — ఆ ఆలయమున శివపీఠమధ్యమున రత్నలింగమును కనెను. తల్లి పాపము పోద్రోలుమని నమస్కరించెను. ఉమాపతే, దేవ! నాతల్లిపాపము క్షమించుము. మూఢురాలు - ఆమెపట్ల ప్రసన్నుడవుకమ్ము. నా పూజలో ఇంచుకపుణ్యమున్న ఆ కారణముననయినా నాతల్లిని కరుణించుము. పైవిధముగ శివుని ప్రార్థించి సూర్యాస్తమయము కానుండ ఆలయము విడిచిపోయెను. ఇంటికి పోవుసరికి తనఇల్లు దివ్యభవనముగా మారిపోయెను. రాత్రిపడనుండ మందిరములో ప్రవేశించెను. రత్నపర్యంకమున తెల్లని పట్టుపాన్పుననున్న జననిని కనెను. దివ్యాంబరములు ధరించినది. దేవకామినివలెనున్నది. ఇంకను ఆమె నిదురలోనున్నది. కుమారుడు

తల్లిని లేపి అద్భుతమందిరములోన శివమందిరమును, సర్వము శివప్రసాద మని తల్లికిచూప ఆమెభక్తి శివునకు ప్రణమిల్లి ఆనందించెను. చారుల వలన రాజు ఈ వార్తవిని గోపికాసదనమునకు మంత్రి సామంత పురోహిత సైన్య పరివారముతో రాత్రిసమయముననే పోయి వారినభి నందించెను. తెల్లవారకముందే పురము ముట్టడించిన వైరిరాజుల హృదయములు స్నేహముగమారి వారెల్లరును చంద్రసేనునకు కాన్కలర్పింతుము అనుమతి నిమ్మని వార్తపంపి అనుమతిపడసి గోపబాలు నింటనున్న రాజును సమీపించి మైత్రి ప్రకటించిరి. శివుప్రసాదము గన్న గోపబాలుని లోకమున తమ తమ దేశములనున్న గొల్లలందరికి ప్రభువాతడని ప్రకటించి ప్రఖ్యాతముగ ధనము, పరిజనము, రథ, గజాశ్వములు కాన్కలు పెట్టిరి. ఈలోగా దివ్యుల పూజలంది వానరేశ్వరుడు హనుమ అట ప్రత్యక్షమయ్యెను. హనుమను కని భక్తియుక్తులయి సర్వులు నమ్రశిరస్కులై ప్రణమిల్లిరి.

హనుమ వారికిట్లనెను : "ఈ గోపబాలుడు మంద-(శని) వారము ప్రదోషసమయమున దుర్లభమయిన శివపూజ యొనరించెను. అందును కృష్ణపక్షము. ఈతని వంశమున ఎనిమిదవతరము నందుడుద్భవించును. ఆతనికి కుమారుడై హరి కృష్ణుడుగా నవతరించును" అని తెల్పి గోప కుమారునికి హనుమ శివాచారముపదేశించి అంతర్హితుడాయెను. ఆ గోపబాలునికి శ్రీకరుడని పేరిడి యేగెను. కాలాంతరమున గోపకుడు శ్రీకరుడును, రాజు చంద్రసేనుడును శివారాధన తత్పరులయి శివపదము ప్రాపించిరి.

# బ్రహ్మ ఖండము

## 3-వ అవాంతరఖండము - బ్రహ్మోత్తరఖండము

## 6-వ అధ్యాయము

శివపూజాఫల వర్ణనము :

త్రయోదశి సాయంకాలమునకు ప్రదోషమని పేరు. ఫలము కోరువారు మహాదేవుని ఆ సమయమున పూజించవలెను. ప్రదోష పూజాఫలము అనంతము. దివ్యులెల్లరా సమయమున శివునంతికమున నుందురు. శివుడు నాట్యముచేయును. ఆ సమయమున పూజవలన చతుర్వర్గ ఫలములందుదురు. దరిద్రమను చీకటిలో సంసారసాగరమున మునిగితేలువారికా సమయమున పూజ సాగరముమీద ప్లవమువంటిది. సర్వ అశుభములు తొలగి శుభములే చేకూరగలవు. ప్రదోషమున గిరిశార్చనమున నరులకెటువంటి భయమయినను తొలగిపోవును.

ఒక ఇతిహాసము — విదర్భపురాధీశుడు సత్యరథుడు కలడు. ధర్మాత్ముడు, శీలవంతుడు, ధీరుడు, సత్యవాది, సుఖముగా చిరము రాజ్యము పాలించెను. శాల్వలభూపతి కితనితో వైరమేర్పడగా ఆతడు సైన్యముతోవచ్చి విదర్భనగరమును ముట్టడివైచెను. సత్యరథుడు తన బలముతో నాతని నెదుర్కొనెను. శాల్వులుడు బలవంతుడుకాగా రణమున సత్యరథునోడించి చంపివైచెను. మంత్రులు మిగిలినసైన్యము పురమువిడిచి పలాయనమొనరించిరి. ఆ సత్యరథుని భార్య రిపుల కోలాహలమునకుతప్పి రాత్రిసమయమున నగరువిడిచి పైకిపోగల్గెను. ఆమె గర్భవతి, శోకముతో తూర్పుదిశగా చీకటిలో పయనించి పోసాగెను తెల్లవారువేళకు చాలాదూరమునడచి అలసిన సమయమున ఒక విమలమయిన సరస్సు కన్పించెను. ఆ సరోవరతీరమున

రాజమహిషి మంచిముహూర్తమున ప్రసవించి కుమారుని కన్నది. ఒక వృక్షచ్ఛాయ నాశ్రయించియున్నది. తాపమయి, నీటికి, బాలునిఛాయలో విడచి, సరసునదిగి జలము త్రావబోవ ఆమె నొక మొసలి ఈడ్చుకొనిపోయెను. ఇటుల కుమారుడు జన్మించుటతోనే తలిదండ్రులను కోల్పోయెను. ఈలోగా ఆ సరోవరతీరమున కొక బ్రాహ్మణకాంత-ఆమె దరిద్రురాలు. వితంతువు. ఆమె కొక్కడే తన యుడు. భిక్షాటనమొనరించి బ్రదుకుచుండెను- ఈ రాకుమారుని చూచి అనాథ ఎవ్వరునులేరు కులము తెలియదు ఎటుల గ్రహింతు. నా కుమారునివలెనే పెంచెదనా అని ఆలోచించుచుండ సాక్షాదీశ్వరుడే భిక్షుకరూపమున కన్పడి "విచారించకు! ఈతనిని పాలించుము. నీకు శుభములగునని" తనదారినేగెను.

ఆ ద్విజకాంత ఇరువురను తన ఇంటికికొనిపోయెను. బ్రాహ్మణులచే ఇరువురికిని సంస్కారములు నిర్వర్తించి పెంచుచు క్రమముగా ఉపనయనమును కావించెను. తల్లితో ఇరువురును బిక్షాటనమున తిరుగుచు దైవవశమున ఒకనాడు దేవతాలయములో ప్రవేశించిరి. ఆ ఆలయమున అనేకులు మునులున్నారు. అందులో శాండిల్యుడను మునీంద్రుడు ఈ బాలురనుచూచి "అహో దైవచిత్రము. బ్రాహ్మణ బాలునితో కూడి ఈతడు భిక్షాటనమున జీవించవలసివచ్చిన" దన బ్రాహ్మణి మునికి నమస్కరించి ఆ సభామధ్యమున మునీంద్రుని ఆ బాలుని చరిత తెలుపుమన ఆతడు జ్ఞానికాన బాలకుడు రాజకుమారుడు మాతాపితలను కోల్పోయెనని తెల్పెను. అయిన మునీంద్రా ఈతనికి తిరిగి రాజ్యము చేవడునా అని ప్రశ్నించి? నా కుమారునితోపాటే పాలించుచున్నాను. భిక్షాశనము దారిద్ర్యముపోవు ఉపాయము తెలుపుమనిగోరెను.

శాండిల్యుని సమాధానము: పూర్వజన్మలో ఈతనితండ్రి రాజ కార్యభారమున చేయుచున్న శివపూజవిడిచెను, అధర్మమాచరించెను,

శత్రువుని చంపెను, రాత్రి భోజనముచేసెను. ఇదియంతయు శివపూజ పూర్తిచేయకచేసిన అకార్యము. ఈతని తల్లికూడ పూర్వజన్మలో సపత్నిమోసగించి చంపిన కారణమున మొసలివాతపడెను. శివపూజ చేయకుండుటయే దారిద్ర్యమునకు ముఖ్యకారణము. ప్రదోషసమయమున లోకజననిని గౌరినిపీఠమున ఆసీనురాలినిచేసి దివ్యుల సమక్షమున శంకరులు నాట్యముచేయును, సరస్వతి వీణ వాయించును, ఇంద్రుడు వేణుగానముచేయును, బ్రహ్మ తాళము వాయించును, లక్ష్మి గానమాలాపించును, విష్ణువు మద్దెల కొట్టును, దేవతలు తిలకించుచుందురు. కనుక ప్రదోషసమయమున శివుని పూజించిన సర్వశుభములు చేకూరును. కావున నీవు శంకరుని శరణందుము – అని ముని తెల్పెను.

*

# బ్రహ్మఖండము

## 3-వ అవాంతరఖండము - బ్రహ్మోత్తరఖండము

## 7-వ అధ్యాయము

శివపూజాక్రమము తెలుపుడని విప్రపత్నిత వేడగా శాండిల్య మహాముని తెల్పుచున్నాడు: రెండు పక్షములు – శుక్ల, కృష్ణ పక్షములయందు త్రయోదశి నిరాహారము. అస్తమయానికి మూడు ఘడియలకు ముందు స్నానము చేయవలెను. సంధ్య నిర్వర్తించుకొని శివపూజ ఆరంభము చేయవలెను. దేవమందిరము వితానములతో రంగవల్లులతో ముగ్గులతో అలంకరించి స్థిరాసనమున కూర్చుండి పూజా ద్రవ్యములు సంపాదించుకొనవలెను, పీఠపూజ చేయవలెను, దేవతా ధ్యానముచేసి తన హృత్పీఠమున నుంచుకొనవలెను. నవశక్తి యుతునిగ నుమాపతిని ధ్యానించుకొనవలెను. శాస్త్రోక్తవిధానమున శంకరుమూర్తి ధ్యానము కల్పించవలెను. ధ్యానించి ఉమా శంకరులను పూజించి ధూపదీపనైవేద్యములిచ్చి పుష్పాంజలిఘటించి ప్రదక్షిణ మొనరించి నమస్కరించవలెను. గురుని గణపతిని ఆరాధించ వలెను. పూజాక్రమము సంప్రదాయానుసారము నిర్వర్తించవలెను. పరమేశ్వరుని రక్షయాచించవలెను. అఘములుపోయి శుభములు చేవడును. అనంతరము యథాశక్తి బ్రాహ్మణభోజనము, దక్షిణలిచ్చి సత్కరించవలెను. శతములు బ్రహ్మహత్యలయినను శివపూజ నశింప చేయును. ఈ బాలురచే పూజలుచేయించిన సంవత్సరమున కోరికలు ఫలించును. ఈ విధమున ప్రదోషమున శివపూజ చేయుమని బ్రాహ్మణికి తెల్పెను. ద్విజరాజకుమారులిరువురు ఈ విధముగ పూజలు చేయ సాగిరి. ఈ విధముగ నాలుగు మాసములు గడచినవి. ఒకనాడు రాజకుమారుడు లేక ద్విజబాలుడు ఒంటరివాడై నదీతీరమునకు స్నాన

మునకేగి లీలగా విహరించసాగెను. అక్కడ నదీవేగమునకొట్టబడుచు గట్టునంటిన ఒక కలశమునుచూచి, ఎత్తి బరువుగనుండ శిరమునధరించి, దేవదత్తమని సంతసించుచు, ఇంటికితెచ్చి తల్లిముందుంచి ఇట్లనెను "అమ్మా! గిరిజాపతి ప్రసాదమిదిగో చూడుము. కుంభరూపమున నిధానము శివప్రసాదము" అన తల్లితనకుమారుని అభినందించుచు రాకుమారుని పిలిచి కుంభముచూపెను. మీరిరువురు ఇందులోని ధనము సమముగ పంచుకొనుడు ఇది నాశాసనము అన రాకుమారుడు అమ్మా శివప్రసాదము ఆతనిదే. అందులోపాలు నాకువలదనెను ఆతని పుణ్యమున లభించినది ఆతడే అనుభవించవలెననెను. ఆ శంకరులే నాకుచితమయినది ప్రసాదించును అనెను. తరువాత యథాప్రకారము శివపూజ చేయుచుండిరి. ఒక సంవత్సరము ఆ యింట ఆ విధిపూజ జరిగిపోయినది వసంతసమయము ఇరువురును కలసి వనవిహారము చేయసాగిరి. దూరముగ పోవ పోవ అట గంధర్వకన్యలు శతములు క్రీడించ కాంచిరి. బ్రాహ్మణబాలు డనుచున్నాడు "మనము ముందుకు పోరాదు. అట స్త్రీలు విహరించుచున్నారు. విమలాశయులు, బుధులు, స్త్రీసన్నిధానమును విడతురు. వీరు ధనయౌవన దుర్మదులు, కౌతుకము కల్పింతురు నిజధర్మరతుడు, అందును బ్రహ్మచారి వారితో సంభాషణ చేయరాదు. స్త్రీల క్రీడాస్థానమునకు పోనిచ్చగించను అనెను. అయితే రాజకుమారుడు ఒకడే ఆ ప్రదేశమునకేగెను. వారిమధ్య ఒకయువతి. వచ్చు రాజకుమారుని చూచి ఆతని రూపలావణ్యములు అంగసౌష్టవమునుకని ఆశ్చర్యపడెను. గంభీరుడు, యువకుడు, ధీరుడనుకొనసాగెను. సఖులనుచూచి ఆమె ఇట్లనెను — సమీపంలో ఇంకొక వనమున్నది మీరటకేగి పూలుకోయుచుండుడు. కోసి ఇటువచ్చునంతకు నేనిందేయుందునన వారామె ఆజ్ఞ శిరసావహించి వెడలిపోయిరి. వచ్చే రాజపుత్రునిపై దృష్టినిలిపి అందాసీనయయ్యెను. రాకుమారుడామెను సమీపించి దైవయోగ

మున మదనాతురుడయ్యెను. గంధర్వరాజతనయ తన్నుసమీపించిన రాకుమారునకు చిగురుటాకు ఆసనమిచ్చి స్వాగతముపల్కెను. ఆతని చరిత తెలుప ప్రశ్నించెను. తాను విదర్భరాజకుమారుడనియు, రాజ్యమును, తలిదండ్రులను కోల్పోయితిననియు తెల్పెను. తిరిగి ఆమె కథ తెలుపగోరెను.

ఆమె వృత్తాంతము : "ద్రవికుడను గంధర్వశ్రేష్ఠుడు కలడు. ఆతని తనయను నేను. అంశుమతి అని పేరు. నీరాకకని సఖులను దూరముగ పంపివైచితిని నీతో మాటలాడ నభిలాషతో ఇట్లుచేసి నీకై నిరీక్షించియుంటిని. సర్వసంగీతవిద్యల నాకన్న నధికురాలులేదు. దేవకాంతలు నాసంగతిని సంతసింతురు. నీకు మనసున్న నా స్నేహమంగీకరించుమనుచు తన కుచములనందగించు ముత్యాలహారము రాకుమారుని మెడలోవైచెను. కాని రాకుమారుని వాక్యము – నాకు రాజ్యములేదు. నిన్ను గ్రహించి నేనేమిచేయవలయును. ఆలనపాలనల నిన్నలరించు శక్తి రాజ్యహీనుడను నాకులేదుకదా. అయినను నీ జనకునిపంపు నీవు చేయవలయును. స్వేచ్ఛగా ప్రవర్తనము మూఢులకు చెల్లును. ఆమె-అయితే సర్వము నీ అభిమతము ప్రకారమే జరుగును. రేపు ఉదయము ఇదేతావునకు రమ్మని పంపి సఖులను కలసుకొనెను. రాకుమారుడు ద్విజసూనుని చేరుకొని జరిగినదెల్ల వివరించెను. ఇరువురును కలసి గృహమునకేగిరి. మరునాడిరువురును అదే వనమునకు పోయిరి. అంతకుముందే గంధర్వపతికుమార్తెతో వచ్చియుండి కుమారులిరువురకు స్వాగతము తెల్పెను. తరువాత రాకుమారునితో శివునానతి తెల్పెను. శంకరుతే నాతనయను నీకు – ధర్మగుప్తునకు– ఇమ్మని ఆదేశించెను. నీ రాజ్యము నీకు దక్కునట్లు సమయముచేయ నన్నుపంపెను. అందువలన ఈ నాకన్యను అంశుమతిని నీ కిచ్చుచున్నాను. నీ అరులను నిర్జించి నీ రాష్ట్రమున నిన్ను నిల్పెదను. పదివేలసంవత్సరములీమెతో నీవు రాజ్యభోగములనుభవించి కాలాంత

రమున కైలాసవాసివగుదువు. కైలాసమునకూడ ఈనాతనయ ఈ దివ్యశరీరముతోనే నిన్ను సేవించును. అని వెంటనే వారికిరువురకు పాణిగ్రహణ మొనరించెను. అనేకములు రత్నాభరణములు కాన్క లిచ్చెను. పదివేలు గజములు, నీతురంగములు లక్ష, రథములు వేలు, సువర్ణభారములనంతము లొసంగెను. ఒక దివ్యరథము, ఇంద్రధనువును పోలిన ఒకవిల్లు, అక్షయతూణీరము ఇచ్చెను. అభేద్యకవచము, సువర్ణమయము శక్తి, రిపుమర్దనసామర్థ్యము కలదాని నందించెను. చతురంగ సమన్వితమయిన గంధర్వసైన్యముతోడిచ్చి పురముపై దాడి వెడల నుపదేశించెను. కూతు నల్లుని పొననిపించి విమానమున తన నగరమునకే పోయెను ధర్మగుప్తుడు కాంతతో గంధర్వ సేనతో తన నగరము ముట్టడించి అరిని (దుర్ధర్షణుని) రణమున హతునిగావించి నిజపురము ప్రవేశించి పూర్వమంత్రులు పురోహితులుచేరి తన్నభిషే కించ రాజ్యభారము పూనెను. తన్నుపోషించిన విప్రవనితయే జన నిగా విప్రకుమారుని సోదరునిగా అంగీకరించి సర్వశుభములు సుఖ ములు తనతోపాటు కల్పించెను.

# బ్రహ్మ ఖండము

## 3-వ అవాంతరఖండము - బ్రహ్మోత్తరఖండము

## 8-వ అధ్యాయము

నిత్యానందమయము, శాంతము, వికల్పములేనిది, అక్షయమయినది, ఆద్యంతములులేనిదగు శివతత్త్వము తెలియబడిన పరాగతి యలవడును, కామభోగములయందు విరక్తికలిగి, అహేతుకమయిన, ఫలముకొరకు, భక్తి శివునియందుంచిన పునర్జన్మలేనిముక్తి ఆ నరుడు కాంచును. నిత్యముశివపూజ చేయుచున్న, భోగాంతమున శివునిచేరుదురు కర్మబలీయమయి విషయములు విడువలేకున్నను ఆ నరునకు కర్మమయమయిన పూజ కామధేనువే-కోరికలు ఫలింపచేయును. స్వర్గాపవర్గములు చేకొన లోకమున శివపూజ కారణమగును. ప్రదోషముతోకూడిన సోమవారము, కేవలము సోమవారమయినను ఎవడు శివపూజచేయునో ఇహపరముల ఆతనికి దుర్లభమేదియునుండదు. శుచియయి ఉపవాసముండి జితేంద్రియుడై వైదికలౌకికములలో నేవిధిగనైనను శివపూజచేసినచో, బ్రహ్మచారి, గృహస్థు, కన్య, పతిగల కాంత, పతిలేనిస్త్రీ. ఇందెవ్వరయినను పూజభక్తితోచేసిన కోరిన కోరికలు ఫలించును. ఇందుఒకకథ :—

ఆర్యావర్తమున ధర్మాత్ముడు చిత్రవర్మ అనురాజు దుర్మార్గుల పాలిటి యమునివంటి (శాసకుడనుట) వాడుండెను అనేకయజ్ఞములు చేసెను. శరణన్నవారిని రక్షించువాడు. సకలపుణ్యకార్యములు చేసెను. అరులనునిర్జించెను. శివకేశవులయెడ భక్తుడు. అనుకూలవతులయందు, కాంతలయందు తేజోవంతులు తనయులను కనెను. ఒక కన్యకూడ జనించినది. హిమవంతునకు పార్వతివలె, కన్యనుకని కోరికలు నిండినట్లు సంతసించెను. కన్యజనన ఫలము ద్విజులను జ్యోతిర్విద్యా

వేత్తల నాహ్వానించి బహూకరించి ప్రశ్నించెను. ఒకడు 'ఈ నీ కన్య సీమంతిని అను పేరు కలది ఉమవలె మాంగల్యవతి, దమయంతివలె రూపవతి, భారతివలె కళలు తెలిసినది, లక్ష్మివలె గుణవంతురాలు, దేవ మాతవలె మంచి సంతానము కనును, జానకివలె వ్రతము ధరించునది, పదివేల సంవత్సరములు భర్తతో సుఖములందును, ఎనమండుగురు సుతులను కాంచును, అన ఆ మాటల కలరి రాజు సంతోషించి అతనికి బహుమతులిచ్చెను. అయితే వారిలో ఒక ధీమంతుడు ధైర్యశాలి ఈ కన్య పదునాలుగవ సంవత్సరమున వైధవ్యమనుభవించునని నెను. వజ్రముచే కొట్టబడిన వానివలె రాజు నిశ్చేష్టుడై. ఇంచుక చింతించి, సర్వము దైవేచ్ఛ అని మనసునిలిపి, బ్రాహ్మణులపంపివైచెను. ఆకన్య సీమంతిని శైశవమువిడచి నది కాగా, సఖులద్వారా తన వైధవ్య వార్తవిన్నది యాజ్ఞవల్క్యమునిపత్ని మైత్రేయి నాశ్రయించి "మాతా నీచరణము లాశ్రయించితిని ఆపన్నురాలను, నాకు సౌభాగ్యము వర్ధిల్లుకర్మ ఉపదేశించుమని" వేడుకొనెను. మైత్రేయి ఉపదేశము" తల్లీ ఉమాసహితుని శంకరుని శరణు పొందుము. భక్తితో గౌరీశంకరులను సోమవారము పూజించుము. బ్రాహ్మణులకు భోజనము కల్పించుము. అభిషేకముచేసిన పాపక్ష యము. పీఠపూజవలన సామ్రాజ్యము, గంధమాల్య అక్షతలర్పించిన అఖిలసౌఖ్యములు సౌభాగ్యము, ధూపమిచ్చిన సౌగంధ్యము, దీప దానమునకాంతి, నైవేద్యమిచ్చిన మహాభోగములు. తాంబూల దానమునలక్ష్మి, నమస్కారమున ధర్మార్థ కామ మోక్షములు, జపము వలన అష్టైశ్వర్యసిద్ధులు అలవడును. హోమమున సర్వకామ సమృద్ధి యలవడును. ఇటుల సోమవారపూజవలన ఎట్టి దుర్గతియు తొలగి పోవును" రాజకన్య ఆతీరున శివపూజచేసెను. గురువుల అనతి రాజు చిత్రవర్మ తన కన్యను నలదమయంతుల పౌత్రుడు చంద్రాంగదున కిచ్చి వివాహమొనరించెను. చంద్రాంగదుడు వివాహానంతరము

కొంతకాలము మామఇంటనే యుండెను. ఒకనాడు చిత్రాంగదుడు స్నేహితులతో పడవ ప్రయాణమున లీలగా యమునదాటి పోతలంచెను. ఆ పడవ ఒక సుడి గుండమున పడిమునిగిపోగా అందరును మరణించిరి. ఒక్కరును కన్పించలేదు. సీమంతిని ఆవార్తవిని మూర్ఛపోయెను. రాజు, అంతఃపురజనము, పౌరులు దుఃఖసాగరమున నిమగ్నులైరి. రాజకుమారుని బందుగులువచ్చి ఔర్ధ్వదైహికములు నిర్వర్తించిరి. పతితోసహాగమించ నివారించబడి సీమంతిని వైధవ్యమనుభవించ నంగీకరించినది, వైధవ్యము వచ్చినను మునిపత్ని బోధించిన సోమవార వ్రతము విడువలేదు, ఆ వైధవ్యమువచ్చినకాలము సీమంతినికి పదునాలుగవ సంవత్సరము, నాటినుండి శివపూజచేయుచు మూడు సంవత్సరములు గడపినది. ఆమెమామ ఇంద్రసేనుడు పుత్రశోకమున దీనుడైయుండ దాయాదులు రాజ్యముహరించిరి. వారు ఇంద్రసేనుని చెరలోవైచిరి. చంద్రాంగదుడు నీటిలో మునిగిపోగా ఆతనినొక నాగకాంతచూచి మోహించి నాగలోకమునకు కొనిపోయెను. ఆ కాంతరాజసుతుని పరమాద్భుతమయిన తక్షక పురమునకు కొనిపోయెను. తక్షకుని సభకుకొనిపోగా నాగరాజుతేజముకని ధైర్యమున ప్రణమిల్లెను. తక్షకుడు కామినిని 'ఈతడెవ్వరని ప్రశ్నించ" యమునాతోయముల మునిగిపోవువానినిచూచి తెచ్చితిమనెను. ఇంకమాకేమియును తెలియదనెను. తక్షకునిచే ప్రశ్నింపబడి రాకుమారుడు తన వృత్తాంతముతెల్పెను. "నిషధదేశమునకురాజు నలచక్రవర్తి-ఆతని పత్ని దమయంతి. వారలకుమారుడు ఇంద్రసేనుడు. ఆతనికి తనయుడనేను. చంద్రాంగదుడనిపేరు. నూతనముగ వివాహమయినది. జలవిహారమున మునిగిపోయిన, వీరలునన్నిటకు తెచ్చిరి. నీ పాదాబ్జములకంటిని. కృతకృత్యుడను. ఎన్ని జన్మలపుణ్యముననో మిమ్ము మీలోకమును కాంచితిని. నీదయవలన తేజస్వివి నీతో సంభాషణ ప్రాప్తించినది అని ధైర్యముగ తక్షకునితో తన చరిత చిత్రాంగదుడు తెలుప భయపడవలదనుచు దేవతలలో మీరెవ్వరిని

సదా పూజింతురని నాగరాజు ప్రశ్నకు సమాధానముగా ఉమాపతిని పూజింతుమనెను. పరమశివుడు మాకు పూజ్యుడనెను. తక్షకుడు సంతసించి "రాజకుమార నీకు సంతసించితిని బాలుడవయ్యు పరాత్పరు శివతత్త్వము తెలిసితివి. ఇదిరత్నమయమయిన లోకము' వీరు సుందరులు కాంతలు, వృక్షములన్నియు కల్పవృక్షములు, బావులు అమృతపూరితములు, మృత్యుభయముగాని జరా రోగముల భయము గాని ఈ లోకమునలేవు. నీ యిష్టమువచ్చినట్లు విహరించుచు భోగము లనుభవించుము—అన రాకుమారుడామాటలువిని కరములుజోడించి తక్షకుని కీటుల విన్నవించెను.

"నేను వివాహము చేసికొనినకాంత భూలోకముననున్నది. సువ్రత, తండ్రికేకపుత్రిక-నిత్యము శివపూజాపరాయణురాలు, ఇపుడు నేను మృతుడనయితినని శోకమున మునిగియుండును. దైవమువలననే ప్రాణములుండును, పోవును. చిరము ఇట నేనుండుట ధర్మము కాదు. నాలోకమునకు నన్నుపంపి పుణ్యమునపొమ్ము" అన సుర వృక్షముల వలన లభించిన దివ్యాన్నపానాదిభోగముల తృప్తునిచేసి కామగమనముగల అశ్వమిచ్చి కోరినపుడెల్ల తన్ను స్మరించిన వచ్చి దర్శనమిచ్చి సహాయపడుదునని వాగ్దానముచేసి రత్నమాల్యాభరణాదు లిచ్చి మోసుకొనిపోయి లోకమున విడువ ఒక రాక్షసుని నియమించి, కూడ పోవ ఒక నాగకుమారునితోడిచ్చి పోయిరమ్మని పంపెను. నిమిషములో నదీతటముననిలచెను. దివ్యాశ్వము నధిరోహించనుండ ఆ సమయముననే సీమంతిని సఖులతో నదికి స్నానమునకై వచ్చి ముందున్నపతినికాంచెను. నరరూపమున 'రాక్షసుడు', నాగకుమారుడు నున్నారు. దివ్యమాల్యాంబరములు దివ్యగంధముతో కూడిన దేహము దివ్యాశ్వమధిరోహించియున్న పతినికని జడతవహించి కను లప్పగించిచూచుచు నిలచెను. రాజపుత్రుడు ఆమెను సరిగ ఆనవాలు పట్టలేదు. చూచిన స్మృతియున్నది. మాంగల్యములేదు; ధమ్మిల్లి

బంధము లేదు. అంగరాగవిహీనమయిన దేహము, కనులకాటుక లేదు శోకము మూర్తీభవించినట్లున్నది. అశ్వముదిగి ఆమెను సమీపించి ఆమె చరిత తెలుపగోరెను. సఖీముఖమున సర్వము తెలియచెప్పెను. నేడు సోమవారము-వ్రతనియమముగ స్నానమునకేతెంచినది. నేటికి మూడు సంవత్సరములయినది పతినికోల్పోయి అని సఖులు తెల్పిరి. స్వయము సీమంతిని ప్రశ్న-నీవు దివ్యుడవా-నావృత్తమడుగ పనియే మన దుఃఖమాపుకొని రాకుమారుడు పాణిగ్రహణశంక కలిగియు దరిచేర్చి చెవిలో సీమంతి ఇకనుండి రెండుమూడు రోజులలో నిన్ను కలియగలడు, ఈ వార్త తెల్ప నన్ను పంపించెనని, శివపాదములాని తెల్పెదను సంశయించకుము నీలోనే ఈమాటఉంచుము. ప్రకటించ వద్దు అనబాగుగ ఆతనివంకచూచి తప్పక ఈతడే నాభర్త, పరలోకము నుండి వచ్చిన పూర్వరూపమే ఎట్లుండగలదు. నేను దౌర్భాగ్యురాలను. ఇది స్వప్నముకావచ్చును. ఇతడు ధూర్తుడు యక్షుడో గంధర్వుడో కావచ్చును. కాని మునివాక్యము ఫలించునేమో వ్రతఫలము దక్కునేమో. శివునికనుగ్రహము కల్గినదేమో, ఇటుల పలువిధముల చింతించెను. ఆతడు ఆతని తండ్రికీ వార్త తెలుపపోయెదను. నీకు స్వస్తియగును. పతినిపొందగలవు అని అశ్వమధిరోహించి వెడలిపోయెను. క్షణములో తన నగరమునకేగి పురోపవనముననేయుండి నాగకుమారుని ద్వారాదాయాదులకు వార్త పంపెను. వెంటనే ఇంద్రసేనుని విడిచిపుచ్చుడు. పన్నగాలయమునుండి ఆతని కుమారుడు చంద్రాంగదుడు వచ్చియున్నాడు. రాజ్యమువిడిచి నృపాసనము విడిచిపెట్టి పొందు లేకున్న చంద్రాంగదుడు బాణములచే మీప్రాణములు హరించుననన భయపడి దాయాదులింద్రసేనుని విడిచిపుచ్చి మంచి మాటలు తెల్పి సుతుడువచ్చెనని తెల్పిరి.

పౌరజనులు పురోద్యానమున నృపాత్మజునిచూచి రాజు ఇంద్రసేనునికి తెల్పిరి. రాకుమారుని ఉత్సవముగ నగరమునకు ప్రజలు

పొదివికొనితేగా తలిదండ్రులకు ప్రణామమాచరించెను. వారిసంతోష మున కవధిలేదు. వారలెల్లరకు తనకథ వివరించెను. ఈ వార్త చారుల ద్వారా చిత్రవర్మకు నిషధరాజుచెప్పి పంపెను. వారలకు పారి తోషికములిచ్చిపంపి కుమార్తెకీవార్తతెల్పి ఆనందించెను. వైధవ్య లక్షణములులేకుండ సర్వాలంకారశోభితను గావించెను. ఇంద్రసేన సుతుని చిత్రాంగదుని రావించి చిత్రవర్మ మహావైభవముగజరిపించెను. చిత్రాంగదుడు తక్షకుడిచ్చిన కల్పవృక్షసంబంధి దివ్యమాల్యాంబరా భరణములు కాంతకిచ్చెను. కాంతతో చంద్రాంగదుడు తన పురము నకు తిరిగిపోయెను. ఇంద్రసేనుడు కుమారుని హస్తముల రాజ్యము నిచ్చి వనములకేగి తపమొనరించి శివసాయుజ్యమందెను. పదివేల సంవత్సరములు సీమంతినితో రాజ్యము పాలించుచు చంద్రాంగదుడు సుఖము లనుభవించెను. ఎనమండుగురు కుమారులను ఒక కుమార్తెను సీమంతినివలనకనెను.

ఇంకను సోమవార వ్రతమహాత్మ్యము తెలుపమనులు కోర సూతుడు తెల్పుచున్నాడు.

*

# బ్రహ్మఖండము

## 3-వ అవాంతరఖండము - బ్రహ్మోత్తరఖండము

## 9-వ అధ్యాయము

ఇంకొకగాథ-: విదర్భదేశమున ఒక బ్రాహ్మణుడుండెడివాడు. వేదమిత్రుడనిపేరు. శాస్త్రవేత్త. ఆతనికొక మిత్రుడు సారస్వతుడను వాడుకలడు. ఒకే దేశమువారు మంచిస్నేహితులు. వేదమిత్రునకు సుమేధుడనుతనయుడు జనించెను. సారస్వతుని తనయుడు సోమవంతుడు. ఈ బాలురిరువురును సమవయస్కులు, ఒకేవిధంగా దుస్తులు, ఒకే స్థితిలో ఉన్నారు. బాల్యమునుండియు ఇరువురును కలసియే విద్యలనభ్యసించిరి. వివాహమునకు తగినవయసు వారయిరి, తండ్రులు తనయులకిట్లనిరి "మీరుభయులు రాజదర్శనముచేసి విద్యల వలనమెప్పించి ధనము సంపాదించి వివాహము చేసికొనుడు" అనవారు రాజుదర్శనముచేసి తమ అభిలాష తెల్పిరి. వారిని పరీక్షించి విజ్ఞులని తెలిసియు, లోకవ్యవహారము తెలియుటమంచిదని, ఇట్లుపదేశించెను. "వివాహితులయిన ప్రఖ్యాతముగ ధనము కావలయును. మంచిఆశ్రయము దొరుకవలయును. నిషధరాజు భార్య సోమవార వ్రత సమయమున దంపతులను పూజించి ప్రఖ్యాతముగధనమిచ్చును. అందుచేత ఒకడు స్త్రీవేషముధరించి రెండవవాడు పురుషుడుగా దంపతులయి మీరేగి పూజనంది ధనముగ్రహించుడని" లోన నవ్వుచు తెల్పెను. ఇచ్చినంతధనముగ్రహించి తిరిగి నావద్దకు రండనిపంపెను.

కుమారుల సమాధానము-: "కుటిలమార్గమున వర్తించుట మాకిష్టములేదు. కుటిలులకు పాపము, నింద, భయము, వైరము వెంటనంటియేయుండును. పాపమెప్పుడయినను బయల్పడితీరును. రాజా! మీరు తెల్పిన మార్గము మాకు వర్తనీయముకాదు. మా

కులాచారమునకు విరుద్ధము -అనరాజు సమాధానము: "ఇదిరాజశాసనము. మీరు పౌరులు. నా ఆనతి తిరస్కరించరాదు. వెంటనే మీరు పోవలసినదే అనభయపడి వారల్లే చేసెదమని రాజ సభ విడిచి ఇంటికేగిరి. సారస్వతుని కుమారుని సోమవంతుని పిలిపించి స్త్రీవేషములెన్నగా కల్పించెను. కాటుక, ఆభరణములు కృత్రిమములు ఏర్పరించెను. మంచిరూపవతిగా తయారయ్యెను, కాకున్నదిక్కాకమానదని దంపతులయి ఉభయులు నిషధదేశమునకు పయనించిరి. సోమవారం సమయమునకే రాజ భవనమునకేగి ఆదరించబడిరి. ఆ దంపతులను రాజపత్ని ప్రత్యేకముగా ప్రత్యేక ఆసనములనుంచి పూజించెను. కృత్రిమదంపతులను చూచి లోననవ్వుకొని గౌరీమహేశ్వరులుగా భావించి పూజనిర్వర్తించి దంపతులందరికి షడ్రసోపేతముగ దివ్యాసమమైన భోజనము కల్పించెను. భోజనము లయినతర్వాత తాంబూలము యథోచితమైన దక్షిణలందించెను. గోవులు హిరణ్యము, నూతనవస్త్రములిచ్చి నమస్కరించి పంపివైచెను. సోమవంతుడు పతివ్రతా భావప్రభావమున నిజముగ నవయౌవనయయిన కామినిగా మారిపోయెను. ముందేగుచున్న సుమేధునికని విలసిత "నాథా అబలను, త్వరగనీవెంట రాజాలను. కామ పీడితురాలను. ఈవనము రమ్యముగనున్నది. ఇట నాతో విహరించుము. నన్నాలింగనమొనరించుకొన్నగాని నాబాధతగ్గదు." అన హేళనచేయుచున్నాడనుకొని నీవు బ్రహ్మచారివి నామిత్రుడవు, సామవంతుడవు—భ్రమించి ఇట్లేలమాట్లాడుచున్నావు" అననేను పురుషుడనుకాను నాపేరు సామవతి అనేకన్య నీకు రతిసుఖ మీయనున్నాను చూడు నా అంగములు తిలకించుము. రహస్యముగ ప్రక్కకుకొనిపోయి వస్త్రములు నగ సడలించ కృత్రిమములుకాని స్త్రీ కుచితమయిన జఘనము స్తనాది అంగములు వ్యక్తములుకాగా ఇంచుక వికారమునకు లోనయి చిత్త వికారమునడంచుకొని, మాటలాడకపోబోవ సామవతి అనుచున్నది. "నీ సంశయము తీరినదికదా. వచ్చినన్ను కలియుము.

సుందరమయిన ఈ వనముచూడుము, పరస్త్రీ సురతమునకెంతయు తగియున్నది."

సుమేధుని సమాధానము :- మర్యాద అతిక్రమించరాదు. మనము కలసి శాస్త్రము లభ్యసించితిమి. నీ విట్లనుట ఉచితముకాదు, మనవంటివారికి జారధర్మమనుసరించుట పాపము. నీవు స్త్రీవికావు. పురుషుడవు, ఇది స్వయం కృతాపరాధమున సంక్రమించినది. ధూర్తుడయిన రాజుశాసనమునకు భయపడి ఇట్టి గతికివచ్చితిమి. ఇంటికి నాతో మారుమాటాడకరమ్ము. దీనికనంతరచికిత్స మన జనకులకుతెల్పి ఆలోచింతము. దేవద్విజప్రసాదమున నీ స్త్రీత్వము పోవుమార్గము చూతము, దైవయోగమున స్త్రీత్వము పోకున్న నీజనకుని అనుమతి వడసి వివాహము కావించుకొని అనంతరము నీతో భోగింతును. రాజకాంత వ్రతమహిమ ఎంతటిదోకదా. అనుచుండ బలవంతముగ ఆతని నాలింగనమొనరించుకొని అధరపల్లవము ముద్దాడెను. అతిశయముగ కలియ యత్నించ ధీరత వారించి ఎట్లో ఇంటికి తీసికొనివచ్చితండ్రులకు జరిగినదెల్ల వివరించెను. వారు వీరిని వెంటనిడుకొని, కోపపరీతచేతస్కులయి విదర్భరాజు ఆస్థానమునకేగిరి. రాజా నీ దుశ్చేష్టితఫలము చూడుము. నీ శాసనము ధిక్కరించలేక నిషధకుపోయి ఈ గతికివచ్చిరి. నా కుమారునకు స్త్రీత్వము ప్రాపించిన సంతతి నష్టమయినది. పితరులు నిరాశులయిరి. బ్రహ్మచర్యచిహ్నలుపోయి యువతిచిహ్నలుద్భవించినవి. అన రాజు విచారించవలదు ఉపాయమాలోచింతునని వారల నూరడించి మహర్షులను రావించి ఉపాయమడుగ శివభక్తుల మహిమలు తత్ఫలితములు మారుప ఇతరులకు శక్యముకాదు, అన రాజు భరద్వాజునిరావించి శంకరాలయమునకేగి మూడురాత్రులు పూజాదులు నిర్వర్తించుచు జాగరముచేసెను. గౌరిని నుతించి సంతోషపెట్టెను. భక్తుడయిన రాజునకు గౌరి సంతసించి దర్శనమిచ్చెను. రాజును కోరికతెలుపుమన సామవంతునకు పుంస్త్వము

ప్రసాదించవేడెను. దేవి తనభక్తుల కృత్యమన్యథా చేయతగదన రాజు ఏకపుత్రవిషయమిది కాన కరుణించ ప్రార్థించెను.

కాని దేవి ఇట్లనెను: నా ప్రసాదమున సామవంతునకు విద్వాంసుడు దీర్ఘాయువు నగు సుతుడు గలుగును. ఈ సామవతిని సుమేధునికిచ్చి వివాహముచేయుడు. ఆమెతో ఆతడు గృహస్థధర్మమవలంబించి కామభోగములనుభవించుగాక అని తెల్పి అంతర్హితురాలాయెను. దేవి ఆజ్ఞ సర్వులు పాలించిరి. సామవతి సుమేధుని పరిణయమయి చిరము సుఖములందెను. అచిరముననే సామవంతునకింకొక తనయుడుదయించి విద్వాంసుడయి తలిదండ్రుల నానందపఱచెను.

# బ్రహ్మ ఖండము

## 3-వ అవాంతరఖండము - బ్రహ్మోత్తరఖండము

## 10-వ అధ్యాయము

శివనిర్మాణం విచిత్రమయినది. శివుచేష్టితము విచిత్రము. శివమహాత్మ్యము చిత్రాతిచిత్రము. శివభక్తుల చరిత్రము విచిత్రాతీతము, స్వర్గాపవర్గసాధనము తెలుపు ఒక గాథ :

అవంతీదేశమున మందరుడను పేరుగల బ్రాహ్మణుడుండెను. విషయలోలుడై స్త్రీలకు వశుడయ్యెను. స్నాన సంధ్యాదులు మానెను. కులటలతో జూదరులతో స్నేహము. పూర్వమజామీళుని వలె, రాత్రింబవళ్లు పింగల అను వేశ్యతో గడుపసాగెను. ఇంద్రియ లోలత నామె గృహమున నేవాసము. ఆ భోగస్త్రీ ఇంటనున్న సమయమున ఋషభుడను శివయోగి ధర్మాత్ముడటురా వీరిరువురు వేశ్యయు ద్విజుడును ఆతనిని పూజించిరి. ఆయనను పీఠమున ఆసీనుని చేసి పాదములు కడిగి ఆ జలములు తమశిరముల చల్లుకొనిరి. గంధ మాల్యాదులర్పించి భోజనమిడిరి. భోజనానంతరము శయ్యనమర్చి తాంబూలమిచ్చిరి. పాదములుపట్ట దొడంగిరి. వారి సేవ అనుమతించి ఒకరాత్రి అయింట గడపి శివయోగి ఉదయము కాగానే తనదారినేగెను. కాలముగడువ ఇరువురును మరణించి కర్మకను గుణమయిన గతినందిరి. విప్రుడు, దశార్ణదేశమున రాజు వజ్రబాహువు రాణి గర్భము నాశ్రయించెను. సపత్నులామె గర్భము ధరించుటకోర్వక రహస్యముగ ఆహారమున గరళముపెట్టిరి. దైవ యోగమున గరళము తినియు ఆమె చావలేదు. మరణముకన్న దుస్సహమయిన బాధకు లోనయినది. కాలముగడువ మాసములు నిండి ఒక కుమారుని కన్నదిరాణి. ఆమె బాధతోపాటు కుమారు

డును అతి దుఃఖమునకుపాలయ్యెను. అంగములంతట ఇరువురికిని వ్రణములయినవి. రాజు వైద్యులచే మందులిప్పించినను వ్రణములు బాగుకాలేదు. రాత్రింబవళ్లు నిదురలేదు. బ్రదికియు మరణించిన వారుగానున్న రాణిని కుమారునిచూచి రాజు ఆలోచనలోపడెను. సహించలేక సూతునిపిలిచి రథమెక్కించి వారిరువురిని దూరమున అరణ్యమున విడిచిరమ్మని వాడటులొనరించియేగెను. ఆకలిబాధ, ఒంటరితనము, సహాయములేదు. మహారణ్యము, కుమారునెత్తుకొని, పడుచులేచుచు, భయపడుచు, ముండ్లచే కాళ్లుపొక్కులెక్కతూలుచు నేడ్చుచుండ దైవవశమున ఒక మార్గమునబడెను. వ్యాపారులు, గోవులు, నరులు పోవుట కనెను కష్టమున కొంతదూరమామార్గమున పోసాగెను. పలువురు స్త్రీ పురుషులు కల ఒక వైశ్య నగరము, చూచెను. ఆ నగర పాలితుడు, రాజరాజువంటివాడు, పద్మాకరుడు అనే వైశ్యపతి, ఆ వైశ్యపతి గృహదాసి యొకతె దూరమునవచ్చు పుత్రునితోడి కాంతను దుఃఖితనుచూచి కొనిపోయి స్వామికి తెల్పెను. ఒకచోటనిలిపి ఆమె వృత్తాంతము తెలిసికొనెను. ఇంటికి దూరముగ రహస్యస్థలముననుంచి మాతృవత్ రక్షించుచు అన్నపానము లేర్పరించెను. వ్రణములు శాంతించలేదు. వైద్యము చేయించినను బాలుడు సుఖముకాలేదు. విధివశమున కొంతకాలమునకు మరణించెను. కుమారుడు చనిపోగా రాజపత్ని మహాదుఃఖమునకులోనయినది. ఆమెనెవరు శాంతింపచేయగలరు!

ఇంతలో పూర్వము తెల్పిన శివయోగి ఋషభుడటకేతెంచెను. యోగిని వైశ్యనాథుడు పూజించెను. ఇంతలో రోదించు కాంతను చేరి ఇట్లనెను — "మూఢత వద్దేదవు. ఈ లోకమున పుట్టేదెవరు, చచ్చేదెవరు, ఈ దేహములు జలబుద్బుదములువంటివి. బుద్ధిమంతుడు క్షణభంగురములయిన దేహములపట్ల చింతించడు, గుణకర్మవశమున జన్మింతురు కర్మకుకట్టువడి భ్రమింతురు. సత్త్వగుణమున దేవత్వము, రజోగుణమున నరజన్మ, తమోగుణమున పశుపక్ష్యాది జన్మ కాంతురు.

జంతువు అవ్యక్తము నుండి జన్మించి అవ్యక్తమందే లీనమగును. మధ్యఉన్నట్లు కన్పించును – నీటి బుడగవలె. దైవవశమునపుట్టును చచ్చును. ఆయువు సుఖము దుఃఖము పుణ్యము పాపము విధాత లలాటమున లిఖించినట్లే జరిగిపోవును. సర్వము నశించేదే. శోకించ తగదు. నీ జన్మలు శతకోట్లు గతించిపోయినవి. నిత్యము సర్వులకు మృత్యువు చేరికగనేయుండును. దేహధారులకు ఏది సుఖమో తెలుపగలవా?'' వ్యాఘ్రము ఎదురుగా నిలువ పశువు గడ్డి తిన గలదా? అటులనే మృత్యువు సదా ఎదురనుండ జంతువులకు సుఖ మేది? మృత్యుంజయుని ఉమాపతిని శరణువేడుము. శివపదాంబు జము దొరికిన క్షణమున జన్మజరాభయమంతరించును. శివపదము లభించిన పునర్జన్మలేదు. శోకమును విడిచి శివుని భజించుము.'' శివయోగి పలుకులు విని పాదములకు నమస్కరించి రాజపత్ని గురుసమునికి - యోగికిట్లనెను - తనయుడు మరణించెను బంధుగులు విడిచిరి. రోగము బలీయము, ఇట్టి నాకు మరణమేగతి, ఈ శిశు వుతో చావనిశ్చయించితిని, చావనున్న నాకు మీ దర్శనలాభము కలిగినది. కృతార్థురాలనయితిని, అన యోగి హృదయముకరిగి పూర్వముచేసిన ఉపకారము స్మరించి చనిపోయినశిశువును సమీపించి భస్మమును శివమంత్రముచే మంత్రించి ఆ శిశువుముఖమునచల్లి ప్రాణము పోసెను. నెమ్మదిగా బాలుడు కనులుతెరచెను. స్తన్యముకాంక్షించి ఏడువసాగెను. బాలునెత్తుకొని హృదయమున కానించుకొన యోగి మరల కొంతభస్మముమంత్రించి తల్లికుమారుల శరీరములపై చల్లెను. రోగము క్షణముశోపోయి దివ్యశరీరములయినవి. దేవతల వలె శరీరములు కాంతియుతములైనవి. యోగిపాదములవ్రాలి రాజపత్ని ముందుగతియేమి అన ఆమెను సుఖస్వరూపిణిగా ఆశీర్వ దించుచు ఈ లోకమున చిరముందువు. ముసలితనమురాదు. ఈతడు విద్యావంతుడగునంతకు ఈ వైశ్యపతియింటనే ఉండుము. అని భస్మ వీర్యమున యోగి వారలకు సుఖములిచ్చి తనదారినేగెను.

# బ్రహ్మ ఖండము

## 3-వ అవాంతరఖండము - బ్రహ్మోత్తరఖండము

## 11-వ అధ్యాయము

వేశ్య పింగల యోగి నుపచరించిన పుణ్యమున మరణించిన అనంతరము కీర్తిమాలిని అను పేరుతో చంద్రాంగదుని కాంత సీమంతినీగర్భమున జన్మించెను. వైశ్యపతియింట భద్రాయువు - రాకుమారుడు పెరుగుచుండెను, ఆ వైశ్యునికి సునయుడను పేరుగల ఉత్తముడొక కుమారుడున్నాడు, రాకుమారునితో మైత్రిపాటించెను. బ్రాహ్మణులచే వణిక్పతి ఇరువురికిని సంస్కారములు కాపించెను. ఉపనీతులయి గురుసేవలోనుండి సర్వవిద్యలునేర్చిరి. రాకుమారునికి పదునారువత్సరములవయమున ఆ యోగి ఋషభుడు మరల అట కేతెంచెను. తల్లి కుమారులు యోగిపాదములకు పదే పదే నమస్కరించుచు పూజించిరి. తల్లి 'గురువర్యా ఈతడు నీ కుమారుడు నీవు ప్రాణదాతవనుచు' యోగిపాదములకు మ్రొక్కించెను. నీ శిష్యుని గ్రహించుమని విన్నవించెను.

యోగి కుమారుని కిట్లుపదేశించెను :— "సన్మార్గమునాచరించుము, గోదేవగురు విప్రులయందు భక్తియుంచుము, చండాలుడతిథిగావచ్చినను గౌరవించి ఆదరించుము, ప్రాణసంకటమయినను సత్యము విడువకుము, గోబ్రాహ్మణ రక్షణకయిన ఒకప్పుడసత్యమాడినను పాపములేదు, ధర్మసంగ్రహముచేయుము, స్నాన జప హోమస్వాధ్యాయములు విడువకుము క్రోధ ద్వేష భయాదులు విడువుము, కౌటిల్యము దంభము చేరరానీయకుము, క్షత్రధర్మమాశ్రయించియు వృథాహింసచేయకుము, శుష్కవైరము, వృథా

లాపము, పరనింద చేయకుము అన్నిటియందు అతివర్జించుము, చపలులను, నాస్తికులను, పతితులను చేరకుము, ద్విజప్రసాదము సంపాదించుము. బ్రహ్మాసంకులము, ఖ్యాతికలది, శివమయమయిన మహాదేశమున వసించుము, శివుని త్రిభువనేశ్వరుని ఆరాధించుము, ఉషఃకాలమునలేచి శుచియయి ఉమాపతిని, లక్ష్మీశునారాయణుని, బ్రహ్మను వినాయకుని స్కందుని కాత్యాయనీదేవిని ఇంద్రాది లోకేశులను ఋషులనుచింతించుము. ఉదయించు సూర్యునికి నమస్కరించుము, శివునకు గంధపుష్ప ఫలాదులర్పించుము, పంచాక్షరీ మంత్రము సేవ్యము, సంక్షేపించి ధర్మసంగ్రహము వత్సా! వివరించితిని.

ఇంకొక రహస్యము తెల్పెదను. జయప్రదము, సర్వాపద్విమోచనము, శివకవచము తెల్పెదను వినుము.

*

# బ్రహ్మ ఖండము

## 3-వ అవాంతరఖండము - బ్రహ్మోత్తరఖండము

## 12-వ అధ్యాయము

కవచఅధ్యాయము - విశ్వవ్యాపికి ఈశ్వరునకు మహాదేవునకు నమస్కరించి శివమయ కవచము తెల్పుచున్నాను. ఆసనము కల్పించుకొని జితేంద్రియుడై శివుని అవ్యయుని హృత్పద్మమున నిల్పి స్వీయతేజమున ఆకాశమంతను నిండించిన అనంతుని ఆద్యుని పరానందమయుని మహేశుని ధ్యానించవలెను. దశదిశలు నాకు ఈశ్వరు అనంత నామములే రక్షగా నిల్పునుగాక. నిలచిన, శయనించిన, నడచిన, ఏస్థితియందయినను శివుడవ్యయుడు నన్ను రక్షించుగాక. మార్గమున నాకు నీలకంఠుడు రక్షకుడు - కవచము ఈ తీరున నడచుచున్నది.

“ఓం నమో భగవతే సదాశివాయ, సకల తత్త్వాత్మకాయ, సకల లోకైక శంకరాయ నిర్మలాయ నిర్గమాయ జయ జయ మృత్యుంజయ, త్ర్యయ బక త్రిపురాంతక విశ్వేశ్వర విశ్వరూప విష భూషణ విశ్వతోముఖ సర్వతో రక్ష రక్షమాం దుఃఖాతురం మా మానంద యానందయ, కవచేన మామాచ్ఛాద యాచ్ఛాదయ, నమస్తే నమస్తేనమః” ఈకవచము సర్వబాధాప్రశమనము. సదాధరించుము. ఎన్నటికిని దేనివలనను భయము కలుగదు. దారిద్ర్యశమనము మాంగల్యవివర్ధనము, పాతక ఉపపాతకములు శాంతించును. శివ కవచధారణఫలముగ దేహాంతమున శివుని చేరుదురు.

యోగి మహారావము శంఖమొకటియు. శత్రుసంహారము ఖడ్గము ఇచ్చెను. మరల భస్మము గ్రహించి ఆతని శరీరమంతయును

ధరింపచేసెను. పన్నెండువేల గజముల బలముకల్గునని ఆశీర్వదించెను. ఈ ఖడ్గము చూచినమాత్రన అరులు నశింతురు, ఈ శంఖనాదము విన్న నీశత్రువులు మూర్ఛమునింగెదరు. శస్త్రములు విడిచి భూమిపై పడెదరు. ఇటుల ఖడ్గ శంఖములు పరసైన్య వినాశకరములు, ఆత్మసైన్యమునకు శౌర్యధైర్యములు వృద్ధిచేయునవి. ఈ బలమున భస్మధారణ కవచధారణబలము, శంఖ ఖడ్గబలము వీనివలన అరులను జయించి రాజ్యము సంపాదించి పాలించగలవు. అని మాతా తనయులచే వైశ్యపాలక కుమారులచే పూజితుడై యోగి యథేచ్ఛచనియెను.

*

# బ్రహ్మఖండము

## 3-వ అవాంతరఖండము - బ్రహ్మోత్తరఖండము

## 13-వ అధ్యాయము

ఈ సమయమునకు దశార్ణాధిపతి వజ్రబాహువునకు మగధ రాజు బలీయమయినశత్రువుగా పరిణమించెను. పేరు హేమరథుడు బలవంతుడు. దశార్ణ దేశముపై దండెత్తెను, ఆతని సేనాపతి దశార్ణ దేశమున రత్నధనరాసులు కొల్లగొట్టి పరగృహములు దహించివైచెను, మాగధుడు సర్వసంపదలు గ్రహించి క్రమముగా నగరము ముట్టడించెను. వజ్రబాహువు యుద్ధమునకై పురమువెల్వడి మాగధుని సైన్యయుతుడై ఎదిరించెను. మహోత్సాహమున పోరాడియు తుదకోడిపోయెను. రాజును బందీకృతునిచేసి మాగధుడు పురప్రవేశముచేసెను, స్త్రీ జనమును బందీకృతులనుచేసెను. స్త్రీలను, గోధనమును, రత్నరాశులను హరించి రాజును రథమున బంధించి వెడలి పోసాగెను. భద్రాయువు బలవంతుడు, రాజపుత్రునకీవార్త విన వచ్చెను. హయారూఢుడై, వైశ్యతనయుడు వెంటరా ఖడ్గశంఖ మాత్రసహాయుడై మాగధులాక్రమించిన తనదేశమునకు క్షణములో ఏతెంచెను. రాగనే రిపుసైన్యమున ప్రవేశించెను. బాణవర్షము అరులపై కురియించెను. శివకవచరక్షితుడుకాన అరిబాణములకు గురికాక శత్రువులనురుమాడసాగెను. మృగకులమున సింహమువలె రణరంగవిహార మొనరించెను. ఖడ్గముఎత్తి విహరించ ఖడ్గధార చూచినమాత్రన అరులు మడియుచుండిరి. శంఖము పూరించి సర్వుల నాశనముకావించెను. శంఖనాదమువిని వారి వారి వాహనములనుండి మూర్ఛపడి నేలవాలి చనిపోయిరి. బద్ధుడయిన తండ్రిని విడిపించెను, అంతఃపురకాంతలను, సవతితల్లుల నెల్లరను విడుదల

చేయించెను మంత్రులు, పురజనులెల్లరు బంధవిమోచనముగాంచిరి. స్త్రీలు, బాలురు, కన్యలు, గోధనము, హరించబడిన వస్తుజాల మంతయు అరులవద్దనుంచి గ్రహించెను. పరాజితుడైన, మాగధుని హేమరథమున బంధించివైచెను. మాగధుని మంత్రి సామంత ముఖ్యులనెల్లరను బందీకృతులనుగావించి పురము ప్రవేశించెను. పలాయితులయిన తనవారెల్లరును తన్నాశ్రయించ నేతెంచిరి.

కుమారుని విక్రమంచూచి సర్వులు ఆశ్చర్యమగ్నమానసులైరి. అకారణముగ తమకు తెలియకవచ్చిన దివ్యునిగాతలంచిరి. ఏకాకియై తొమ్మిది అక్షౌహిణులబలము సంహరించె నీతడు మానవ మాత్రుడుకాడు. యోగసిద్ధుడు కావలయుననుకొనిరి. మంత్రులాతనిచరితము తెలుపుమన నింతలో రాజు దరికిరాగా ఆతని పాదములపై ప్రణమిల్లిర్రాలెను. కుమారునివలె నమస్కరించిన ఆ వీర కుమారుని రాజు ఆలింగన మొనరించుకొని ఆనందించెను, దేవతుడవో, గంధర్వుడవో, మాతాపితలెవ్వరో తెలుపగోర భద్రాయువు తన తండ్రితో నిట్లనెను. "ఈవైశ్యసుతుడు సునయుడు, నా సఖుడు. తల్లితో నే నీతనియింట పెరిగితిని. నాపేరు భద్రాయువు. నా చరితము తర్వాత తెల్పుదును. నీకు భద్రమగును, కాంతలతో మంత్రి జనము పరివారముతో పురప్రవేశమొనరింపుడు. అరులవలని భయములేదు కనుక యథాపూర్వము సుఖముగనుండి రాజ్యపాలన కొనసాగించుడు. నేను తిరిగివచ్చు వరకు ఈ బంధితులను విడువరాదు. ఇప్పటికి నేను నాయింటికేగి త్వరలోవత్తునని అనుమతించి వైశ్యకుమార సఖునితో ఇంటికేగి తల్లికి జరిగినది సర్వము వివరించెను. వైశ్యపతి రాకుమారుని విజయ మభినందించుచు ఆలింగనముచేసికొని పూజించెను. వజ్రబాహువు మంత్రులతో కాంతలతో, తనయులతో నగరు ప్రవేశించి సుఖములందెను. ఆ రేయి శివ యోగి ఋషభుడు చంద్రాంగదుని మేల్కొల్పి భద్రాయుషుని

పుట్టుపూర్వోత్తరములు తెల్పి ఆతని కాంత సీమంతిని తనయ కీర్తి మాలినిని భద్రాయుషునకిచ్చి పరిణయము చేయుమని తెల్పి తన దారినేగెను. సుముహూర్తమునిశ్చయించి భద్రాయుషుని రావించి తనయ కీర్తిమాలిని నిచ్చి వైభవముగ వివాహము నిర్వర్తించెను. ఆతనితండ్రి వజ్రబాహుని నైషధుడు ఆహ్వానించి ఎదురేగి గౌరవ పురస్సరముగ తన మందిరమునకు తెచ్చి వివాహము నిర్వర్తించబడిన భద్రాయువును నవవధువుతో ఆతనికి సమర్పించెను. పాదముల ప్రాలిన కుమారు నాలింగన మొనరించుకొని " ఈతడజ్ఞాతవంశజుడు నాకు ప్రాణదాత. నీకు అల్లుడు. ఈతనిచరిత నాకు తెలిపి నాశ్రుతి పుటముల నమృతము వర్షించుడని దాశార్హుడ." రాజా ఈతడు నీ కుమారుడే శైశవమున రోగపీడితుడు యోగిసంకల్పమున ఇంత వాడాయెను, ఈతనిమాతను, నీకాంత నాదరించి, నగరికేగుము శ్రేయములు చేకూరును." అని నైషధుడు తెల్పి, కాన్కలిచ్చి అల్లుని తనయను ఆతని తలిదండ్రులతో సాగనంపెను. విందులార గించి సపరివారుడై వజ్రబాహుడు కొడుకుతో కోడలితో పురిచేరెను. మాగధుని విడిచిపుచ్చి మైత్రిపాటించి ఆతనిని పురికి పంపివైచెను. ఆసమయమునకు వచ్చిన శివయోగిని పూజించి ప్రసన్నునొనరించు కొని పంపి, నిత్యము శివకవచధ్యానము, శివపూజచేయు ప్రజా పాలన తత్పరత, కాంతతో చిర సుఖములందెను.

*

# బ్రహ్మఖండము

## 3-వ అవాంతరఖండము - బ్రహ్మోత్తరఖండము

## 14-వ అధ్యాయము

వీరుడు భద్రాయువు సింహాసన మధిష్ఠించి రాజ్యపాలన సాగించుచు, ఒకనాడు భార్యతోకూడ రమ్యమైన వనమునకేగెను. అదివసంతము. కాంతతో వనవిహారమున ఆనందించుచుండెను. దూరమున ఒకపులితరుమ పర్విడు ద్విజదంపతులను చూచెను. వ్యాఘ్రము తరుముచున్నది, అది మమ్ము చంపకముందే వచ్చి రక్షించుమని ఆక్రోశించిరి. రాజు బాణమును సంధించి వ్యాఘ్రమును తాడించెను. కాని ఆదెబ్బకు వ్యాధినందక వ్యాఘ్రము ద్విజకాంతను పట్టికొని పోయెను. ద్విజుడు దుఃఖమున మునింగెను. "రాజును నిందించ సాగెను. నీశంఖము, ఖడ్గము, దివ్యాస్త్రములు, నీబలము ఏమయి నవి. శరణార్తుని రక్షించలేకపోయితివి. ఇంతకన్న మరణము నీకు మేలుకాదా! అథధలను, కృపణులను శరణార్థులను రక్షించలేని రాచరికమేల'', అన రాజు విచారించసాగెను. ద్విజుని పాదముల పైపడి "నీకు కావలసినధనమిత్తు ననుగ్రహించి నన్ను మన్నించుము. ఇదిరాజ్యము ఇదినాపత్ని ఇది నాశరీరము ఈసర్వము నీఅధీనము నీకోరిక తెల్పు మిత్తునన రాజా! భార్యలేనివానికి ధనాదులేల నా భార్యను కోల్పోయితిని. నీఅగ్రమహిషిని ఉపభోగమునకై నాకిమ్ము. అన రాజుసమాధానము–"బ్రాహ్మణ! ఇదేటిధర్మము పరదారనుకోరుట అస్వర్గ్యము. సద్గతికి భంగముకాదా? ఏమయినను ఇచ్చినవారుకలరు. కలత్రము నీయదగునా! ఆ పాపమునకు ప్రాయశ్చిత్తమున్నదా" అన ద్విజుని వాక్యము– "పంచమహాపాతకములనయినను తపమొనరించి పోగొట్టవచ్చునన, పరదారాగమన పాపము తపమున పోదా!

అందుచేత నీభార్యను నాకిమ్ము. లేకున్న నరకము పాలగుదువన 'రక్షించలేక పోవడము మహాపాపము. దానికన్న పత్నీదానము మంచిదే. అందుచేత ద్విజునకు పత్నినిచ్చి పాపముపోనాడి అగ్నిలో ప్రవేశింతును. కీర్తి నిల్చును' అని రాజు వెంటనే ప్రజ్వలింపజేసి ఉదక ధారతో బ్రాహ్మణునకు పత్నిని ధారవోసి స్వయంస్నానముచేసి శుచి యయి విభుదేశ్వరునకు ప్రణమిల్లి ఇనుమారు అగ్నికి ప్రదక్షిణముగా వచ్చి శివునిధ్యానించెను. అగ్నిలో పడబోవ విశ్వేశ్వరుడావిర్భవించెను. దివ్యులు పూలవానకురియించిరి, ఆ పూలమధ్య అంబాసహితుడు శంకరుడు కాన్పించెను. శంకరులను రాజు నుతించి ప్రాంజలియయి యుండి "పాహిమాం జగన్నాథ, నిరాభాసుడవు, నిత్యుడవు, భవ భీతిని శాంతింపచేయువాడవు, వేదాంతవేద్యుడవు నీకు నమస్కారము అని నుతించి రక్షవేడెను''. 'నిన్ను పరీక్షించి ప్రసన్నత చూపుటకే ద్విజరూపమునవచ్చితిని. వ్యాఘ్రము పట్టినది గిరిపుత్రి గౌరి. వ్యాఘ్రము మాయామయము కాన శరపాతమునకు లొంగలేదు. నీవు కోరినవరమిత్తు తెల్పు' మన నీదర్శనముకన్న కావలసినవరమన్య మేదికలదు మహాదేవా! నన్ను నాభార్యను నా తలిదండ్రులను వైశ్యపతిని ఆతని కుమారుడు సునయుని సదా నీపార్శ్వవర్తులుగా నొనరించుము. ఇదియేమహద్భాగ్యమనెను.

రాజపత్ని కీర్తిమాలిని ఇట్లనెను : "నా తలిదండ్రులు చంద్రాంగద సీమంతినులు నీ ఆంతరంగిక భక్తులయి నీ పార్శ్వ వర్తులుకావరమీయు" మని ప్రార్థించెను. కోరిన వరములిచ్చి శంకరులు పార్వతీసహితుడై అంతర్హితుండయ్యెను. పదివేలు సంవత్సరములు రాజు రాజ్యముచేసి రాజ్యము పుత్రుని యధీనమొనర్చి పశుపతి పదమందెను. వరప్రసాదమున పత్నియు తలిదండ్రులు అత్తమామలు, వైశ్యపతి ఆతని తనయుడు శివపార్శ్వవర్తులయి శాశ్వతత్వమునందిరి.

*

# బ్రహ్మ ఖండము

## 3-వ అవాంతరఖండము - బ్రహ్మోత్తరఖండము

## 15-వ అధ్యాయము

ఇంకొక శివయోగి ప్రభావము తెలుపు ఇంకొక చరిత:

వామదేవుడను శివయోగికలడు. నిస్సంగుడు, సమదర్శనుడు, పరిగ్రహముచేయనివాడు, ద్వంద్వాతీతుడు, గృహదార వర్జితుడు—లోకానుగ్రహమునకే సంచరించువాడు—మహాఘోరమయిన క్రౌంచారణ్యము ప్రవేశించెను. ఆ నిర్మానుష్యమయిన అరణ్యమున బ్రహ్మరాక్షసుడొకడుండెను. ఆకలిగొనియున్నవాడు యోగిని చూచి చంపితిన పర్విడెను. నోరుతెరచికొని భయంకరుడై వచ్చు వానినిచూచి యోగిచలించలేదు. ఆతడు రెండుచేతులతో శివయోగినిపట్టి పీడించతలంచెను. యోగి అంగస్పర్శమాత్రమున పాపములు ధ్వంసమయి ఆతనికి పూర్వజన్మ వాసనకలిగినది. దుఃఖితుడాయెను. చింతామణి స్పర్శకు లోహము బంగారమయినటుల, జంబూనదిలోపడి మృత్తిక స్వర్ణతనందినట్లు, కాకి మానసముచేరి హంస అయినటుల, నరుడు అమృతముత్రాగి దివ్యత్వముపొందినట్లు యోగిసంగమున గత పాపుడై ఆకలిపోయి తృప్తుడాయెను యోగి ప్రశ్నించ తనకథ ఇటుల తెలుపసాగెను. "యోగీంద్రా నేను మహాపాపినయ్యు మీ అంగస్పర్శవలన పుణ్యమతికలవాడనయితిని. గత జన్మలో దుర్జయుడను పేరుగలయవనదేశపురాజును. కామమునకు లోనయి నాదేశములోను ఇతరత్ర చిక్కినదేశములలోనుగల స్త్రీలను అన్నిజాతులవారిని నా భృత్యులద్వారా రావించుకొని దినమొకకాంతగా భోగించితిని. ఇట్లయినను నా కామమునకు తృప్తి కాలేదు. క్రమముగా వయసుమళ్లి రాజయక్ష్మకు — క్షయరోగ

మునకు గురి అయితిని. మరణించి నరకమనుభవించి నానా యోనులపుట్టిలో 25వ జన్మ ఈ బ్రహ్మారాక్షసుడనయి ఈ నిర్జనారణ్యమున తుత్తునకు లోనయియుంటిని. మీ అంగస్పర్శవలన పూర్వ స్మృతికలిగి పాపమతి తొలగిపోయినది, రక్షించు" మన వామదేవుని సమాధానము. ఇది తపశ్శక్తికల నాదేహజ భస్మమహిమ. మహాదేవుని మహిమలకువలెనే భస్మ మహిమ తెలుపశక్యముకాదు. పూర్వమొక బ్రాహ్మణుడు ద్రవిడదేశస్థుడు, ధర్మముపొంత పోనివాడు, మూఢుడు, కర్మవలన శూద్రుడుగా సంచరించసాగెను. దొంగతనము, శూద్రస్త్రీరతి. జారిణినికలియపో నొకనాడు శూద్రునిచేతిలో మృతిచెందెను. ఆ మృతకళేబరమును స్మశానమునపారవైవ శ్వానములా శరీరముమీద నడయాడినవి. యమదూతలురాగా వారిని కాదని విమానమున శివకింకరులాతనిని శివలోకమునకు కొనియేగిరి. యమదూతలాశ్చర్యపడి ఆతడొనర్చిన పుణ్యమేమని ప్రశ్నించ శివదూతల సమాధానము: చూడరా! ఈతని శరీరము, నీ లలాటము, నీ చర్మాలము, వక్షము - భస్మచిహ్నములుచూడరా! శివశాసనమున మేమువచ్చితిమనుచు శివునంతికమున కాబ్రాహ్మణుని కొనిపోయిరి. బ్రహ్మారాక్షసుడాశ్చార్యపడి తన్నురక్షించ ప్రార్థించెను. తనపురాకృతము పుణ్యలేశమున ఆ మహాత్ముని దర్శన స్పర్శనములయినవని తెల్పెను. ఇంకను భస్మమహాత్మ్యము శివయోగి వామదేవుడు బ్రహ్మారాక్షసునకు తెలుపసాగెను.

*

# బ్రహ్మ ఖండము

## 3-వ అవాంతరఖండము - బ్రహ్మోత్తరఖండము

## 16 వ అధ్యాయము

ఒకానొక కాలమున మందరగిరియందు కాలాగ్నిరుద్రుడు శతకోట్లరుద్రులు పరివేష్ఠించియున్న సమయమున, దేవతలతో ఇంద్రుడాయన దర్శనమునకై వచ్చెను. ఋషులు అప్సరసలుకూడ ఏతెంచిరి. నందివీరభద్రాదిరుద్రపార్షదులు రుద్రగణములు మహాకాలుని పరివేష్ఠించియుండిరి. సనత్కుమారుడు మహేశ్వరునొక ప్రశ్న వేసెను: "భగవన్ - ధర్మములనంతములు, ప్రయాసపడి అభ్యసించినగాని ముక్తినీయవు. లోకులకింత నిశ్చలతయుండదు. లోక కల్యాణమునుకోరి భుక్తి ముక్తి ప్రదము, సులభసాధ్యమయిన సాధనము తెలుపుడని" వేడుకొన మహాకాలుని సమాధానము 'త్రిపుండ్ర ధారణము సులభముగ భుక్తి ముక్తుల ప్రసాదించును. గోమయదగ్ధ మయిన భస్మము ప్రశస్తము. సంప్రదాయమయిన భస్మధారణ విధానమిట కాలరుద్రులు సనత్కుమారునకు లోకహితమునకే వివరించిరి. భస్మధారణము అవిధిగానయిననుధరించినను సర్వపాప ప్రశమనముకాగలదు పాపములనంతములు, వివరించపనిలేదు. ఎట్టి పాప సంఘాతమునయినను భస్మధారణనాశము చేయగలదు. త్రిపుండ్ర ధారణమే సర్వోపనిషత్సార సంగ్రహము. ఇట్లు వివరించి శివయోగి వామదేవుడు భస్మము అభిమంత్రించి బ్రహ్మరక్షసునకీయ నాతడు ధరించి వెంటనే దివ్యపురుషుడై గురునకు ప్రదక్షిణనమస్కారము లాచరించి, విమానమురానధిరోహించి పుణ్యలోకములకేగెను.

*

# బ్రహ్మ ఖండము

## 3-వ అవాంతరఖండము - బ్రహ్మోత్తరఖండము

## 17 వ అధ్యాయము

వేదవేదాంగవిదులు బ్రహ్మవాదులయిన గురువులచే ఉపదేశమునందిన నరులకు సద్యః సిద్ధిలభించును. మూర్ఖుడయినను గురుభక్తి కలిగి గురుపూజచేసిన సిద్ధులు పొందును. శ్రద్ధతో చేసినపూజ, దానము, అనంత ఫలములందించును. అశ్రద్ధగాచేసినది నిష్ఫలము. మంత్రము, తీర్థము, ద్విజులు,దైవము, దైవజ్ఞుడు, వైద్యుడు గురువు - వీరిపట్ల నరునకు ఎటువంటి భావనకల్గునో సిద్ధియు తదనురూపముగనుండును. విశ్వము భావమయము. భావవిలసనమునే పుణ్యము, పాపము. విశ్వాసయుతమయిన భావనిశ్చలతలేక ఏదియును ఫలించదు. ఇందులకొకగాథ—పాంచాలరాజునకు సింహకేతుడను పుత్రుడు, గుణవంతుడు, క్షత్రధర్మనిరతుడుకలడు. ఆతడొకనాడు కొంతపరివార మనుగమించ వేటకేగెను. ఆ భృత్యులలో ఒక శబరుడు జీర్ణాలయమొకదానిని చూచెను. పీఠమున అక్షతలున్నవి. సూక్ష్మమయిన శివలింగమున్నది. వెంటనే ఆ సంగతి రాజపుత్రునకు నివేదించెను. "ప్రభూ! నాచే ఈ లింగము చూడబడినది. ఆదరమున యథావిభవముగ దీనిని పూజింతును. ఈ పూజావిధానము తెలుపుడని" రాకుమారుని వేడుకొనెను. పూర్వపుణ్యమున ఆ శబరునకట్టి భక్తి జనించినది. సాధారణమయిన శివపూజావిధానము రాకుమారుడు శబరునకు తెల్పెను. ఆ విధులలో చితాభస్మోపహారము మంచిదని హాస్యమునకై తెల్పెను.

చండకుడను శబరుడు రాకుమారుని పల్కులు శాసనముగా గ్రహించెను. వాడింటికేగి లింగమూర్తి మహేశ్వరునకు నిత్యము

చితాభస్మము ఉపహారము కల్పించినదే నివేదించుచు పత్నితోకూడి శ్రద్ధగా పూజ సలుపసాగెను. సుఖముగ కొన్ని సంవత్సరములు గడచిపోయినవి. ఒకనాడు పూజలోనుండి ఉపహారమునకై చితాభస్మమునింపిన పాత్రచూడ ఒకరేణువుకూడ అందు లేకపోయినది. పత్నిని పిలిచి "చితాభస్మముదొరకలేదు. ఏమిచేయుదును. పూజ కంతరాయము కలిగినది. పూజచేయకయ నేను క్షణము జీవించలేను. ఇందుకుపాయము కన్పించదు. గురుశాసనము. ధిక్కరించినట్లయి సర్వనాశనమగును." అనిన పత్ని అనుచున్నది. 'చిరకాలమునుండి రక్షించుచున్న ఈ గృహము కాల్చివైచి అందు నేను దగ్ధమగుదును. ఆ భస్మము గ్రహించిపూజ నిర్వర్తించు" డనెను. శబరుని సమాధానము "ధర్మార్థకామమోక్షములకు దేహము పరమ సాధనము. నవయౌవనవతివి. సుఖమునకయిన దేహము నెటుల త్యజింతువు. ఇంతకు మనకు సంతానములేదు. భోగయోగ్యమయిన దేహము నెటుల దగ్ధము కావించుకొనెదవు" శబరిసమాధానము—పరార్థమునకు దేహత్యాగము శ్రేయోదాయకము. అదిశివార్థమయినచో ఆ పుణ్యఫలమింతయని తెలుపగలమా! నేనెట్టి తపముచేసితినో, ఎట్టి దానము లిచ్చితినో. పూర్వజన్మ శంకరు నెంతగా పూజించితినో, నా తలిదండ్రు లెంతటి పుణ్యాత్ములో, ఈ కళేబరము శివునికొరకు కాల్చివేయనబ్బినది" అన శబరుడంగీకరించిన, ఆమె స్నానముచేసి శుచిఅయి, గృహమునకు నిప్పుఅంటించి మండే అగ్నికి ప్రదక్షిణ మొనరించి గురునకు నమస్కరించి, హృదయమున సదాశివుని ధ్యానించి అగ్నిలోపడబోవుచు అంజలిఘటించి ఇట్లనెను. "దేవా నా ఇంద్రియములు పుష్పములగుగాక, ఈశరీరమే ధూపము, హృదయమే దీపము, ప్రాణము హవిస్సు, ఇంద్రియము లక్షతలుగా పూజాఫలమునాకిమ్ము. నాకు కోరికలు ధనాదులు స్వర్గముకాదు. జన్మయున్న నీపాదకమలములకు తుమ్మెదనగుదునుగాక" అనుచు

అగ్నిలోపడి క్షణములో భస్మమాయెను. శబరుడు యత్నమున భస్మపోగుచేసి దగ్ధగృహోపాంతమున సమాహిత చిత్తమున పూజ పూర్తిచేసెను. పూజాంతమున ప్రసాదము స్వీకరించుటకు నిత్యము వచ్చేకాంతను స్మరించెను. ప్రాంజలియయి వినయమునవచ్చు కాంత స్మృతికి దగుల కనులు మూతబడ యథాపూర్వము అంజలిఘటించి చెక్కుచెదరక మందహాసముతో, నమ్రశిరస్కయయితన ప్రక్కకాంత నిలచుట కనెను. గృహము యథాపూర్వమ ప్రకాశించినది. శబరునిప్రశ్న. ఇది కలయా నిక్కువమా అన శబరిసమాధానము "అగ్నిలోపడుటయే తెలియదునాకు. ఏదియును కన్పించలేదు అగ్ని, గృహము నాదృశ్యమునలేదు నాకు వేడిసోకలేదు. క్షణములో తెలివందినట్లయి ఈదృశ్యమేకంటిని. దేవపూజాంతమున ప్రసాదము స్వీకరించవచ్చితిని". ఇట్లు దంపతులు ప్రసంగించుకొనుచుండ దివ్య విమానమువచ్చినది. శతచంద్రతేజులు ఆ విమానమున నలువురు శివ భక్తులున్నారు. వారు నిషాదదంపతులను హస్తావలంబనమిచ్చి విమానమధిరోహింపచేసిరి. శివదూతల కరస్పర్శవలన వారిదేహ ములు దివ్యములయి ప్రకాశించినవి. అందువలన పుణ్యకర్మల విషయమున శ్రద్ధ అతి ముఖ్యమయినది —

*

# బ్రహ్మ ఖండము

## 3-వ అవాంతరఖండము - బ్రహ్మోత్తరఖండము

## 18-వ అధ్యాయము

సర్వధర్మములలో ఉత్తమమయినది ఉమామహేశ్వర వ్రతము కలదు - తెల్పెదను వినుడని సూతుడు తెలుపసాగెను:

అనర్తదేశమున వేదరథుడను బ్రాహ్మణుడు కలడు. కళత్ర పుత్రసంపన్నుడు. సత్కులసంజాతుడు. ఆతనికి శారద అనే కన్యకలదు. 12 సంవత్సరముల ఆ బాలను, పద్మనాభుడను వృద్ధుడు ద్విజుడు, భార్య చనిపోగా, యాచించ, రాజభయమున తండ్రి ఇచ్చివేసెను. మధ్యాహ్నము వివాహము జరిపించిరి. మామగారింటనే యుండి సంధ్యాసమయమున సరస్తీరమున సంధ్యావందనమునకా అల్లుడేగెను. సంధ్యపూర్తియై తిరిగి వచ్చుటలో ఇంచుక చీకటిపడెను, దారిలో ఒకపాము ఆతనిని కఱువ మృతిచెందెను, కర్మగతిఇది. కన్య బంధుగులువచ్చి ఆశ్వాసించియేగిరి. వైధవ్యము ప్రాపించి శారద తండ్రిఇంటనేయుండెను. కొన్నినెలలు గడచినవి.

ఒకనాడు అతివృద్ధ నైధ్రువను ముని - అంధుడు - శిష్యుని కరము ఆలంబనముగా ఆ ద్విజునింటికేతెంచెను, వచ్చిన బంధుగులేగిరి. బాలఇంటనుండెను, ఆ వృద్ధునికి ఆసనమిచ్చి నమస్కరించి ఏమికావలయునని ప్రశ్నించెను, కాళ్లుకడిగి వింజామరవీచి అలసిన మునికి సేవచేసెను. స్వయమాతనికభ్యంగనము చేయించి, దేవార్చనమునకమరించ ఆతడు పూజపూర్తిచేసికొనెను, భోజనము కల్పించెను. ఆరగించి మునితృప్తుడాయెను. ఇట్లాశీర్వదించెను,

భర్తతో సుఖముండి సర్వగుణోపేతుడైన సుతునికనుమని దీవించెను. దేవతాప్రసాదమునకు యోగ్యురాలవయి కీర్తికాంతువనెను.

బాల ఆశ్చర్యపడి ఇట్లనెను: "బ్రహ్మన్ – మీవచనము అసత్యముకాదు. నేను మందభాగ్యను, నాపట్ల మీ ఆశీస్సు ఎట్లు ఫలించగలదు? బ్రహ్మవిదులయిన మీ ఆశీస్సు బండరాతిమీద వర్షించినట్లు, శునకమునకు సత్క్రియలుచేసిన నిష్ఫలమయినట్లు, నేను అభాగ్యను, నాకుఫలించదుకదా! దుష్కర్మఫలభాగినినేను విధవను తమ ఆశీర్వచనమునకెట్లు పాత్రురాల నగుదు" ననెను. ముని 'అంధుడను నిన్ను చూడక నేనన్న దానిని సాధింతును. నేను చెప్పినట్లు నడచుకొనుము. ఉమామహేశ్వర వ్రతము నీకుపదేశింతును. ఆవ్రతమాచరించుము, అన "దుశ్చరమయినదయినను చేతునుపదేశించుడని శారద అన ముని వివరించుచున్నాడు – "చైత్రమునగాని, మార్గశీర్షమునగాని గురునునుజ్ఞచే శుక్లపక్షము అష్టమిగాని చతుర్దశిగాని, ఉభయపర్వముల నేదేనొకనాడు సంకల్పించి ప్రాతఃస్నానముచేసి దేవతామందిరముముందు పద్మము రచించి కలశముంచి శివు ప్రతిమయుంచి యథావిధి పూజించుము. హృత్పద్మమున జగన్మాతాపితలను ధ్యానించి అభిలాష తెలుపుము. సాయంత్రం పూజ నిర్వర్తించి క్షీరముతో హవిస్సును భుజించవలెను. ఈ విధముగ సంవత్సరము జరుపవలెను. సంవత్సరాంతమున యథాశక్తి బ్రాహ్మణభోజనమిడి దక్షిణలిచ్చి సత్కరించవలెను." ఈలోగా తలిదండ్రులు అన్నదమ్ములు వచ్చిరి. మునికి వారెల్లరు నమస్కరించి గౌరవించిరి. మునివలన జరిగినదెల్ల విని వారు వ్రతము సమాప్తియగునంతకు ఆ వృద్ధునే గురువుగా వరించి తమ గృహముననేయుండ ప్రార్థించిరి. వారి ప్రార్థన నంగీకరించి శిష్యునితో అంధ ముని వారింటనేయుండెను. శారద ఆ ముని ఉపదేశించినమార్గమున పూజ కొనసాగించెను.

*

# బ్రహ్మఖండము

## 3-వ అవాంతరఖండము - బ్రహ్మోత్తరఖండము

## 19-వ అధ్యాయము

గురువచనానుసారము శారద, పతివియోగత ప్తయయ్యు, నియమముగ వ్రతము సంవత్సరము జరుపుకొనెను. సంవత్సరాంతమున వ్రత సమాప్తికాగా వ్రతోద్యాపనముచేసెను. ఆరోజు ఉపవసించి మంత్ర జపము చేసికొనెను. ప్రదోషసమయమురాగా శంకరునిపూజించెను. రాత్రి జాగరము చేయుచు శివాంతికమున గడపెను. ఆమెతోపాటు గురువు జపధ్యానము లొనరించి శివునానందపఱచెను. జగదేకమాత భవాని ముని జపచర్యకు శారద నియమ వ్రతపూర్తికి సంతసించి దర్శనమిచ్చెను. ఆమె ఆవిర్భవించ ఆ క్షణమున వృద్ధమునికి కనులుచూడ నాయెను. మునియు శారదయు ఆ జగదంబిక పాదముల వ్రాలిరి. శివాని తాను వారలకు సంతసించితిననియు కోరిక తెలుపుడనెను. ముని జగదంబకు "ఈ కన్య గతభర్తృక అని తెలియక శుభాశీస్సులనిచ్చితిని. చిరము భర్తతోనుండి సుతులను కనుమని ఆశీర్వదించితిని —— అని తెల్ప దేవివాక్యము — ఈమె పూర్వజన్మలో ద్రావిడదేశమున ఒక ద్విజునకు రెండవభార్య. తనరూపవిలాసాదులచే పతిని ఆకర్షించి తనతోనే విహరించునట్లుచేసి, జ్యేష్ఠపత్నికి ఆశాభంగము కలిగించెను. ఆమెపతివ్రత. సంతానములేదు. భర్త తన్ను చూడడు. ఈ దుఃఖముచే కాలమురా మరణించెను. ఈమె గృహ సమీపమున ఒకయువకుడు ద్విజుడాసుందరిని ఈమెనుచూచి కామించి ఆతురుడై దరిచేరి కరముపట్ట కోపించి పొమ్మనెను. ఈమెనే రాత్రిం దివములు స్మరించుచు ఆ ద్విజకుమారుడు మృతిచెందెను. జ్యేష్ఠపత్నికి, పతివ్రతకపకృతిచేసి ఈజన్మలో భర్తనుకోల్పోయి విధవ ఆయెను. ఏ

స్త్రీ లోకమున భార్యాభర్తలకు వియోగము కల్పించునో ఆమె 21 జన్మలు కౌమారవైధవ్యమనుభవించును. పూర్వము ఈమె కరము గ్రహించి మరణించిన యువకుడు ఇపుడు పాండ్యదేశమున ద్విజుడై జన్మించి వివాహితుడయి సతీ సుతులతో సుఖముగనుండియు పూర్వ స్మృతివదలక స్వప్నమున నిత్యము ఈమెతో రతి ప్రసంగము చేయుచుండెను. ఆ కారణమున ఈమెకు సుతుడుదయించి నీ ఆశీర్వచన మున విద్యావంతుడు గుణవంతుడునగును అని దేవి అంతర్హితురాల య్యెను. ముని శారదతండ్రికి దేవివరము రహస్యముగ తెల్పి శారదచే పూజలంది శిష్యునితో తన దారినేగెను. భర్తసంగానుభావము స్వప్న మున నగుచు శారద గర్భవతి యాయెను. కాని లోకము జారిణి అని ఆమెను నిందించిరి. ఆ లోకవార్తవిని ఆమె బంధుగులు వారింటికేతెం చిరి. కులమునకు కళంకమాపాదించితివని ఆమెను బాధించిరి. కొందరు ముక్కు-చెవులుకోసి వెంట్రుకలుతీయించి వెడలద్రోయుమనిరి. ఇంతలో వారలందరకు ఆకాశవాణి ఇటులవిన్పించెను. - "ఈమె ఏ పాపమును చేయలేదు. వ్రతమహిమవలన పూర్వభవ పుణ్యమున ఇట్లు సంతాన వతి అయినది. నేటినుండి ఈమెను జారిణి అని దూషించిన ఆ మూఢుని జిహ్వా తక్షణమే చీలిపోవును." ఆ మాటలువిని సర్వులు ఆనందించిరి. తల్లి దండ్రులు దేవిని నుతించిరి. అందులో ఒకడు ఈమాటలెవరు నమ్మెదరన తక్షణమే వాని జిహ్వాచీలిపోయి రక్తముక్రక్కుకొనెను. అదికని దైవవాక్యము విశ్వసించి గ్రామవృద్ధులామెను పూజించి శ్లా ఘించిరి. ఒకవృద్ధుడు 'జ్ఞాని' "సంశయముతోపనిలేదు. ఈశ్వరమాయ వలన ఏదికాదు? యూపకేతుడనురాజర్షి శుక్రము జలములోపడిన దానిని ఒకవేశ్య ఆశుక్రముతోడి జలముత్రాగి గర్భిణిఆయెను. విభాండక మునిశుక్రము త్రాగి లేడిగర్భముధరించి ఋష్యశృంగునికన్నది. సత్యవతి మత్స్యగర్భమున పుట్టినది. మహిషిగర్భమున మహిషాసురుడుపుట్టెను. కారుణ్యమున గర్భము ధరించినస్త్రీలు పెక్కురుగలరు. దేవతల

మహర్షులకరుణ అయుక్తములు యుక్తములగును. ఈమెయు ఋషి సేవనమున, వ్రతమహిమచే గర్భము ధరించనోపునని సంశయము వారించెను. సకాలమున శారద ప్రసవించి తనయుని బాలార్కతేజుని కాంచెను. బాల్యముననే విద్యలార్జించి మహాపండితుడాయెను. పది సంవత్సరములు వయసులోనే వేదవేదాంగపారగుడాయెను. శివ పర్వమురా ప్రజలు సర్వులు గోకర్ణమునకు పయనించ శారదయు తనయునితో గోకర్ణమునకుపోయెను. సదాస్వప్నమున తాను కని భోగించుయువకుడట కన్పించెను. అతనినిచూచి పులకలుదయించి ప్రేమపూరితనయనములచే నాతనినే చూడసాగెను. అతడును స్వప్నమున నిత్యము రతిసౌఖ్యములతేలించు ఆకాంతను తన ఎదుటకని, ఆ కుమారునికూడ స్వప్నముననే చూచుటచేత, ఆమెను సమీపించెను. "భద్రే నామనసునయున్నది ఒక ప్రశ్న నిన్నడిగెదను." అనుచురహస్య స్థానమునకు కొనిపోయి నీవెవతెవు. ఎవని భార్యవు. ఏదేశము తండ్రిఎవరు? నీపేరేమి అన ఆమె తన చరిత అనుపూర్వికము తెల్పెను. బాల్యవైధవ్యకారణముచెప్పెను, ఈతనయుడెట్లను ప్రశ్నకు తనకుమారుడే అని దేవివరము గురునుపదేశమున వ్రతమాచరించి తత్ఫలము అని తెల్పెను. కాని నిజముతెల్పుము. ఈ తనయుని జన్మకుకారణమన లజ్జించి అధోముఖియయి నీకును నాకు తెలియును. ఇట్లు ప్రశ్నించ తగదనెను. తండ్రికి తెల్పి ఆ ద్విజుడు కాంతను తనయుని తనఇంటికి ఆదరముతో కొనిపోయెను. కొంతకాలమటనుండి ఆ ప్రియుడు కాల గతినంద అగ్నిప్రవేశముచేసి ఆతనిననుగమించెను. శివదూతలువచ్చి వారిని విమానమున శివుమందిరమునకు కొనిపోయిరి.

*

# బ్రహ్మ ఖండము

## 3-వ అవాంతరఖండము - బ్రహ్మోత్తరఖండము

## 20-వ అధ్యాయము

రుద్రాక్షమాహాత్మ్యము -

వేయిరుద్రాక్షలు మాలగాధరించిన ఆతనికి దేవతలు నమస్కరింతురు. సాక్షాత్తు ఆతడు రుద్రుడే అని వారిభావన. చేతులకు రెండింటికి పదునారుచొప్పున వలయములుగా ధరించనగును. శిఖలో ఒక రుద్రాక్ష-కరములకు పన్నెండేసి అయినను మంచిదే. కంఠమాల ముప్పదిరెండు. శిరమున నలుబది. కర్ణశష్కులిగా ఆరేసిమాల నూటయెనిమిది ముత్యాలు పగడాలు. వీనితోకలిసినమాల ఉత్తమము, యథాలాభముగ రుద్రాక్ష ధారణమున ఆతనిని పాపములంటవు. రుద్రాక్ష శిరముననున్న గంగాస్నానఫలమందెదరు. రుద్రాక్షను పూజలోఉంచి పూజించిన అభిషేకఫలమలవడును. రుద్రాక్షలు ఏకముఖి, పంచముఖి, ఏకాదశ, చతుర్దశముఖములుండును. రుద్రాక్ష పూజ సంపత్కరము. పాపక్షయకరమయిన ఒక ఇతిహాసము వినుడు. కాశ్మీరదేశపురాజు భద్రసేనుడు. ఆతని తనయుడు శూరుడు సుధర్ముడనిపేరు. ఆతని మంత్రికొడుకు తారకుడు. ఇరువురును మిత్రులు. ఆ బాల్యము కలసి విద్యనభ్యసించుచు కలసి క్రీడాసక్తులయిరి. వారిరువురు సదా తమ అంగముల రుద్రాక్షలు ధరించుచుండిరి. సదాభస్మము ధరించుచుండిరి. సాక్షాద్బ్రహ్మయోాయన ఒకమారా కాశ్మీరరాజు గృహమునకు పరాశరమునీంద్రులేతెంచిరి. సపర్యలందించి ఆసనమిడి రాజు మునీంద్రునిట్లు ప్రశ్నించెను. "మునీంద్రా ఈ నాతనయుడును మంత్రి తనయుడును రుద్రాక్షలేధరించి రత్నాభరణములు వలదనిరి.

మేమెంతచెప్పినను వీరు వినుటలేదు. సంపన్నులము రుద్రాక్షలు విభూతి వలదన్న మానుటలేదు. రత్నభూషణాలు చందనము తిరస్కరించిరి. వీరికీ స్వభావము ఎందులకలవడినదో తెలుపప్రార్థన" అన పరాశరుని సమాధానము.

వీరి పూర్వగాథవినుము, నందిగ్రామమున మహానందఅనే వారవనిత, శృంగారవతికలదు. ఇంద్రవైభవమును మించినభోగములామెయనుభవించెను. కామవిహారిణిఅయ్యు ఆవేశ్య సత్యధర్మములాశ్రయించి నిత్యము శివపూజచేసెడిది. శివనామమన్నా, శివభక్తులన్నా శివకథలన్నా భక్తిప్రీతిమెండు. వినోదమునకు ఒకకోతిని ఒకకోడిని రుద్రాక్షలలంకరించి చేతులు చఱచుచు నాట్యముచేయించి వినోదించెడిది. ఇట్లుండ ఆవేశ్య ఇంటికి శివవ్రతుడు ఒక వైశ్యుడేతెంచెను. భస్మరుద్రాక్షతోపాటు ఒక అమూల్యమయిన రత్నకంకణము చేతినలంకరించుకొనెను. ఆకంకణముచూచి వేశ్య తన మనసదిహరించినదనెను. వైశ్యుడు ఆమెతో కంకణము కావలయునన్న వెలయిచ్చి కైకొనుమనెను. వేశ్య తనవృత్తి వ్యభిచారమని, తననియమము ప్రకారము కంకణమిచ్చిన మూడురాత్రులతనికి పత్నిగా నుందుననెను. వైశ్యుడందుల కంగీకరించెను. సహధర్మము చరింతునని ఆతని హృదయము స్పృశించెను. వెంటనే రత్నకంకణమిచ్చి, రత్నమయలింగ మొకటి ఆమెహస్తముననుంచి ఇట్లనెను. ఇది నాప్రాణపదము దీనినిరక్షించుము అది పోయిన నాకు మరణము అగును. కానిమ్మని రత్నమయలింగమునుకూడ గ్రహించెను. ఈ వ్యవహారమునకు సూర్యచంద్రులే సాక్షులనుకొనిరి. లింగమును నాట్యమండపమున స్తంభముమీద నుంచెను. రాత్రి విటధర్మమున ఆతనితో గడపెను. సుఖముగా శయ్యనాతనితో నిదురించెను. నిశాసమయమున నాట్యమండపమున అగ్ని బయలుదేరి అవరించినది. తొందరగాలేచి బంధమువిడిచి మర్కటమును పోవిడిచెను.

కుక్కుటమును విడిచెను. అగ్నికణములు పారజిమ్ముచు మర్కట కుక్కుటములు దూరముగా పారిపోయినవి. స్తంభముతోపాటు లింగము కాలిపోయి ముక్కలుగా నాయెను. లింగము వికలముకాగా తాను మరణించ వైశ్యుడు నిశ్చయించెను. శివలింగముపగుల తాను జీవించతలంచుటలేదనెను. చితి భృత్యులచే పేర్పించుమనెను. శివుని యందు మనసుంచి అగ్నికాహుతి కావలయుననెను భృత్యులచే నగరమునకు బాహ్యప్రదేశమున చితి పేర్పించెను. మండుచున్న అగ్నిలో వైశ్యుడు శివధ్యానముచేయుచు ప్రదక్షిణముచేసి పడి పోయెను. వేశ్యదుఃఖించి బంధుగులనురావించి తన వాగ్దానము నిలుప పత్నీ భావమున ఆతనితో సహగమించ అగ్నిలో పడెదనని తెల్పెను. సహధర్మచారిణిగా త్రిరాత్రముందునంటిని. నాపాపమున లింగము మొదటిరాత్రియే ఇట్లయినది. సత్యముననే ధర్మమునిల్చును. అని సర్వస్వము శివభక్తులకు దానముచేసి ముమ్మారు అగ్నికి ప్రదక్షిణము చేసి శివుని ధ్యానించుచు అందులోపడబోవ, విశ్వాత్మశంకరులు దర్శన మిచ్చి ఆమెను వారించిరి. త్రిలోచనుని చంద్రకలావతంసుని చూచి స్తబ్ధురాలు భీతితో నిలచెను. వణకిపోవుచున్నది. ఆమెను కరములబట్టి శంకరులిట్లనిరి—నీభక్తి పరీక్షించుటకేనేను వైశ్యరూపమునవచ్చితిని. నీధైర్యము, నిశ్చల భక్తికి సత్యవ్రతమునకు సంతసించితిని. అగ్నినేనే కల్పించితిని. ఏమియును దగ్ధముకాలేదు. భ్రమకల్పించితిని. నీకు దివ్యులకు దుర్లభమయిన భోగములు కల్పించి దీర్ఘాయువు సంతతి ఇచ్చితిని. ఇంకేమికావలయునో తెల్పుమిత్తునన "నాకు భోగముల యందిచ్ఛలేదు. ఏలోకముల భోగములు పనిలేదు. నీపాదస్పర్శవినా ఏమియునువలదు. వీరెల్లరు నాభృత్యులు, బంధుగులు, నా ఆనతి నీసేవలోనుండిరి. పునర్జన్మలేకుండ నాతోపాటు వీరెల్లరకు నీపద మిమ్ము' అనికోరెను. శంకరులట్లే వరమిచ్చియేగిరి, ఆమెతో వారినెల్లరను పరంపదముచేర్చెను.

పరాశరులు తెల్పుచున్నారు. రాజా! వింటివికదా ఇతిహాసము. వేశ్యపరివారము బంధుజనము శివ పదముచేరిరి. దూరముగ పారిపోయిన మర్కట కుక్కుటములు నీ కుమారుడు మంత్రికుమారుడుగా జన్మించి పూర్వాభ్యాసమున రుద్రాక్షలకే ప్రీతిపడిరి. వీరు శివునర్చించి శివునిచేరుదురని తెల్పెను.

# బ్రహ్మ ఖండము

## 3-వ అవాంతరఖండము - బ్రహ్మోత్తరఖండము

## 21-వ అధ్యాయము

రాజు ఇతిహాసమువిని ఆనందించి ప్రాంజలియై మునికిట్లనెను- వీరిభవిష్యత్తుకూడ తెలుపగోర పరాశరుని సమాధానము. వీరి చరిత మునవిన సహ్యముకానిది కొంతయున్నది. నిర్మలమనస్కతకోరితివి కనుక ధీరుడవయి వినుము తెల్పెదను. నీకుమారునికి పన్నెండు సంవత్సరములు నిండినవి. నేటికేడవనాడు ఈతడు మరణించును. ఆవార్త కాలకూటముకాగా రాజుమూర్ఛమునిం గెను. కరుణానిధి మునిరాజును లేవనెత్తి భయపడకుము ఇంకను తెల్పెదనువినుము. నీకు హితము వచింతును-సృష్టికి పూర్వము ఏకము పరము చిదానందమయము జ్యోతికలదు. అదియే సర్వమునకాది, కేవలుడు శివుడు. తననుండియే రజోగుణరూపుని బ్రహ్మను సృజించి ఆతనికి వేదములిచ్చి సృజనకార్యమాతనిపై పెట్టెను. సర్వోపనిషత్సారము రుద్రాధ్యాయమిచ్చెను. ఏకము అవ్యయము సనాతనము బ్రహ్మజ్యోతి శివాత్మక పరతత్త్వము రుద్రాధ్యాయమున ప్రతిష్ఠితము. అత్రిమొదలయిన ఋషులు దానిని గ్రహించిరి. రుద్రాధ్యాయజపము నరులకు కైవల్యప్రాప్తికి పరమ సాధనము, ధర్మమున పుణ్యము అధర్మమున నరకము ప్రాపింతురు. అధర్మసుతులు నరకనాయకులు, కామక్రోధాదుల పుత్రులు పంచ మహాపాతకులు. ఈ పాతకనాయకులు చండాలురు అనగా తీవ్రులు. యముడు వీరిని పిలిచినరకమున కాధిపత్యము వారికిచ్చెను. వారికి భృత్యులు ఉపపాతకులు. రుద్రాధ్యాయములోకమున పరంపరగా ఋషులవలన వ్యాప్తికాగా లోకమునుండి పాతకనాయకులు ఉపనాయకులు పారిపోయిరి. యమునికి పోయి ఈ వార్తతెల్పిరి.

"ప్రభూ! మాకిచ్చిన అధికారములు పాలించలేము! లోకమున మేముండ జాలము. లోకమున నదీతీరముల ఆలయముల గ్రామమున రుద్రాధ్యాయఘోష వ్యాపించ దానివలన దగ్ధులమయితిమి, మాకు లోకమున నిలువనీడలేదని. ఈ విపత్తును తప్పించ వేడిరి. యముడు బ్రహ్మ సదనమునకేగి బ్రహ్మకు ప్రాంజలించి ఈ వార్త తెల్పెను. రుద్రాధ్యాయ వ్యాప్తివలన లోకమున పాతకములు లేవు. నరకము శూన్యమయినది. నారాజ్యము నిష్ఫలమని ఉపాయమాలోచించ వేడెను. ఇంకను యముడు తెల్పుచున్నాడు "రుద్రాధ్యాయము జపించుచు స్నానముచేసి మృత్యుభయము లేకయున్నారు. శివలోకముప్రాపించిరి". బ్రహ్మ ఒక ఉపాయము కల్పించెను. అవిద్యాసుతులు దుర్మేధ అశ్రద్ధ అనువారలను కల్పించి వీరుశ్రద్ధ, మేధలను నశింపచేసి లోకమున తిరుగ నీకేమి భయము పొమ్మనయముడు సంతసించి కృతార్థుడుగా నెంచి తన లోకమునకేగెను. రాజు ధర్మాత్ముడు తనవద్దకువచ్చిన మునులనుకని అజ్ఞాననాశనమున కుపాయము వేడ శతరుద్రీయము జపించిన జ్ఞానోదయమగునన ఆవిధానమునకామునిని గురువుగా వరించి పలువురుమునులను రావించెను. వారు ఆశలేనివారు శాంతులు. నూరుకలశములు స్థాపించి రుద్రాధ్యాయముతో పుణ్యవృక్షమూలమున అభిషేకించి రాజును అతని తనయులనారీతిగా నభిషేకించి విధ్యుక్తములొనరించ పదవదినమున అభిషేకించుచుండ ఆ రాజన్యకుమారుడు హఠాత్తుగా మూర్ఛపోయెను. మునులవలనమరల తెలివికితేబడి ప్రశ్నించ రాకుమారుడనుచున్నాడు-దండహస్తు డొక పురుషుడువచ్చి నన్ను కొట్టబోయెను. మరియొకవీరుడుదండహస్తుడు వానిని పాశముతో బంధించి దూరముగాతీసికొనిపోయెను. ఇంతయు నేనుచూచితిని. మీచే రక్షింపబడితిని.

వారాశీస్సులు రాకుమారునకిచ్చిన అనంతరము రాజువారలకు భోజనములు కల్పించి దక్షిణలిచ్చి సభలో సుఖాసనముననుండ నారద

మునీంద్రుడటకేతెంచెను. రాజాతనికర్ఘ్యపాద్యములిచ్చి ఆసనమిడి ప్రాంజలించినిలువ నారదుడిట్లనెనురాజా, నేను నీకడకువచ్చుచుండ మహాదాశ్చర్య మొకటి చూచితిని. యముడు నీతనయుని ప్రాణములు కొనిపోవనేతెంచెను. శంకరులు పార్షదుని వీరభద్రుని పిలిచి యముని దండించపంపెను. నీతనయునికొట్టబోవు యముని కోపించి వీరభద్రుడు బంధించి తీవ్రముగ తాడించెను. కొట్టుచునే శివునంతికమునకు కొని పోవ యముడుశూలికి, వీరభద్రునికి ప్రాంజలించి "దేవదేవ, మహారుద్ర వీరభద్ర నీకు నమస్కారము. నాయందునీకేల కోపము. నరులనుదం డించి కొనిపోవుట నావిధి. అంతకాలమాతనికివచ్చినది, నా అపరా ధము తెలుపుమన రుద్రాభిషేకమున ఆ రాకుమారుని కాయువు పది వేల సంవత్సరములు, ఇంతలో అంతరాయమేమి కలిగినది, నీకు సందేహమున్న వెంటనేపోయి చిత్రగుప్తునే అడుగుము. వెంటనే యముడు చిత్రగుప్తుని రావించి ఆయుః ప్రమాణము తెలుపగోర 12 వత్సరములే కాని పదివేలు వర్షములాయువని అనంతరములేఖని వ్రాసినదనెను. యముడు వీరభద్రుని ప్రార్థించి బంధ విమోచన మందెను. తనలోకమునకు పోయెను. వీరభద్రుడు కైలాసమున కేగ నేను నిన్నుగాంచ వచ్చితి నని నారదమహర్షి తెల్పెను, రుద్రాభిషేక ఫలముగ నీకుమారుడు మృత్యుభయమువదలి పదివేల ఆయువు గాంచెను, వర్షముల ఇట్లు తెల్పి నారదుడు స్వర్గమునకేగ ఋషులు తమతమ ఆశ్రమములకేగిరి. ఈ విధముగా కాశ్మీరనృపతి రుద్రా ధ్యాయ ప్రభావమున కుమారునకు దీర్ఘాయువు కల్పించి సుఖము లందెను. ఎవరు శంకరుని కీర్తింతురో వారు కోటిజన్మలపాపము శాంతించ శాంతులయి ఇందుమౌళిపదమందెదరు.

*

# బ్రహ్మఖండము

## 3-వ అవాంతరఖండము - బ్రహ్మోత్తరఖండము

## 22-వ అధ్యాయము

ఇయ్యాదిశుభప్రదమయిన మార్గము శివునిచే చెప్పబడినది. సంసారబంధములువిడి నరులు ముక్తిగాంచు సన్మార్గము. అనధికారులకు స్త్రీ శూద్రులకుగతియేమన్నచో విచారమువలదు, శివకథామృత పానమున సర్వులు శివపదమునందెదరు" అజ్ఞానాంధకారమునకు శివ జపము జ్యోతి, భవరోగమునకు పరమౌషధము. మహాపాతకము లను కొండలకు వజ్రము, ఘాతము. శుభములు కోరువారు శివకథలు వినవలెను. ఒక్కక్షణము విన్నవారికి దుర్గతులుండవు, కలియుగమున శివకీర్తనము పురాణపఠనము ముక్తిపదము. పురాణపుణ్యకథలు సద్గ్రామమున, సుజనులున్నచోట, సుక్షేత్రమున, దేవతాలయమున విన్పించవలెను. పురాణజ్ఞుని ఆసనతాంబూల ఆచ్ఛాదనదక్షిణనిచ్చిన సర్వఫలప్రదము.

ఒక ఇతిహాసము - దక్షిణాపథమున బాష్కలమనే గ్రామము కలదు. జనము సర్వులుమూఢులు. కర్మలుచేయరు. శ్రుతులన్న పురాణములన్న వినరు. బ్రహ్మ కర్మ ద్విజులొనరించరు, జపము స్వాధ్యాయములేదు, పాపములు, అధర్మములే ఆచరింతురు. పరమధర్మము వారికి తెలియదు. స్త్రీలు కుటిలలు, కులాచారములు తెలియనివారు నాలుగు వర్ణములవారును, అందులో విదురుడను బ్రాహ్మణుడు దురాత్ముడు కలడు. సదావేశ్యాలంపటుడు. భార్యను బందుల యను దానినివిడిచెను. బందులపతి వివర్జితయై విటులవెంటబడి కామముతీర్చుకొనసాగెను. పతిజారునితో బందులయుండకోపించి కొట్టబోవ జారుడు పర్విడెను. భార్యనుచేతికోలది మోదించసాగ ఆమె నిర్భయు

రాలై కోపించి ఇట్లనెను. "నిత్యము రాత్రులు వేశ్యాతో నీవు భోగించ వాగతియేమి. రూపవతిని యౌవనవతిని నేనెటుల కామము నోర్చుకోగలను. నీ సంగములేని నేనేమి చేయవలెను. అన ఆ మెపతి ఇట్లనెను "నీవన్నదినిజమే. నీకొకహితముతెల్పెదను వినుము. నీవు ఉపపతివలన ధనము గ్రహించినాకిమ్ము. నేను వేశ్యకిత్తును. ఇట్లయిన ఇరువురిచాంచల్యముతీరునన" ఆమె అంగీకరించెను. ఇటుల వీరిదురా చార ప్రవృత్తిసాగిపోయినది. కాలమువచ్చి పతిమృతిచెంద పుత్రులతో గృహమునవేయుండి క్రమముగా యౌవనము సడలిపోగా ఆ వృత్తి మానుకొనెను. దైవయోగమున పర్వదినమున బందుగులతో గోకర్ణ క్షేత్రమునకుపోయెను. తీర్థమున స్నానముచేసి ఒక ఆలయమున దేవ దర్శనముచేసి పురాణ శ్రవణము కావించుచుండ వినెను. జారిణి అనుభవించే నరకవర్ణనమువిన్నది. భయముచే ఒడలు కంపించిపోయినది. శ్రోతలు వెడలిపోగా బ్రాహ్మణుని పాదములపైబడి తనయౌవన చరిత విన్పించి పాపముపోవు ఉపాయము తెలుపవేడెను. పురాణ జ్ఞుడు బ్రాహ్మణుని సమాధానము-"పుణ్యావశమున కాలముండగా పుణ్యగాథవిన్నావు. నీకు గతితెల్పెదను భయపడవలదు. సత్కథా శ్రవణమున నీ మనసు నిర్మలమయినది. పశ్చాత్తాపము కలిగినది. సర్వ పాపములకు నిజమయిన పశ్చాత్తాపమే పాపశమనకారి. పుణ్యకథా శ్రవణమున, పుణ్యక్షేత్ర నివాసమున చిత్తశుద్ధి కలుగును, అనంతరము శివుధ్యానమున మతినిల్చును. ధ్యానమున మాలిన్యములన్నియును నశించును. కాలగతినందిన యనంతరము శివలోక ప్రాప్తియగును. నామసంకీర్తనము సద్యః ఫలప్రదాయిని. విషయములనుండి ఇంద్రియ ములను మరలించి సత్కథలు వినుచు శివునామస్మరణచేసికొనుము. ముక్తికాంతువు. ఆ క్షేత్రమునవేయుండి ఆ ద్విజుడేగురువుగా ఆతని వలన సత్కర్మలు వినుచు క్రమముగాచిత్తశుద్ధి అలవరచుకొని ధ్యాన నియమమును చేబూనెను, నిత్యము తీర్థజలముల స్నానముచేయుచు.

జటావల్కములు ధరించి యోగిని గానయి శివనామ జపపరాయణ ఆయెను. కాలాంతరమున మరణించి శివకింకరులచే కొనిపోబడి శివ పదమందెను, పరదేవిసమీపముననే సదా వాసము—ఒకనాడు పార్వతిని చేరి అంజలిఘటించి తన పతిగతియెట్టిదని ప్రశ్నించెను. సద్గతికుపాయము యాచించ "ఆతడెప్పుడయిన తన కథలువిన్న సద్గతినంది తన లోకమునకురాగల" డనెను. పదేపదే అంబను కొలుచువేడగా పతి సద్గతికై అంబ తుంబురుని రావించి ఆతనికిట్లనెను - "నీవీమెతో వింధ్య శైలమునకేగుము. ఈమెపతి అట పిశాచమైయుండెను. ఆతడు వినుచుండ నాసంబంధి పుణ్యకథలు తెల్పి నానామకీర్తనముచేయుము. ఆతని పిశాచత్వము పోయినవెంటనే శివాంతికమునకు కొనిరమ్ము—అని పంపెను. ఆ కాంతతో తుంబురుడు విమానమున వింధ్యాద్రి కేగెను. దూరమునుండియే మహాకాయు, రక్తనేత్రు, ఒకమారు నవ్వుచు, ఒకమారేడ్చుచునున్న వానిని బలవంతమున తుంబురుడు పట్టికట్టి వీణియచేబూని గౌరీపతిగాథపాడి విన్పించెను. ఏడుదినము లిటుల విన్పించ పాపములుపోయి, రూపుమారి, దివ్యదేహముధరించి తుంబురు పార్శ్వమున నిలచెను, ప్రాంజలించెను. ఆతనితో ఆతని సతితో తుంబురుడు తిరిగి విమానముననే కైలాసమునకు గౌరిచెంతకు చేర్చెను —

**స్కాంధమున మూడవదియయిన బ్రహ్మఖండము సమాప్తము.**

*

తి
రు
మ
ల

తిరుపతి

దేవస్థానముల

ముద్రణాలయము

తి
రు
ప
తి

కా. 1,000.